# అనగనగా ఓ మంచికథ

2021 -2022



శ్రీ

కౌముది

మీ మునివేళ్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 250

కౌముది మాసపత్రికలో

జూలై 2021 సంచిక నుంచి డిసెంబర్ 2022 సంచిక వరకూ వచ్చిన

# అనగనగా మంచి కథలు


| సంఖ్య | కథపేరు | రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | అజ్ఞాత శిశువు | వేలూరి సహజానందం | 3 |
| 2 | తొలికోడి కూసింది | ఆచంట శారదాదేవి | 10 |
| 3 | సంతృప్తి | విమలారామం | 15 |
| 4 | గడ్డిపూలు | జలంధర | 27 |
| 5 | అగాధపుటంచున.. | బైరాగి | 39 |
| 6 | ఒక చిన్న మానవుడు | ఇచ్ఛాపురపు జగన్నాధరావు | 45 |
| 7 | ఉత్తరాల మంట | యన్. ఆర్. చందూర్ | 61 |
| 8 | అదృష్టవంతులు | నార్ల చిరంజీవి | 66 |
| 9 | వ్యాధిగ్రస్తుడు | మాలతీ చందూర్ | 82 |
| 10 | ఒకటే చీర | శ్రీ వేలూరి శివరామశాస్త్రి(శతావధాని) | 89 |
| 11 | అదృష్టవంతుడు | బలివాడ కాంతారావు | 93 |
| 12 | క్షమించాను | శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు | 100 |
| 13 | అధికారి | రాచకొండ విశ్వనాథశాస్త్రి | 117 |
| 14 | జ్యోతి | బుచ్చిబాబు | 130 |
| 15 | చింపేసిన పేజీలు | కొమ్మూరి ఉషారాణి | 145 |
| 16 | త్రికళ | వడ్డాది పాపయ్య | 153 |
| 17 | అరుదైన ఆత్మహత్య | అవసరాల రామకృష్ణారావు | 161 |
| 18 | ఇల్లు అమ్మకం | పాలగుమ్మి పద్మరాజు | 176 |

# అజ్ఞాత శిశువు

## వేలూరి సహజానందం

## (1952 , మార్చి , ఆంధ్రజ్యోతి మాసపత్రిక నుంచి)

**“ఏమే అలా ఉన్నావ్?”** అని అడిగాడు.

“.................. “

“నిన్నే.. ఏమిటంత నీరసంగా ఉన్నావ్? ”

“కొంచెం బద్ధకంగావుంది.” ఆమె ఎంత ప్రయత్నించి, వారించినా, కొంటెగా చిఱునవ్వు ఆ ఎర్రని పెదవుల్లోంచి దూసుకుపోయింది.

"ఏం .... మళ్లీ మాట్లాడటం మానేశారేం?” అని అడిగింది.

"ఉహ్హ!"

"మీకోరిక .... తీరేట్టే వుందిలేండి.”

“ఆ .... పదేళ్లనుంచి తీరుతోంది ..... ఇక తీరుతుంది" అన్నా డతను.

ఆమె చిన్నపుచ్చుకుంది. అతనది గమనించి, “సరసము విరసము కొఱకే” అన్నారు నీలాంటి వాళ్లను చూసే .... అప్పుడే కోపంతో మందార పువ్వయావు” అని ఆమె బుగ్గపై చిటిక వేశాడు.

ఇదివరకటికన్న అతను యిప్పుడు భార్యపై చాలా ప్రేమ చూపిస్తున్నాడు. అతని అప్పగారు చూడటానికి వచ్చి, విస్తుపోయింది. “ఓరి .... వీడిగారాబం ..... ఎంత ....”

. 'పదిరోజులపాటు ఉండాలనుకొని వచ్చిన సోదరి కాస్తా మూడోరోజునే మూటకట్టింది. పొద్దున్న పక్కలెత్తేదీ తమ్ముడే. సాయంకాలం పక్కలువేసేదీ తమ్ముడే.

దొరక్క, దొరక్క దీపాలులేని ఇల్లు దొరకటం .... తమ్ముడు .... శుభ్రంగా బి. ఏ. ప్యాసయిన తమ్ముడు దీపపుఖడ్డలో కిరసనాయిలుపొయ్యటం .... సరిపోయింది. తను ఉండబట్టికాని, లేకపోతే శెలవు పెట్టి వీడు విస్తళ్లుకూడా ఎత్తును.

“ ఒరే ..... కంచంలో తప్పు చెయ్యికడుక్కొని ఎరగనివాడివి .... ఒక్కమాటుగా చక్కని పంట బ్రాహ్మ డివయి ఊరుకున్నావ్? ”అని తమ్ముడిని హేళన చేసింది.

తమ్ముడు నవ్వి ఊరుకున్నాడు,

“ఆ ఆఫీసులో వీడికి పనేం సాగుతోందో మరి ....” అంది స్వగృహానికి వెళ్లిన భర్తతో.

“అవునులే .... నీకిప్పుడు గుర్తెందుకుంటుందీ? నలుగురు ఆడపిల్లలను, ఇద్దరు మగపిల్లలని కన్నాక .....” అన్నాడు నీళ్ళు నములుతూ భర్త.

"ఓహో! సరే .... అవును లేండి ....పాపం, ... ఎంత ఇదిగా వుండేవారు ....అందుకే గావును .... మీరు నీళ్లుపోసుకొనేప్పుడు .... చిన్నపిల్ల లిద్దరకూ కూడా పొయ్యమంటే, మాటైనా మాట్లాడకుండా కాగెడునీళ్లు పోసుకొనివచ్చి, కుర్చీలో పత్రిక జపంచేయటం ....” అని ఆమె తన అక్కసు వెళ్లబోసుకుంది.

అతనేమీ మాట్లాడలేదు.

ఆమె. మళ్ళీ అందుకుంది.

"మా తమ్ముడు కూడా అడిగాడు. ‘ ఏమిటి అక్కా ఇంత చిక్కావు' అని .... వీళ్ళను సాకలేక నాపని అవుతోంది .... కాస్త.... మీరు "

“మీతమ్ముడు అలా గారాబంగా చూస్తున్నాడనేగా, ఇప్పుడు ఈసడించావు. ” ఆమె నాలిక కొరుక్కుంది.

అత్తగారూ, మావగారూ వేంచేశారు. సావిత్రికి తల్లిదండ్రులను చూడటానికి కూడా సిగ్గు వేసింది. ఏదో, ఆ పదేళ్లే బాగా ఉంది. ఇప్పుడేమిటో, ఇదిగావుంది. తల్లి వచ్చిన మర్నాడే కొబ్బరికాయలు కొట్టించి, కొడుకు పుట్టాలని దీవించింది. సత్యనారాయణకూ సిగ్గుగానేవుంది. నలుగురిలో తిరగడానికి లోలోపల చాలా ఉత్సాహంగానే వున్నా, బైటవాళ్లు వ్యంగ్యంగా అనే మాటల, కొంటెగా చూసే చూపులు అతన్ని కించపరుస్తున్నయ్. నలభయ్ ఏళ్లు వస్తున్న తనకు ఇప్పుడు ....ఏమైతేం!

మొదట్లో కొద్దిరోజులపాటు భార్యాభర్తలు బిడియపడ్డారు. కానీ, తర్వాత సరిపుచ్చుకున్నారు. .

చూస్తూవుండగానే ఆరోనెల వచ్చేసింది. సత్యనారాయణ మెల్లగా అన్నాడు. “మా అక్కయ్యను రమ్మని వ్రాయనా?"

"ఇప్పటినుంచే ఎందుకండీ? పైగా కిందటిసారే ఆవిడకు మీ ధోరణి నచ్చలేదు.” అంది.

“కాస్త .... సాయంగా వుంటుందిగా!”

. “ఏం వద్దు లేండి .... మీరు వంట చేయటం, నీళ్లు కాగబెట్టటం .... బట్టలు పిడిచి ఆ రేయటం .... ఇవన్నీ చూస్తే, నామీద రుసరుసలాడుతుంది. మీ అక్కయ్య. ఇప్పుడు నేనేమైనా బరువులెత్తుతున్నా కనకనా!" అంది సావిత్రి.

సావిత్రి తల్లివచ్చి, పురుటికి పంపమని అల్లుడినడిగింది. సావిత్రి వెళ్తానని ఊగింది. కానీ, సత్యనారాయణ బోధించాడు.

''' అది .... పల్లెటూరు .... కుగ్రామం "

" అయితే .... "

" ఇది .... బస్తీ .... "

" అయితే .... "

" అయితే ఏమిటి? అక్కడ డాక్టర్లా? మంత్రసానులా? "

ఆమె పెద్దగా నవ్వింది.

అతను చికాకుపడ్డాడు.

" ఏమిటండీ! "

ఏమిటేమిటి .... తొలి కాన్పు .... కాస్త డాక్టర్లువున్న చోట ...."

"మా ఊళ్ళో వాళ్లంతా సుఖంగా కన...."

అతనింక మాట్లాడలేదు. కానీ క్రమేపీ ఆమె. ముఖంలోని ఆ చపలదరహాసం పోయి, గంభీరత వ్యాపించింది. కళ్లలో ఆలోచన ప్రతిబింబిస్తోంది. శరీరమంతా ఒక్కసారి పాలిపోయినట్టయింది.

"నే ..... వెళ్లను ....... వెళ్లను" అంది అస్పష్టస్వరంతో.

సత్యనారాయణ తన ప్రబోధం యొక్క ఫలితం గమనించి, "ఛా .... ఏమిటా భయం .... భేష్ .... దగ్గర, కలసివుంటాం గదా అని అన్నాను .... పోనీ .... పెద్దది ఆమె వచ్చి, అడుగుతోంది. వెళ్లు" అన్నాడు.

ఇంక అతనెంత బతిమాలినా, బామాలినా ఆమె సుతరామూ వినలేదు.

" అల్లుడ్దు తీసుకో వెళ్లమంటుంటే, నువ్వు రానంటా వేమిటే?" అంది తల్లి.

" నేను ..... రాను .... రాను ...... ముమ్మాటికీ రాను .... వీలుంటే నువ్వే ఇక్కడికరా .... అనాటికి" అంది కూతురు.

" వీలుంట మేమిటే? అక్కడ ఒక్క కణం ఉంటానుటే? ఏమిటి నీ అస్తావిస్తం ......సరే.... వారం వారం వ్రాస్తూవుండు. ఎనిమిదో నెల రాగానే వస్తాను. "

తల్లి వెళ్లిపోయింది.

★★★★★★★★★★★★★★

నిద్రలోంచి ఉలిక్కి పడి లేచింది .... దీపం పెద్దది చేయబోగా, అదికాస్తా కిందపడి భగ్గుమంది. ఈ చప్పుడుకు అతనూ లేచాడు ....

"ఏమిటే ...."

"ఏంలేదు."

"మరలా కంగారుగా చూస్తున్నావేమిటి?"

"ఏంలేదు పొద్దున' బిచ్చకత్తె ఒకత్తె .... "

సందులోంచి గొంతుచించుకుంటూ " ఏడ్పు వినబడుతోంది.

ఆమె కళవళపడ్డది.

అతను ఆమెపక్కనే కూర్చున్నాడు.

'బిచ్చకత్తె .... బాలింతరాలు ..... రెండు రోజుల పసిగుడ్డు ...."

"పసిగుడ్డు ...."

"గుడ్డి .... పసిగుడ్డు ...."

ఆమె ఇంక మాట్లాడలేదు. ముచ్చెమటలుపోసింది.

. అతనెంతో ధైర్యంచెప్పాడు.

"ఛా ..... అవన్నీ మనస్సుకు పట్టించుకోకూడదు. అసలింక తలుపులు తీసి, ఎవరికీ ముష్టివేయకు."

"ఛా .... ఆమాట .... అనద్దు ..... మా తాతయ్య పక్షవాతంలో పడిపోయికూడా, "అమ్మా .... మాధాకబళం" అని వినబడగానే," అమ్మాయి .... " అని పిలిచేవాడు."

"మరి వాళ్లనుచూసి భయపడిపోతుంటివి ...."

అమె జవాబు చెప్పలేదు. ఆ తెల్లవార్లూ ఉభయులూ మేల్కొనే వున్నారు.

తెల్లవార్లూ సందులోంచి ఏడ్పు ఒక్కొక్కసారి పెద్దగా, ఒక్కొక్కసారి తగ్గుగా వినబడుతూనేవుంది.

నాలుగురోజులయాక ఆ పచ్చి బాలింతరాలు మళ్లీ గడపముందుకు వచ్చింది.

'ఇది .... నాలుగో కాన్పమ్మా .... పోనీ .... గుడ్డివాడే అయినా జీవిస్తాడనుకుంటే ....వాడుకూడా ..... మట్టిలో కలిసిపోయాడు.'

అడగకపోయినా, ఆ కళ్లుగుంటలుపడ్డ తల్లి తన గర్భశోకాన్ని విన్పించింది.

ఈసారి సావిత్రి భయపడలేదు. కానీ స్థాణువులా నుంచుంది .... భిక్షుకలోకం యొక్క ఆకలి చక్రాలు కదిలినయ్ ..... పొట్ట పెరిగిన పిల్లలు .... పుడకల్లా కాళ్లు .....వళ్లంతా కురుపులతో వున్న వాళ్లు ..... మూగవాళ్ళు ..... దారిద్ర్యం, దుఃఖం వేరు ..... కానీ ఈ భయంకర, వికృతసంతానాన్ని కడుపులో పెట్టుకొని, ఆకలి కార్చిచ్చుల మధ్య పెంచుకుంటున్న ఈ దీనమాతల భగ్న హృదయాల్లో ఏ దీపం వెలుగుతోంది? సంస్కారహీనులు, సంపదహీనులు. తమ వంటిమీదకు గుడ్డ

అక్కర్లేదు. మంచి గుడ్డ ఇవ్వు .... అదిచింపి, పంచుకుంటారు. పారేసిన మెతుకులు చాలు .... కాని సాక్షాత్తు భగవంతుడే తమ కడుపున పుట్టినట్టు, ఎంత మమతతో బంధించుకుంటారు?

సావిత్రి బిచ్చగాళ్లను చూడటం ఇది మొదటిసారికాదు. ఈ పెద్ద, బరువైన పుస్తకం గడపలముందు పేజీలు తెఱుచుకొన్నదివ్వాళే కాదు. కాని సావిత్రికిదివఱకెప్పుడూ ఇందులోని కన్నీటి వాక్యాలు ఇంతస్పష్టంగా కనుపించలేదు. ప్రతి అక్షరంలోనూ ఏదో దీపం వెలుగుతున్నట్టుంది. ఈ సప్తసముద్రాలను మించిన ఈ ఆకలి ఘోషలో, ఏదో స్పష్టాస్పష్టంగా...... హృదయాన్ని కలచి వైస్తున్న, విషాద మధుర రాగం–వినబడుతోంది. ఈ ఆకలి, ఈ చినుగు, దుమ్ముగుడ్డలు, ఈ మడ్డీ, ఇవి తనకు పరాయివే అయినా, ఆ మధుర రాగం, ఆ వినిర్మలదీపం .... ఇవి తనలోనూ ప్రతిధ్వనిస్తున్నయ్. ప్రకాశిస్తున్నయ్ ....అక్కడ .... ఆపై ఉత్తుంగ తరంగాల కింద, లో, లోన అగాధంలో .... అక్కడ .... తనకూ, వాళ్లకూ మధ్య ఎడం లేదు ..

ఇదివఱకల్లా కేవలం పైశాచిక వికృతికారాలతో విసిగి, వేధించి వెళ్లే ఆ ముష్టి కళేబరాల్లో ఇప్పుడేదో జ్యోతి భగ్గున వెలిగి, ఇన్నాళ్లు తనకగబడని ఏదో మాధుర్యం కళ్లకు కొట్టవచ్చినట్టుగా కనబడుతోంది.

ఇన్నేళ్ళూ ఈ ఆకలి పుస్తకంలో అక్షరాలపై దుమ్ముపడి వుంది. ఇప్పుడొక్క మలయమారుతంతో ఆ ధూళి అంతా తొలగి, ఉజ్జ్వలంగా కనపడుతున్నయ్..

సావిత్రిలో మార్పు సత్యనారాయణకేమీ అర్థం కాలేదు. 'మొదట్లో భయం అనుకున్నాడు. కాని ఇప్పుడు ఏవో అనేక ఆలోచనలు ఆమెను నిద్రపోనీయట్లేదని గ్రహించాడు.

ఆమె మాటల్లో, నడతలో కూడా మార్పువచ్చింది. చనిపోయిన పితామహుని పదే పదే తలచుకుంటుంది, ఎంతటి సహృదయుడు? ఆ శుష్క, నిర్జీవనేత్రాల్లో ఆమె ఇప్పుడు శతసహస్ర నేత్రాలను,–అశ్రుపూరిత నేత్రాలను చూడగలుగుతోంది.

ఓ దయామయా? ఎంత ప్రేమ నిమిద్చుకున్నావు, ఆ రెండు కళ్లలో! ఇంకిపోని నీ ప్రేమ ఇప్పుడు అర్థమైంది.

.★★★★★★★★★★★

డాక్టరు, మంత్రసాని వచ్చారు. నొప్పులు పొద్దున్న అరంభమైనా, పురుడింకా రాలేదు. సత్య నారాయణ ఆదుర్దాకు అంతులేదు. ఆ ఆదుర్దా ఆనందంతో నిండివున్న ఆదుర్దా. మగపిల్లవాడు పుట్తాడని తన జోస్యం.

రెండుమూడుసార్లు తను వెళ్లి సావిత్రిని గదిలో చూశాడు. కాని తీవ్రబాధలో తనువచ్చిన స్పృహే లేకుండా పడివుంది సావిత్రి.

నిశీథందాటింది .... డాక్టరు, మంత్రసాని ఆయాసపడుతూ గదిలోంచి బైటికి వచ్చారు. వాళ్లకళ్ళు చూడగానే సత్యనారాయణకు భయం వేసింది..

డాక్టరు మెల్లగా అన్నాడు. "మృత శిశువు ...."

సత్యనారాయణ గుండెలో మంట భగ్గుమన్నది.

మంత్రసాని అన్నది "మగపిల్లవాడు."

సత్య నారాయణ కళ్ళలో నీళ్ళు తిరిగినయ్.

డాక్టరన్నాడు "పుట్టుగుడ్డు."

సత్యన్నారాయణ నిశ్చేష్టుడయాడు

తీవ్ర భయంతో కంపించాడు.

డాక్టరు విచారించాడు. "మృతశిశువు"

సత్యనారాయణ మళ్ళీ నేల మీదకు వచ్చాడు.

వెంటనే గదిలోకి వెళ్లబోయాడు.

మంత్రసాని చెప్పింది.

"ఆవిడకు స్పృహలేదు. ఓ గంటకు స్పృహవస్తుంది. కంగారు చేయకండి."

సత్యనారాయణ మెల్లగా లోపలకు వెళ్లాడు.

గుడ్డతో కప్పబడి ఉన్న శిశువును చూడగానే మళ్ళీ అతనిగుండె జలదరించింది. గుడ్డిపిల్లడు! తనకు ఇన్నేళ్ళకు ............లేక ....లేక....

అత్తగారు అంది. "పచ్చనిపసిమి ....బతికే అదృష్టం లేకపోయింది."

బతికే అదృష్టం!

★★★★★★★

సావిత్రి కళ్ళు తెఱచి, కాసేపు అయోమయంగా చూసింది. తర్వాత తల్లి దగ్గరకు వెళ్ళి మెల్లగా కూతురి ప్రశ్నలకు జవాబు చెప్పింది.

అంత నిస్సత్తువ, నైరాశ్యం, దుఃఖం లోనూ ఒక్కమాటుగా తలెత్తి, మెఱుస్తున్న కళ్ళతో అడిగింది. "పిల్లడేడి....అమ్మా!"

గుమ్మంలో నిలబడ్డ సత్యనారాయణ చెప్పాడు ..... మృత్యుభూమిలో నున్నాడని.

సావిత్రి గుడ్లు పత్తిగుడ్లలో బైటికి పొడుచుకోవచ్చినయ్.

. సత్యనారాయణ అన్నాడు. "అంధ, మృతశిశువు."

సావిత్రిగుండెను, గొంతుకను చీల్చుకుంటూ సన్నని ఎలుగు బైటపడింది.

"ఎ ...డి? నా బిడ్డ"

ఆ ఆక్రందనకు తెల్లపోయి నుంచున్నాడు నత్యనారాయణ.

సావిత్రి ఇంకేమీ అడగలేదు. మాట్లాడలేదు.

కొంత సేపటికి తెప్పరిల్లుకొని భర్త అన్నాడు.

"ఆ వికారశిశువుని చూసి భయపడుతావని, వెంటనే ...."

★★★★★★★★★★★

చంద్రునిలో మచ్చలా, సావిత్రి ముఖంలో విషాదచ్ఛాయ నిత్యనివాసమేర్పరచుకుంది. మృత్యుద్వారాన్ని సైతం తట్టి ఆ శీతలముఖాన్ని ముద్దిడే అనంత ప్రేమ సావిత్రి నిలా దహించివేస్తుందని సత్యవారాయణ అనుకోలేదు.

★★★★★★★★★★

గడపలోనుంచుంటుంది సావిత్రి .... మళ్లీ భిక్షుకలోకం యొక్క ఆకలిచక్రాలు కదిలిపోతయ్ .... వికృతస్వరూపులు, వికలాంగులు, దారుణ వ్యాధిపీడితులు .... ఒకరినొకరు అనంత ప్రేమతో పెనవైచికొని, ఆకలిలో, దుమ్ములో, చినుగుల్లో సాగిపోయే ఆ దౌర్భాగ్య, దీనముఖాల్లో, పసిబిడ్డలు వేళ్లాడే ఆ బాలింతల జోలిలో సావిత్రి ఆ దీపకాంతినే చూస్తోంది .... వీళ్లకు సంస్కారం లేదు .... సంపదలేదు ___ ఏమీలేవు .... కాని జీవితం యొక్క కూకటి వేరు, కొనవూపిరి అయిన ఆ ..... ప్రేమ ....వారు పోగొట్టుకోలేదు.

శూన్యాకాశంలోకి చూస్తుంది సావిత్రి ...వ్యథితమైన మనోగగనంలోకి చేతులు చాస్తుంది .... మృతుడు కావచ్చు ...అంధుడు కావచ్చు .... కాని హృదయానికి హత్తుకొనే అదృష్టంకూడా లేకపోయింది. జీవిస్తే ప్రేమించి, మృతమైతే ద్వేషించే ప్రవృత్తుల మధ్య తనకెక్కడ శాంతి ....ఇంకొక పిల్లలు పుట్టవచ్చు పిల్ల. పుట్టవచ్చు.

భర్త ఆస్తికి వారసత్వంలేని లోటును నింపుతారు. కాని ఈ తనలోటు ఎలా నిండుతుంది? ఎప్పుడు నిండుతుంది? మూగ, మృత, ఆంధ, అజ్ఞాత శిశువుమీద ఈ అనతిక్రమ్య మైన ప్రేమ ఏమిటి? చల్లార్పటానికి ప్రయత్నించిన కొద్దీ ప్రజ్వలిస్తున్నది ఈ శోకవహ్ని ..... జ్వాల ....

అన్ని నాళ్లక్రితం .... సందులోంచి నిశీధంలో హెచ్చుతగుల్లో వినబడిన భిక్షుక స్త్రీ యొక్క నిష్ఫల దుఃఖారావం మళ్ళీ సావిత్రి చెవుల్లో ఘోష పెట్టింది.

★★★★★★★★★★★★★

సత్యనారాయణకు 'ప్రమోషన్' అయింది. బదిలీ అయింది. ఇప్పుడు నౌకర్లు .... చాకర్లు .... వంటమనిషి .... ఇద్దరు మగపిల్లలు .... ఒక ఆడపిల్ల ___

"ఎప్పుడూ అలా కూర్చుంటావేం .... పిల్ల పుట్టిన రోజు పండగై తేకూడా" అన్నాడు భర్త. '

కొత్త చొక్కా, పరికిణీతో పిల్ల గంతులు వేస్తోంది. ఇద్దఱు కుఱ్ఱాళ్లు–రేగిపళ్లు విరజిమ్ముతున్నారు.

"చూడు .... ఎలా ఆడుకొంటున్నారో .....నవ్వుతూ పలకరించు ....." అన్నాడు భర్త.

పిల్లలు ముగ్గురూ ఒళ్ళోకి వచ్చారు ....గుండెకు అదుముకుంది .... కాని ... ఆదిగో ... వీధిగుమ్మంలో గుడ్డిబాలుడు కమ్మని గొంతుకతో పాడుతున్నాడు. భర్త వెనక పిల్లలు వెళ్లిపోయారు..బిచ్చగాడికి రేగిపళ్లు పెట్టుతున్నాడు పిల్లవాడు .... వాడు పడిన పళ్లను తడుముకుంటూ తీసుకుంటున్నాడు.

కళ్ళుమూసుకుంది సావిత్రి. కాని ఆనకట్టలకు తలొగ్గని మహా ప్రవాహంలా కన్నీరు ప్రవహించింది.

పిల్లలు గంతులేస్తున్నారు ..... భర్త ఏవో సర్దుతున్నాడు .... సావిత్రి వళ్లంతా చెవులు చేసుకొని ,. వీధిలోంచి అస్పష్టంగా ప్రతిధ్వనిస్తున్న గుడ్డిబాలునిపాట వింటోంది.

"ఓ ప్రభూ! ఆ మట్టిపాత్రలో యెంత అమృతం నింపావు! ఈ స్వర్ణకలశంలో ఎంత విష, విషాదాన్ని నింపావు .... ఓ అంధ గాయకుడా! ఈ అభాగ్యురాలి హృద్ఘోషను విన్పించు .... నా అజ్ఞాత శిశువుకు! ఓ మృత్యువా? నిన్ను ధిక్కరించను .... కాని ఒక్కసారి ... ఈ దీనహస్తాలను .... ఆ శీతల శరీరాన్ని తాకనియ్యి."

శూన్యంలోంచి, ఆకాశంలోంచి, మనోగగన తమో దిక్కులనుంచి శైశవపదప్రతిధ్వని సావిత్రికి విన్పించింది .... పెక్కు దుఃఖంలో, తప్పిపోయిన పసిబిడ్డ వచ్చి ఆమె గుండెకు హత్తుకున్నాడు ..... స్పృహ వచ్చి, కళ్లు తెజచేసరికి, ముగ్గురు పిల్లలు తండ్రి ఓదార్పుకు ఆగకుండా పెద్ద పెట్టున ఏడుస్తున్నారు.

★★★

# తొలికోడి కూసింది

## ఆచంట శారదాదేవి

## (1975 - జూలై , వనిత మాసపత్రిక నుంచి)



ఆఖరు గంట క్లాసు జరుగుతోంది. రసిక పాఠం చెబుతోంది. ఆ గంట ఆమెకు పాఠం చెప్పాలని లేదు. వాళ్ళకు వినాలనీ లేదు. కాని ఆమెకు చెప్పక తప్పదు. వాళ్ళకు వినక తప్పదు. అందుకే క్లాసు నిశ్శబ్దంగా జరుగుతోంది. రసిక బోర్డు మీద లెక్క వేసి చూపిస్తోంది. అది నాలుగో తరగతి క్లాసు. నలభై మంది పిల్లలు అమాయకమైన ముఖాలతో నిశ్శబ్దంగా బోర్డు కేసి చూస్తున్నారు. ఆ పసిపిల్లలను చూస్తూంటే వాళ్ళనేదో చిత్రవధ చేస్తున్నట్లనిపిస్తోంది. హాయిగా

ఆడుకుంటూ పాడుకుంటూ గడపవలసిన కాలం. వాడిపోయిన ముఖాలతో గంటకోసం ఎదురు చూస్తున్నారు. తను చేస్తున్న లెక్క తనకే సరిగా అర్థం కావటం లేదు. మనసు అక్కడ లేదు. సాయంత్రం కాగానే సహజంగా ఇంటివేపు మళ్ళుతుంది.

ప్రొద్దున తను బయలుదేరేటప్పుడు రాజుకు ఒళ్ళు వెచ్చగా వుంది. జ్వరం వచ్చిందో ఏమో! అతనికి ఫ్లాస్క్ లో కాఫి పోసి, టిఫిను బల్ల మీద పెట్టి వచ్చింది. అయినా కొంచెం ముందుగా వెళితే బాగుండును. ప్రొద్దున పెట్టిన కాపీ ఎలా ఉంటుందో! తను వెళితే మళ్ళా చేసి ఇవ్వవచ్చు. మామగారికి పెద్దతనంతో ఊరికే నీరసం, తపన. తను ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటారు.

ఎవరో పిల్లవాడు నిద్రమత్తుతో బల్ల మీదికి వాలిపోయాడు. బల్ల మీది పుస్తకాలన్నీ ఢమీమని కింద పడ్డాయి. బోర్డు దగ్గర నుంచి వెనక్కు తిరిగి అటువేపు చూసింది. ముగ్గురు పిల్లలు బిక్క మొహాలతో ఒక్కసారి లేచి నిలబడ్డారు.

"నేను కాదు టీచర్, వాడు."

"అబద్ధం టీచర్"

మూడోవాడు ఏదో చెప్పబోతున్నాడు.

తనకు వినే ఓపిక లేదు.

"సరే, కూర్చోండి" అంది. అంతా కూర్చున్నారు.

బోర్డు తుడిచి మళ్ళీ మరొక లెక్క మొదలుపెట్టింది. గంట గణ గణా మోగింది. లెక్క పూర్తి కాలేదు. క్లాసు వదిలేసింది. జైలులోంచి విడుదల పొందిన వాళ్ళలా సంచులు తీసుకుని పరుగులు పెట్టారు. వెళ్ళటానికి కూడా ఓపిక లేని వాళ్ళు మెల్లగా వెళ్ళుతున్నారు. స్టాఫ్ రూమ్ కు వెళ్ళి చేతులు కడుక్కుని బాగ్ తీసుకుని బయటపడ్డది రసిక. గేటు దగ్గరకు వచ్చింది. గేటు ప్రక్కనే పెద్ద మఱ్ఱి చెట్టు ఉంది. అక్కడ నలుగురు టీచర్లు తాపీగా పుస్తకాలు, బాగ్ లు కింద పెట్టుకు కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళను చూస్తే ఆశ్చర్యం వేసింది.

"ఏం ! ఇళ్ళకు పోవడం లేదా!" అంది.

ఒకమ్మాయి జవాబు చెప్పింది క్లుప్తంగా —— "ఛైర్మన్ గారు స్కూలు చూడ్డానికి వస్తారుట."

తనకు గుండెల్లో రాయిపడినట్లయింది. ఆయన ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో! అంతవరకు ఇక ఇంటికి వెళ్ళటానికి వీలుపడదు. ప్రొద్దుటినుంచి ఏం చేస్తున్నాడు! ఉసూరుమంటూ వాళ్ళ పక్కనే చతికిల పడింది.

మనసు మళ్ళా ఇంటికి పరుగెత్తింది. రాజు ఎలా ఉన్నాడో! ఆయన టిఫిన్ తిన్నారో లేదో! మామగారికి నీరసం ఎలా ఉందో! తను ఎప్పుడు వెళ్ళి వంట చెయ్యాలి: తన ఇంటికి ఆధారం పదేళ్ళ పిల్ల బలిజ. తనకు అంతకన్నా ఎవరూ దొరక లేదు. ఒకపూట భోజనం నెలకు ఐదు రూపాయలు దొరుకుతాయని ఆశపడి దాని తల్లి దాన్ని తన దగ్గర పెట్టింది. అంతమాత్రమైనా ఇంట్లో ఆధారం ఉంటుంది గదా అని ఆశపడి తను ఉంచుకుంది. నాలుగు గంటలు కాగానే అది రెడీగా ఉంటుంది. ఇంటికి పోవడానికి పసిపిల్ల గదా. దానికి ఆటల రంధి.

చెట్టు కింద కూర్చున్న నలుగురు టీచర్లు బండివాడి దగ్గర కొన్న వేరుశనక్కాయలు తింటున్నారు. కబుర్లు చెప్పుకుంటున్నారు. తననూ తినమన్నారు. తనకు తినాలని లేదు. వద్దన్నది. దిగాలుపడి దిక్కులు చూస్తూ కాస్త దూరంగా కూచుంది. ఎండ తగ్గి ఆకాశమంతా ఎర్రని కాంతి అలుముకుంటోంది. పొద్దు ఊకుతోంది. అప్పుడు ప్యూన్ వచ్చి చెప్పాడు. 'చైర్మన్ గారు ఇవ్వాళ రావటం లేదుట. రేపు వస్తారుట. మళ్ళా రేపూ ఇదే ఫార్సు: అందరూ లేచి ఎవరి తోవన వాళ్ళు వెళుతున్నారు. సరాసరి బస్సు స్టాండుకు వెళ్ళింది. ఎంత చూసినా ఏ బస్సు రాలేదు. మనసులో తొందర, రిక్షా పిలిచింది. రెండు రూపాయలు కావాలన్నాడు. అయినా తప్పదు, ఉసూరుమంటూ రిక్షా ఎక్కింది.

బలిజ రోడ్డు మీద నించుని ఎదురు చూస్తోంది. పుస్తకాలు, సంచీ తీసుకుని తను ఇంకా లోపలికి వెళ్ళలేదు.

అప్పుడే అన్నది." పొద్దుపోయింది, పోతానమ్మా"

తనకు చిరాకెత్తింది. ఏం తొందర, ఒక్కరోజు కాస్త ఆగలేదా! "పోదువుగానిలే. రాజు ఏం చేస్తున్నాడు!" అంది విసుగ్గా.

"నాలుగ్గంటలకి పాలు పట్టా. నిద్దరబోతున్నాడు." అంది.

లోపలికి వెళ్ళింది. వరాండాలో అతను సూటు బూటు కూడా విప్పకుండా కూచుని పేపరు చదువుతున్నారు. వచ్చి ఎంత సేపయిందో ఏమో!

"కాఫీ తాగారా?" అంది.

"లేదు" అన్నాడు ముభావంగా.

తాను ఆలస్యంగా వచ్చినప్పుడల్లా అతను కాస్త ముభావంగా ఉంటాడు. తను ఏం చేస్తుంది? తనకు చిరాకు వేసింది. కాఫీ టిఫెన్ అన్నీ రెడీగా పెట్టే పోయింది గదా! తనూ రోజంతా స్కూల్లో అలసిపోయ్యే వస్తుంది గదా! అయినా బాధ అణచుకుంది. ఇల్లు శూన్యంగా ఉంటే అతనికి తోచదేమో! ఆప్యాయంగా అంది.

"రండి, కాఫి ఇస్తాను."

అతను లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చాడు. తను రాజు దగ్గరకు వెళ్ళింది. ఒళ్ళు ముట్టుకుని చూసింది; చల్లగా ఉంది. అమ్మయ్య: జ్వరం లేదు. మనస్సు కాస్త తెప్పరిల్లింది. స్టవ్ ముట్టించి మళ్ళీ పాలు పెట్టింది — కాఫి చెయ్యటానికి, ప్లాస్కులో కాఫీ బలిజకి ఇచ్చింది. ప్లాస్కు కడిగి అది వెళ్ళిపోయింది. అతను టిఫిన్ తింటున్నాడు. కుంపటి అంటించి స్నానానికి వేన్నీళ్ళు పెట్టింది. కాగిన పాలు తీసుకుని కాఫీ కలుపుతోంది. అతను వాళ్ళ ఆఫీసు కబుర్లు చెబుతున్నాడు. తను ఊకోడుతోంది. కాని మనసు అక్కడ లేదు. పొద్దుపోయింది; వంట ఎప్పుడు అవుతుందా అనుకుంటోంది. ఒంట్లో ఓపిక లేదు. హాయిగా నిద్ర పోవాలని ఉంది. కాని ఆ నిద్రకు ఇంకా టైముంది. ఈ లోపల చేయవలసినవి ఎన్నోఉన్నాయి.

తను వచ్చిన అలికిడి విని మామగారు మెల్లగా వచ్చారు. వంట ఇంటి గుమ్మం దాకా వచ్చి గబుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నారు. ఆయనకు మొహమాటం. అతను తనూ ఏకాంతంగా ఉన్నారని, ఆయన అక్కడికి రాకూడదని భ్రమ. అత్తగారు పోయినప్పటి నుంచి ఆయనకు లోలోపల ఏదో చెప్పలేని బాధ. మొహమాటం. కొడుక్కు కోడలికి తాను భారంగా ఉన్నానేమోనని ఆయన భ్రమ. ఆయన ఒంటరిగా ఉండలేరు. తను రాగానే చంటిపిల్ల వాడు తల్లి కోసం ఎదురు చూస్తున్నట్లు ఏవో చెబుతారు. "ఇవ్వాళ ఎందుకో నడుం అంతా నొప్పిగా ఉంది" అంటారు. తను ఓపికగా నడుం తోముతుంది. "గొంతుకు ఎండుకుపోతోంది, చెప్పలేనంత నీరసంగా ఉంది" అంటారు. తను హార్లిక్సు కలిపి ఇస్తుంది. ఒక్కో రోజు " ఇవ్వాళ బలిజ నన్ను ఒంటరిగా వదిలేసి రాజు నెత్తుకుని ఎక్కడికో వెళ్ళిపోయింది." అంటారు. తను ఓపిగ్గా "నేను కోప్పడు తానులెండి" అంటుంది. ఆయనను చూస్తే తనకు జాలి వేస్తూ ఉంటుంది.

అతనికి కాఫీ ఇచ్చి మామగారికి హార్లిక్సు కలిపి తీసుకు వెళ్ళింది. ఆయన హాల్లో కూచుని ఉన్నారు. "ఆలస్యం అయింది ఇవ్వాళ, పాపం మీకు నీరసం వచ్చి ఉంటుంది. ఎవరో వస్తారంటే స్కూల్లో ఉండిపోవలసి వచ్చింది." అంది. ఆయన జాలిగా "చాలా కష్టపడుతున్నావు. తల్లీ" అన్నాడు. ఆ ఆప్యాయతకు కళ్ళు చెమ్మగిల్లాయి. "కాస్సేపు పడుకోండి. వంట ఇప్పుడే చేస్తాను." అంది.

ఎలాగో వంట పూర్తి చేసింది. అతని స్నానం అయ్యాక రాజుని లేపి నీళ్ళుపోసి పాలు తాగించి మళ్లా పడుకో బెట్టింది. తను స్నానం చేసి శుభ్రంగా మల్లెపువ్వులా తయారైంది. అందరికి వడ్డించింది. అందరి భోజనాలు అయ్యాయి. వంటగది శుభ్రం చేసింది. రాత్రి పది దాటుతోంది. అప్పటికి నిద్రకు దేవుడు పర్మిషన్ ఇచ్చాడు. పడకగది వేపు వెళ్ళింది. ఏదో చదువుకుంటున్న అతను ఆమెను చూడగానే ఆప్యాయంగా దగ్గరకు లాక్కున్నాడు. ఒంట్లో ఓపిక లేదు. మనసులో మమకారం ఉంది. సంతోషంగా అతని కౌగిట్లో ఇమిడిపోయింది.

అందరూ నిద్రపోతున్నారు. రసికకు ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు. నిద్రపోతున్న రాజును, అతన్ని చూస్తూ పడుకుంది. ఇద్దరి ముఖాలు అమాయకంగా కనిపిస్తున్నాయి. రోజంతా ఇంట్లోనే ఉండి వీళ్ళను చూసుకుంటూ వుంటే ఎంత బాగుండును అనిపించింది. కాని వెంటనే మళ్ళా మనస్సు అందుకు ఒప్పుకోలేదు. తను ఉద్యోగం చేస్తోంది కాబట్టి అందరికి అన్నీ సౌకర్యంగా జరపగలుగుతోంది. లేకపోతే ఇబ్బందిపడక తప్పదు. మామగారికి మందులు, రాజుకు టానిక్కులు, పాలు పండ్లు, ఎన్ని ఖర్చులు: అన్నింటికి అతని సంపాదన మీదే ఆధారపడితే సంసారం ఎలా జరుగుతుంది: పైగా డబ్బు దాచుకోవాలి గదా! రాజు పెద్దవాడవుతాడు. పెద్ద చదువులు చదివించాలి. ఎంత డబ్బు కావాలి:

నిద్రపట్టక అటూ ఇటూ ఒత్తిగిలింది. మెళ్ళో కాసుల పేరు గుచ్చుకుంది. అది సాయంత్రం తియ్యటం మరచిపోయింది. అవసరాన్ని బట్టి అది ఆరు నెలలు బాంకులో ఉంటే, ఆరు నెలలు ఇంట్లో ఉంటుంది. అయినా అది అమ్మటానికి బుద్ధి పుట్టదు. అది ఆత్తగారి కాసుల పేరు. అది ఆవిడ తనకిచ్చింది. అది తను తన కోడలికి ఇవ్వాలి. కోడలు: నవ్వు వస్తోంది, రాజు పెద్దవాడై కోడలు వస్తే తను రిటైరై అన్నివిధాల విశ్రాంతి తీసుకుంటుందా! రాజుకింకా ఏడాది వెళ్ళలేదు. కలలు గుర్రాలు కట్టుకు సంవత్సరాలు దాటి వెళుతున్నాయి.


తెల్ల వారినట్లుంది. తొలి కోడి కూసింది. మళ్లీ మొదలు! రాజుకి పాలు, అతనికి కాఫీ, మామగారికి హార్లిక్సు, వంట, పని, స్కూలు, మళ్లా సాయంత్రానికి ఇల్లు!

నిద్రమత్తు ఇంకా వదలటం లేదు. అలాగే అంతు లేకుండా నిద్రపోవాలని ఉంది. మనసులో మమకారం మసలుతోంది. ఓపిక లేకపోయినా రసిక మామూలుగా లేచింది ....

# సంతృప్తి

## విమలారామం

## (1975 - సెప్టెంబర్ , వనిత మాసపత్రిక నుంచి)


సంతృప్తి
-- విమలారామం

మనోరమను రిసీవ్ చేసుకోటానికి ఆనంద్ ఒక్కడే కాదు అనుపమ కూడా స్టేషనుకు వచ్చింది.

ముచ్చటగా వున్న ఆ యువ జంటను చూసే సరికి ఆమెకు రెండు కళ్ళూ చాలవనిపించింది.

చెల్లెలి చుట్టూ చేతులు వేసి 'చలిలో నువ్వూ వచ్చావెందుకే?' అంది మనోరమ.

'అదేమిటి వదినా! మీ చెల్లాయికే కాని నాకు మాత్రం చలిగా వుండదా?" అన్నాడు ఆనంద్ చిలిపిగా నవ్వుతూ.

"ఉహు( అదేం కాదక్కా! ఆయనకు ఒంటరిగా రావటం భయం!" అనుపమ కిలకిలా నవ్వింది.

మురిపెంగా వాళ్ళను కలియజూస్తూ నిలబడింది మనోరమ.

'పిల్లల్ని తీసుకురాలేదేమక్కా?'

'పది రోజుల పాటు ప్రశాంతంగా నీ దగ్గరుందామని వచ్చా, పిల్లలు కూడా ఎందుకు? ఇంకా నయం – బావను తోడు తీసుకురాలేదేమని అడిగావు కాదు!'

మనోరమ విసుగుదలకి ఆనంద్ ఆశ్చర్య పోయాడు.

అనుపమ నవ్వింది. 'సరే, ఇంటికి పోదాం పద.'

టాక్సీలో బయలుదేరారు.

"మేం ఫేమిలీ పెట్టుకున్న క్రొత్తలో వచ్చారు మీరు. మళ్ళీ ఇంతకాలానికి ఇప్పుడు రావటం ... వాళ్ళను కూడా తీసుకువస్తే సరదాగా ఉండేది!" అన్నాడు ఆనంద్.

ఒక్కసారి అతని వైపు చురుగ్గా చూసి తల త్రిప్పుకుంది మనోరమ.

అది గమనించిన అనుపమ 'ఇంట్లో అల్లరికి వేరే పిల్లలక్కర్లేదక్కా! ఈయనే పదిమంది పెట్టు' అంది.

'మీ అక్కయ్య వచ్చింది కదా అని నా మీద చాడీలు చెపుదామనుకుంటున్నావేమో! అట్టే ఆశపడకు. రెండ్రోజులు పోతే ఆవిడకే తెలుస్తుంది చెల్లాయి ఎంత చెడ్డదో – మరిది ఎంత మంచివాడో!'

'ఇంకా నయం – ఇంటి ముందు బోర్డు వ్రాసి పెడతానన్నారు కాదు!'

వాళ్ళ అల్లరి ముగియటానికి ముందే టాక్సీ ఇల్లు చేరింది.

మనోరమ ముఖం కడుక్కొని వచ్చేసరికి కాఫీ టిఫిను అందించింది అనుపమ. అంత సేపూ ఆనంద్ ఏదో ఒక పనిలో అనుపమకు సాయం చేస్తూనే ఉన్నాడు.

'పని మనిషి అప్పుడే వెళ్ళిపోయింది?' అని అడిగింది మనోరమ.

'ఇంత భారీ మనిషి ఇక్కడ అడుగులకు మడుగులొత్తుతుండగా మీ చెల్లాయికి వేరే పని మనిషి ఎందుకు వదినా!'

'పోదురా!'

'... అదేమిటి ? ఈ పూట వస్తుండి పనికి పొమ్మంటావా?'

'ఇంకా టైముంది కాని, నన్ను కబుర్లతో కాల్చుకు తినకుండా కాసేపు పేపరు చదువుకోండి.'

మనోరమ కళ్ళల్లో నిల్చిన ప్రశ్న అలాగే ఉండడం చూసి 'పని మనిషిని పెట్టుకోలేదక్కా!' అంది అనుపమ.

'అదేమిటే ! అంత పనీ ఎలా చేసుకుంటున్నావు?'

అనుపమ నవ్వింది. 'ఇదేమంత పెద్దపని!'

అక్కగారింట్లో నౌకర్లు చాకర్లు ఎంత మందుంటారో ఆమెకు తెలుసు. అందుకనే, ఆ సంభాషణ ఇంక సాగనివ్వలేదు అనుపమ.

వేణ్ణీళ్ళ బకెట్ బాత్ రూమ్ లో పెడుతున్న చెల్లెల్ని చూసి, '... అంత, మొద్దు బకెట్ ఎలా ఎత్తగలిగావే?' అంది మనోరమ.

'అలవాటక్కా! రోజూ చేసుకునే పనేగా!'

'అదంతా అబద్ధం వదినా! మొగుడు చేత మోయిస్తే మీరేమనుకుంటారో అని తానీ పూట పెట్టింది కాని ... మీ చెల్లెలు రోజూ నా చేత చేయించని పనంటూ లేదని నమ్మండి! ... మీరొచ్చారు, నా పంట పండింది. ఈ పూట కావల్సినంత రెస్టు దొరికింది!' అన్నాడు ఆనంద్.

'ఆయన కబుర్లకేం కాని... నీళ్ళు చల్లారి పోతాయి. నువ్వెళ్ళి స్నానం చెయ్యక్కా!'

మనోరమ నవ్వుకుంటూ బాత్ రూమ్ లోకి వెళ్ళింది. తలుపులు వేసుకున్నా – నీళ్ళ చప్పుడు లేనప్పుడు – వాళ్ళ మాటలు ఆమెకు లీలగా వినిపిస్తూనే ఉన్నాయి.

'నేనొట్టి పిసినిగొట్టు మనిషినని మీ అక్కయ్యనుకోదూ!'

'ఛ ! ఏమిటా మాటలు !'

'నాకు మాట రాకుండా నువ్వు చేస్తేగా!'

'ఎవరి మెప్పో పొందాలని పెట్టుకుంటామా పనిమనిషిని? – సంతానంతో వేగలేకనో రోగం రొస్టుతోనో చేసుకోలేకపోతే పెట్టుకోవాలికాని!'

'నిజం చెప్పు. నువ్వీ పనులన్నీ తేలిగ్గా చేసుకోగలుగుతున్నావా?'

'చేసుకోలేకపోతున్నానని మీతో ఎప్పుడయినా చెప్పానా?'

'చెప్పేదానివయితేగా నువ్వు!'

'ఆ మాట నా కళ్ళల్లోకి చూసి చెప్పండి!'

'నువ్వు కొరకరాని కొయ్యవి'

'స్టేటస్ సింబల్ గా పనిమనిషిని పెట్టుకోవాలని మీకుందేమోనని నాకు లేదు...'

'పోనీ, అలాగే అనుకొని పెట్టుకో! నా మర్యాద దక్కించు.'

'అలాగే ! ఆ చేత్తోనో ఓ వంట మనిషిని కూడా చూడండి. శుభ్రంగా తింటూ బబ్బుంటాను. ఆరు నెల్లు తిరక్కుండా మీరు గుర్తుపట్టనంతగా మారిపోతాను. అప్పుడీ తలుపులన్నీ వెడల్పు చేయించుకోవాలి. ఇక వీధిలో అడుగు పెడితే – అదుగో అలా గున్నేనుగులా పోతోంది – ఆవిడేనా బక్క ఆనందుగారి అర్ధాంగి అని అంతా చెప్పుకుంటారు. ఆ పైన ..'

ఆ తర్వాత వాళ్ల నవ్వుల దొంతరల మధ్య ఏం మాటలు దొర్లాయో మనోరమకి వినిపించలేదు.

స్నానం చేసి వచ్చి బట్ట కట్టుకుంటుంటే గది బయట వాళ్ళనుకుంటున్న మాటలు మళ్ళీ వినిపించాయి ఆమెకు.

'... టెలిగ్రామిచ్చి అంత హడావిడిగా బయలుదేరిందేమిటి మీ అక్కయ్య ... ఉత్తరం రాసి అందరితో కల్సిరావచ్చుగా!'

'మా అక్కయ్య సంగతి తెలియదు కనుక మీరంత ఆశ్చర్యపోతున్నారు.'

'ఏమిటి?'

'ఇలా అర్ధాంతరంగా బయలుదేరి రావటం దానికి క్రొత్తేం కాదు. మొదట్లో కంగారుపడేవారు మా నాన్న గారు. ఆ తర్వాత టెలిగ్రాములు మాకందరికీ అలవాటయిపోయాయి.'

'అంటే?'

'మా బావ మీద కోపం వచ్చినప్పుడల్లా ఇలాగే వచ్చేస్తుంది మా అక్క!'

మనోరమకి చివ్వున కోపం ముంచుకొచ్చింది. ఉన్నపళంగా వెళ్ళి చెల్లెలి చెంపలు వాయించాలనిపించింది .. అంతలోనే ఆనంద్ గొంతు గుర్తు చేసింది. చెల్లెలిప్పుడు అలనాటి చిన్నపిల్ల కాదని, పెళ్ళి చేసుకుని పెద్దదయిందని – తానిప్పుడు వాళ్ళింటికే చుట్టపు చూపుగా వచ్చిందని!

'చిత్రంగా ఉందే'

'అది కాదు చిత్రం! మనింటికి రావటం!'

సిగ్గుతో ముడుచుకుపోయింది మనోరమ. 'ఛీ! ఎంత తెలివి తక్కువ పనిచేసింది తను?' ఇంకా ఏం మాటలు వినాల్సివస్తుందో అని గుడుసుళ్ళు పడుతూ చీర కట్టుకోవటం పూర్తయినా గదిలోనే ఉండిపోయింది ఆమె.

'మనిషిలా అనుకోవటం ఆవిడ వింటే బాగుండదు.'

'సరే, మీరూ స్నానం చేసి రండి'.

ఆ తర్వాత వాళ్ల మాటలు వినిపించలేదు. ఆమెకు గది బయటకు వెళ్ళాలని అనిపించలేదు. ఏదో ఉక్రోషంతో అక్కడే కూర్చుండిపోయింది. రైలు దిగినప్పుడు చెల్లెలితో ఎన్నో మాట్లాడాలన్న ఉత్సాహం. ఆమెలో ఇప్పుడు లేదు ... మంచం మీద వాలి కళ్ళు మూసుకుంది మనోరమ.

మరి కాసేపటికి అనుపమ తలుపులు త్రోసుకొని లోపలికి వచ్చింది. 'అక్కా ! అరే ... అదేమిటీ ? అలా పడుకుంది ...'

గది గుమ్మంలో నిలబడిన ఆనంద్ అన్నాడు 'రాత్రి ప్రయాణం కదూ! బాగా అలసిపోయుంటుంది. పోన్లే, ఆవిడను లేపకు.'

వాళ్ళ మాటలు వినాలన్న కుతూహలం ఆపుకోలేక అలాగే నిద్ర నటిస్తూ పడుకుంది మనోరమ. కాని, ఆమె ఆశ తీరలేదు. వంటింట్లో కేరింతాలాడుతూ ఆనంద్ భోజనం చేస్తున్నంతసేపూ అనుపమ మాటలేవీ సరిగ్గా వినిపించలేదు.

కొంత సేపటికి నిజంగానే నిద్రలో కొరిగిపోయింది మనోరమ. అలా ఎంత సేపు పడుకుందో ఆమెకు తెలియదు ... మెలకువ వచ్చేసరికి ప్రక్క గదిలోంచి కుట్టుమిషను శబ్దం వినిపించింది. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. తీసుకొని బయటకు వచ్చింది మనోరమ.

'లేచావా అక్కా! బాగా నిద్రపట్టిందా?'

'ఊ(!'

'బట్ట కట్టుకోడానికి లోపలికి వెళ్ళిందానివి – ఎంతసేపటికీ రాకపోతే చూద్దామని వచ్చా. అప్పటికే నిద్రపోయావు.'

'ఊ(!'

'అదేమిటలాగున్నావు? ఒంట్లో బాగోలేదా?' చేస్తున్న పని ఆపి అక్కదగ్గరికి వచ్చింది అనుపమ.

ఇంక ముభావంగా ఉండటం తనకే బాగుండలేదు. 'అబ్బే, ఏం లేదే, నిద్ర బద్ధకం వదలక ..' అని నవ్వేసింది.

'సరే ! రా ... భోజనం చేద్దాం.'

కుట్టుమిషను వైపు చూసి, 'బట్టలన్నీ నువ్వే కుడతావా?' అంది మనోరమ.

'అవును. ఆయన పేంట్లు, షర్టులు తప్ప!' అని నవ్వింది అనుపమ.

'ఎందుకే ఇంత శ్రమ. టైలర్ కిచ్చుకోకూడదూ?'

'ఈ మాత్రం దానికి శ్రమేముంటుంది? చేతనయిన పని. వీలయినప్పుడు చేసుకోవచ్చు. ఇష్టం వచ్చినప్పుడు చేసుకోవచ్చు. టైలర్ చుట్టూ తిరగనక్కరలేదు. ఇట్లా కుట్టావేం అని వాళ్ళననక్కరలేదు.

'ఉహూ(! నేననేది ఆ సమయంలో మరోటేదయినా చేసుకోవచ్చు కదాని...'

'యావరేజ్ ని రోజుకో అరగంట కూడా మిషన్ మీద కాలు పెట్టను. అదయినా అవసరమయితేను .. అర్జంటయితేను. ఇంతలో మునిగిపోయే పన్లేముంటాయి? సరే పద... '

బాత్ రూమ్ కి వెళ్ళి ముఖం కడుక్కొని వస్తూ దొడ్లోకి చూసి ఆశ్చర్యపోయింది మనోరమ. 'అనూ ! నా బట్టలన్నీ ఎవరుతికి ఆరేశారే? చాకల్ది వచ్చి వెళ్ళిందా?'

అనుపమ నవ్వింది, 'లేదక్కా ! నేనే అరేసాను.'

'ఎందుకూ? రేపు చాకల్దాన్ని పిలిపిస్తే పోయేదిగా?'

'నాతోపాటే నీవీనూ! ఎన్నున్నాయని!'

'అంటే ? ... చాకల్ది కూడా లేదన్నమాట!'

'ఈ మాత్రం బట్టలకి అది కూడా ఎందుకే? ఉతకటం నా వంతు – ఇస్త్రీ చేయటం ఆయన వంతు.' అని నవ్వేసింది అనుపమ.

మనోరమ కింకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

అన్నం తింటున్నంత సేపూ అక్కయ్య పిల్లల గురించే అడిగింది అనుపమ. ఎవళ్ళెవళ్ళు ఏం చదువుతున్నారో – వాళ్ళకేవేం ఇష్టమో – అన్ని వివరాలూ అడిగింది. తన గురించి ఏమీ చెప్పనూ లేదు – అక్కను అడగనివ్వనూ లేదు !

వంటిల్లు సర్దుకొని బయటకు వచ్చాక మళ్ళీ కుట్టుపనిలోకి దిగింది అనుపమ. ఈ మాలు ఇన్ని గుండీలు, హుక్కులూ తీసుకొని అల్మారాలో కుట్టిపెట్టిన బట్టలూ అవీ ఓ మోపెడు తీసిముందేసుకుంది.

ఆశ్చర్యపోయింది మనోరమ. 'ఈ బట్టలన్నీ నీవేనా?'

తల త్రిప్పుకుంటూ అంది అనుపమ, 'కాదక్కా ! ... నీరజ అని ఓ అమ్మాయిని. ఆమె తెచ్చింది. మరేమో...'

మనోరమ ముఖం జేవురించింది. 'చాల్లాలు! ఇంక నాకేం చెప్పకు. ఈ ఇంట్లో నువ్వింత కూలి మనిషి వయిపోతావని నేనెప్పుడూ అనుకోలేదు. పనివాళ్ళు వద్దన్నావు. బాగుంది. ఆ పనీ ఈ పనీ అని లేకుండా అంత చాకిరీ నువ్వే చేసుకుంటున్నావు. చాలా బాగుంది. నీ బట్టలన్నీ ఉతుక్కుంటున్నావు – కుట్టుకుంటున్నావు. మరీ బాగుంది. మరయితే ఈ కర్మేమిటే ! ... పరాయి వాళ్ళ బట్టలు కుట్టపల్సినంత ...'

'...ప్లీజ్ ! తొందరపడి ఎవర్నీ నిందించకక్కా! నే చెప్పేది విను. విన్నాక నాదింకా తప్పనిపిస్తే అప్పుడు తిట్టు .. ఓ క్షణం ఓపిక పట్టు.'

'ఏం చెపుతావు? అతన్దేం తప్పు లేదు – అన్నీ కావాలని నువ్వే చేస్తున్నానంటావు. ఊర్కే కూర్చోవటమెందుకని ఈ మోతంతా మోస్తున్నానంటావు. అంతేగా?'

'మన పనులు మనం చేసుకుంటూ మరొ కళ్ళకి సాయపడ్డం తప్పంటావా అక్కా?'

మనోరమ మరింత ఆశ్చర్యపోయింది. 'అంటే ? ఈ బట్టలు కుట్టటం అదీ ఊరికేనా? కనీసం గొడ్డుచాకిరీకి కూలి కూడా కిట్టదన్న మాట ..! ఆ మహారాజావారికీ సంగతి తెలుసా?'

'తెలుసు.'

'ఛ ! ఇంత మతిలేని మనుషుల్ని నేనెక్కడా చూళ్ళేదు.'

'పోనీలే అక్కా? చేస్తున్నదేదో నీతో చెపుదామనుకున్నాను. నువ్వు పూర్తిగా వినకుండా ఇన్ని మాటలంటే నేను మాత్రం ఏమనగలను?'

మనోరమ వెలవెలబోయింది.

తల దించుకునే ఉంది అనుపమ. ఆమె చేతి వ్రేళ్ళు కుట్టుపని చేస్తూనే వున్నాయి. అక్క మౌనమే అనువుగా తీసుకొని గొంతు విప్పింది. 'నీరజ ఎవరో కాదక్కా? ఈయనకు చిన్నప్పుడు చదువు చెప్పిన చిదంబరం మాస్టారమ్మాయి. పాపం, ఆయనిప్పుడు రిటైరయిపోయారు. ఇద్దరు కూతుళ్ళు పెళ్ళిళ్ళు చేసేటప్పటికే ఆయన శక్తంతా ఉడిగిపోయింది. నీరజ కాక ఇంకా ఓ పెళ్ళి కావాల్సిన అమ్మాయి ఉంది. పెద్దకొడుక్కి డిగ్రీ ఉంది కాని ... సరైన ఉద్యోగం లేదు. చిన్నవాడి కింకా చదువే పూర్తికాలేదు. ఇన్ని అవస్థలు పడుతున్నా వాళ్ళల్లో ఎవరిలోను అభిమానానికి లోటు లేదు. ఎవర్నీ చేయి చాపి అడగరు. గురువుగారని చెప్పి మీ మరిది ఎప్పుడయినా ఇవ్వబోతే పుచ్చుకోరు. ఆయనకేదో విధంగా సాయపడాలని ఈయన కోరిక. అందుకనే వాళ్ళబ్బాయికి పెర్మనెంటు ఉద్యోగం వేయించాలని ప్రయత్నాలు చేస్తున్నారు .. నీరజ స్కూలు ఫైనలు పాసయింది. టైపు నేర్చుకుంటోంది. ఆ మధ్య ఖాళీగా ఉన్నప్పుడు నా దగ్గరికి వచ్చి కుట్టు పనీ అదీ నేర్చుకుంది. ఓ రోజున అడగలేక అడగలేక 'నా ఫ్రెండ్స్ నాల్గు జాకెట్లు కుట్టిపెట్టమన్నారు. మీకభ్యంతరం లేకపోతే మీ మిషను మీద కుట్టుకుంటానక్కా' అని అడిగింది.

'ఏమన్నా ఇస్తానన్నారా ?– ' అని అడిగాను. ముఖం ఎర్రగా చేసుకొని, – 'అవునక్కా ! టైపు పరీక్షకు ఫీజు కావాలి. ఈ ఇబ్బందుల్లో నాన్నగార్నేమని అడగను!' అంది. ఆమె ముఖం చూసేసర్కి నాకు కళ్ళ నీళ్ళు తిరిగాయి! నేనా డబ్బు ఇస్తానంటే తను ఎలాగా తీసుకోదు. 'నీ చేతిలో పని నువ్వు చేసుకుంటున్నావు. ఇదేం తప్పుపని కాదమ్మా ! అలాగే కుట్టుకో –' అన్నాను. వాళ్ళ ఫ్రెండ్సు ద్వారా ఇంకా బట్టలు తెచ్చుకుంది ... ఇందులో సగందాకా తానే కుట్టుకుంది. పాపం, చిన్నపిల్ల, నా కళ్ళెదురుగా అంత శ్రమ పడుతుంటే నా కడుపు తరుక్కుపోయిందక్కా ! ఆ అమ్మాయికి నేనీ మాత్రం సాయపడటం తప్పంటావా ?'

అనుపమ గొంతు జీరపోయింది.

'అమ్మా !' అని ఒక పిచ్చికేక పెట్టింది మనోరమ.

భయంభయంగా తల యెత్తింది అనుపమ.

సోఫాలో కూర్చున్న మనోరమ స్ప్రింగులా క్రిందకు దూకి చెల్లెల్ని వాటేసుకుంది.

అక్కయ్యెందుకు ఏడుస్తోందో అనుపమకి అర్థం కాలేదు. 'అక్కా ! ఏమిటిది? నేనేమన్నానని ! నీ మనస్సు నొప్పిస్తే నన్ను క్షమించక్కా! ...'

చెల్లెల్ని వదిలిపెట్టి లోపలి గదిలోకి పరుగెత్తింది మనోరమ. మంచం మీద బోర్లబొక్కలా పడుకొని తలగడలో తల దూర్చుకుంది.

అనుపమ ఆమె దగ్గరగా వచ్చి వెన్ను మీద చెయ్యి వేసింది. 'అక్కా !'

'కాసేపు నన్నొంటరిగా వదిలిపెట్టి పోవే ! నన్ను విసిగించకు ..'

అక్క నిరాదరణకు తట్టుకోలేక అనుపమ మనస్సు చివుక్కుమంది. కన్నీళ్ళగ్గ పట్టుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

తన గుండెల్లో సుడులు తిరుగుతున్న బాధను కన్నీరుగా కరిగించుకుంది మనోరమ. ఎంత సేపలా పడుకుందో ఆమెకు తెలియదు. మగతగా నిద్రపట్టింది.

బయట ఆనంద్ గొంతు వినిపించి ఆమెకు మెలుకువ వచ్చింది.

'ఏం అలాగున్నావేం?'

'అబ్బే, ఎలాగున్నాను!'

'దాద్దామని పెదవులంటున్నా చూడమని కళ్ళల్లో తడి చెపుతోంది.'

'ఊ (! మీ పరిశీలనులు – పరీక్షలు కట్టిపెట్టి ఆ చేతిలో పేకెట్టేమిటో చెప్పండి ముందు.'

'చెప్పుకో చూద్దాం.'

'మనకి వెడ్డింగ్ డే ప్రజంటుసు తెస్తానన్నారుగా ! అదే అయివుంటుంది.'

'కాదు'.

'మరి?'

'ఇంకా మనకి వేడుకలు కావాలంటావా? ...పెళ్ళి పాతపడిపోలేదూ?'

'రెండేళ్ళకే ఇలాగంటున్నారు. వచ్చే ఏడుకి ముసలివాళ్ళమై పోతామంటారా ఏం?'

'ఆ మాట అప్పుడే అంటానా ? పుట్టబోయే మన కుర్రాడి పెళ్ళానికో పిల్ల పుట్టద్దూ?'

కాసేపు వాళ్ళ నవ్వులతో ఇల్లంతా పరవశించింది. మనోరమ తనలో తను నవ్వుకోకుండా ఉండలేకపోయింది.

'అనుకోకుండా ఓ పన్జేయాల్సి వచ్చింది అనూ !'

'చెప్పండి. మీరనుకొని చేసే పనులెన్నుంటాయి కాని ...'

'ఉహూ (! నిజంగానే ...'

'అడ్వాన్సు రాలేదా ?'

'రాకపోవటమేం ? నిక్షేపంలా ఆరు వందలూ వచ్చింది. అనుకున్నట్టుగా నీకూ నాకూ బట్టలు తీసుకుందామని బయలుదేరాను. దార్లో విశ్వనాథం కనిపించాడు ... పాపం, వాళ్ళావిడకు పురుడు అదీను. మేజర్ ఆపరేషన్ అయిందిట. క్రితం నెల్లో మరేదో అవసరం వచ్చి అడ్వాన్సు తీసుకున్నాట్ట. ఈ నెల్లో అదీ దొరకదు. అప్పూ పుట్ట లేదు. తెల్సిన వాళ్ళ బ్రతుకులన్నీ ఒక్కలాగునే ఉన్నాయి ...'

'పాపం, ఆ డబ్బు అలాగివ్వకపోయారా ?'

'అనూ !'

'అవునండీ ! పండగలూ అవీ అందరికీ వస్తాయి. మళ్ళీ మళ్ళీ వస్తాయి. కష్టాలు అలా కాదుగా ...?'

'నిజంగా నువ్వాడదానిగా పుట్టవల్సింది కాదు సుమా !'

'ఇంకా నయం – మనిషిగా ఎందుకు పుట్టావని అనలేదు!'

'నేను మాట వరస కనటం లేదు అనూ ! నిజంగానే నువ్వపురూపమైన మనిషివి. అడక్కుండానే అన్నీ తెచ్చి పెట్టాలనుకుంటుంది భార్య. కాని, అడిగినా తెచ్చిపెట్టని మొగుడంటే ...'

'మహాప్రభూ ! మీ ఊహాగానాలు కట్టిపెట్టి వాస్తవంలోకి రండి. నేను .. మీ అనూని .. మీ ఎదురుగా ఉన్నాను. నేననుకున్నది చేసారా అని అడుగుతున్నాను, ముందా సంగతి చెప్పండి.'

'అలా కాక మరోలా ఎలా చేయగలుగుతున్నాను? విశ్వనాథంకి నాల్గు వందలిచ్చాను.'

వాళ్ళ మాటలు వింటున్నకొద్దీ మనోరమకు మతిపోతోంది.

'కావాలంటే తీసుకోమని చెప్పాను. అతనే వద్దన్నాడు.'

'అభిమానవంతుడు. ఎలా అడుగుతాడు? మీరే బలవంతం చేయాల్సింది.'

మనోరమకు కూర్చుంటేనే కళ్ళు తిరిగి పోతున్నాయనిపించింది.

'అభిమానవంతుడు కనుకనే బలవంతం చేయలేదు. ఈ వేళ పుచ్చుకోగా సరి కాదు – రేపు తీర్చద్దూ!'

'అంటే ! ఇచ్చింది మళ్ళీ పుచ్చుకోవాలనే అనుకుంటున్నారా? మీరేనా ఆ మాటలనేది?'

'పోనీ, అతని స్నేహం పోగొట్టుకోమంటావా?'

'ఊ (! మీరు పెంకిఘటం .. మీతో ఎవరు వేగగలరు? సరే, ఆ రెండొందలు పెట్టి ఏం చేసారు? అదయినా చెప్పండి.'

'ఇదిగో .. ఈ చీర తెచ్చాను.'

పేపరు విప్పితున్న చప్పుడూ అదీ వినిపించింది మనోరమకి.

'అబ్బ, ఎంత బాగుందండి! ఈ నీలం రంగంటే మా అక్కయ్య కెంతిష్టమో!'

'ఆవిడకనే తెచ్చింది .. వెళ్ళేటప్పుడు పెట్టొచ్చని.'

'మంచి పని చేసారు.'

ఇంకో క్షణం కూడా ఆ గదిలో నిలబడలేక పోయింది మనోరమ. ఒక్క ఉదుటున తలుపులు తెరుచుకొని బాత్ రూమ్ వైపు పరుగెత్తింది. గబగబ ముఖం కడుక్కుంది.

ఆమె తిరిగి వచ్చేసరికి వాళ్ళింకా అక్కడే నిలబడి ఉన్నారు.

'అక్కా ! ఇది చూడూ ...' అని అనుపమ దగ్గరగా రాబోయింది.

మనోరమ చెల్లెలి మాట వినిపించుకొనేలేదు. ఆమె వైపు చూడనేలేదు. 'చూడండి మరది గారూ ! అర్జంటుగా నేను మా వూరు వెళ్ళి పోవాలి. ఒక ఆటో కాని, టాక్సీ కాని పిలిచి పెట్టండి ... వీలయితే మీరు కూడా స్టేషను దాకా రండి. ప్లీజ్ ! ..' అంటూ గదిలోకి వెళ్ళి తలుపులు బిడాయించుకుంది.

ఆమె బట్టలు మార్చుకొని సూటుకేసు సర్దుకొని బయటకు వచ్చేసరికి వాళ్ళింకా కొయ్య బొమ్మల్లా అక్కడే నిలబడిపోయాడు.

'అదేమిటి ? మీరింకా ఇక్కడే నిలబడిపోయారు ?'

ఆమె గొంతులోని ఉద్వేగానికి షాక్ తిన్న వాడిలా ఉన్నాడు ఆనంద్. 'పది రోజులుందామని మీరొచ్చారు. వచ్చి పది గంటలయినా కాలేదు. ఇప్పుడే ప్రయాణేమిటి? మీరు చెప్పేదేమిటో ...'

'... అర్థం కాలేదంటారు. మళ్ళీ చెపుతున్నా వినండి! గంటలో మా వూరికి బండుంది...నన్నెలాగో స్టేషను చేర్చమని అడుగుతున్నా! వెంటనే వెళ్ళిపోవాలి. ఇక్కడింక క్షణం కూడా ఉండలేను.'

అనుపమ వైపు అయోమయంగా చూసాడు ఆనంద్.

నీళ్ళు నిండిన కళ్ళతో నిస్తేజమైన నిలబడి పోయింది అనుపమ.

'ఏమిటలా చూస్తున్నారు? మీకు వీలులేదా! పోనీ, అదయినా చెప్పండి. నేనే వెళ్ళిపోతాను.' అంటూ ఓ అడుగు వేసింది మనోరమ.

'అనూ! ..' ఆనంద్ కి మతిపోయినట్లయింది.

'వెళ్ళండి. అక్కకి ఆటో తెచ్చిపెట్టండి.' అని వంటింట్లోకి వెళ్ళిపోయింది అనుపమ.

ఆనంద్ తడబడే అడుగులతో బయటకు వెళ్ళిపోయాడు.

మనోరమ అక్కడ నుంచి కదలలేదు. వెనక్కి తిరగలేదు. చెల్లెలితో మాట్లాడదామనీ అనుకోలేదు. దీర్ఘంగా బయటకు చూస్తూ అలాగే నిలబడిపోయింది.

'అక్కా!'

ఉలిక్కిపడి అటు తిరిగింది. 'ఉహూ ! నా కొద్దు. తినాలని లేదు.'

'పోనీ, కాఫీ అయినా త్రాగు.'

ఓసారి చెల్లెలి వైపు చూసి చటుక్కున కప్పు నందుకొని తల తిప్పుకుంది.

ఆటో తీసుకొని వచ్చాడు ఆనంద్. అతను మరో క్షణంలో బ్రద్దలయ్యే జ్వాలాముఖిలా ఉన్నాడు.

'వెళ్ళొస్తాను అనూ!' చెల్లెలి వైపు తిరక్కుండానే బయట కడుగు వేయబోయింది మనోరమ.

'బొట్టు పెట్టించుకో అక్కా!'

బొట్టు పెట్టి ఆమె చేతుల్లో చీర పెట్టబోయింది అనుపమ.

'ఎందుకిది ? ఇప్పుడేం వద్దు ..'

'కాదని వెళ్ళావంటే తర్వాత నాకంటే నువ్వే ఎక్కువ బాధపడతావ్ ! అదే నాకెక్కువ కష్టం. నన్ను కష్టపెట్టాలనుకుంటే అలాగే తీసుకో కుండా వెళ్ళు...'

గబుక్కున చెల్లెలి చేతుల్లోంచి ఆ చీర లాక్కుంది మనోరమ.

పిచ్చిపట్టిన వాడిలా వాళ్ళిందరి వైపు మార్చి మార్చి చూస్తున్నాడు ఆనంద్.

అతని చేతికి బేస్కెట్ అందిస్తూ, 'ఆటోలో పెట్టండి.' అంది అనుపమ.

'ఇప్పుడేం వద్దు ..' అంది మనోరమ గడప దాటుతూ.

'పోనీలే, కోపం తగ్గితే దార్లో తిందు గాని--- లేకపోతే గోదావరి వచ్చినప్పుడు నా పేరు చెప్పి కిటికీలోంచి విసిరెయ్!' అని చేతుల్తో ముఖం కప్పుకొని లోపలికి పరిగెత్తింది అనుపమ.

పావుగంటలో స్టేషను చేరింది ఆటో. టిక్కెట్టు కొని ఆమెకు సీటు అదీ చూసిపెట్టాడు ఆనంద్.

ఇంకో ఇరవై నిమిషాలుండి బండి బయలుదేరటానికి.

ఆనంద్ తల దించుకుని కిటికీ దగ్గరే నిలబడ్డాడు. ఎవరో గబుక్కున చేయి పట్టుకొనేసరికి ఉలిక్కిపడ్డాడు.

'ఇలా ప్రక్కగా రండి మరిదీ ! మీతో ఓ ముక్క చెప్పాలి.' అంది మనోరమ.

అతను కలలో నడిచినట్లు ఆమె వెంట వెళ్ళాడు. ఇద్దరూ ఓ మూలగా ఎవరూ లేని చోటుకి చేరారు.

'చూడండి ! ఇప్పుడు మీకెంతో చెప్పాలని వుంది. కాని, ఆ ధైర్యమూ లేదు – అంత వ్యవధీ లేదు.'

'చెప్పండి. చెప్పగల్గినంత చెప్పండి. పోనీ, ఓ సారి వెనక్కి వచ్చి వెళ్ళకూడదూ!'

'ఉహూ ! అంత శక్తే ఉంటే ఇప్పుడిలా పారిపోయే దాన్నే కాదు.'

'మీరనేదేమిటో నా కర్థం కావటం లేదు. ఒక వేళ పొరపాటేమయినా జరిగితే ..'

'ఉహూ(! --- నా బ్రతుక్కి మీ తప్పులెంచటం కూడానా?'

'ఛ! అంత మాటెందుకనుకుంటారు! మీరొచ్చారని ఎంతో సంతోషించాము. అంతలోనే మీరిలా వెళ్ళిపోతున్నారు. మిమ్మల్ని నొప్పించే మాటేమయినా అనూ అందా? అంటే చిన్నతనం వల్ల కావచ్చు. లేక మీరక్కయ్యే కదా అన్న చనువు వల్ల కావచ్చు. ఆమేదయినా అంటే మీరు మన్నించండి. అనూ తరపున నేను క్షమాపణ ---'

'ప్లీజ్ ! ఇంకాపండి. అలాంటి మాట లింకనకండి. ఇప్పటికే చేసిన పనికి సిగ్గుతో చచ్చిపోతున్నాను.'

'ఏం చేసారని మీరంత బాధపడాలి?'

మనోరమ గొంతు గాద్గదికమయింది. 'నేను చేసింది ఓ మంచి పని అయితేగా – ఇది చెడు అని చెప్పుకోటానికి! ఇన్నాళ్ళు సంసారం చేసాను, ఏ నాడూ ఆయన్ని సంతోషపెట్టిన మాటనలేదు – మా వాళ్ళను సుఖపెట్టే సంగతి చెప్పలేదు. ఎప్పుడూ ఏదో ఒక సాధింపే! ఎన్నున్నా ఇంకా కావాలనే! ఆశకు అంతుండాలని తెలియలేదు – అసంతృప్తికి అర్థం లేదని తెలియలేదు. లేని దాన్ని కోరటమే ఒక ముచ్చటనుకున్నాను. రాని దాన్ని రప్పించుకోవటమే ఒక గొప్పనుకున్నాను. ఎందరికో అందనివి అమర్చుకుంటున్నాననుకుని నాకందిన వెన్నో పోగొట్టుకున్నాను, --- 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అంటే తెలియనిదాన్ని – ఇంక తోటి మనిషికి సాయం చేసే సద్బుద్ధి నాలో ఎలా పుడుతుంది? ఏదో పుణ్యం మిగలబట్టి అలా చీకటిలోనే ఉండిపోకుండా ఈ వెలుగులోకి వచ్చాను. చేసింది చెడ్డ పనే అయినా నాకిక్కడ మంచే జరిగింది. నా అజ్ఞానం ఈ రోజుతో పటాపంచలయింది. నిజం మరిదిగారూ! నా చెల్లెలు అదృష్టవంతురాలు! దానికి నలుగురూ మెచ్చుకొనే మంచి చేయటమే కాదు – మరెవరూ నొచ్చుకోకుండా మంచి చెప్పటమూ వచ్చింది !...'

ఆమె కళ్ళల్లో నీళ్ళు చూసి నిర్ఘాంతపోయాడు ఆనంద్.

'పెట్టి పుట్టాం కనుక అన్నీ పట్టి తెచ్చెకోవాలనుకొనే నేనెక్కడ – తోటి మనిషికి చేతనయినంత మంచి చేద్దాం – అదే మనిషి బ్రతుక్కి ముఖ్యం – అనుకొనే అనూ ఎక్కడ! చిన్న పిల్ల ఎదురుగా ఓటమినొప్పుకోలేక ఇలా పారిపోతున్నాను. నా అహంకారం పూర్తిగా చచ్చిపోయిన రోజున మీ యింటికి నిండు హృదయంతో మళ్ళీ వస్తా! ఆయనతో ... పిల్లలతో మిమ్మల్ని సంతోషపెట్టేలా మరీ వస్తా! అంత వరకు ... ఈ అల్పురాల్ని మన్నించు.'

ఆనంద్ కళ్ళు చెమ్మగిల్లాయి. 'మీరింత బాధపడుతున్నారు వదినా! మిమ్మల్నీ స్థితిలో ఎలా పంపించను!'

'...లేదయ్యా! ఇప్పుడే కళ్ళు తెరిచి మనిషి బ్రతుక్కో అర్థం చూస్తున్నాను. కొంచెం ధైర్యం తెచ్చుకోనీ! అనూతో చెప్పు – అక్క మన్నించమందని! అక్కకు తన మీద ఏ కోపమూ లేదని ... బాధపడకయ్యా! నీకు మనోరమ తత్వం క్రొత్త కానీ – అనూకి క్రొత్తకాదు. అది నాతో ఎన్నాళ్ళు వేగిందో నీకేమ్ తెల్సు !...'

ఆనంద్ చిత్తరువే అయ్యాడు.

'అన్నీ కావాలని ఆశపడటం అదృష్టంకాదని – ఒక అవలక్షణమని ఈ రోజే తెల్సింది! ఉన్న దాంతో సరిపెట్టుకోవటం కర్మం కాదని – అదే ఒక భాగ్యమని ఈ పూటే తెల్సింది! ఉన్నంతలో తోటి వాళ్ళకి సాయపడటంలో ఎంత సంతృప్తి ఉందో – అదెంత గొప్ప వరమో ఇప్పుడే – ఇంతకుముందే తెల్సింది ! ...'

అవునంటూ స్టేషనులో గంట మ్రోగింది.

మనోరమ తన కంపార్టిమెంటు వైపు పరుగు పెట్టింది.

కిటికీలోంచి ఆమె తన చేత బెడుతున్నదేమిటో కూడ చూసుకోలేదతను.

'నా చెల్లెలు నాకెంతో అమూల్యమైన కానుక ఇచ్చింది మరిదీ! ఈ పేదక్క తన మేరేజ్ డేకి ఇది మాత్రమే ఇవ్వగల్గిందని చెప్పు! తనంత భాగ్యం సంపాదించాకనే తన కళ్ళ బడుతుందని చెప్పు...'

రైలు కనుమరుగయ్యేంత వరకు అలానే చూస్తూ నిలబడిపోయాడు ఆనంద్. మనోరమ ఇంకా ఏదో చెపుతున్నట్లే అతనికి అనిపించింది. చటుక్కున గుప్పిట తెరిచాడు. సుతారంగా చుట్టిన రంగు కాగితం పొట్లం విప్పాడు.

స్టేషనులో అప్పుడే దీపాలు వెలిగించారు.

జిగేల్ మంటున్న ఆ ముత్యాల దుద్దుల్లో మనోరమ కన్నీళ్ళు తళుక్కుమన్నాయి !

## గడ్డిపూలు

- జలంధర

(1975 - అక్టోబర్ , వనిత మాసపత్రిక నుంచి)

"వదినా ! రెడీయా ?" బైట నుంచి అడిగాడు శేఖర్.

"వస్తున్నాను. పదవయ్యా!" అంటూ ఎర్ర అంచున్న తెల్లరంగు గద్వాలు చీర ఒంటినిండా కప్పుకుని, మెళ్ళో చంద్రహారం సరిచేసుకుని బైటకు వచ్చింది స్వర్ణ. కారులో వెనక సీటులో కూర్చుంటూ, "పూలు, పళ్ళు అన్నీ కార్లో పెట్టించావా?" అని అడిగింది.

"ఆ! అయినా, అవన్నీ నీ డిపార్టుమెంటు. ఎందుకైనా మంచిది ఒకసారి చూడు – నేను దేవుడి కోసం గుడికి రావడం లేదు కదా వదినా!" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

మాట్లాడకుండా అన్నీ సరి చూసుకుంది స్వర్ణ. శేఖర్ గుడికి రావడానికి గల కారణం ఆమెకు తెలుసు కనుక లోలోపలే నవ్వుకున్నది.

రాజారావుగారి ఆ ఊళ్ళోని ధనవంతుల్లో ఒకరు. ఫాక్టరీ బాధ్యతలన్నీ పెద్ద కొడుకుకు వదిలిపెట్టారు. కుటుంబ బాధ్యతలన్నీ పెద్దకోడలు స్వర్ణకు విడిచిపెట్టారు. సాయంత్రం ఆరు గంటలయ్యేటప్పటికి నిశ్చింతగా క్లబ్బుకు వెళ్ళిపోతారు. ఆయన రెండో కొడుకు శేఖర్. సరదాకొద్దీ ఏదో ఉద్యోగం అంటూ చేస్తున్నాడతను. ఐదుగంటలకల్లా ఆఫీసు నుంచి వచ్చే అతని మీద, అన్నగారు స్వర్ణను శుక్రవారం పూట గుడికి తీసుకువెళ్ళే బాధ్యత పెట్టారు. కానీ, అది ఒక కారణం అయినా, అతనికి అక్కడి బోలెడంత కాలక్షేపం. అక్కడికి వచ్చే రకరకాల అమ్మాయిలు, పాత స్నేహితులు, పూజారుల కక్కుర్తి, అమ్మ వారి అలంకరణ, బ్లాక్ మార్కెటీర్ల భక్తి, కొత్త దంపతుల అన్యోన్యత ... ఇలా బోలెడు కాలక్షేపం. నానారకాల అల్లర్లు చెయ్యొచ్చు భక్తి చాటున; స్వర్ణకు అది తెలుసు. అందుకనే నవ్వుకుంది. వదినంటే ఎంత చనువుందో, అంత గౌరవమూ ఉంది శేఖర్ కు. తనకున్న ఆరేడు ఏళ్ళు పెద్దదే అయినా, ఆమె తన ప్రవర్తనతోను, మంచితనం తోనూ ఆ గౌరవం సంపాయించుకుంది. సామాన్య సంసారుల ఇంటినుంచి, లక్షాధికారల కోడలైన స్వర్ణకు జీవితంలో అటూ, పోటూ అన్నీ తెలుసు.

'అయినా, ఆ అమ్మాయిని చూసి మారచ్చునేమో.' అనుకుంది. డ్రైవింగ్ సీట్లో ఉన్న శేఖర్ ను పరీక్షగా చూసింది. దాదాపు ఆరడుగుల పొడుగుతో, పచ్చటి చాయతో, ఆకర్శణీయంగా కనిపించే అత్తు అందగాడికిందే

లెక్క. అతని బట్టలు ఐశ్వర్యానికి చిహ్నాలు. అతని గుణం – అహంకారం, అమ్మయకత్వం – ఈ రెండింటినేత. అందరి డబ్బున్న కుర్రాళ్ళలాంటి వాడే అతను. కానీ, ఏమో ...

కారు గుడి ముందు ఆగింది. ఒకసారి చుట్టూ కలియజూసి, కారి దిగింది స్వర్ణ. జనం చాలా త్రొక్కిడిగా ఉన్నారు.

ఆ రోజు శ్రావణ పౌర్ణమి. శుక్రవారం.

జనాన్ని తప్పించుకుంటూ, పూలు పళ్ళు పట్టుకుని, ముందుకు వెళుతోంది స్వర్ణ. వెనకాల విసుక్కుంటూ వస్తున్నాడు శేఖర్.

“హల్లో ! ఆంటీ ! తీయటి కంఠస్వరం వినబడింది.

తలెత్తి ఎవరూ అని చూసింది స్వర్ణ.

లావణ్య!

“హల్లో ! అమ్మ వచ్చారా?” అంది స్వర్ణ.

“అదిగో! అక్కడ కూర్చుందిగా !” అంది లావణ్య. అమ్మవారి గుడిదగ్గర కూచుని ఉన్న లావుపాటి ఆవిడను చూపిస్తూ.

“ఆహా ! నేను చూడనేలేదు. హల్లో మిసెస్ రావ్ ! కులాసా?” అంటూ ఆమె దగ్గరకు వెళ్ళి పలకరించింది స్వర్ణ.

“ఆ ! ఆ ! కులాసానే .. లావణ్య వచ్చింది చూశావా ? ఈ అబ్బాయి ఎవరూ? నీ మరిదా! ఇంకా పెళ్ళి కాలేదు కదూ?” ఏదేదో మాట్లాడుతూనే, శేఖర్ ను ఆపాదమస్తకం కళ్ళతోనే పరీక్ష చేసి, లెక్కలేస్తోంది ఆవిడ.

మెల్లిగా, ఆవిడను వదుల్చుకుని, ఇక ప్రదక్షిణం చేసి అమ్మవారి గుడివైపు అడుగువేసింది స్వర్ణ. అక్కడ అష్టోత్తరానికి క్యూ! ఆ కాసేపట్లో అమ్మ వారికి చేయించే అర్చనలోనూ, చేయబోయే దర్శనంలోనూ, మిగిలినవారికన్న అధికులు కావాలని మనుష్యులు పడే తపనంతా అక్కడ కనబడుతోంది.

అమ్మవారికి హారతి ఇచ్చారు. త్రొక్కిసలాట ఎక్కువైంది. పసిపిల్లల ఏడుపులతో నానా బీభత్సంగా ఉంది. పూజారి తెచ్చిన హారతి కళ్ళకద్దుకుని పళ్ళెంలో రూపాయి వేసింది స్వర్ణ.

“వదినా!” పిలుపు విని స్వర్ణ వెనక్కి తిరిగింది. శేఖర్ చేతిలో చిల్లరడబ్బు.

“పూజారి పళ్ళెంలోని ... వేరుసెనక్కాయలు కొనుక్కోవచ్చు.” అన్నాడు చిలిపిగా.

“ఛా! పడెయ్ ముందు. ఏం పనది?” కోపంగా కసిరింది స్వర్ణ.

"ఆ ! వాడికి తెలియొచ్చిందా ఏమిటి? అయినా నువ్వు రూపాయ్ వేశావ్. నేను అర్ధ రూపాయ్ తీశాను. ఇంకా వాడికే లాభం..."

కోపంగా వెనక్కి తిరిగింది స్వర్ణ.

"వదినా ఆ మాజిక్ చూడు." అన్నాడు శేఖర్. పూజారి ప్లేట్లో డబ్బులు, కొన్ని అమ్మ వారి వెనక బెట్టి, కొన్ని బొడ్లో దోచేసి, మరి కొన్ని హుండీలో వేశాడు. "ఇందులో ఎవరి ఎవరి కెంతెంతంటావ్?"

మాట్లాడలేదు స్వర్ణ. ఆమెకు కోపమొచ్చిందని గ్రహించాడు శేఖర్. మళ్ళీ అర్చనకు ప్లేటు వచ్చినప్పుడు ఎనిమిది అణాలు పడేసి మరో ఐదు పైసలు కూడా స్వర్ణ చూసేట్లుగా పడేసి, "పాపపరిహారంతో సహా ఇచ్చేశాను వదినా!" అన్నాడు. నవ్వుతూ ఊరుకుంది స్వర్ణ. చుట్టూ వయస్సులో ఉండే ఆడపిల్లలు ఈ అల్లరంతా చూసి, పైట కొంగులు అడ్డం పెట్టుకుని నవ్వుతున్నారు. వాళ్ళను చూసి, మరీ రెచ్చిపోయి అల్లరి చేస్తున్నాడు శేఖర్. అది తెలుసు స్వర్ణకు.

జనం మరింతగా ఎక్కువ అవుతున్నారు. నిలుచునే చోటులేకుండా ఉంది. "కొంచెం జరుగుతారా! అమ్మవార్ని చూసి దణ్ణం పెట్టుకు వెళతాను. కొంచెం.."

"అసలే గోలగా ఉంటే నువ్వేమిటమ్మా మధ్య. ఊ కానీ, వెళ్ళు!" అని విసుక్కుంటోంది ఎవరో మామీ.

"ఊరికే చూసి వెళ్ళిపోతానండీ అంతే!" ఆ కంఠం విని, అటుగా వంగి చూసింది స్వర్ణ. "అరే ! ఆ అమ్మాయి.." అంది గట్టిగా.

"ఏ అమ్మాయి వదినా?" చాలా కుతూహలంగా ముందుకు వంగి చూశాడు శేఖర్.

చామనఛాయ, నీరు దిగిపోయిన ముక్కుపుడక, నలిగిపోయిన వాయిల్ చీర, పొడుగాటి జడ, తల్లో ఎండి వాడిపోయిన గన్నేరు పూవు. భక్తిగా కళ్ళు మూసుకుని నిలబడి ఉంది ఆ అమ్మాయి.

"ఈ అమ్మాయా? నేనింకా ఆ అమ్మాయి అనుకున్నా!" అన్నాడు కటకటాలలో నుంచి బైటికి చూస్తూ – శేఖర్. అటు చూసింది స్వర్ణ.

లావణ్య వాళ్ళమ్మ పక్కన, మారేడు వృక్షం మొదట్లో ఉన్న సిమెంటు చప్టా మీద కూర్చుని నాజూగ్గా కొబ్బరి ముక్క కొరుకుతోంది. మబ్బు రంగు జరీ ఎంబ్రాయిడరీ చీర, మెళ్ళో ముత్యాలహారం, వేలికున్న రవ్వల ఉంగరం, దీపాలకాంతిలో తళతళలాడాయి. ఐశ్వర్యమిచ్చిన ఆరోగ్యం ఆమె బుగ్గలకు గులాబులద్దింది. సుఖమైన జీవితం ఆమె కళ్ళకు మెరుపులనిచ్చింది. యౌవనమిచ్చిన అందంతో, నీరెండవేళ కొమ్మలో ఊగే రోజాపూవులా వుంది ఆమె. చటుక్కున

చూపులు మార్చి తనముందున్న అమ్మాయిని చూసింది స్వర్ణ. శకుంతల కాబోలు ఆ అమ్మాయి పేరు. నిజమే! వీళ్ళిద్దరికీ పోలికెక్కడ?

అష్టోత్తరం చేయించడమైన తరవాత బైటకు వచ్చారు. మండపం మీద కూర్చుని కొబ్బరికాయ కొడుతున్నాడు శేఖర్. శకుంతల గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. ఏం కోరుకుంటోందో?

"దేవుడా ! నాకేమీ వద్దు. నాకు ఎవరో ఒక పెళ్ళికొడుకుని చూపించి, మా వాళ్ళకు నా బాధను విరగడ చెయ్యి!" – అనా?

మోకాళ్లమీద తల ఆన్చి, అలవోకగా అటే చూస్తూ ఆలోచిస్తున్న స్వర్ణ "హాయ్ ! స్వర్ణక్కా!" అనే పలకరింపు విని తలెత్తి చూసింది, మీనాక్షి. ముదురు లేత నీలం కలయికతో, ఏవో గళ్ళు గళ్ళుగా ఉన్న బెల్ బాటమ్స్ వేసుకుంది. అవి ఖరీదైనవి కాకపోయినా, ఆకర్షణీయంగా వున్నాయి. మెళ్ళో ఏవో పూసలదండ, చేతికి కడియం, చెవులకు ఆర్టిఫిషియల్ ముత్యాల దుద్దులు. తమాషాగా ఉంది మీన.

"హాయ్ శేఖర్! తమరు కూడా ఏమిటి గుడికి?!" అంది చటుక్కున ఇద్దరి మధ్య కూర్చుంటూ.

"చూడండి మీనాంబికగారూ! తమరి ఉద్దేశం నేను గుళ్ళోకి రాకూడదనా లేక..." కొబ్బరి ముక్క మీనా మీదుగా వంగి స్వర్ణకు అందిస్తూ అన్నాడు శేఖర్.

అది మధ్యలోనే అంది పుచ్చుకుంది మీన.

"అహ! ఐడియా అది కాదు. సైతాన్ కూడా వేదాలు వల్లిస్తుందేమిటా అని. బై దిబై నా పేరు మీనాంబిక కాదు. మీన. నీ కొబ్బరి ముక్కకు థాంక్స్!

"అనవసరంగా థాంక్స్ చెప్పకు. నీకేం ఇవ్వలేదు నేను. నువ్వు పుచ్చుకున్నావ్ అంతే. అయినా, మీ వాళ్ళు నీకు పెట్టిన పేరు అదేకదా తల్లీ!"

"వాళ్ళకు బుద్ధిలేకపోతే పిలిచేవాళ్లకుండాలి. అది సరే స్వర్ణక్కా –" అంటూ స్వర్ణ వంక తిరిగి ఏదో అడుగుతోంది మీన. ఆమె వంకే చూస్తోంది స్వర్ణ పరీక్షగా. మీన పెద్ద అందగత్తేం కాదు. కానీ, ఆ అమ్మాయిలో ఆకర్షణ వుంది. ఎదుటి వాళ్లను ఆకట్టుకునే శక్తి వుంది. చటుక్కున గుడివైపు చూసింది స్వర్ణ. ముప్ఫయ్యో ప్రదక్షిణానికి గుర్తుగా కాబోలు చింతగింజ పెట్టుకుని వెళుతోంది శకుంతల.

మీన రాకతో చుట్టుపట్ల సంచలనం ఏర్పడింది. కొందరి కళ్ళల్లో కుతూహలం, కొందరి కళ్ళల్లో నిర్లక్ష్యం, మొత్తానికి అందరినీ ఆకర్షించింది మీన.

"వెళ్ళొస్తాం ఆంటీ !" అంటూ నాజూగ్గా అడుగులు వేస్తూ అటుగా వచ్చింది లావణ్య.

"నువ్వా లావణ్యా ! రా !" అని పిలిచి మీనకు శేఖర్ కు పరిచయం చేసింది స్వర్ణ. వాళ్ళు ముగ్గురూ చాలా సులభంగా మాటల్లోకి దిగారు. మీన ఏవో జోక్స్ చెబుతోంది. వాళ్ళ వంకే మౌనంగా చూస్తూ, వాళ్ల ఉత్సాహాన్నీ ఆనందాన్నీ పంచుకుంటోంది స్వర్ణ. లావణ్య చాలా చక్కగా, హుందాగా కూర్చుని మాట్లాడుతోంది. ఆమెకు తెలుసు – శేఖర్ చూపులు తనను వెంటాడుతున్నాయని. మరింత మెల్లగా తెచ్చి పెట్టుకున్న నిర్లిప్తతతో మాట్లాడుతోంది లావణ్య. గబగబ ఏవో కబుర్లు చెప్పేస్తోంది మీన. ఇద్దరి ప్రయత్నం అంతరాంతరాళాలలో ఒకటే – అది శేఖర్ ను ఆకర్షించాలని, యౌవనంలో ఉన్న అమ్మాయిల మనస్తత్వం కొత్త కాదు స్వర్ణకు.

పక్కగా ఏదో అలికిడైతే తిరిగి చూసింది స్వర్ణ. శకుంతల ప్రదక్షిణాలు పూర్తి అయినట్లున్నాయి. అలుపుగా వచ్చి, స్వర్ణకు కాస్త దూరంగా కూర్చుంది. ఆమె ముఖమంతా చెమట పట్టింది. ముంగురులు చెరిగినాయి. బొట్టు చెమ్మగిల్లింది. ఆ కళ్ళల్లోని యౌవనంలో ఉండే తళుకులను, బ్రతుకుభయం దాచేసింది. ఆ అమ్మాయి కూర్చున్న తీరులో పొందిక, బేలతనం స్వర్ణను కదిలించి వేశాయి.

"ఏమమ్మా ! ఒక్కదానివి వచ్చావా?" అడిగింది స్వర్ణ.

శకుంతల ఉలిక్కిపడి చూసి, "మీరా? ఎవరో అనుకున్నాను" అంది. ఆమె చూపులు స్వర్ణను దాటి శేఖర్ ను గమనించాయి. అందంగా, హుందాగా, ఇద్దరు ఆకర్షణీయమైన అమ్మాయిలుని తనను గమనిస్తున్నారని తెలిసి, బ్రహ్మాండమైన ఉత్సాహంతో మాట్లాడుతున్నాడతను. శకుంతల కళ్ళల్లో అందమైన అబ్బాయిని చూసిన ఆడపిల్ల హృదయస్పందన తళుక్కుమన్నది. వెంటనే చూపు మార్చేసుకుంది. శేఖర్ గమనించలేదు కానీ స్వర్ణ చూసింది. 'ఎంత చక్కటి కళ్ళు ఈ పిల్లవి' అనుకుంది.

'ఈ అమ్మాయిని శేఖరుకు పరిచయం చేసి చూద్దాం' అనుకుని పక్కకు తిరిగింది.

"టోరా టోరా టోరా చూశారా ... అందులో" అని ఏదో మాట్లాడుకుంటున్నారు ఆ ముగ్గురూ.

"మా బామ్మ అప్పడాలు చేస్తూ, పీట ఏదో చేతిమీద వేసుకుందండీ ! చెయ్యి వాచి జ్వరమొచ్చింది. ఒకటే గోల. అందుకే ఒంటరిగా వచ్చాను నేను ప్రదక్షిణాలు ఆపడమెందుకని..." ఏదో మాట్లాడుతోంది శకుంతల.

"లాభం లేదు..." అనుకుని తిరిగిపోయింది స్వర్ణ. ఒక్క టిక్కట్టు నాలుగు రూపాయలు పెట్టి సినిమా చూడగల తాహతు ఉంది లావణ్యకు, శేఖర్ కు. 'జీవితం జీవించడానికే' అనే మీన ఎవరినో టోకరా కొట్టి, అదే క్లాసులో కూర్చుని సినిమా చూసెయ్యగలదు. కానీ, అప్పడానికి పది పైసల చొప్పున, నలభై అప్పడాలు చేసి నాలుగు రూపాయలు సంపాయిస్తే కాని, జీవితం గడవదు శకుంతలకు. 'వీళ్ళ పరుధులు కలవవు,' అనుకుంది స్వర్ణ. కాసేపు తరువాత అంతా బయలుదేరారు.

★★★★★★★

శకుంతల పరిచయం చాలా విచిత్రంగా అయింది స్వర్ణకు. ప్రతి శుక్రవారం గుళ్ళో చూస్తూండేది ఆ అమ్మాయిని. అదే సహనం, అదే నడక – తీర్చిదిద్దినట్లు ఉండేది ఆ అమ్మాయి. కుతూహలంగా గమనించేది ఆ అమ్మాయిని స్వర్ణ.

"ఎవరో లక్ష్మీదేవిలా ఉంది కదూ పిన్ని గారూ పిల్ల", అంది పక్కనే కూర్చున్న బామ్మగారితో.

"ఆహా ! ఉందమ్మా! ఏం ప్రయోజనం? తల్లీ తండ్రీ ఇద్దరూ లేరు. వేరే దిక్కూ లేదు. ఇక్కడ మేనత్త 'కుంటి కొడుకున్నాడు. కోడల్ని చేసుకుంటాను ర'మ్మంటే, అంతకన్నా దిక్కులేక వచ్చింది. ఇక్కడ పరిస్థితి మరీ ఘోరం. వాడికి అప్పుడే పెళ్ళై ఇద్దరు పిల్లలట. ఆ కుంటివాడికి, ఆ అనాకారి, నచ్చలేదట. రూపసి కావాల్సివచ్చింది, రూపసి! 'నా మొగుడి వంక చూశావా చంపుతాను' అంటుంది వాడి పెళ్ళాం. 'దాంతో నీకేమిటి ? నా మాట విను. మూడు ముళ్ళు వేయిస్తాను' అంటుంది మేనత్త. ఇద్దరి మధ్య నలిగి చస్తోంది ఈ పిల్ల. చంపేశాడాన్నా కాదు పాపిష్టి దేముడు," అని గబగబా తూర్పు దేశపుయాసతో చెప్పేసింది ఆ బామ్మగారు ముసుగు సవరించుకుంటూ.

"అదేం మాట బామ్మగారూ ! ఆ పిల్ల మీకేం భారమైందని?" నొచ్చుకుంటూ అంది స్వర్ణ.

"ఏం భారమేమిటమ్మా ! అది నా మనవరాలు. ఇద్దరం ఆ పల్లెటూరు నుంచి మరే గతి లేక ఇక్కడికి పడివచ్చాం. ఇక్కడా అక్కడా కూడా నిత్యదరిద్రం తల్లీ! అప్పడాలు ఒత్తి, వడియాలు పెడితే జీవితాలు గడుస్తాయా అమ్మా! నా ఖర్మ" అంది బామ్మగారు కొంగుతో, కళ్ళు అద్దుకుంటూ.

అదిరిపోయింది స్వర్ణ. బామ్మగారి వంక పరీక్షగా చూసింది. ముతక నీరుకావి పంచ, పీక్కుపోయిన దవడలు, గాజు కాయల్లాంటి కళ్ళు, నిత్యకష్టానికి అలవాటుపడి నరాలు ఉబ్బిమోటుదేలిన చేతులు .. ఏమిటోగా అనిపించింది స్వర్ణకు. వెంటనే పర్సు తీసి ఓ పది రూపాయలు ఇవ్వబోయింది.

"ఏమిటిదీ ? వద్దమ్మా వద్దు. వాటితో మా రోజులు గడవబోవు. ఒకళ్ళకు పెట్టే వంశంలో పుట్టాం. ఉరేసుకునైనా చస్తాం. కానీ, ఊరికే చెయ్యి చాచం తల్లీ!" ఎంతో అభిమానంతో అంది బామ్మగారు.

ఏం మాట్లాడలేకపోయింది స్వర్ణ. వెంటనే, "ఊరికే వద్దులెండి. మా ఇంటికి అప్పడాలు తెచ్చిపెట్టండి పోనీ," అని బలవంతాన, ఆవిడ చేతుల్లో పెట్టింది. అయిష్టంగానే ఆ పది రూపాయల్ని తీసుకుంది ఆవిడ. ఆ నోటు ఆవిడకు ఎంత అవసరమో అర్థమైంది స్వర్ణకు. 'అవసరాల ముందు ఏ ఆత్మాభిమానాలూ ఆగవు.' అనుకుంది.

అప్పుడే అక్కడికి వచ్చి కూర్చుంది ఆ అమ్మాయి. అలిసిపోయినా, అందంగానే ఉంది ఆ అమ్మాయి. 'దీపకళికలా ఉంది పిల్ల' అనుకుంది స్వర్ణ.

"నీ పేరేమిటమ్మా?" అని అడిగింది.

"శకుంతలండీ !" మెల్లగా చెప్పింది.

“నా అమ్మ. నా తల్లీ! ఎక్కడైనా మంచి సంబంధం ఉంటే చూసిపెడుదూ ... ఆడపిల్ల గుండెల మీద కుంపటైపోయ్యింది. మాది గడపదాటని వంశం తల్లీ ! రెండో పెళ్ళైనా, మూడో పెళ్ళైనా సరే, కన్నెచెర వదిలిస్తే చాలు. ఏమీ ఇచ్చుకోలేనమ్మా ! ఏదో గుళ్ళో పెళ్ళి చేస్తాను. ఆ ఇంటి నుంచి బయట పడితే చాలు. బిడ్డ దిగులుతో అన్నం తిని మూడు రోజులైంది !” గబగబా చెపుతోంది బామ్మగారు. ఆ అమ్మాయి వంక చూసింది స్వర్ణ. ఆ లేతగుండెలో యెన్ని అగ్ని పర్వతాలు రేగుతున్నాయో ? ‘భగవంతుడా ! ఎలాంటి జీవితాలు సృష్టించావు ?’ అనుకుంది స్వర్ణ. బామ్మగారికి అడ్రసు చెప్పి బయలుదేరింది. ఇంటికి వచ్చేదాకా ఆలోచిస్తూనే ఉంది ఆమె విషయం. ఏదో ఒక రకమైన ఆవేశమొచ్చింది స్వర్ణకు. ఆ పిల్ల జీవితం నాశనం కాకూడదు. చాలా మంది రూప విహీనుల కన్నా, గుణహీనులు కన్నా కొద్దిరెట్లు అదృష్టవంతురాలే, ఆ పిల్ల, సంప్రదాయం, సౌందర్యం, సుగుణం మూడూ ఉన్నాయి ఈ అమ్మాయికి.

ఆమె దృష్టిలో తెలిసిన కుర్రాళ్ళు అందరూ మెదిలారు. అందులో మంచి పెళ్ళికొడుకులెంత మంది ఉన్నా, బామ్మగారికి కావలసిన, కులం గోత్రం చాలా విధాల అడ్డు తగిలాయి; ఆ పిల్ల ప్రాణాలు పోయినా ఒప్పుకుంటుందేమో కానీ, వర్ణ సంకరం కానీయదు బామ్మగారు. ‘పోనీ, తనకు తెలిసిన ఏ శరణాలయంలోనో, స్త్రీ సంక్షేమ కేంద్రంలోనో చేర్పిస్తే ... ఆలోచించింది స్వర్ణ. కానీ, వాటి గురించి విన్న కథలు భయపెట్టాయి స్వర్ణను. ఏమీ తెలియని ముగ్ధ ఆ పిల్ల. ఆలోచిస్తే అన్నింటికీ, ఆ అమ్మాయి మంచితనం, సంప్రదాయం రెండూ అడ్డు తగులుతున్నాయనిపించింది స్వర్ణకు. ఒక్కసారిగా, మెదడులో తళుక్కుమన్నట్లు శేఖర్ గుర్తుకు వచ్చాడు. అవును ! శేఖర్ ఎందుకు చేసుకోకూడదు !

“మీనా ఎందుకో నాకు నచ్చదు వదినా ! తను మంచి స్నేహితురాలు. ఒప్పుకుంటాను. చాలా హాయిగా కబుర్లు చెపుతుంది నిజమే. కానీ, నా భార్యగా ఊహించలేను; ఆ ధైర్యాన్ని మెచ్చుకుంటాను కానీ భరించలేను. నాకు దరిద్రమంటే అసహ్యం లేదు వదినా ! గుణవంతురాలు, బుద్ధిమంతురాలు అయితే చాలు! ఈ ఇంటి కోడలంటే నీలా ఉండాలి వదినా! నీ నిర్ణయం మీద చాలా నమ్మకముంది. కానీ, జాలిపడి మీనాను చేసుకోమనకు. ఆ పిల్ల ఒక సుడిగాలి. భార్యగా భరించలేను నేను.” అన్నాడు శేఖర్ ఒకసారి. ఆ రోజు అతని భావాలు విని, భార్య గురించిన అత ని ఊహ విని ఆశ్చర్యపోయింది స్వర్ణ. ఆడుతూ, పాడుతూ ఉండే అతను అంత ఆలోచించగలడనుకోలేదు. అతని స్వార్థానికి నవ్వు కూడా వచ్చింది. మీన అల్లరి చేసి కబుర్లు చెప్పడానికి పనికి వచ్చే స్నేహితురాలు; భార్యగా పనికి రాదన్న మాట!

మీన, తండ్రి స్కూలు మాష్టరు, స్వర్ణ కుటుంబం కొత్త ఇల్లు కట్టుకుని రాక మునుపు, వాళ్ళ ఇంటి పక్కనే ఉండేవారు. అయనకు ఆరుగురు సంతానం. వాళ్ళలో మూడో పిల్ల మీనా. తండ్రి మూర్ఖత్వం, తల్లి చాదస్తం, త్వరగా పెళ్ళి చేసుకుని, విధవ అయిన అప్పగారు, కాలుజారి జీవితానికి శాశ్వతంగా దూరమైన చిన్నక్క, వీళ్ళందరూ చాలా పాఠాలు నేర్పారు మీనకు. రాత్రి ఎనిమిందిటికి సిగరెట్టు తెమ్మని ఆడపిల్లలను వానలో పంపే తండ్రిని గురించి ఏ మాత్రం సదభిప్రాయం లేదు మీనకు. అందుకే వింతగా తయారైంది. ఏం చేస్తే ఇతరులు ఆకర్షింపబడతారో తెలుసు

మీనకు. ఆ పిల్ల బోళాతనం, మరుకుతనం చూస్తే స్వర్ణకు మొదటి నుంచీ ఇష్టమూ, జాలీ, శేఖరంటే ఏదో ఆకర్షణ ఆ పిల్ల పెంచుకుంటోందని తెలుసు. ఇల్లు మారినా, శేఖరుండే సమయం చూసి, ఉప్పెనలా వచ్చి, కాసేపు కబుర్లు చెప్పి, అల్లరి చేసిపోతుంది మీన, ఆమె వున్నంతసేపూ సరదాగానే మాట్లాడి సమానంగా అల్లరి చేసేవాడు శేఖర్. ఆ ధైర్యం తోనే ఒక రోజు, 'పోనీ మీనాను పెళ్ళి చేసుకుంటావేమిటి శేఖర్" అని నవ్వుతూ అడిగింది. అతని జవాబు విని మారు మాట్లాడలేదు స్వర్ణ.

"ఈ ఇంటి కోడలంటే నీలాగ ఉండాలి వదినా !" శేఖర్ మాటలు గుర్తుకు వచ్చాయి. తను ఏ పరిస్థితుల్లో ఈ ఇంటి కోడలైంది ? అర్ధరాత్రి దాటినా ఆ అమ్మాయే గుర్తుకు వచ్చి నిద్ర పట్టని స్వర్ణ తన గురించి ఆలోచించింది. రాజారావు గారి చిన్ననాటి స్నేహితుడి కూతురు స్వర్ణ. చూసిన రెండు రోజుల్లోనే ఆమె గురించి చాలా చక్కని అంచనా వేసింది రాజారావుగారి బిజినెస్ బుర్ర. ఎవరో క్రిశ్చియన్ అమ్మాయితో తిరుగుతూ ఫారిన్ వెళ్ళిపోదామని ప్రయత్నిస్తున్నాడు పెద్దకొడుకు చంద్రం. ఇంట్లో బాధ్యత నిర్వహించే దిక్కు లేదు. ఇన్ని సమస్యలకు తీర్పు స్వర్ణ అనుకున్నాడాయన. "నీ కిష్టమైతే నీ స్నేహాలు వదులుకోవద్దురా అబ్బాయి. అలా అడ్డపడే పిల్ల కాదు. నా మాట విను. కానీ స్నేహితురాలైన ప్రతి ఆడదీ పెళ్ళాంగా పనికి రాదురా" అని చాలా రకాలుగా మధ్యపెట్టి కొడుకును ఒప్పించాడు. "నేను అయిష్టంగానే పెళ్ళికి ఒప్పుకున్నాను స్వర్ణా! ఆ తరువాత నిన్ను చాలా రోజులు మనిషిగా గుర్తించలేదు నేను. కానీ, కేవలం నీ ప్రవర్తనతో నాలో మార్పు తెచ్చావు. నాన్న చెప్పింది నిజం ! ప్రతి ఆడదీ పెళ్ళాం కాలేదు. అందులో నా స్వర్ణ అసలు కాలేదు" అనే భర్త మాటలు గుర్తుకు వచ్చాయి స్వర్ణకు. ఆ రాజారావుగారి కొడుకేగా శేఖర్ ! ఏమో చూద్దాం. "శకుంతల అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది." అనుకుంది స్వర్ణ ఆ రాత్రి.

కానీ, ఈ శుక్రవారం అనుకున్నవన్నీ తలక్రిందులైనాయి. శకుంతల శేఖర్ లు ఉత్తర దక్షిణ ధ్రువాలని తెలిసిపోయింది స్వర్ణకు.

మరో నాలుగైదు రోజుల తరువాత కాబోలు ఎవరో వచ్చారని పని మనిషి చెబితే, భర్త బట్టలు సర్దుతున్న స్వర్ణ కిందికి వెళ్ళింది. బామ్మగారు "అమ్మా ! నా మనుమరాలకి సంబంధం కుదిరింది తల్లీ ! ఎన్ని అవస్థలు పడ్డానో, ఎందరి కాళ్ళు పట్టుకున్నానో, మీలాంటి వారితో చెప్పుకోవల్సినవి కావవ్వి. ఆ రోజు మీరు డబ్బిస్తే అభిమానపడ్డాను. ఈ రోజు నోరు తెరిచి అడుగుతున్నాను. ఈ పెళ్ళికి ఎవరైనా నలుగురు సాయపడాలి తల్లీ....!" ఇంకేమిటో చెప్పి ప్రాధేయపడిందావిడ.

"పిల్లాడెవరు?" కుతూహలం ఆపుకోలేక అడిగింది స్వర్ణ.

"పిల్లాడూ !! హయ్యో రాత ! పిల్లాడా చట్టుబండలా ?! రెండో పెళ్ళి వాడు. పగలు చూస్తే రాత్రి కల్లో కొస్తాడు." తల కొట్టుకుంటూ అంది ఆవిడ.

"మరి శకుంతల ఒప్పుకుందా?"

"తప్పదుగా తల్లీ ! దాన్నడిగితే చేసుకుంటానంది. ఏం చేస్తుంది మరి ! మరో దారేదీ ?" దీర్ఘాలు తీస్తూ, కళ్ళు తుడుచుకుంటూ, దారంతో చుట్టిన కళ్ళద్దాలు సవరించుకుంటూ చెపుతోంది బామ్మగారు. వసివాడని పూవులాంటి ఆ పిల్ల భవితవ్యం – పాతకాలపు మూర్ఖత్వం, అంతులేని ఆప్యాయత తప్ప మరొకటి లేని ఈ బామ్మ గారి చేతుల్లో ఉంది .. కానీ, మరొకరేరి మరి!? ఆలోచిస్తూ లోపలికి వెళ్ళి, మెట్ల దగ్గర ఆగిపోయింది స్వర్ణ. ఏదో చెయ్యాలి. ఏం చేద్దాం!? ఆమె మనస్సు చాలా విధాలుగా ఆలోచిస్తోంది.

"ఏమిటమ్మా ! ఆలోచిస్తున్నావు?" పూజ గదిలోనుంచి వచ్చిన మామగారు అడిగారు.

ఆ సమయంలో ఆమె మనస్సులోని తపన ఎవరికైనా చెప్పుకోవాలి. వెంటనే బయట పడిపోయింది స్వర్ణ. కానీ, అప్పుడు కూడా జాగ్రతగా చెప్పవలసినంతే చెప్పింది శకుంతల గురించి.

"చూడమ్మాయ్!" కళ్ళజోడు బంగారు ఫ్రేం సవరించుకుంటూ సూటిగా చూస్తూ అన్నారు ఆయనః "అందరి జీవితాలు మనం బాగుచెయ్యలేము. మన బాధ్యత ఎంతవరకంటే, ఏదో తోచిన సహాయం చెయ్యటం వరకూ, అంతే. ఆ అమ్మాయి బాధ్యత మరే విధంగా మనం తీసుకోగలం? అయినా చూడు, ఒకటి నేర్చుకో. హక్కులేని ఆప్యాయతలు చెల్లవు. ప్రతి చిన్న విషయానికి బాధపడితే ఎలా అమ్మా? పద – ఏదో తోచింది ఇచ్చి పంపు." ఆప్యాయంగా చెప్పినా, ఆ మాటల వెనక సూక్ష్మగ్రాహ్యత, అధికారం ఆమెకు చిరపరిచితాలే.

మౌనంగా పైకి వెళ్ళి కొత్త చీర, రెండు వందలు తెచ్చి బామ్మగారికిచ్చింది. గోడకు జారగిలబడి నీరసంగా కూర్చున్న బామ్మగారు ఒక్కసారి నిటారుగా నిలబడి, ఒక వంద పొగిడి పది కాలాల పాటు చల్లగా ఉండాలి అని దీవించి, "అప్పడాలు, ఇదుగో ఈ హడావిడి తరవాత తెస్తానమ్మా! మర్చిపోలేదు." అని వెళ్ళి పోయింది.

అటే చూస్తూ నిలబడింది స్వర్ణ. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. బంగారపు బొమ్మలాంటి పిల్ల!

"ఏమిటి వదినా? ఇక్కడ నిలబడి ఆలోచిస్తున్నావ్?" అన్నాడు ఆఫీసుకు బయల్దేరబోతూ శేఖర్.

ఉలిక్కిపడి "ఆహ! ఆ అమ్మాయి..." ఆమెకు శేఖర్ తో చాలా చెబుదామని ఉంది. కానీ ప్రయోజనం లేదని తెలుసు. "ఏం లేదయ్యా...ఏం లేదు..." అని వెళ్ళిపోయింది.

★★★★★★★★★★★★★★★★★★

మరు శుక్రవారం వద్దన్నా వచ్చాడు శేఖర్ గుడికి. స్వర్ణకు తెలుసు లావణ్య కోసం వచ్చాడని. అమ్మవారి ముందు దణ్ణం పెడుతున్న స్వర్ణ ఉన్నట్లుండి ముందున్న అమ్మాయిని చూసి అదిరిపోయింది. శకుంతల ! కానీ, ఏదో మార్పు! సన్నటి నడుముకు వడ్డాణం. మెళ్ళో రాళ్ళ నెక్లెసు, పసిమి శరీరానికి ఎర్రటి పట్టుచీర, మెళ్ళో మెరుస్తున్న

పసుపు తాడు, నల్లపూసలు, కాటుకతో చెమర్చిన కళ్ళు ... చాలా అద్భుతంగా ఉంది శకుంతల! 'పోన్లే, ఎవరో డబ్బున్నవాడు చేసుకున్నట్లున్నాడు. అదృష్టవంతురాలు. తిండికి కష్టపడదింక' అనుకుంటూ పక్కకు చూసింది. నల్లగా, పొడుగ్గా ఉన్నాడతను. పైన ఉత్తరీయం, కొత్త పంచ, చేతికి రాళ్ళ ఉంగరాలు, నలభయ్యో పడిలో ఉన్నాడతను. ఎందుకో వెనక్కి తిరిగి చూసింది శకుంతల. "మీరా?" అని పలకరించబోయి ఆగిపోయింది. ఏమిటా అనుకుంటూ పక్కకు చూసింది, స్వర్ణ – శేఖర్.

కన్నార్పకుండా శకుంతలనే చూస్తున్నాడతను. ఒక్క క్షణం కళ్ళు దించుకొని, మళ్ళీ మామూలుగా "మీరు.." ఏదో మాట్లాడబోయింది శకుంతల.

"ఊ! చాల్లే! ఇక పోదాం పద" అన్నాడు ఆమె భర్త. ఆ ధ్వనిలో అనుమానం, కరుకుతనం అర్థమైంది స్వర్ణకు. ఆ మాటల్లో ఆమె దురుదృష్టం కత్తి ఝుళిపించినట్లయింది.

మౌనంగా కళ్లతోనే సెలవు తీసుకుని ఒంటినిండా చెంగు కప్పుకుని భర్త వెనకాల వెళ్ళిపోయింది శకుంతల.

"ఎవరా అమ్మాయి వదినా ! ఎక్కడో చూసినట్లున్నాం .. చాలా బావుంది కదూ!" అటే చూస్తూ అన్నాడు శేఖర్.

ఒళ్ళు మండిపోయింది స్వర్ణకు. ఇవ్వాళ, ఇలా కనబడితే బావున్నదన్నమాట శకుంతల! వారం రోజుల క్రితం నిరాశ, నిస్సహాయత మూర్తీభవించిన శకుంతల, ఎదురుగా వున్నా కళ్ళకు కనబడలేదు కాబోలు శేఖర్ కు. ఇవ్వాళ 'చాలా బావుంది ..'. నాలుగూ అడిగేద్దామన్నంత కోపంగా వెనక్కు తిరిగింది. "హాయ్" అంటూ అప్పుడే వచ్చిన లావణ్యను పలకరిస్తూ వెళ్ళిపోయాడు శేఖర్. ఏమనగలదు? అన్యమనస్కంగానే కాస్సేపు కూర్చుని, కారు దగ్గరకు వచ్చింది. రోడ్డు మీద దీపాలు మిణుకు మిణుకుమంటున్నాయి.

"చాలా చీకటి పడింది. పద బాబూ పోదాం" అని బిచ్చగాళ్లకు చిల్లరవేసి వెనక్కు తిరిగింది స్వర్ణ.

"ఏయ్ శేఖర్ ! స్టాప్ ఫర్ ఎ సెకండ్" రివ్వున సైకిల్ మీద వచ్చింది మీన. బాగా అలసిపోయినట్టు ఉంది ఆమె.

"అనుకున్నాను స్వరణక్కా నువ్వు వస్తావని! నేను ఎయిర్ హోస్టస్ పోస్ట్ కు అప్లై చేశాను. ఉద్యోగం రావాలని కాస్త మీ దేవుణ్ణి ప్రార్థిద్దూ" అంది.

"నువ్వా ? ఇంక విమానాలు నడిచినట్లే" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

"విమానాలు నడవ్వు బుద్ధూ! ఎగురుతాయి. వస్తానక్కా. అద్దె సైకిల్ ఇచ్చెయ్యాలి. వస్తాను శేఖర్!" అంది.

శేఖర్ మీనాను చూడడం లేదు. లావణ్య కారు ఎక్కుతూ చెయ్యి వూపింది. అటే చూసి చెయ్యి ఊపాడు శేఖర్. ఇద్దరి వంకా మార్చి మార్చి చూసింది మీన. ఒక్కసారి స్వర్ణ వంక చూసి "వస్తానక్కా" అని రివ్వున వెళ్ళిపోయింది.

★★★★★★★★★★★

పెద్ద బిజినెస్ మాగ్నేట్ కూతురు లావణ్య. వాళ్ళ నాన్న ఏదో ఇన్ కంటాక్స్ ట్రబుల్ లో ఇరుక్కోవడం వలన, కొన్ని నెలలు ఆలస్యమైంది శేఖర్, లావణ్యల పెళ్ళి, కానీ, అది కూడా వాళ్ళ నాన్న గౌరవానికి చిహ్నమే కాబట్టి, లావణ్య తెచ్చే కట్నం ముందు, మిగతా విషయాలు పట్టించుకోవడం చాలా అవసరం అనుకున్న రాజారావుగారు, అన్ని విధాలా మంచి సంబంధం అనుకున్న లావణ్య తండ్రి – వారిద్దరి పెళ్ళికి ఒప్పుకోవడంలో మరి తాత్సారం చెయ్యలేదు.

మళ్ళీ, శ్రావణ పౌర్ణమికి శేఖర్, లావణ్యలతో గుడికి వచ్చింది స్వర్ణ.

"ఏవండీ!" ఎవరో పిలిచినట్లై అటు తిరిగి చూసింది. గుర్తుపట్టలేకపోయింది ఆమెను.

"నేనేనండీ! శకుంతలను...మర్చిపోయారా?" అంది నవ్వుతూ.

కన్నార్పకుండా చూసింది స్వర్ణ. ఎక్కడికక్కడ శరీరమంతా లావైపోయింది శకుంతలకు. నలిగిపోయిన అందం వయసెక్కువ చూపెడుతోంది.

"ఇదేమిటి? ఇలా..."

"లావయ్యాననా? అందరూ అంటూనే ఉన్నారు లెండి. ఆ(! ఇదే హాయి లెండి. ఇప్పుడు నన్నెవరూ చూడరు. అనుమానాలు, దెబ్బలు, చుట్టముక్కల వాతలు తప్పుతాయి." అంది తెచ్చిపెట్టుకున్న నవ్వుతో. అది నవ్వు కాదు – నిస్సహాయత, బాధ, దాచుకునే ప్రయత్నం!

కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి స్వర్ణకు. ఏదో మాట్లాడబోయింది. ఎయిర్ హోస్టస్ కావడానికి ఎక్స్ ర్ సైజస్ చేసి సన్నబడ్డ మీన, ఫిగర్ మెయిన్ టనెన్స్ అని డయటింగ్ చేసే లావణ్య గుర్తుకు వచ్చారు.

"వస్తా! ఆయన గేటు దగ్గర ఉన్నారు." అని రెండడుగులు వేసి, "అన్నట్లు, మీ మరిది కులాసాగా ఉన్నారా?" అంది.

మాట్లాడకుండా, శేఖర్, లావణ్యవైపు చూపించింది స్వర్ణ. వాళ్ళు ఒకళ్ళనానుకుని ఒకళ్ళు కూర్చుని సర్వం మరిచిపోయి కబుర్లు చెప్పుకుంటున్నారు.

'ఈ అమ్మాయా?' అని ఏదో గొణుక్కుంటూ, "వస్తానండీ" అని వెనక్కు తిరిగి చూడకుండా విసవిసా నడిచి వెళ్ళిపోయింది శకుంతల. అటే చూస్తున్న స్వర్ణకు, ఆ రోజే వచ్చిన మీన ఉత్తరం జ్ఞాపకమొచ్చింది.

"నువ్వు పెళ్ళి చేసుకోమని రాశావు స్వర్ణక్కా! నీకు తెలుసు నేను శేఖర్ ను మర్చిపోలేదని. అప్పుడప్పుడు ఈ ఎయిర్ హోస్టస్ జీవితం విసుగనిపిస్తోందక్కా! ఈ తెచ్చిపెట్టుకున్న ఫాస్ట్ నెస్, సంపాయిస్తున్న డబ్బు ఇవన్నీ నావికావని "నేను చాలా మంచి పిల్లని శేఖర్" అని వచ్చేద్దామనిపిస్తుంది నాకు. కానీ, ఇక తిరిగిరాలేను. ఇప్పుడు ఆ దారి శాశ్వతంగా మూసుకుపోయింది. లావణ్య చాలా అదృష్టవంతురాలు. శేఖర్ పెళ్ళి శుభలేఖ నాలో ఎంత సంచలనాన్ని తెచ్చి ఉంటుందో గ్రహించేదానివి నువ్వు ఒక్కదానివే. ఇప్పుడు ఒకటే జీవితాదర్శం. ఇంటర్ నేషనల్ ఎయిర్ హోస్టస్ కావాలని. అన్నట్లు నీకు తెలుసా? నా సంపాదన మా ఇంట్లో వాళ్ల అవసరాలను పెంచింది. అమ్మకు రవ్వలముక్కు పుడక కావాలట. నాన్న కాల్చే ఒక్కో సిగరెట్టు ఖరీదు రూపాయ్. ఇవన్నీ మామూలే..." ఇంకా ఏదేదో రాసింది మీన.

అలాగే ఆలోచిస్తూ, చాలా సేపు కూర్చుండి పోయింది స్వర్ణ ఒంటరిగా.

★★★★★★★★★★★★★★★★★★★★★★

రాత్రి తొమ్మిది గంటల వేళ కిటికీ చువ్వలు పట్టుకుని ఆలోచిస్తూ, భర్త రాకకై ఎదురు చూస్తూ నిలబడింది స్వర్ణ. ప్రకృతి అంతా సన్నని వానలో స్నానం చేస్తోంది. బయటనుంచి ఏదో జోక్ చెప్పుకుని నవ్వుకుంటూ వస్తున్నారు శేఖర్ లావణ్య. సన్నగా, తీగలా వుంది లావణ్య. ఏదో దేవతలా వుంది. హాయిగా నవ్వుతోంది. ఎవ్వరూ లేరనే ధైర్యంతో ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి లోపలికి తీసుకువస్తున్నాడు శేఖర్. తన గదిలో నుంచి వాళ్లనే చూస్తోంది స్వర్ణ. ఎందుకో ఆమెకు మీన, శకుంతల గుర్తుకు వచ్చారు. ఏం చేస్తోందో మీన ...? బహుశా భూమికి కొన్ని వేళ అడుగుల ఎత్తున, తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, విపరీతమైన అలంకరణతో, ప్రయాణీకుల హాస్యాలను, విసుర్లను భరిస్తూ సర్వ్ చేస్తూ వుంటుంది.

శకుంతల ... ఒకప్పటి బంగారు బొమ్మలాంటి శకుంతల ... ఇదే సమయంలో నలభై ఏళ్ళు పైబడ్డ వ్యక్తి మొరటు చేతుల్లో అనుమానాల మధ్య, కావేషాల మధ్య, పళ్ళు బిగబట్టి కన్నీళ్ళు దాచుకుంటూ నలిగిపోతూ ఉండి వుంటుంది. ఆ ఆలోచనలు భరించలేక కళ్ళు మూసుకుంది స్వర్ణ.

లావణ్యలాంటి వారు స్వతహాగా అదృష్టవంతులు. వాళ్ల జీవితం వడ్డించిన విస్తరిలాంటిది. ఆర్థికంగా ఆలోచిస్తే, శకుంతలకన్న ఒక మెట్టే పైన ఉంది మీన. కానీ, మీనా తెగింపుతో జయించుకువస్తోంది. ధైర్యంగా మంచో, చెడ్డో జీవితం ఎంచుకుంది. కానీ, మంచితనం, సౌందర్యం తప్ప మరొకటి లేని శకుంతల ..?

చల్లటి ఈదురుగాలి కిటికీలోనించి దూసుకు వచ్చింది. బల్లమీద మీన ఉత్తరం కాబోలు రెపరెపలాడింది. అలికిడికి అటుగా చూసింది స్వర్ణ. ఆమె దృష్టి బల్లమీద వున్న పూలకుండీ మీద పడింది. పొద్దున్న


అయిదేళ్ల వాసు పరిగెత్తుకుంటూ వచ్చి, "మమ్మీ ! ఈ పూలు చూడు ఎంత బావున్నాయో" అన్నాడు. వాడి చేతిలోని గడ్డిపూలు. వాసు గోల భరించలేక అవి పూలకుండీలో పెట్టింది. వాటిని రోజూ కంచె చుట్టూ చూస్తూనే ఉండేది స్వర్ణ. కానీ, ఇవాళ డిమ్ లైట్ లో, ఖరీదైన కట్ గ్లాస్ ఫ్లవర్ వాస్ లో, ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహం ముందు చెప్పలేనంత అందంగా వున్నాయి అవి. వాతి వంకే కన్నార్పకుమ్మా చూసింది స్వర్ణ.

గడ్డిపూలవంటివారే శకుంతలలాంటి అమ్మాయిలు. వాళ్ళు అదృష్టవశాత్తు ఖరీదైన జీవితాన్ని పొందగలిగితే, వారి అందానికి అమాయకత్వానికి మెరుగు లభిస్తుంది. లేనివాడు కాలికింద పడి నలిగిపోతున్నా గమనించరెవరూ! కానీ, అన్ని గడ్డిపూలు కట్ గ్లాస్ ఫ్లవర్ వాస్ లోకి ఎలా వస్తాయి?

అగాధపుటంచున..

- భైరాగి

(1950 - సెప్టెంబర్, ఆంధ్రజ్యోతి మాసపత్రిక నుంచి)


అ గా ధ పు టం చు న....

నాకు చిన్నప్పట్నించీ, అందే సరిగ్గా వూహ తెలియకముందునుంచి, కూడా ఆత్మహత్య అంటే ఒక రకమైన భయభక్తులు, ప్రేమాదరాలు వుండేవి. దీనికికారణం నేను సరిగాచెప్పలేను. కాని బహుశా ఒకటైయుంటుంది. చిన్నతనంలో మనకి జీవితం అంటే ఆపేక్ష చాలాయెక్కువ. నిజంగా జీవితాన్ని సంపూర్ణంగా హత్తుకొని అనుభవించగలిగే చిన్నతనంలోనే అలాంటి జీవితాన్ని యెవడైనా స్వేచ్ఛగా తృణీకరించాడంటే వాడిని ఒక రకంగా గొప్పవాడినిగా యెంచటం సహజం. కాని రానురాను నాకు ఆత్మహత్యమీద యీ గౌరవంపోయింది. ఆత్మహత్య చేసుకొనే వాళ్ళ వుద్దేశ్యాలు నేను అనుకొన్నంత మహత్తరమైనవి కావేమోననే అనుమానం కలుగసాగింది. భర్తతో పోట్లాడి చెరువులో దూకి చనిపోయిన భార్య, పరీక్షతప్పి రైలు కింద తలదూర్చిన విద్యార్థి కడుపునొప్పిని భరించలేక విషంపుచ్చుకున్న ముసలాయన వీళ్ళందరూ నిజంగా ఘనకార్యంచేసినవాళ్లేనా అని నేను ప్రశ్నించుకొనేవాణ్ణి. కాని ఆత్మహత్యల్లో అన్నికేసులూ యిలాంటివికావు.

కొన్నిసంవత్సరాలక్రితం నేను వర్తాపత్రికల్లోఒక వార్త చదివాను. అది విభిన్న జాతిమతాలకుచెందిన నిరాశప్రేమికుల విషాదాంత గాథ. సంఘాన్ని తల్లిదండ్రులను తదితర బాహ్యప్రాపంచిక శక్తులను చూచి వెలి పొందిన యిద్దరు ప్రేమికులు మద్రాసు నగరంలో ఒక హోటలు కిరాయి గదిలో కలుసుకొన్నారు. వాళ్ళిద్దరు యిదివరకే ఒక నిశ్చయానికి వచ్చియున్నారు. ఆరాత్రి వారు యెంతో కులాసాగా విందుకుడిచి ఆ పవిత్రావసరంలో సోమపానంగూడా చేశారు. నూతన వధూవరుల్లాగా చక్కగా అలంకరించుకున్నారు. ఇదివరకు వందలమందికి ఆశ్రయమిచ్చిన ఆ హోటలు పక్కనువాళ్ళు గులాబీ పూలతో కప్పివేశారు. ఆరాత్రి వాళ్ళు యేం మాట్లాడారో యేం ఆలోచించారో వూహించడం చాలా కష్టం. జీవితకాలమంతటిలో పొందవలసిన అనుభవాన్ని అనుభూతిని కొద్ది నిముషాల్లో యిమడ్చగలగటం, సంవత్సరాల ఆవేశాన్ని కొద్దిక్షణాల్లో కూడగట్టగలగటం, ప్రాపంచికవిషయాల జంజాటంలోనుంచి సారాన్ని గ్రహించి తుక్కును వదలివేయగలగటం, యివన్నీ ప్రతివొక్కడికీ అలవడవు. సాధారణ జీవితం జననమరణాల ఆహారమై ధునాల చేతి పరిశ్రమలాగ తేలికగా వెళ్ళిపోతూవుంటుంది. తుఫానువేగాన్నీ హాలాహలంచేదునీ అగ్నిపర్వత గర్భంలోని వుష్ణతనూ మనం అందనావేసే పరిస్థితి యెప్పుడో

'భైరాగి'.

నాకు చిన్న స్పట్నించీ, అందే సరిగ్గా వూహ తెలియకముందునుంచి, కూడా ఆత్మహత్య అంటే ఒక రకమైన భయభక్తులు, ప్రేమాదరాలు వుండేవి. దీనికి కారణం నేను సరిగా చెప్పలేను. కాని బహుశా ఒకటైయుంటుంది. చిన్నతనంలో మనకి జీవితం అంటే ఆపేక్ష చాలా యెక్కువ. నిజంగా జీవితాన్ని సంపూర్ణంగా హత్తుకొని అనుభవించగలిగే చిన్నతనంలోనే అలాంటి జీవితాన్ని యెవడైనా స్వేచ్ఛగా తృణీకరించాడంటే వాడిని ఒక రకంగా గొప్పవాడినిగా యెంచటం సహజం. కాని రానురాను నాకు ఆత్మహత్య మీద యీ గౌరవంపోయింది. ఆత్మహత్య చేసుకొనే వాళ్ళ వుద్దేశ్యాలు నేను అనుకొన్నంత మహత్తరమైనవి కావేమోననే అనుమానం కలుగసాగింది. భర్తతో పోట్లాడి చెరువులో దూకి చనిపోయిన భార్య, పరీక్ష తప్పి రైలు కింద తలదూర్చిన విద్యార్థి, కడుపునొప్పిని భరించలేక విషంపుచ్చుకున్న ముసలాయన, వీళ్ళందరూ నిజంగా ఘనకార్యం చేసినవాళ్లేనా అని నేను ప్రశ్నించుకొనేవాణ్ణి. కాని ఆత్మహత్యల్లో అన్ని కేసులూ యిలాంటివి కావు.

కొన్ని సంవత్సరాల క్రితం నేను వార్తాపత్రికల్లో ఒక వార్త చదివాను. అది విభిన్న జాతి మతాలకు చెందిన నిరాశ ప్రేమికుల విషాదాంతగాథ. సంఘాన్ని, తల్లిదండ్రులను తదితర బాహ్యప్రాపంచిక శక్తులను చూచి వెలుపొందిన యిద్దరు ప్రేమికులు, మద్రాసు నగరంలో ఒక హోటలు కిరాయి గదిలో కలుసుకొన్నారు. వాళ్ళిద్దరు యిదివరకే ఒక నిశ్చయానికి వచ్చియున్నారు. ఆ రాత్రి వారు యెంతో కులాసాగా విందు కుడిచి ఆ పవిత్రానగరంలో సోమపానంగూడా చేశారు. నూతన వధూవరుల్లాగా చక్కగా అలంకరించుకున్నారు. ఇదివరకు వందలమందికి ఆశ్రయమిచ్చిన ఆ హోటలు పక్కను వాళ్ళు గులాబీపూలతో కప్పి వేశారు. ఆరాత్రి వాళ్ళు యేం మాట్లాడారో యేం ఆలోచించారో వూహించడం చాలా కష్టం. జీవితకాలమంతటిలో పొందవలసిన అనుభవాన్ని అనుభూతిని కొద్ది నిముషాల్లో యిమడ్చగలగటం, సంవత్సరాల ఆవేశాన్ని కొద్ది క్షణాల్లో కూడగట్టగలగటం, ప్రాపంచిక విషయాల జంజాటంలో నుంచి సారాన్ని గ్రహించి తుక్కును వదలివేయగలగటం, యివన్నీ ప్రతివొక్కడికి తటస్థించవు. సాధారణ జీవితం జననమరణాల ఆహారమైథునాల చేతి పరిశ్రమలాగ తేలికగా వెళ్ళిపోతూవుంటుంది. తుఫాను వేగాన్నీ హాలాహలం చేదునీ అగ్ని పర్వత గర్భంలోని, వుష్ణతనూ మనం అంచనా వేసే పరిస్థితి యెప్పుడోగాని రాదు. ఆ ప్రేమికులిద్దరికీ యీ గొప్ప అదృష్టం పట్టింది. వాళ్ళ అంతిమక్షణాలు మానవుని అమరత్వంలో అచంచలమైన విశ్వాసంతోనే గడిచిపోయాయని అనుకొంటాను.

రెండవరోజు ప్రొద్దునపూట హోటల యజమానికి తలనొప్పి, పోలీసు వాళ్ళకి చేతినిండా పని, మర్యాదస్థులయిన వారి బంధువులకు తలవంపులు మిగిలాయి. పత్రికలవారు మాత్రం బాగా వుపయోగించుకున్నారు. యీవార్తను. ఈ పైనుదహరించిన కేసులో ఒక రకమయిన అందంలేకపోలేదు. పూర్వపు నవలారచయితలైతే యిలాంటి ఘట్టాలను యెంతో సజీవంగా సహానుభూతితో చిత్రించివుండేవాళ్ళు. కాని నేటి ప్రపంచంలో యెక్కువమంది యిలాంటి వార్తలు వింటే నవ్వటమో, హేళనగా తలవూపడమో జరుగుతుంది. నామట్టుకు నేను అది ఆప్రేమికుల పిరికితనమని నిందించాను. ఇవ్వాళగూడ నేను నలుగురిలో మాట్లాడవలసివస్తే అది పిరికితనమనే అంటాను. నాలాగా కాక మరికొంత మంది దీనికి ఆర్థిక,రాజ,నైతిక కారణాలు కూడా వెతకగలరు. వారి వాదన సబబుగానే వుంటుంది. ఫలానా పరిస్థితుల్లో ఫలానా మనస్తత్వంగలిగిన వాళ్ళు గనక వారు ఫలానావిధంగా ప్రవర్తించారు అని అంటారు యీ మహాశయులు. వీరు మానవజీవితాన్ని గణిత సూత్రాలుగా ప్రతిపాదించగలరు. వీరిదృష్టిలో మానవుని యింద్రియానుభవాలన్నీ రాసాయనిక పరివర్తనాలవలన కలుగుతాయి. వీరు యెంతటి గడ్డు సమస్యనయినా పాఠ్యగ్రంథాల ననుసరించి యిట్టె పరిష్కరించి వేయగలరు. ఇలాంటి వారికి ఆత్మహత్య యెప్పుడూ ఒక సిగ్గుపడవలసిన విషయంగా కనిపిస్తుంది.

నాకు పద్దెనిమిదిపందొమిదియేండ్లున్నపుడు తర్కబుద్ధిలో అచలమైన విశ్వాసంవుండేది. అప్పుడు తర్కించందే యేవిషయాన్నీ అంగీకరించేవాణ్ణి కాదు. ప్రతిదానికి కార్యాకారణ సంబంధం వెతికేవాణ్ణి. ప్రపంచ వ్యవహారాలన్నిటినీ

యేదో ఒక సిద్ధాంతంలో యిముడ్చుకోవాలని చూసేవాణ్ణి. అలా యిమడనివాటిని బెజ్జములో పట్టని మరమేకులగ అవతల పారవేసేవాణ్ణి. అప్పుడప్పుడు నామనస్సు యెదురుప్రశ్నలు వేసేది. కాని దాన్ని యెలాగోలా సమాధానపర్చేవాణ్ణి. ప్రపంచాన్నంతటినీ ఒక సువ్యవస్థితమయిన సామ్రాజ్యంలాగ సంభావించే యీ అలవాటు కొత్తదిగాదు. నాకంటే ముందు యెంతమంది దీనివల్ల బాధపడ్డారో? ఆరోజుల్లో నాప్రశ్నలకు విసిగిన పండితులు నన్ను వితండవాది అనేవాళ్ళు. పామరులు రెటమతస్థులనేవాళ్ళు. అప్పుడు, నేను చాలయెక్కువగా వాగుతూండేవాడినన్నమాట నిజం. ఆరోజుల్లో నాకు ఆత్మహత్య అర్థం అయ్యేదికాదు. నిర్హేతుకంగా కనిపించిన ప్రతిదాన్ని శంకించేవాణ్ణి. తనకర్థంగానిదాన్ని దూషించటం మానవ సహజం గదా? అందువల్ల నేను అలాగే చేసేవాణ్ణి. అప్పుడు నేను యిలా తర్కించుకునేవాణ్ణి: "బ్రతకటంవల్ల యేంలాభం అని అంటున్నావు నిజమే కావచ్చు. కాని చావటంవల్ల మాత్రం యేమి లాభంవుంది? అందువల్ల బ్రతకటమే మంచిది." అప్పుడు నేను యిది లాభనష్టాలకు సంబంధించిన విషయంకాదని గ్రహించలేక పోయాను.

కాని తరువాత తరువాత నాదృక్పథం మారింది. ఇది యెలామారిందో నేను చెప్ప లేను. బహుశా నేను బొమ్మను తలకిందులు చేసి చూడటం నేర్చుకొని వుంటాను. నేను నిరాశావాదిని అయ్యానని మీరంటారేమో. కాని యిది నిజంకాదు. నేను పూర్వం యెలాగున్నానో యిప్పుడు అలాగే వున్నాను. నాలో పెద్ద మార్పేమీ లేదు. పూర్వం నేను యేరీతిని ఆలోచించేవాడినో అదేమాదిరిగా యిప్పుడూ ఆలోచిస్తున్నాను. నాలో వచ్చిన మార్పేమన్నావుంటే అది క్రమానుగతమయిన వికాసంలాంటిదే. నాలో అంతర్విప్లవాలేమీ జరుగలేదు. కాని ఒకటి మాత్రం నిజం. నాకిప్పుడు హేతువాదంలో పూర్వంవున్నంత సమగ్రమమైన విశ్వాసం లేదు. అంటే నాకిప్పుడు ప్రకృతి నియమాల్లో నమ్మకం పోయిందనిగాని లేక సూర్యుడు తూర్పునగాక పడమరనగూడా వుదయించవచ్చుననే అనుమానం గలిగిందనిగాని కాదు. పురాతనపు తర్కబుద్ధి యిప్పుడు కూడా అన్ని విషయాల్లో పనిచేస్తూనేవున్నది. రాచకీయాలూ, ఆర్థిక సంబంధాలూ, కొరియా యుద్ధం, నైతికపు విలువలు వీటిని గురించి మాటాడేటప్పుడు నేను యిదివరకెలా తర్కసమ్మతంగా వుండేవాడినో యిప్పుడూ అలాగేవుంటున్నాను. కాని యీతర్కం అన్ని చోట్లా, ముఖ్యంగా మానవజాతితో, వైయ్య క్తిక సంపర్కం కలిగిన చోట్ల, పనిచేయటం లేదు. అలాంటి పని చేయని చోటులలో ఆత్మహత్య ఒకటి. అంటే ఒకప్పుడు నా తర్కంతో యీ చిక్కుల్ని విడమర్చగలిగి వుండేవాణ్ణికాదు. తేడా యేమిటంటే అప్పుడు నేను నా వోటమిని వొప్పుకొనేవాణ్ణి కాదు, యిప్పుడు ఒప్పుకొంటున్నాను. పూర్వం మాదిరిగా నేను నా తలకుమించిన సమస్య వచ్చి పడ్డప్పుడు కండ్లుమూసుకొని తప్పుకుపోవాలని చూడటం లేదు. నేనిప్పుడు ధైర్యంగా దానికేసి చూస్తున్నాను.

జీవితం విచిత్రమయినది. మృత్యువుకూడా విచిత్రమయినదే. ఈ రెండింటిలో యేది యెక్కువ విచిత్రమయినదో చెప్పగలగటం చాలా కష్టం. ఆ మాటకొస్తే యేది మృత్యువో యేది జీవితమో చెప్పటమే కష్టం. జీవితం మృత్యువులో

వికసిస్తుంది. మృత్యువు జీవితంలో వాడిపోతుంది. మెరుపు మెరిసేముందు చీకటి, మెరుపు మెరిసింతరువాత చీకటి. దానినే మనం రెండుచీకట్ల మధ్య మెరుపని గాని, రెండు మెరుపుల మధ్య చీకటి అనిగాని అనొచ్చు. లెఖ్ఖలేనన్ని అంకెలు గలిగిన యీగొలుసుకి యెక్కడ మొదలో యెక్కడ ఆఖరో చెప్పటం కష్టం. కోట్లకొలది క్షణాలతో అనంతమయిన కాలావధి నిర్మించబడింది. కాని ఒక్కొక్క క్షణంలోనే ఒక్కొక్క అనంతం వున్నది. ఈ విధంగా పూలతోటలో వున్న వందలకొలది పూలల్లో ఒక్కొక్క దానిలో ఒక్కొక్క పూలదోటవున్నది.

ప్రతి మనిషి తనకి తాను మొదలు, తనకి తాను చివర. ప్రతిమనిషీ ఒక సృష్టి, ఒక ప్రళయం, ఆద్యంతాలు లేని జీవితపు నవలలో ఒక్కొక్క పరిచ్ఛేదం. ఒక్కొక్క స్వయం సంపూర్ణమయిన కథ. దాని వునికికదే కారణం. ఈ విధంగా కన్నులు మిరుమిట్లు గొలిపే మెరుపూ, కాటుకవరదలా కమ్ముకొనే చీకటీ, ఆకాశ సముద్రంలో తరంగాలు. ఇది బుడగ. ఇది నురుగు. ఇది యెక్కడినుంచి బయలుదేరిందో యెందుకు బయలుదేరిందో యెవడు చెప్తాడు! తరంగాలు లేచి పడిపోతాయి. తుఫాను లేచి ఆగిపోతుంది. కాని సముద్రం అలాగే వుంటుంది. అదేవిధంగా జననమరణలను అధిగమించిన శక్తివొకటి వుంటుందని కొంతమంది అంటారు. నాకు తెలియదు, ఇందువలన నేనిది నమ్మలేను. నాకు పునర్జన్మలో నమ్మకం లేదు, కాని నా చైతన్యం నాతోబాటు అంతమొందుతుందని నేను ఆలోచించలేకపోతున్నాను. ఏదో ఒక రూపంలో అమరత్వం అనేది ఉంటుందనే ఆశ మానవజాతిని యెప్పుడూ పీడిస్తూనే వుంటుంది. ఎందువల్లనంటే మన క్రియాకలాపాలుగాని, తత్సంబంధమయిన ప్రతిక్రియలుగాని మనతోబాటే అంతమొందితే యీ జంజాటం అంతా యెందుకు? దైహికానందంతో అసంతృప్తి చెందేవాడికి జీవితంలో కోరతగింది చాలా తక్కువ. ఒక 60 సంవత్సరాల్లో నేననేది లేకుండాపోయినపుడు నాకు సంబంధించిన రుజువు ప్రపంచంలో యేమి మిగిలివుంటుంది? ఒక వేళ మిగిలివున్నా దానివలన నాకువచ్చే లాభం యేమిటి? ఈ దృష్టితో చూస్తే జీవిత సంఘర్షణ అనవసరంకాదా! ఆవేశాల అగ్నిలో కాలిపొయ్యే మానవుని ఆత్మకు శాంతియెక్కడ? అలాంటి శాంతివుండే ఆశకూడా లేనపుడు నిశ్శబ్దంగా చీకటిలో చెరిగిపోవటమే మంచిది కాదా? ఈ విధమయిన ఆలోచనలు అన్నీ ఒకే దిక్కుకి సంకేతం చేస్తాయి.

కాని నాచైతన్యం నాతోబాటే ఆఖరా!? నేను అనుభవించిన సుఖదుఃఖాల్లో నా వెలుగుచీకట్లలో నా హృదయంలో రేగినతుపానులో, వరదల్లో, భూకంపాల్లో చివరకు శేషం యేమీ మిగలదా? నన్ను తృణంలాగా తోసుకెళ్ళుతున్న యీ కాలప్రవాహం యెక్కడకు తీసుకెళ్ళి వదుల్తుంది. నాకు ముక్తి యెక్కడ? నేను యీజన్మలో ఆచరించిన కర్మలు నాతోబాటే ఆఖరయితే నేను పుణ్యం చేస్తేనేం? పాపం చేస్తేనేం? ఏది చేసినా ఒకటే కాదా?

అందుకనే మానవులు ఇంతమంది దేవతలను, యిన్ని మతాలను సృష్టించుకొన్నారు. ఏదో వొకరూపంతో మృత్యువు తరువాత గూడా తను మిగిలి వుంటానని ప్రతివొక్కడూ తనను తాను నమ్మించుకోజూస్తాడు. కొంతమంది ఐహికాదర్శాల్లో

తమ యొక్క యీ స్వప్నాన్ని సఫలం చేసుకోవాలని చూస్తారు. కాని వీటివేటిల్లోనూ నమ్మకం లేనపుడు ఆత్మహత్య ఒక్కటే శరణ్యం. తనకు మించిన శక్తిని గుర్తించి పరాజయం అంగీకరించటమే ఆత్మహత్య. కూడికలు తీసివేతలు అన్నీ అయిపోయి శేషంగా మిగిలిన శూన్యమే ఆత్మహత్య.

★ ★ ★ ★ ★

కాలప్రవాహంతో స్వేచ్ఛగా మునిగి కనపడకుండా పోయినవారిని నేను యిప్పుడు నిందించపోవటం లేదు. వారిని నిందించడానికి నేనెవరిని! జీవితం సిద్ధాంతాల బంధనాలనన్నింటినీ ధిక్కరిస్తుంది. ప్రతివొక్కరికీ వొక్క రూపంలో సాక్షత్కరిస్తుంది. వారు తమ త్రోవ తాము చూచుకొన్నారు. నేను వారిని పిరికిపందలని యేలా అనేది? మసరిక్, మైకోవస్కీ, ఎసినిన్ యింకా ఎంతోమంది మహానుభావులు యీత్రోవను నడిచారు. మానవ ప్రయత్నాల వ్యర్థత్వాన్ని గుర్తించిననాడు వారినీ అఘాతంలో దూకకుండా అడ్డగలిగిన శక్తియేది? వారు అకస్మాత్తుగా త్రోవ మలుపులో మాయమయ్యారు. వాళ్ల నెందుకు ఆపాలి?

నాకు మానవుని సంపూర్ణ స్వాతంత్ర్యంలో నమ్మకంవున్నది. అతడు తన అదృష్టానికి తానే అధినేత. అతడు తనను యే రూపంలో కావాలంటే ఆరూపంలో నిర్మించుకోగలడు. అతడు తన జననమరణాలను కూడా శాసించగలడు. చైతన్యం వున్నంతవరకూ అతడు తన ప్రపంచాన్ని తానే నిర్మించుకుంటాడు. అలాగే నాశనంకూడా చేసుకుంటాడు. అతడు యివ్వాళవున్న రూపం కావాలని కోరితెచ్చుకున్నదే. దానికొరకతడు యెవ్వరినీ దూషించి ప్రయోజనం లేదు. అతడు తన కర్మలన్నిటికి తానే పూర్తి బాధ్యత వహిస్తాడు. అగాధంలో దూకినవారు కావాలనే అలా చేశారు. అందువల్ల వారితో నాకు పేచీ లేదు. ఏదో ఆదర్శం కొరకు ప్రాణాలర్పించినవాళ్లు తగిన పనే చేశారు. ఏ ఆదర్శం లేకుండా ప్రాణాలర్పించినవాళ్లు గూడా మంచిపనే చేశారు. ఏదో ఒక ఆదర్శం వుండటం మంచిదే కాని యే ఆదర్శం లేకపోవటంకూడా మంచిదే. వాస్తవమేమిటంటే యేది మంచిదో యేది చెడ్డదో యెవరికి వారే నిర్ణయించుకోవాలి.

ఇప్పుడు పగలు తొమ్మిదింపావు అవుతుంది. కొద్దిగా మబ్బు పట్టినట్టుగా వున్నది. కానీ యివి కురిసిపోయ్యే మబ్బులు కావు. నేను నా గదిలో కుర్చీలో కూర్చుని రాస్తున్నాను. కిందయెక్కడో పనిచేస్తున్న యంత్రాలు నా ఆలోచనకు తాళం వేస్తున్నవి. గాలిచల్లగా వున్నది. చెట్లు పచ్చగా వున్నవి. నేను బయటికి చూచినప్పుడు జీవితం నృత్యం లాగా, గానం లాగా ఆనందతరంగాల్లా కనిపిస్తూవుంది. వందలకొలది వేలకొలది యిళ్ళల్లో యెక్కడో పిల్లలాడుకుంటున్నారు. పెద్దవాళ్లు యెవరిపనులు వారే చేసుకుంటున్నారు. చప్పట్లు, యీలలు, నవ్వులు, యేడ్పులు, వేలకొలది భావాలు వెలిబుచ్చటానికి, వేలకొలది శబ్దాలు గాలిలో కలుస్తున్నవి. ఈ విశాల మహీతలం చక్కలిగింతలు తగిలిన శరీరంలాగా వున్నది. నేను

వొంటరిగా వున్నాను. అయినప్పటికీ నాచుట్టూ సముద్రాల అవతలా యివతలా అనేక ఖండాల్లో నాలాటివారు, కోట్లకొలది జీవిస్తున్నారు. వారు జీవిస్తున్నారనే భావములో నా జీవితం కూడా యిమిడివుంది. ఈ అనంత గ్రహాదులను, సూర్యచంద్రాదులను, వుదయాస్తమయాల, హేమంతవసంతాల ప్రకృతి నియమాలను నేను నిర్మించలేదు. అయినా యీక్షణం వాటిని నేనే నిర్మించినట్టు భావిస్తున్నాను. నా హృదయం ఒక తీవ్రమయిన ఆవేశపు వరదతో నిండిపోతుంది. ఇది పరమానందంకావచ్చు. ఇది చరమ యాతన కావచ్చు. రెండింటి అనుభవం వొక్కలాగే కనిపిస్తుంది. కణకణలాడే అగ్నికణాలను ముట్టుకున్నా, చల్లని మంచుగడ్డను ముట్టుకున్నా వొకే రకమైనభావం కలుగుతుంది. కారణాలు వెతకనక్కర లేదు. కావలసిందల్లా ఆ అనుభవం. ఇదిజీవితం కావచ్చు. ఇది మృత్యువు కావచ్చు. కాని యీ క్షణం నేను జీవిస్తున్నానన్న విషయం నాకు తెలుసు.

ఈ ఆవేదనను వర్ణించటం యెలాగ? ఇది యెక్కడనుండి వస్తుందో చెప్పడం కష్టం.

దీనికి కారణం నాకు తెలియదు, సూర్యుని స్వర్ణకాంతిలో నిశ్చింతగా ఆడుకుంటున్న పసిపాపలను చూచినప్పుడో, ముసలమ్మ బోసినోటిమీద చిరునవ్వులు చూచినప్పుడో హిమగిరిశిఖరాల స్వచ్ఛధావళ్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నప్పుడో, వెన్నెల రాత్రులలో తాజ్ మహల్ ని తలుచుకున్నప్పుడో, ప్రియురాలి కన్నుల నీలిలోతుల్లోకి తొంగిచూచినప్పుడో, చక్కని కవిత్వం చదివినప్పుడో, గుండెలను కలచివేసే పాటవిన్నప్పుడో, యెప్పుడో అకస్మాత్తుగా యీ అనుభవం నిన్ను చుట్టుముట్టి వుక్కిరిబిక్కిరి చేస్తుంది. నేటితో జీవితసారం గ్రహించినట్టనుకుంటావు. ఇక నీకు జీవించాలని కోరిక వుండదు. ఆ ఒక్క క్షణం నీవు జీవనమరణాలను ఒకేకంటి అద్దమునుంచి చూచావు. చీకటిలో మెరపుమెరసిన క్షణం ఆదే, జీవితంఅంటే యేమిటో నీవిప్పుడు తెలుసుకున్నావు. నీకు సంపూర్ణమయిన తృప్తి కలిగింది. మెరుస్తూ తడిగావున్న కళ్ళతో నీవు తిరిగి ప్రపంచాన్ని చూచినప్పుడు అది పూర్వం మాదిరిగా వుండదు. అదే అగాధపు అంచున వున్న క్షణం.


ఇంకా యేమిటి కావాలి నీకు? నీవు చూడవలసింది చూచింతరువాత నీకు కావలసింది అందిన తరువాత యింకా యెందుకు బతకాలనుకుంటావు? "నిద్ర, కలలు, అక్కడే వున్నది గమ్మత్తు అంతా. నీవు ఈ నశ్వరరూపాన్ని త్యజించిన తరువాత శాశ్వత నిద్రలో యేమి కలలు గంటావో యెవడికి తెలుసు?" అనుమానించకు. నిద్రపో, నీ ఆత్మ రోజాపూలవాసనలాగ అదృశ్యమయి గాలిలో తేలిపోతుంది. ఒక అపరిచితమయిన స్టేషనులో అప్పుడే రైలునుంచి దిగినట్టుగా ఉంటుంది నీకు. నీకు యే సాహసకృత్యాలు తటస్థిస్తాయో యెలా తెలుసు? నిర్భయంగా నిద్రపో. నీ పక్క తెల్లగా శుభ్రంగా వున్నది. పక్కన పుష్పపాత్రలు, రంగురంగుల పూలున్నాయి. తెల్లని దుప్పటి కప్పుకో. నీ ఆలసిన శరీరంలో ఒక రకమైన వెచ్చదనం ప్రాకుతుంది. నీవు నిశ్శబ్దంగా చిన్న అలలమీద తేలిపోయే వినోదనౌకలా నీకు తెలియకుండానే అనంత వినీలసాగరంలో ప్రవేశిస్తావు. అక్కడే అన్నిత్రోవలూ కలుసుకుంటాయి.

# ఒక చిన్న మానవుడు

## ఇచ్ఛాపురపు జగన్నాధరావు

## (1978 - ఆంధ్రజ్యోతి దీపావళి సంచిక నుంచి)

చీకటి క్రమక్రమంగా చిక్కబడుతోంది.




క్రమక్రమంగా ప్రసాద్ సహనం తగ్గిపోతోంది.

ఏమి జీవితం! అనుకున్నాడు ప్రసాద్. ఆ నిట్టూర్పులో మానవ జీవితం మీదా, తన స్వంత జీవితం మీదా కూడా నిర్లిప్తత ఉంది.

అక్కడా అక్కడా దీపాలు చీకటికి చిన్న చిన్న చిల్లులు పెడుతున్నాయి. అతని నల్లటి మనస్సు ఇంకా, ఇంకా, నల్లబడుతోంది.

"ప్యూన్ !" అని కేక వేశాడు.

ప్యూన్ రంగా "ఏమిటి బాబూ? అన్నాడు.

"లైట్లు వెయ్యలేదేం?" అని కసిరాడు ప్రసాద్.

"మీరే వెయ్యొద్దన్నారు" అన్నాడు ప్యూన్ రంగా.

"అది, పావు గంటకిందట. ఇప్పుడు వెయ్యి." అన్నాడు రెండు మూడు లైట్లు వెలిగిస్తోన్న రంగాతో.

అతన్ని రంగా అని పిలవడు – శారద ఇంట్లో వున్నప్పుడు తప్ప. ఆమె వాడిని రంగా, రంగా అని పిలుస్తుంది. వాడిని పిలిచే పిలుపులో తన మీదకన్న ఎక్కువ ఆప్యాయత, కనీసం స్నేహం కనిపిస్తుంది.

మొన్న ... పొరపాటు అలవాటుకొద్దీ ప్యూన్ అని పిలిస్తే శారద ఎంత మాట అంది?

"మిమ్మల్ని ..గుమస్తా! అని మీ సూపరెంటు పిలిస్తే మీకెలాగ ఉంటుంది?" అంది! అంతే కాదు, "రూపాయి పని చేసి పావలా పట్టికెడతాడు వాడు! పావలా పని చేసి రూపాయి పుచ్చుకుంటాం మనం! వాడి దురదృష్టాన్ని మీరు మాటమాటికీ, పిలుపు పిలుపుకీ జ్ఞాపకం చెయ్యక్కరలేదు" అని కూడా అంది శారద.

ఆ క్షణంలో తనకి చాలా కోపం వొచ్చింది. భర్తని గౌరవించకపోతే సరి. అంతగా అవమానం చెయ్యాలా? అది ప్యూన్ ఎదురుగానే! కాని అది సమయం కాదని ఊరుకున్నాడు తాను, ఈ కాలు కొంచెం నయం అయి. కేసు ముగిసి మళ్ళీ తన ఉద్యోగంలో చేరితే అప్పుడు చూడాలి అమ్మగారి తిప్పలు! ఓడలు బళ్ళూ, బళ్ళు ఓడలూ అవుతాయని శారదకి తెలీదు. కానీ, ఈలోపున వాడికి మరీ గర్వం ఎక్కువ కాకుండా వాణ్ణి హద్దుల్లో పెడుతూనే వున్నాడు. మళ్ళీ తాను సీట్లో కూర్చున్నాక తాసీల్దారుగారితో చెప్పి ---

శారద --- ఎక్కడ వుందీ?

ఇంతసేపూ --- ఏడున్నర కావొస్తోంది. ఆఫీసులోనేనా? ఓ టెలిఫోను అడగమని తానెన్నిసార్లో చెప్పినా శారద వినిపించుకోదు – ఒకసారి టెలిఫోన్ చేస్తే.

"ప్యూన్! సిగరెట్టు తే!" అన్నాడు ప్రసాద్.

"అయిపోయాయి" అన్నాడు రంగా దూరం నించి.

"పొద్దుటినుంచీ ఆరు కన్నా కాల్చలేదు! పదీ అయి పోయాయిరా? కావాలంటే అబద్ధాలాడకు. అడిగి తీసుకో --- కమాన్ తే!" అన్నాడు.

"నిజంగానేనండి. కిటికీ అవతల పీకలున్నాయి. కావలిస్తే లెక్క చూడండి."

"నువ్వే కాల్చి అక్కడ పడేస్తే సరి!"

"అవన్నీ బెర్కలీ సిగరెట్లు" అన్నాడు ప్యూను.

"ఏం, అది నీ బ్రాండు కాదా? నువ్వు కాల్చవా?" అన్నాడు ప్రసాద్.

"కాదండి. అవి నేను కాల్చను." అన్నాడు రంగా.

"అంత గొప్పవాడివా? నీ బ్రాండేమిటోయ్?" అన్నాడు ప్రసాద్ కొంత సౌమ్యంగా. తన పని అయితే తియ్యతియ్యగా మాట్లాడాలి, పెద్ద పార్టీలలోలాగ.

"నాది కింగ్" అన్నాడు.

"నేనెప్పుడూ కింగు సిగరెట్లు గురించి విన్లేదు" అన్నాడు ప్రసాద్.

"అవి కింగు బీడీలు" అన్నాడు నవ్వుతూ రంగా.

"చూడూ! ఓ సిగరెట్టు పెట్టే తే"

"బాబోయ్! అమ్మగారికి తెలిస్తే – ఇంకేమైనా ఉందా!" అన్నాడు రంగా.

"తెలీదు లేవోయ్! నేం జెప్పనుగా!"

"అయినా తెలుస్తాది" అన్నాడు రంగా మొండిగా.

అమ్మగారు! అమ్మగారు!

అయ్యగారు లెక్కలేదు. కాని, ఇది సమయం కాదు.

"చూడూ!" అన్నాడు – రంగా అనాలంటే పౌరుషం – ఫ్యూన్ అనడానికి భయం. సిగరెట్ కోసం నరాలు లాగేస్తున్నాయి.

ఏమిటన్నట్టు చూశాడు మెట్లమీద నిలబడి వున్న రంగా.

"బీడీలు ఘాటూ, సిగరెట్టు ఘాటూ?" అన్నాడు ప్రసాద్. ప్రేమ వ్యవహారాల్లోనూ, ముష్టి వ్యవహారాల్లోనూ డిప్లమసీ కావాలి.

"దేనికది" అన్నాడు రంగా.

వీడిదుంపతెగా!

"సరే! ఓ బీడీ ఇలా ఇయ్యి. నేను చెప్తాను" అన్నాడు ప్రసాద్. అతను శారదనీ, సమయాన్నీ మరిచిపోయాడు.

"అమ్మగారొచ్చేశారు" అన్నాడు రంగా. గుమ్మం ముందు కారాగింది. శారద ఎవరికో గుడ్ నైట్ చెప్పి దిగింది. ఇంతకు ముందు ఆలస్యంగా వచ్చినా బస్ లోనే వచ్చేది. కారులో చీకట్లో ఎవరితో.. ...

నయమే! బీడీ వాసన గదిలో లేదు అనుకున్నాడు ప్రసాద్. మళ్ళీ శారద మీద కోపం జ్ఞాపకం వచ్చింది. తానెంత గొప్పదని ఆమె ఉద్దేశం? ఎంత ఎక్కువ జీతం తెచ్చుకుంటున్నా భార్యగా ఆమె తన బాధ్యతలని భర్తగా తన కివ్వవలసిన గౌరవాన్ని మరిచేందుకు వీలు లేదు.

అలిసిపోయి వచ్చింది శారద.

ఎయిర్ కండిషనింగ్ వున్న గదిలో పని చేసి కారులోవస్తే అలా ఎందుకు అలిసిపోయి వుండాలి?

ఆ మాటే అడిగాడు ... అనుకున్నట్టు కాదు. "బాగా అలిసిపోయినట్టున్నావు" అన్నాడు.

"అలసట ... దానికేం?" అంది శారద అర్థం లేకుండా.

లోపలికి వెళ్ళి ముఖం కడుక్కుని వొచ్చింది – ఎంతో బాగుంది.

"చీకటి పడిపోయింది." అన్నాడు ప్రసాద్ బయటికి చూస్తూ. అతను లోలోపల జ్వలిస్తున్నాడు. కాని, లోపలి నీడలని బయటికి కనిపించ నివ్వకూడదు– డిప్లమసీ అదీ.

"మరో లైటువేస్తే సరి" అంది లేవకుండానే. రంగా భక్తి గా కాఫీ తెచ్చి ఇచ్చేడు. ఆమె ఏదో ఆలోచిస్తూ సున్నితంగా సిప్ చేస్తోంది. వాడు తనకి కాఫీ అందించే విధానాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని కుతకుతలాడేడు ప్రసాద్.

హఠాత్తుగా "ఈ ఇల్లు చాలడం లేదు మార్చేస్తాను" అంది శారద.

"మన ఇల్లు కాదు. ఈ ఇల్లు."

"ఈ ఇల్లేం చెయ్యాలి" అన్నాడు ప్రసాద్.

"ఉంచుదాం, తరువాత చూద్దాం" అంది శారద. ఆ చిన్న యిల్లు ఆమె సొంతం.

"మరి .. అద్దె ఇవ్వాలిగా! ప్రమోషనొచ్చిందా?" అన్నాడు ప్రసాద్. కుర్చీ ఆమెకి దగ్గరగా లాక్కుని.

"అవును, డైరెక్టరు స్పెషల్ అసిస్టెంట్ గా వేసుకున్నాడు" అంది శారద.

"జీతం?"

"పెంచుతారు–ఇంటి అద్దె ఇస్తారు."

కాఫీకప్ కింద పెట్టబోతోంటే రంగా వొచ్చి కింద పెట్టేడు, స్కవుండ్రల్.

శారద.

బి. ఏ. పాసయింది. తానూ అంతే.

టైపు – రాదు! తనకి వొచ్చును.

షార్ట్ హేండ్ – రాదు. తనకి వొచ్చును.

అందంగా వుంటుంది. తాను – జబ్బు పడ్డాడు.

మంచి ఉద్యోగం. తాను – సస్పెన్షన్ లో ఉన్నాడు.

ఆమెని కారులో దింపుతారు, తాను ఇల్లు కదల్లేదు.

అన్నీ ఆలోచించి, మళ్ళీ ఆమె అందాన్ని చూశాడు – ప్రసాద్. నాలుగేళ్ళ కిందట మామగారు తన కాళ్ళు కడిగి నాలుగు వేలు కట్నం ఇచ్చి ఈ ఇల్లు 'ప్రస్తుతానికి" శారద పేరున రాసి ఆమెని తన భార్యగా చేసినప్పుడూ, గాలి చొరని ఆ గదిలో, గాలి ఉందో లేదో ఆలోచించే ఆలోచనకి తానివ్వని ఇతర ఆలోచనలతో ఆమెని – శారదని చూసినప్పుడూ ఇలాగ ఇంత అందంగా వుండేది కాదు శారద. ఈ మధ్య .. తాము కుంటుకుంటూ కాస్త దగ్గరికి వెళ్ళినప్పుడల్లా "వెళ్ళి పడుకుంటే నేను చదూకుంటాను" అని "అండీ" అని కూడా అనుకుండా అతన్ని విదిలించి నేర్పుగా తన ఒళ్ళు తన దగ్గరే వుంచడంలో నేర్పరి అయాక శారద ఇంకా ఎంతో బాగుంది.

ఆమె కిన్ని ప్రమోషన్లేమిటి? చిన్న గుమస్తా ... అసిస్టెంటు ..పెద్ద గుమస్తా... పి.ఏ. అన్నీ మూడేళ్ళలో.

అసలీవిడకి చిన్న గుమస్తా ఇచ్చిందెవరు? పోనీ ఇప్పించెందెవరు? తన ఆఫీసుకి వచ్చిన కేశవంగారి కాళ్ళు పట్టుకోకుండానే పట్టుకున్నంతగా అతన్ని మెప్పించి, కేశవరాంగాడి జుత్తు పట్టుకోకుండానే అతని బిల్స్ కాస్త అటూ ఇటూ చేసి అతన్ని ఒప్పించి శారదకి ఉద్యోగం ఇప్పించింది తను!

తన భార్య శారద ఇవేళ ఎక్కడి కెళ్ళేవని అడగడానికి గడగడ!

"ఎక్కడ ఇల్లు?" అన్నాడు ప్రసాద్ చివరికి.

శారద చెప్పింది. అంటే తను భయపడ్డట్లే అన్నీ ఏర్పాట్లయి పోయాయన్న మాట.

"నేను స్నానం చేసి వొస్తాను– రాత్రి డిన్నర్ కి వెళ్ళాలి" అంది శారద.

"డిన్నరా? రాత్రి కా?" అన్నాడు ప్రసాద్. ఆమె అవునంటే అక్కడే ఈ వ్యవహారం తేల్చేద్దామని వుంది.

నవ్వింది శారద.

"డిన్నరు రాత్రికాకపోతే పగలు వుంటుందా?" అంటూ నవ్వింది.

నిమిషం నిశ్శబ్దంగా వుండి తానూ నవ్వేడు. దిక్కులేక అని మనస్సులోనే అనుకుని. ఈ కాలు కొంచెం స్వాధీనంలోకి వొచ్చి, తనమీద కేసు ముగిసి, మళ్ళీ తానూ మనిషి అయినప్పుడు ... ఆమె సంగతి చూడాలి.

ఆమె వెళ్ళి శుభ్రంగా అయివొచ్చింది. ఎంతో ఎంతో బాగుంది.

కుర్చీలో కూర్చుంది. కారు కోసం ఎదురు చూస్తోంది కాబోలు.

"నువ్వు చాలా బాగున్నావు" అన్నాడు ప్రసాద్ ఉండబట్టలేక. గాలిరాని ఒక ఇరుకు గదిలో మొట్టమొదటి తన స్పర్శకి ముడుచుకుపోతున్న శారదతో ఆ మాటే అన్నాడు. ఆవేళ ఆమె ఇంకా ముడుచుకుపోయింది సిగ్గుతో.

ఇవేళ తన మాటలు శారదకి వినిపించలేదు.

మరో అయిదు నిమిషాలకే కారు రానేవొచ్చింది. వెనుదిరిగి చూడకుండా వెళ్ళి పోయింది.

"ప్యూన్!" అని ఎలుగెత్తాడు ప్రసాద్.

విచిత్రంగా వాడు ఒక సిగరెట్ పేకెట్ తెచ్చి ఇచ్చేడు.

ఇంతసేపటి తరవాత సిగరెట్ పొగ పీలిస్తే వళ్ళంతా జివ్వుమంటోంది. బాగుంది!

★★★★★★★★★★★★

కొత్త ఇల్లు.

కొత్త జీవితం.

కావలసినన్ని సిగరెట్లు.

తాగినంత టీ.

ప్రసాద్ కి ప్రత్యేకం – కొంచెం అటు పక్కకి – ఒక గది.

ఇవి అన్నీ బాగున్నాయి.

కాని కొన్ని అంత బాగులేవు.

శారద మేడమీద గదిలో పడుకుంటూంది.

ఆమె సుమారు ప్రతిరోజూ సాయంత్రం బయటికి వెళ్ళి అర్ధరాత్రి వొస్తోంది.

ఎక్కడ, ఎవరితో, ఏం చేస్తోంది?

ఆఫీసుపని అని శారద అనలేదు.

అడిగితే అలా చెప్పవొచ్చును లేకపోతే చెప్పకపోనూ వొచ్చును!

ఆమె వుద్యోగస్తురాలు.

పెద్ద జీతం.

చిన్న బంగళా.

అస్తమానమూ ఏదో పని అంటుంది. తాను తీరికవేళ అంటే రోజంతా చదివే ఎన్నో కథల్లో యీలాటి సందర్భాలు వొచ్చేయి. అకారణంగా అనుమానాలు పెట్టుకుని చివరి పేరాలో అంతా మిధ్య అని తెలుసుకుని కౌగిలించుకొంటారు.

తన జీవితంలో చివరి పేరా ఎప్పుడో !

అవన్నీ మళ్ళా ఎప్పుడో!

అలా అనుకొంటూనే మరి కొంతకాలం గడిచిపోయింది.

కావలసినన్ని సిగరెట్లు ప్రసాద్ కి.

తాగినంత కాఫీ, టీ.

ఇంతకు ముందునించీ సబ్సిస్టెన్స్ అలవెన్సుగా వచ్చే రెండొందల చిల్లరలో నలభయ్యో, ఏభయ్యో వుంచుకొని ఆమె కిచ్చే వాడు. ఇప్పుడూ అలాగే చేసినా శారద ఏమీ అనలేదు.

ముందు ముందు బాగా అనిపించింది జీవితం.

శారద మంచిదనిపించింది.

కాని ...

క్రమక్రమంగా లోలోపల ఏదో బాధ.

పరిస్థితులేవైనా, తాను భర్త, ఆమె భార్య.

తన 'సుఖం' చూస్తోందా? అవును. కాదు ...

రోజూ ఎక్కడికి వెడుతుంది?

ఎక్కడ తిరుగుతోంది?

ఎవరితోనైనా ...

ఛా! శారద అలాటి మనిషి కాదు! ఆమె సంగతీ, భర్త కదా. తనకి తనకే తెలీదూ?

కాని ...

ఆ డైరెక్టరు – ఒక్కో రాత్రి పన్నెండు దాకా ఆమెని రానివ్వడు.

అంతంత అఫీసు పనులేముంటాయి?

వాడు – యంగ్ మాన్ ట. స్మార్ట్ గా వుంటాడట. సచ్ ఎ నైస్ – నయిస్ మాన్! అంటుంది – ఉండీ ఉండీ శారద.

వాడితో కానీ, కొంపదీసి శారద.

ఛా!

ఛా ఛా!

అలా అనుకోవడమే పాపం – తన సుఖం కోసం ఆమె అర్థిస్తోంది. ఈ మంచి ఇల్లు, తిండి, సిగరెట్లు, కాఫీ అన్నీ తనకివ్వడానికి.

కాని తనది గ్రౌండ్ ఫ్లోర్.

ఆమెది ఫస్ట్ ఫ్లోర్.

సంపర్కంలేని సంసారం.

తన ఆరోగ్యమూ అలాగే వుంది.

కాని శారద సంసారి. ఆమెని ఏమైనా అనుకుంటే పాపం!

తప్పు.

★★★★★★★★★★★★

మరి కొంతకాలం గడిచిపోయింది.

ప్రసాద్ సస్పెన్షను అలాగే వుంది. కాని విచారణ ప్రారంభం. అయేలాగ వుంది.

శారద పని హెచ్చయిపోయింది.

ఊళ్ళు తిరగాల్సి వొస్తూంది.

ఢిల్లీ.

బాంబే.

కలకత్తా.

పాపం.

ఢిల్లీలో ఎక్కడ వున్నావూ? అని అడిగేడు. ఆమె తిరిగి రాగానే ప్రసాద్ తనకి ఢిల్లీ వెళ్ళాలని వుండేది. వుంది.

"అశోకాలో"

"అలాగా! బాగుందా?"

శారద చిరునవ్వు. అదే సమాధానం.

"బాంబేలో ఎక్కడా?"

"తాజ్ లో."

బాంబే వెళ్ళాలని వుంది.

కాని,

పోనీ! శారదనైనా చూడనీ, తానెందుకు అడ్డుపడాలి? తన భార్యగావొచ్చి ఈ అదృష్టం అంతాపొందుతోంది. గుడ్, కాని,

"కలకత్తాలో ఎక్కడ వున్నావూ?"

"గ్రాండ్ హోటల్లో"

తనకి కలకత్తా వెళ్ళాలని లేదు. డర్టీ సిటీ. అంతా కల్మషం. గోల. కమ్యూనిజం.

ఢిల్లీ నుంచి తనకి స్వెట్టర్ తెచ్చింది శారద.

బాంబేనించి షర్ట్ – పువ్వులది! మంచిది తెచ్చింది.

కలకత్తా నించి రసగుల్లా తెచ్చింది.

ఎక్కడికి వెళ్ళినా, ఏదో ఒకటి తెస్తుంది.

తనని మరచిపోదు, తన భార్య శారద.

కాని, ఆ పెద్ద పెద్ద హోటళ్ళల్లో...

ఆ మగాళ్లతో శారద ఎంత మంచిదైనా ..

ఈ మధ్య మరీ సంతోషంగా, ఉషారుగా ఉంది శారద.

ఎంతో ఎంతో బాగుంది.

రసగుల్లా లాగ.

రుచి ... అడగడానికి కూడా భయం వేస్తోంది. అంత మారిపోయింది.

తనకి.

పువ్వుల సిల్కు చొక్కా, వేడిగా వుంటే వేసుకోడానికి.

చలివేస్తే – స్వెట్టర్.

ఆకలి వేస్తే రసగుల్లా.

ఏదైనా మరొకటి వేస్తే కాఫీ, సిగరెట్, శారద కాదు.

ఆమె –

వాడితో ...

"తప్పు" చేస్తోందా?

థర్టీ థాట్.

అలా అనుకోకూడదు.

కాని, ఆడది, మగాడు. ఆమె అందగత్తె, వయసు, ఆరోగ్యం, ఆ స్వేచ్ఛ– ఆమెకి మటుకు కోరికలుండవూ? ఆ హోటల్ గదుల్లో చల్లటి ఆ ఏకాంతపు పరిసరాల్లో – ఆ యంగ్ స్మార్ట్ మేన్ తో ...

ఏమో!

శారద మంచి మనిషి.

ఆమె మంచిది.

కాని – మనిషి.

నిజంగా అలా చేస్తోందా?

చేస్తే తానెందుకు జ్ఞాపకం వస్తాడు.

ఆ సిల్కు చొక్కా, స్వెట్టరు, రసగుల్లా ఎందుకు తెస్తుంది?

ఏమో!

అనుమానంగా వుంది.

అనుమానం పెనుభూతం.

ఎన్ని కథల్లో అమాయికల మీద అన్యాయంగా భర్తకి అనుమానం కలుగలేదూ?

ఎప్పుడో పోయిన అన్నయ్యనో.

ఎపూడూ లేని తమ్ముడినో.

ఆ "రెండో మనిషి" లో చూసిన అమాయికపు కన్నీళ్ళలో ప్రత్యక్షమైన భర్తకి బుద్ధిరాలేదు?

తాను తొందర పడకూడదు.

నిన్ననే గదా శారద "ఓసారి అలా ఊటీ, కూనూరూ తిరిగి రాకూడదుటండీ! ఏర్పాట్లు నేను చేస్తాగా!" అందీ? తనమీద ప్రేమలేకపోతే అలాగ ఎందుకంటుంది?

ఏమో!

ఇక్కడినించి తనని వెళ్ళగొట్టి మరింత స్వేచ్ఛగా ఉందామనేమో! కాని, ఆమె స్వేచ్ఛకి ఇపుడు మాత్రం ఏం తక్కువ?

ఏమిటి ఆపగలడు, తాను?

కాని ...

శారద అందంగా వుంటుంది. పరువం ఉన్న వయస్సులో ఉంది.

ఆ ఏకాంతాల కాంతత్వంతో ఏకాంత అంతటి వాడిచెంత. ఉండి, 'మంచి' మనిషిగా ఉండిపోతుంది?

ఏమో, ఏమో, ఏమో!

చిన్న గింజలాటి ప్రసాద్ అనుమానం రోజురోజుకీ కాన్సర్ లా, కరువులాగ పెరిగింది.

ఉదయం నుంచి సాయంత్రం దాకా అతనికి తిండీ, కాఫీ, సిగరెట్, ఆలోచన.

ఆలోచనలో ఆమె శారద.

ఆమె లోలోపల ఎలాగ వుంటుందో మరిచిపోయాడు ప్రసాద్. ఆలోచనలలో అవసరం వొచ్చినప్పుడు ఆమెని ఊహించి తనని తాను రంపాన పెట్టుకునేవాడు. అతని నరాలన్నీ లాగిలాగి వొదిలేవి.

కాని.

కళ్ళతో చూడని మాటని నిజంలాగ భావించకూడదు.

అందులోనూ చెడ్డమాటని.

ఎన్ని కథల్లో అలాగ!

ఎన్ని సినిమాల్లో అలాగ!

అంతదాకా యెందుకు? తన మీద లంచగొండితనం ఆరోపించిన ప్రభుత్వం వారు చేసిన ఆరోపణలో నిజం ఏముంది? ఆరోపణలో వున్న మనిషి దగ్గర, ప్రభుత్వం వారు చెప్పిన తేదీన, వారు చెప్పిన మొత్తం తాను తీసుకోలేదు, కాని తనని సస్పెండు చేశారు. ఛార్జీషీటు ఇచ్చేరు. వాటికి తోడు కాలిబాధ ఒకటి.

తాను శారదని అంత సులువుగా అనుమానించి అవమానించడం న్యాయం కాదు!

అయినా, ఇన్ని పరిస్థితుల మధ్య అనుమానించకపోవడం అభిమానం అన్న మాట కాదు.

నిదర్శనం ...

అంటే ఆమె అచ్చు వెయ్యరాని పరిస్థితుల్లో వుండగా దర్శనం చెయ్యాలి కాని, ఎలాగ?

అలపై ...

లాగ అక్కడెక్కడో ఎవరో .. తనని రానిస్తారా?

"ఒక్కసారి చూస్తాన్సార్!" అంటే "ఆల్ రైట్" అంటారా?

అనరు.

అయితే, మార్గం ఏమిటి? మార్గాంతరం ఏమిటి?

★★★★★★★★★★★★

రోజులు గడుస్తున్నాయి.

ప్రసాద్ కి తిండి మీద కన్న, కాఫీ, టీ, సిగరెట్ మీదకన్న శారదమీద కోరికలు ఎక్కువయాయి. కోరికతో బాటే అనుమానం కూడా.

ఈ మధ్య ఆమె చిరునవ్వు మానేసింది తనని చూసి.

మరీ సంతృప్తిగా, ఆనందంగా వుంది తనని చూసినా.

అనుమానం ...

అలా పెంచుకుంటూ భరించుకుంటూ వొచ్చాడు.

ఆ రోజు .. ఒక రోజు...

ఇంక్వైరీకి పిలుపువొస్తే ఆఫీసుకి వెళ్ళేడు.

విచారణ రెండు రోజులు సాగి, ఆగిపోయింది. రెండోరోజున సాంబశివరావు పలకరించేడు.

అతనీమధ్య కనిపించలేదు. ఆఫీసులో ప్రసాద్ కి చాలా దగ్గరగా ఉండేవాడు.

"ఎలా ఉన్నావు?" అన్నాడు ప్రసాద్ ని చూసి.

"బాగానే ఉన్నాను" అన్నాడు ప్రసాద్.

ఇంక మాటలు లేకనో, అడిగే మాటలు లేకనో ఆగిపోయాడు సాంబశివరావు. ప్రసాదే కలుగజేసుకుని, అతని అంతరాంతరాలలోని ఆలోచనల్ను ఊహించి, "శారద ఉద్యోగం చేస్తోంది" అన్నాడు.

సాంబ ఒక్కసారి జీవించినంత వెలిగి "అవును – విన్నాను" అన్నాడు.

"ఏం విన్నావు?" అని అడిగేడు ప్రసాద్ తేలు కుట్టగానే లాక్కున్నట్టు అనుమానపు తేలు అంత దగ్గరగా ఉందన్న మాట!

"అదేలే" అన్నాడు సాంబ నీళ్ళు నములుతూ.

"అంటే?" అన్నాడు ప్రసాద్. ఎలాగో కోపం, బాధ, ఆతృత కలిపి.

"ఏం లేదు" అన్నాడు సాంబ.

రెండు నిమిషాల నిశ్శబ్దం తరవాత –

"వాళ్ళు – అదే శారదని గురించి అంటున్నారా" అన్నాడు.

సాంబ దిక్కులు చూశాడు.

ప్రసాద్ కి అంతా తెలిసింది. తన భార్య శారద, వీళ్ళ వెకిలి సంభాషణల్లో విషయంగా ఉందన్న మాట. అవన్నీ రంగరించి ఆ కబుర్ల గ్రంథం తనకి రాయాలని ఈ సాంబశివరావు ప్రయత్నిస్తున్నారన్న మాట!

స్కౌండ్రల్స్!

రోగ్స్!

"డర్టీ ఇడియట్ ఫెలోస్!" అనుకొన్నాడు మనసులో. అతని కోపం అవధులు దాటిపోయింది.

"స్కౌండ్రల్స్!" అన్నాడు.

"రోగ్!" అని ఇంకా గట్టిగా అన్నాడు.

"డర్టీ ఇడియట్ ఫెలో" అని అరిచాడు. అన్నీ సాంబశివరావు మీద గురి చూసి.

"నన్నేనా" అన్నాడు సాంబశివరావు ఆశ్చర్యంగా.

"అవును" అన్నాడు దృఢంగా ప్రసాద్.

"ఎందుకలా తిడతావు?" అన్నాడు కోపం ఆపుకుంటూ సాంబశివరావు.

"ఎందుకా? శారద మీద అభాండాలు వేస్తావా? ఏం? నువ్వు చెప్తోన్నది నాకు తెలీదనుకున్నావా? కాస్త అందంగా వున్న ఆడది నలుగురి మధ్య వుద్యోగం చేస్తే ఆమె మీద లేని పోని అపవాదులు వేస్తార్రా మీరందరూ?" అన్నాడు రొప్పుకుంటూ ప్రసాద్.

సాంబశివరావు మాట్లాడలేదు. అతను కొంచెం మెతక మనిషి, ఏడుపు వొచ్చేస్తోందిలా వుంది.

"నాకు శారద మీద అనుమానం కలగాలనేగా?" అన్నాడు రెట్టించి ప్రసాద్ కోపంలో అతని కాలు సలుపుతోంది.

"అనుమానమా?" అన్నాడు సాంబశివరావు – అతనికి ఏడుపులాటి నవ్వొచ్చి నవ్వేడు.

తెల్లబోయి చూశాడు ప్రసాద్.

సాంబశివరావు ఆగలేదు. "అనుమానమా!" ఈ ఊళ్ళో ఆమె విషయంలో అనుమానం ఎవ్వరికీ లేదు బ్రదర్!" అని ప్రసాద్ ముఖంలో రిలీఫ్ చూసి "అంతా అందరికీ తెలిసిందే! ఇందులో ఎవరికీ అనుమానం దేనికీ?" అన్నాడు. అని వెంటనే వెళ్ళిపోయాడు.

ఇంకేం చెయ్యలేక ప్రసాద్ రిక్షాలో ఇంటికి చేరేడు.

అవమానం!

అనుమానం లేదుట!

అయితే అందరికీ తెలుసున్నమాట, తనకి తప్ప!

ఇవేళ అటో, ఇటో తేల్చేయాలి!

సిగరెట్ వెలిగించాడు.

ఆమె డబ్బుతో కొని ఇచ్చినది! కాని మానలేకపోయాడు.

సాయంత్రం దాకా అలాగే సిగరెట్ కాలుస్తూ, టీ తాగుతూ కాఫీ కావాలని అరుస్తూ, సిగరెట్ తాగుతు ఎదురు చూశాడు.

ఆ రోజు తొందరగా వచ్చింది శారద.

“ఇవేళ – “ అన్నాడు ప్రసాద్.

“పని త్వరగా అయింది. మా డైరెక్టరు సెలవుపెట్టేడు” అంది శారద.

ఆమె రెండు మెట్లెక్కేడ “నీతో మాట్లాడాలి” అన్నాడు.

ఆమె వెనక్కి తిరిగి అతని మాటలు విని మళ్ళీ సాగిపోయి గంట తరువాత కిందకి వచ్చింది.

ఎంత అందంగా వుంది!

ఎంత అమాయకంగా ఉంది!

ఊరంతా అంటే, అంతేనా?

“ఏమిటి?” అంది శారద.

“నిన్ను గురించి అందరూ ఏమిటో అంటున్నారు.” అన్నాడు ప్రసాద్ లేని ధైర్యంతో.

“ఏమనీ?” అంది శారద చిరునవ్వుతో వెన్నెలలాగా.

“అదే – నువ్వు...”

“చెప్పండి ...”

“నువ్వు ....” నానిపోయాడు ప్రసాద్.

“నేను ఎవరితోనో తిరుగుతున్నారని – అదే మల్లిక్ మా డైరెక్టరుతో వుంటున్నానని” అంది శారద.

తేలికపడ్డాడు ప్రసాద్.

“అవునవును” అన్నాడు.

"అయితే?" అంది శారద.

"అదే ..."

"మీకూ నమ్మకం వుందా?"

"అంటే ... అందరూ .."

"వాళ్ళందరూ నన్ను పెళ్ళాడలేదు – మీ ఒక్క మాటా వేరు."

నెలల తరబడి నిలవవున్న బాధలన్నీ జ్ఞాపకం వొచ్చాయి అతనికి , అనుమానం – అనుమానం పీడించుకుని తినేస్తోన్నది.

"నిజం చెప్పాలంటే ... " అన్నాడు ఆమెని చూస్తూ. ఎంత బాగా ఉన్నాయో ఆమె పెదవులూ, బుగ్గలూను.

"నిజమే చెప్పాలి" అన్నాయి చక్కని పెదవులు ఎప్పటికన్నా, ఎర్రగా, నిండుగా ఉన్నాయి.

"నేనూ మనిషిని – మానవుడినికనక .. అలాగే అనుమానించాను" అన్నాడు ప్రసాద్ ఆమె కళ్ళు ఎర్రబడలేదు. అందులోకి ఆర్ద్రత రాలేదు. వాటి కోసం చూసి నిరాశపడ్డాడు ప్రసాద్.

శారద కిటికీలోంచి చూస్తోంది.

అతను శారదని చూస్తున్నాడు.

నాలుగైదు నిమిషాల లాగే – ఆ తరవాత

"నిజం చెప్పు శారదా!" అన్నాడు ప్రసాద్.

జాలిగా చూసింది శారద.

"నిజం చెప్తే భరించే శక్తి వుందా?" అంది.

తృళ్ళిపడ్డాడు ప్రసాద్.

"నేనూ మనిషినే ! ... డబ్బుకోసం ఒక జబ్బు మనిషికి భార్యని అయ్యాను. కాని, నాకూ, కోరికలూ, కలలూ వుంటాయి వున్నాయి. తీరుతున్నాయి" అంది.

"నువ్వు – నువ్వు–" అని లేచాడు ప్రసాద్.

"గాబరా వొద్దు. కాలునొప్పి ఎక్కువౌతుంది" అంది శారద.

"అయితే మన సంసారం పూర్తి అయిందన్న మాట" అన్నాడు ప్రసాద్ ఆవేశంగా.

"అది ఎప్పుడో అయిందనుకున్నాను" అంది శారద.

"నీకు సిగ్గులేదా?" అన్నాడు దహించుకుపోతూ ప్రసాద్.

"దేనికీ? నేను కట్నం పుచ్చుకుని ఒక కుటుంబాన్ని నాశనం చెయ్యలేదు! జబ్బు మాట దాచి పెళ్ళి చేసుకుని ఒక ఆశాజీవిని నిరాశకి బలి ఇవ్వలేదు – దేనికీ నాకు సిగ్గు?" అంది.

పెద్ద లెక్చరివ్వాలని ఉన్నా, గొంతుక పూడిపోయింది ప్రసాద్ కి.

"మనకింక చెల్లు" అన్నాడు.

"రైట్" అంది శారద.

"ఇవాళే వెళ్ళిపోతాను! ఇంత అవమానకరమైన పరిస్థితులో ఒక వ్యభిచారితో – నేను కాపురం చెయ్యను" అన్నాడు.

"చెయ్యొద్దు" అంది శారద.

"ప్యూన్! ప్యూన్!"

రంగా వొచ్చాడు.

"నా బట్టలన్నీ సూట్ కేసులో పెట్టు" అన్నాడు ప్రసాద్. చాలా కాలం తరవాత అతనిలో శక్తి వొచ్చింది.

రంగాలోనూ వొచ్చినట్టుంది.

పెట్టి పది నిమిషాల్లో తయారైంది. మరో చేతిసంచి కూడా.

"మళ్ళీ వస్తాననుకోకు" అన్నాడు రంగాని రిక్షాకి పంపి.

"అనుకోను.." అంది శారద.

"నువ్వు చేసిన దానికి ధన్యవాదాలు"

"వెళ్ళడం ఎక్కడికి?" అంది శారద ఉద్రేకాల ఆకాశం నుంచి వాస్తవమైన క్రిందికి తెస్తూ.

"ఎక్కడికో! నీ కెందుకు?"

"ఏం లేదు పాత ఇంటి తాళాలిస్తాను. అక్కడ ఉంటే నాకూ ఉపయోగం! రంగా ఉంటాడు కావలిస్తే"

"నీ దానధర్మాలు నాకక్కర్లేదు"

"దానం లేదు. ధర్మం లేదు. ఇల్లు పాడుబడి వుండడం ఇష్టం లేదు .. పోనీ .. కష్టమైతే వద్దు" అంది శారద.

రిక్షా ఒచ్చింది.

సామానులు ఎక్కేయి.

"ఎక్కడికండీ?" అన్నాడు రిక్షావాడు, కొంచెం ఆలోచించి, శారద దగ్గరకి వెళ్ళి, "సరే! తాళాలిలా పడెయ్యి" అన్నాడు.

లోపలికెళ్ళి శారద తాళాలు తెచ్చి ఇచ్చింది.

మంచి వాసన వేస్తోంది శారద.

"ఇదీ దగ్గర వుంచుకుంటే పనికొస్తుంది."

కవరు.

తెల్ల కవరు.

కొంచెం బరువుగావుంది. ఉత్తరం కాదు.

విప్పి చూస్తే డబ్బు, రెండో మూడో వందలు.

"నాకెందుకు?"

"ఖర్చులకి .. మరీ అంత అవసరం వొస్తే రంగా చేత కబురు పెట్టవొచ్చు."

కవరు విసిరేద్దామనిపించింది. కాని, ఈ రాత్రి భోజనం – సిగరెట్ – పొద్దుట కాఫీ –

ఎత్తిన చెయ్యి నెమ్మదిగా దిగింది. కవరు జేబులోకి వెళ్ళింది.

రిక్షా కదిలింది. గాలి చల్లగా వేస్తోంది.

పాప వంకిలంలో నుంచి మలయమారుతం లోకి వొచ్చినట్టు అనిపించింది ప్రసాదుకి రెండు నిమిషాలు.

ఆ తరువాత జరిగినదీ, విన్నదీ అంతా జ్ఞాపకం వొచ్చింది. కళ్ళు మండేయి. చెమర్చేయి.

ఏమీ కనిపించనంతగా తడిసిపోయాయి.

★★★★★★★★★★★★

అది అవమానం; అది నిరాశ; అది అభిజాత్యం. అన్నీ – కాని ఏదీ కాదు.

రిక్షా ఆగి, చీకటింటిలో అడుగు పెట్టగానే అతనికి బాధ కలిగింది.

ఎంత పొరపాటు చేశాను అనుకున్నాడు.

అవును.


పొరపాటు.

శారదని అలాగ నిలదీసి అడగాల్సింది కాదు.

# ఉత్తరాల మంట

## యస్. ఆర్. చందూర్

### (1978 – సెప్టెంబర్ ఆంధ్రజ్యోతి మాసపత్రిక నుంచి)




ప్రతి ఆదివారం వసుంధర ఏదో ఒక కొత్త కార్యక్రమం తలపెడుతుంది, ఈ గదిలో టేబుల్ ఆ గదిలో పెట్టడం, ఆ మూలనున్న ట్రంకు పెట్టెలు ఈ మూలకి మార్చడం, ఉత్తర దక్షిణాలుగావున్న పడకమంచాన్ని తూర్పు పడమరలుగా తిప్పడం, ముందు గదిలోవున్న పుస్తకాల బీరువా వెనక గదిలోకి ఫిరాయించడం – ఏదో ఒకటి! ఆదివారం ఉదయం వేళ వసుంధర ఎప్పుడూ స్తిమితంగా కూచోదు. ప్రతిసారీ జగన్నాధం మార్పుని మొదట్లో హితవుగా చూడక ఏవో కుంటికారణాలు చెబుతాడు. ఆఖరికి వసుంధర చెప్పింది అక్షరాలా ఆమోదించి, ఆరు రోజులూ గృహకృత్యాలు నిర్వహించిన ఎడ్యుకేటెడ్ గృహిణికి ఏడోరోజున తనకి చేతనైన సాయం తను చేస్తాడు.

జగన్నాధానికి రోజూ యింగ్లీషు వార్తలొచ్చే వేళకి (అనగా ఎనిమిది గంటలకి) నిద్దరలేవడం అలవాటు. ఆదివారాలు మాత్రం కాస్త బద్ధకించి తొమ్మిదిన్నరదాకా పక్కమీద దొర్లుతూ వుంటాడు. ఈ లోగా వసుంధర రెండు తడవలై నా మేలుకొలుపులు పాడుతుంది. పాలవాడూ పనిమనిషీ లేకపోతే తనూ పదిగంటలదాకా మహారాజులా పడుకునేదాన్నంటుంది.

మద్రాస్ వచ్చిన ఆరేళ్ళబట్టీ, వసుంధరా జగన్నాధాల ఆదివారాలు బహురమ్యంగా నడుస్తున్నాయి. ఉదయం పదకొండున్నరదాకా యిల్లు సద్దుకు, దుమ్ము దులుపుకోడం. ఈ తతంగంలో పనిమనిషి కూడా సాయంగా ఉంటుంది.

అవసరమైతే, తరవాక జగన్నాథం విధిగా అభ్యంగన స్నానం చెయ్యాలి. మారాంచేస్తే వసుంధర వూరుకోదు. ఆరురోజులు ఆఫీసులో పనిచేసి వచ్చిన తర్వాత, ఏడోనాడు వంటికీ మాడుకీ దిట్టంగా నూనె పట్టించి తలనిండా వేన్నీళ్ళ స్నానం చెయ్యకపోతే కళ్ళుమంటలూ, తలనొప్పి వస్తాయంటుంది వసుంధర. మొదటిరోజుల్లో జగన్నాథం కాస్త మొరాయించేవాడుగాని తరవాత్తరవాత ఆత్మసమర్పణ చేసుకున్నాడు. స్నానానంతరం పాయసంతో భోజనం.

మధ్యాహ్నం టిఫిన్ కి – ఆవడలో, పులిహోరో, మినపసున్నో, కారపుగారెలో – ఫక్తు తెలుగువంటకం తయారు చేసేది వసుంధర. ముందుజాగర్తగల మనిషి కనక జగన్నాథం శనివారం సాయంత్రమే ఆదివారం మొదటాటకి సినీమా టికెట్లు కొని తెచ్చేవాడు. టీ అనంతరం భార్యాభర్తలు సినీమాకి వెళ్ళేవారు. మళ్ళీ సోమవారం ఉదయం నుంచీ జగన్నాథానికి ఆఫీసూ, వసుంధరకి యిల్లు. ఇన్నేళ్ళబట్టి కాపరం చేస్తున్నా వసుంధకకి పిల్లలు కలగలేదు: జగన్నాథానికి తనకి సంతానం లేక పోయిందనే చింత లేదు.

ఆ ఆదివారం ఉదయం వాలుకుర్చీలో కూచుని, గడిచిన రాత్రి విన్న వార్తలు పత్రికాముఖంగా చదువుతున్నాడు జగన్నాథం. తలంటికింకా గంట టైముంది. వసుంధర వంటింట్లో ఉంది. చుయ్ మంటున్నాయి. గారెలో బూరెలో కాని, కొరియా ప్రజల గురించి మనసులో వాపోతున్నాడు జగన్నాథం.

“ఏమండోయ్, యిలా వస్తారూ !" వంటింట్లోనుంచి ఆజ్ఞాపూర్వకమైన ఆహ్వానం.

జగన్నాథం భుజంమీద తువ్వాలేసుకుని, పేపరు చేతబుచ్చుకుని వంటగదిలోకి వెళ్ళాడు.

"చూడండి —— ఈ కబ్బోర్డ్ యిటు పక్కగా జరిపి, బొగ్గులబస్తా ఆ మూల పెడితే, కుళాయి తిప్పుతున్నప్పుడు నీళ్ళు బొగ్గులమీద చిందవు."

ప్రస్తుతం కుళాయినీళ్ల వల్ల బొగ్గులు తడుస్తున్నాయా అని జగన్నాథం అడగదలుచుకోలేదు. అదంతా హోమ్ డిపార్టుమెంటుది.

"అయితే బొగ్గులబస్తా ఆ మూలపెట్టమన్నావా?" అని అడిగాడు. ఆదివారాలు అలాటి పనులకి అలవాటుపడ్డ జగన్నాథం.

“ మీరు మోస్తారుటండీ బొగ్గులబస్తా! బట్టలు మసై పాడుపాడుకావూ: మధ్యాహ్నం పనిమనిషి చేత పెట్టిస్తాను. మీ సలహా అడుగుదామని పిల్చాను. "

జగన్నాథం వసుంధర ఆలోచన భేషుగ్గా ఉందన్నాడు.

“ఏమిటా మర్చిపోయిందని పొద్దుట్నుంచీ యిదవుతున్నాను. తోలు పెట్టెలోవున్న ఉత్తరాలకట్టలు బయట పారెయ్యండి. అవి మంటబెట్టి మీకు వేన్నీళ్లు కాస్తాను. ఉత్తరాలతో యిదో గొడవ. అవి ముక్కలుగా చించి వీధిలో పారేసేందుకు వీల్లేదు. ఇరుగూ పొరుగూ ఆ ముక్క లేరుకు చదువుతారేమోనని భయం. అయినా వెధవ ఉత్తరాలు.

ఎందుకాచెత్త? మనం పట్నంలో ఉంటున్నామేగాని మనది పట్నవాసపు కాపరంకాదు. ఇంటినిండా చెత్తాచెదారం పోగుచేస్తారు. ఎందుకు చెప్పండి పన్నెండేళ్ల కిందటి ఉత్తరాలు? "గుక్క తిప్పుకోకుండా ఒక భారతం చదివింది.

" కాని ...."అన్నాడు జగన్నాధం.

“కానీ లేదు. అర్ధణాలేదు. రేపు మా మామయ్యగారింటికి పెళ్ళికెళ్లేందుకు నాకు పెట్టెలేదు. తొరగా ఖాళీ చేద్దురూ – మీకు పుణ్యముంటుంది." అన్నది.

"పెట్టె ఖాళీ చేస్తాను. కాని ఉత్తరాలు పరశురామప్రీతిచెయ్యడమెందుకు? ఎక్కడో ఒకచోట కట్టకట్టిపారెయ్, ఎంతైనా ..... ఉత్తరాలు!" అని సమాధానపరచబోయాడు జగన్నాధం.

“నాలిక గీసుకుంటారా! అందుకూపనికిరావు. వెనక ఆ అలమారులో పుస్తకాలు పెడితే, ఏమయాయో చూశారుగా! చెదపురుగులకి సమర్పించే బదులు ఒక కాగెడు నీళ్ళు కాచుకోడం మంచిది కాదూ?"

జగన్నాధం బిక్క మొహం పెట్టాడు. వసుంధరకి నిజంగా దుర్బుద్ధి పుట్టింది. ఇంట్లో కట్టెపుల్లలుండగా పాత ఉత్తరాలు కావల్సివచ్చాయా నీళ్ళు కాచేందుకు? దహనకాండలో తను తటస్తంగా వుండగోరి, వాలుకుర్చీలోకొచ్చి కూచున్నాడు జగన్నాధం. చటాలున జీన్ క్రిస్టోఫర్ జీవితఘట్టమొకటి స్ఫురణకివచ్చింది.

రోమెన్ రోవా సృష్టించిన జీన్ క్రిస్టోఫర్, రీన్ హార్టు దంపతులకు స్నేహితుడవుతాడు. ముగ్గురి మధ్యా అరమరికలు ఉండవు. కాని, ఊసుపోని ఊళ్ళవాళ్ళకి వీరి పవిత్రబాంధవ్యం గిట్టక, రీన్ హార్టు సతీమీద అపవాదు కల్పించి, ఆకాశరామన్న ఉత్తరాలు ముగ్గురికీ రాస్తూంటారు. ఎవరికివారు మిగతా యిద్దరికీ ఎలా చెప్పడమా అని మధనపడి ఒక రోజున కుండ బద్దలుకొడతారు. ప్రజలు చల్లిన కల్మషంవల్ల వీరి స్నేహలతకప్పుడే పురుగుపట్టింది. "ఆ ఉత్తరాలు విప్పకుండా పొయ్యిలోకి గిరవాటు వేసే ఆత్మబలం మనకి లేక పోయింది. కనక విడిపోదాం" అంటూ క్రిస్టోఫర్ తప్పుకుంటాడు.

జగన్నాధానికి క్రిస్టోఫర్ అంశ ఏ మాత్రమూ లేదు. అతని శక్తిలో సహస్రాంతం కూడా లేదు. కాని ఉత్తరాలు కాల్చడం గురించి ఎప్పుడు ఎక్కడ విన్నా, ఈ ఘటన బుర్రలో మెదులుతుంది. వసుంధర చుంయ్ మనిపించడం పూర్తిచేసి, తన దగ్గరకొచ్చినప్పుడు ఈ కథ చెప్పాడు జగన్నాధం.

"నిజమె – లోకులు కాకులు. క్రిస్టోఫరు ఎంత గొప్పవాడు !" అంది వసుంధర. శ్లాఘించడం పూర్తయిందో లేదో, “ఉత్తరాలకట్టలు యింకా బయట పడెయ్యలేదేం?" అంది.

జగన్నాధం వివర్ణుడయాడనొచ్చు: నిశ్చేష్టుడయాడనొచ్చు; కత్తివాటుకి రక్తపుచుక్క లేదనొచ్చు. ఈలోగా ఉత్తరాలకట్టలు సతీమణి పెల్లగించింది.

వసుంధరకెందుకో ఆ ఉత్తరాల్లో దాచుకోదగ్గ పరిమళం లేదని నమ్మకం. జగన్నాథం తనను పెళ్లాడటానికి పూర్వం కమల, విమల అను యిద్దరు అమ్మాయిల్ని ప్రేమించాడు. వాళ్లిద్దరూ అప్పాచెల్లెళ్లు కారు. కమలని ప్రేమించి, ఆ ప్రేమలో పల్టీకొట్టి, కమలని మరిచేందుకు విమలని ప్రేమించి, అగ్గిబరాటాలాటి విమలని పెళ్లాడే ధైర్యంలేక తనకోసం చెయ్యి చాచాడు. వసుంధరకి కమలా విమలల చరిత్ర తేదీలతో సహా తెలుసు. కాపరానికొచ్చిన కొత్తరికంలో జగన్నాథం తన రోమాన్సులు రోజుకుంటూ రోజుకుంటూ చెబుతున్నప్పుడు తను కొద్దిగా ఈర్ష్యపడేది. అదైనా గడిచిన దానికోసం కాదు. భర్తకి ముందెన్నడూ చపలత్వం కలగకూడదని.

కాస్త తెలివిగల ఆడదాని చెప్పు చేతల్లో మసులుకునేందుకు జగన్నాథం లాటిమనిషి యిట్టే వొప్పుకుంటాడు. జీవితంలో నిస్సారత ఏర్పడి స్మృతుల మీద బతికేకాలంలో, ఒక్కొక్క సాయింత్రం జగన్నాథం కమలా విమలల రోమాన్సు నేమరేస్తూంటే వసుంధర వోపిగ్గా వినేది. 'అనగా అనగా రాజు – ఆ రాజుకి ఏడుగురు కొడుకులు' అంటూ కొడుకు కథ చెబుతూంటే తల్లి ఎంత నిదానంగా వింటుందో, అలా వినేది. భార్యల్లో ఈ మాతృత్వపు ఛాయే లేకపోతే మొగాళ్ళు బతకగలరా?

కమలా విమలలు జగన్నాథానికి ఉత్తరాలు రాయలేదు. ఆ విషయం వసుంధరకి స్పష్టంగా తెలుసు. ఈ యిద్దర్నీ కాక జగన్నాథం మరొక స్త్రీని కన్నెత్తి చూసివుండడు. అలాటి చిల్లర ప్రణయమేదైనా జరిగివుంటే, యింత కాలం తనతో చెప్పకుండా దాచగలడా?

1935 నుంచి 1944 దాకా సంవత్సరాల ప్రకారం కట్టలు. ఎవరెవరో ఎక్కడెక్కడివాళ్లో రాసినవి. ఆ మనుషులిప్పుడెక్కడున్నారో ఏమయారో తెలీదు. పెద్ద పెద్ద ఉత్తరాలు, జగన్నాథమూ రాసేవాడు, వాళ్ళూ రాసేవారు. తాము చదివిన పుస్తకాలూ, చూసిన తమాషాలూ, తిరిగిన ప్రదేశాలు. జీవితాదర్శాలపట్ల తమ అమూల్యాభిప్రాయాలూ యిలాటివన్నీ రాసుకునేవారు. జీవితం మారుతుంది; అభిప్రాయాలు మారుతాయి. మనుషులు మారుతారు; కాని స్మృతులు చెరక్కుండా నిలుస్తాయి.

వసుంధర కట్టలు జగన్నాథం ముందు పెట్టింది. అక్కడక్కడ కొన్ని మచ్చుకి తీసిచూడటం మొదలెట్టాడు జగన్నాథం. ముప్ఫయిల్లో తను ఎన్ని ఘనకార్యాలు చెయ్యగలనని అనుకున్నాడు. 1938 లో ప్రపంచం మీద ప్రేమ, మనుషులపట్ల సహనం, బాధితులందే కరుణ – ఏ స్త్రీకీ తను అందకుండా పెద్ద పెద్ద డిగ్రీలు సంపాయించి, యింగ్లండూ అమెరికా వెళ్లి వచ్చి ... అబ్బో చాలా చేదామనుకున్నాడు. కలలన్నీ పూస్తాయా? లోకాన్ని ఉద్ధరించాలనే తపన ఒక పక్క పీకుతూంటే, 'నిన్ను నువ్వు తెలుసుకో' అనే తత్వం మరోపక్కకి లాగేది ఆ రోజుల్లో.

భార్యాభర్తలిద్దరూ కాసేపు ఉత్తరాలు చదువుకు జ్ఞాపకాలు నమిలారు. ఈ ఉత్తరాలన్నీ జగన్నాథం వికసిత జీవన ప్రధమదశకి ప్రతిబింబాలు. అప్పుడప్పుడు వసుంధర ముడతలుపడే జగన్నాథం నుదుటిమీది చెమటబొట్లు చూసి తనీ

ఉత్తరాలకట్టలు మంటబెడతాననే మంకుపట్టుపట్టడం పొరబాటా అని సందేహించేది. కాని వసుంధరలాటి ఆడవాళ్ళు తాము తలబెట్టిన పని చేసి తీరుతారు. తమది తప్పని రూఢి ఐతే మూడు రోజులపాటు ఏడవనన్నా ఏడుస్తారుగాని, ప్రారంభించిన పని మధ్యలో ఆపరు.

జగన్నాధం బతిమాలినా, వద్దని ఘట్టిగా అన్నా, వసుంధర ఉత్తరాలు మంటబెట్టి నీళ్ళుకాచడం మానేది. కాని జగన్నారం అలా అడగడు. వసుంధర వాదంలో తనకి బాధ కలిగించే నిజం ఉందని భావించాడు. "పాత గుడ్డలు పారేస్తాం, పాత వస్తువులు పారేస్తాం. పాతపత్రికలు పారేస్తాం. కాని ఎందుకూ కొరగాని పాత జ్ఞాపకాలు ఆ తోలు పెట్టెనిండా ఎందుకు?" అని అడిగింది, వసుంధర. సర్జన్ రోగి మంచికే కోస్తాడు; కాని, ఏడవకుండా రోగి ఉండగలడా?

ఆ ఉత్తరాలమంట చూస్తున్నంత సేపూ జగన్నాధావికి కళ్ళు చెమర్చడమే కాదు. కన్నీళ్లు కూడా కారాయి. వసుంధర చూస్తుందేమోనని సిగ్గుపడ్డాడు. నీళ్ళు సలసలకాగాయి. అభ్యంగన స్నానం సమాప్తి అయింది.

పాయసం వడ్డిస్తూ వసుంధర అంది! “ఏమండీ మీకు చిన్నప్పుడెప్పుడైనా భోగిపళ్లు పోశారా మీ అమ్మగారు?" అని.

“ఏం. నీకు పొయ్యాలని ఉందా?"

"అందుకు కాదు, ఆ ఉత్తరాలమంట చూస్తున్నంత సేపూ నాకు భోగిమంటలు జ్ఞాపకం వచ్చాయి."

వసుంధరకి భోగిమంటలెందుకు జ్ఞాపకంవచ్చాయో జగన్నాధం అడగనూలేదు, ఆమె చెప్పనూ లేదు.

ఆదివారంనాటి ప్రోగ్రాం ప్రకారం నాలుగు గంటల వేళ కారపుగారెలు తిని సినీమాకి బయలుదేరారు.

సీజర్ అండ్ క్లియోపాత్రా పిక్చర్లో ఐగుప్తీయ పండితుడు థియోడిటస్ అలెగ్జాండ్రియా గ్రంథాలయం కాపాడమని సీజర్ కాళ్ళా వేళ్ళాపడతాడు. మనుషులు పుస్తకాలసాయంతో కలలు కనడం మాని జీవించాలనీ, భూతకాలపు బూడిదలో నుంచి భవిష్యత్తు మొలుస్తుందనీ పలికే రోమన్ వీరుడికి బర్బరులచరిత్రలు తగలబడటం ఒక లెఖ్ఖా – తన సేనలు సంరక్షించుకోవాలిగాని! “పాతవన్నీ తగలడవల్సిందే' అంటాడు సీజర్.

అప్పుడు వసుంధర జగన్నాధం చెయ్యి తన చేతిలోకి తీసుకుని వేళ్లు నొక్కింది. ఒక్కసారి తలపక్కకి తిప్పి జగన్నాధం భార్యని చూశాడు. చెంపలు తళతళలాడుతున్నాయి. కాని ఆమె మనసంతా పిక్చర్ మీదనే!

ఆ రాత్రి జగన్నాధానికి వసుంధరలో ఎన్నో కొత్త అందాలు కనిపించాయి.

# అదృష్టవంతులు

## నార్ల చిరంజీవి

## (1969 – మే యువ మాసపత్రిక నుంచి)




జాస్మిన్ "సోప్ కంపెనీ' ఆఫీస్ గది గోడకి టైపిస్టు కుమారి మేరి సరికొత్త బొమ్మల కేలండర్ తగిలిస్తుంది, చూస్తూన్న మగగుమస్తాలు ముకుందం, మోహన్ ఇద్దరి గుండెల్లో నెత్తురు గోదారి వెల్లువలా పొంగింది. తమ అదృష్ట గీతాన్ని మౌనంగా పాడేసుకున్నారు. మూడు షీట్ల కొత్త కేలండర్ లో పైన దిలీప్ కుమార్, నడుమ సాధన, చివర దేవానంద్ వర్ణ చిత్రాలతో చూడముచ్చటగా ఉన్నారు.

మేరీని సాధనగా, తమని దిలీప్, దేవానంద్ లాగా ఊహించుకుని మగ గుమస్తాలు తెగ మురిసిపోయారు! ఇద్దరు మగాళ్ళ మధ్య ఓ అందాల పడుచు! ఆఫీస్ మొత్తం జాస్మిన్ పరిమళాలు నిండి మత్తెక్కించాయి.

సోప్ కంపెనీ యజమాని పరంధామయ్యగారు. ఈ స్వతంత్ర భారతం సృష్టించిన ఇంద్రజాలికుల్లో వీరోకరు!! రాజభవన్ రాజమార్గంలో ఆరంతస్తుల భవనం మొదలెట్టి, అద్దెలకెగబడ్డ వాళ్ళ నించి అడ్వాన్స్ లు గుంజి మరో రెండంతస్తులు పూర్తి చేశాడు. ఈ ఎనిమిదంతస్తుల భవనం ఆయన భార్యామణి పేరుతో ఉంది. ఆయనకున్న భారీ వ్యాపారాల్లో చిన్నదీ, చిన్నదాని లాంటిది ఈ సోప్ కంపెనీ. సోప్ ఫ్యాక్టరీ నగరం చివర కోటలాంటి తోటలో ఉంది. ఆఫీస్


మాత్రం ఎనిమిదో అంతస్తు చివరగదిలో ఉంది. ఆఫీస్ మొత్తానికి ఇద్దరే మగ గుమస్తాలు, ఒక ఆడటైపిస్టూ, పరంధామయ్యగారు అడపాతడపా ఆఫీస్ కొచ్చేవారు. ఉన్న అయిదు నిమిషాల్లో లెక్కాడొక్కా చూసుకోడంతో సరిపోయేది. గుమస్తాలు ముగ్గురిలో ఆఖరికి ఆడామగా తేడా కూడా ఆయనకి కనిపించేది కాదు! నెలజీతాలకి తాను కొన్న ముడిసరుకులుగానేచూసేవాడు!

ఒక వారం అటూఇటుగా ముకుందం, మోహన్, మేరీ ఉద్యోగాల్లో చేరారు. చేరిన మొదట్లో చివర అంతస్తు చివరి గది కిటికీలవద్ద నించుని ముగ్గురూ మహానగరాన్ని తనివితీరా చూసేవారు. ఇలాంటి అవకాశం, అదృష్టం తమకు లభించినందుకు పొంగిపోయేవారు. జనతా ఎక్స్ ప్రెస్ లాగా కింద అంతస్తుల్లో కిటకిటలాడే జనాన్ని చూసి నవ్వుకొనేవాళ్ళు. వాళ్ళందరివీ ఏడ్పుగొట్టు మొఖాలు! తమ ముఖాలు మాత్రం అదృష్ట దేవత వెలిగించిన దీపాలు!

“మనం అదృష్టవంతులం” అని అన్నాడు ముకుందం. “నూటికి కోటికి దక్కవలసిన అదృష్టం మనకు దక్కింది "అని అన్నాడు మోహన్. మేరీ చిరునవ్వు నవ్వింది. ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది.

" ఇక్కడ, ఇలా మీతో కలిసి పని చేస్తున్న నాదే అసలు అదృష్టం!" గోముగా అంది. మగ గుమస్తా లిద్దరికి వొళ్ళు ఝల్ మంది.

టైపిస్టు మేరీ కుడి వేపు కుర్చీలో కూచుని ముకుందం కాతా పుస్తకాలతో కయ్యం చేస్తుండేవాడు. ఎడం సేపు కుర్చీలో కూచుని మోహన్ ఆఫీస్ తాలూకు పనితో ఫుట్ బాల్ ఆడుతుండేవాడు. ఇద్దరి నడుమా కూచుని మిస్ మేరీ నాజూకు వేళ్ళతో టైప్ రైటన్ని సున్నితంగా కదిలించేది. కాగితం వొయ్యారంగా వెనక్కి జరిగేది. మగాళ్ళిద్దరికి రాను రాను మధ్యనున్న కుర్చీ సెంట్రల్ పాయింట్ అయింది! వారాలు గడిచి' నెలల్లో కాలం కదిలేసరికి, తెలుగు సినిమాకి నకలుగా ఆ ముగ్గురి మధ్యా కొంటె చూపులు దొంగ చూపులు చిలిపి చూపులు అల్లరి చూపులు దోబూచులాడి చివరకు చెడుగుడి వరసలోకి దిగాయి.




జస్మిన్ సోప్ కంపెనీ ఆఫీస్ లో ఇలా మొదలైన ఆ ముగ్గురి నేస్తం సినిమా కథలా నెలజీతాలు చేతికి రావడంతో కొత్త మలుపులు తిరిగింది. తిరపతి ఘాట్ రోడ్ లాగా నేస్తాల దారి వింత అనుభూతుల్ని రగిలించింది. ఒకరికి తెలీకుండా ఒకరు మేరీ ఆర్థికావసరాల్ని తీరుస్తూ భుజాలు కాశారు. బస్సు టిక్కెట్లతో ఆదుకొన్నారు. కాఫీ ఖర్చులు భరించి పాదుకొన్నారు. సినిమా సరదాలు తీర్చి చేదుకొన్నారు.

ఒక్క చేతిమీద ఎనిమిది మందిని పోషించవలసిన పాపానికి ఒడిగట్టిన చిన్నారి మేరి కి, ఈ మగగుమస్తాల లాభం లేదు. ఔదార్యంవల్ల సగం బెంగ తీరింది! చార్ మీనార్ కి దగ్గర్లో ఎండా వానా

వియ్యమాడే కొంపలో బతుకుతూ, తన యౌవనమే తనకు బద్ధశత్రువుగా పరిణమించిన వయస్సులో, కుక్కలు చింపిన విస్తరి లాంటి తన కుటుంబానికి కుట్టుదుపుల్లలా ఉపయోగపడుతూ, మనసిచ్చి పుచ్చుకొన్న జాన్ కి కోరికల్ని వడ్డించడానికి విస్తరి వేయలేక కుములుతూ, ఈ ఆఫీస్ లో చేరాక కాస్త

ఊపిరి పీల్చుకుంది!

జూన్ అంటే మేరీ దూరపుబంధువు. ఏదో ప్రైవేట్ కంపెనీలో చాలీచాలని జీతం తెచ్చుకుంటున్నాడు. జీతాలు చాలవని కోరికలు చస్తాయా? మేరీ జూన్ ఈ పాటికే డ్రీమ్ లాండ్ లో ఉండేవాళ్లే! కాని, ఈ దరిద్రం అనే విధి రాకాసికత్తులు దూసి ఇద్దరినీ చెరో ఒడ్డున నిలబెట్టింది. మంచిరోజు కలిసివొస్తే ఇద్దరూ వలపు వాగులోకి దూకేసి 'మల్లె పూలా పడవగట్టి' తేలిపోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. జాన్ ప్రియురాలికి సమర్పించుకొన్న చిరుకానుకల్లో, ఇదుగో ఈ బొమ్మల కేలండర్ ఒకటి. దాన్ని తెచ్చి మేరీ తనకి ఎదురుగా గోడమీద తగిలించింది. మగగుమస్తాల మనస్సుల్లో మధురజ్వాలల్ని రగిలించింది.`

మేరీ తన లేమిని ఏమాత్రం తెలియనీకుండా, అంటూ సొంటుపడని నాంపల్లి జాలపండులా నోరూరిస్తూ, తన రోజూ వారీ ఖర్చుల్ని కోరి, బతిమాలి భరించే ఆ మగగుమస్తాలిద్దరిమధ్యా, కులాసాగా పెదవులపై చిరునవ్వుల్ని చెరగనీకుండా కరగనీకుండా కాలక్షేపం చేస్తోంది. బండి నెట్టుకొస్తోంది!

ఎక్కౌంటెంట్ ముకుందం తెలివితేటల మేరీకి నిజమైన నమ్మకం గౌరవం చాలావుంది. ముకుందానికి. ఆమె హస్త వాసి మంచిదనీ, ఆమె ముఖం చూసి పని మొదలెడితే అది నూటికి నూరుపాళ్ళూ విజయవంతమవుతుందని సంపూర్ణ విశ్వాసం కలిగింది. ఆ నమ్మకం రోజురోజుకీ  పెరుగుతోంది. ముకుందం ఇప్పుడు మేరీకి హృదయంలో పీఠం వేసి కూచోబెట్టాడు. తన పాలిట అదృష్టదేవతగా ఆరాధించడం ప్రారంభించాడు.

ఈ సంగతి మేరీ గ్రహించ లేదనడానికి రుజువేదీ లేదు!


మోహన్ ఆఫీస్ నించి వెళ్ళిపోయిన ఒక సాయంత్రం ముకుందం మేరీని ఒక సినిమాథియేటర్ కి తీసుకెళ్ళాడు. పై తరగతి టిక్కెట్లే కొన్నాడు. మేరీ చాలా ఆనందించింది. ఇంగ్లీష్ పిక్చర్ని పై తరగతిలో కూచుని చూడ్డం సామాన్య విషయమా? పాపం మేరీ హృదయం ప్రతి చిన్న విషయానికి చిన్న పిల్లలా ఎగిరి చిందులు వేస్తుంటుంది. ముకుందం కళ్ళకి మేరి అందాల రాణి అయింది. చీకట్లో తన సరసనున్న మేరీ అప్సరసలా ఉంది. మూడు పదుల వయస్సుమించిన ముకుందని ఆ సమయాన శోభనపు పెళ్ళికొడుకులాగా "ఫీల్" అయ్యాడు.

తెరమీది కథలో మునిగిపోయింది మేరీ!

మేరీ చెవిదగ్గర జోరీగయ్యాడు ముకుందం!

"మేరీ .... మేరీ" గుసగుస లాడాడు ముకుందం!

'ఏం ముకుంద్?' అంది గోముగా మేరీ.




తననలా పిలవడంతో ముకుందానికి కిందా పైనా తెలీని మైకం కమ్మింది.

'చెరో మతస్తులమై పోయాం మేరి. ఈ దేశమే మతాల చట్రంలో నలిగిపోతోంది. లేకపోతే నువ్వూ– నేనూ– ఆ పైన ముకుందం వాక్యాన్ని పూర్తి చేయలేక వ్యాకరణ విరుద్ధంగా ఆపేశాడు. మోహమో, తలపో, దిక్కుమాలినది మరేదో అతని గొంతులో గురగురలాడింది. ఉక్కిరి బిక్కిరయ్యాడు.

అతని అవస్తకి జాలిపడింది కుమారి మేరీ.

జాబిల్లిలా చల్లగా అతని క్రాపుని సరిచేసింది

'ఔను ముకుంద్! నువ్వో ఇంటివాడివి కాకుండా ఉంటే, ముగ్గురు బిడ్డల తండ్రి కాకుంటే-- నువ్వూ-నేనూ ... ' మేరీ కూడా వ్యాకరణం వదిలేసి వాక్యాన్ని ఆపేసింది. మేరిగొంతులో ముకుందంమీది

అనురాగం ఐస్ క్రీమ్ లాగా జిల్ జిల్ మనిపించింది పాపం!

మేగి ధర్మ సందేహాలు విన్నాక ఎయిర్ కండిషన్ థియేటర్లో కూడా చెమటలు పోశాయి ముకుందానికి!

ఇంతలో తెరమీది కథానాయకుణ్ణి విలన్ ఎడా పెడా రెండు వాయించి కథానాయికను ఎత్తుకుపోయాడు. వోవొళ్ళెరక్కుండా ఆ కథలో లీనమైపోయింది మేరి,

ముకుందానికి మరి సినిమా చూడబుద్ధి కాలేదు. కళ్ళు మండిపోతున్నాయి. తన స్థితిని అసహ్యించుకున్నాడు.

ఆఫీస్ లో చేరిన మొదట్లో మేరీకి ముకుందం తన కుటుంబ చరిత్ర మొత్తం చెప్పాడు. ఆ సంగతి జ్ఞాపకమొచ్చింది. ఆ రోజుల్లో పబ్లిక్ సింపతీ కోసం తెగ తాపత్రయపడ్డాడు. ఇవాళ కావలసింది అది కాదు. తను తెలివిగలవాణ్ణని మేరీ మెచ్చుకొంది. తన మాటని వెనుకాడకుండా మన్నిస్తుంది. నవ్వుతుంది. కలుపుగోలుగా నవ్విస్తుంది. హాయిగా తీయగా ఉంటుంది. ఇవాళ తనకు కావలసిందేమిటి? ఏదో కావాలి. అది మేరీ ఇవ్వాలి!

మేరీని చార్ మీనార్ బస్సు ఎక్కించి ఇంటి బయల్దేరాడు ముకుందం. పాముల పుట్ట లోకి పోతున్నా ననుకున్నాడు. చిక్కడపల్లి చివర్లో అద్దె కొంపలో మూడేళ్ళనించి పడివుంటున్నాడు. ఈ మూడేళ్ళల్లో ఇద్దరు పిల్లల్ని కన్న భార్య నిత్యరోగం పాలయింది. పెళ్ళాం పిల్లలు అతని రెక్కల్ని విరిచేసి ఇన్నేళ్ళూ కుదేసి కూచోపెట్టారు.

ఎనిమిదంతస్తుల మేడ ఎక్కిన రోజున అతని రెక్కలు మొలకలెత్తాయి. స్వంతంగా గాలిపీల్చాడు. కేలండర్ లో మొదటి కాగితం చిరిగేసరికి అతని రెక్కలు హైద్రాబాదు వెడల్పున పెరిగాయి. రెక్కలనిండా కుమారి మేరి కోసం మంత్ర-తివాచీ పరిచాడు. అక్కడ పెళ్ళాం పిల్లలకు సూది మొన మోపినంత చోటు లేదు!

ఆఫీస్ లో మేరి పక్కన కూచుని పనిచేయడం రోజురోజుకీ ముకుందం ఒడలంతా మగ తీవి అలుముకుంది, పులుముకుంది. మేరీ తనకో పారిజాతసుమం. తనపాలిటి తీయనివరం. మేరీ ఆనందానికి తనజీతం తరగనీ! "సతుల్ సుతుల్ రానీ పోనీ, చస్తే చావని!"

అతని ఆలోచనా ప్రవాహాన్ని తెగ్గొట్టారు పిల్లలు. కసురుకున్నాడు. రక్కసి మట్టలా పడివుంది భార్య. చీదరించుకున్నాడు. ఎయిర్ కండిషన్ థియేటర్లో కొనితెచ్చుకొన్న భోగంకాస్తా ఎగిరి ఇగిరిపోయింది. ముకుందం ఉసూరని నిట్టూర్చాడు!

ఒక వారం రోజులుగా ఆఫీస్ లో ముకుందం ఉదాసీనంగా పడివుంటున్న సంగతి మొట్టమొదట పసిగట్టింది మోహన్. తన తెలివితేటల్ని గురించి చెప్పుకుంటూ "జాకాల్ కి మేనమామని నేను" అని గర్వంగా చెప్పుకొనేవాడు మోహన్. మళ్ళీ ముకుందం అంటే చెప్పలేని ఓ బెదురు డొక్కలో నెప్పిలాఉంది. తనకు తెలీకుండా ఉండాలని తిప్పలు పడుతూ, ముకుందం మేరికి దగ్గరకావడం వాసనపట్టాడు. మనస్సు పెర పెరలాడింది. తర్వాత 'జాతీయ దుస్తులు' విప్పేసి టెర్లిన్ డ్రెస్ తో ఆఫీస్ లో

అవతరించిన రోజున మేరీకూడా ఓ చిరునవ్వు కొసరికొట్టి, 'మీకీ డ్రెస్ సరిగ్గా మేచ్ అయింది' అని




అంది.

'మేరీ పొగడ్త మోహన్ పేద మనస్సుని రెచ్చగొట్టింది.

'అలా అంటారని నాకు ముందే తెలుసు!' అని అన్నాడు.

"ఎలా?" అని నివ్వెరపోయింది మేరీ.

అంతలో తమాయించుకుని 'భలే తెలివిగలవారు మొత్తానికి!' అని చిరునవ్వుతో మిళాయించి అనేసింది.

మోహన్ ముగ్ధుడయ్యాడు. కోటలో పాగా వేశాడు కదూ!

నెలమధ్యలో కాని ముకుందం ఉదాసీనత మేరీకి అర్థం కాలేదు. మేరీ కి అవసరాలు కూడా నెల మధ్యనించే మొదలవుతాయి మరి! ముకుందం జీతం ఆస్పత్రికీ, కొంపకీ హారతికర్పూరంలా కరిగిపోయింది. అతని జేబు అతని మనస్సులాగా ఖాళీ అయిందని మేరీ గ్రహించింది. ఒక్క తృటికాలం ధియేటర్లో అతను గుసగుసలాడిన సంగతి గుర్తు వొచ్చింది. సోప్ వాటర్ లో మురికి బట్టని గుంజినట్లు, నిన్నటి మొన్నటి సంగతులన్నిటిని తుడిచేసి మనస్సుని ఆర వేసింది. ఎప్పటిలా మాటల్లోకి

దించింది. సమయానికి తగినంత సానుభూతి కాళ్ళముందు వారబోసింది! మేరీ చిరునవ్వుల టానిక్ పనిచేసింది. ముకుందానికి సత్తువ వచ్చింది. కాలు నిలదొక్కుకున్నాడు!

ముకుందం ఉదాసీనతని మోహన్ వినియోగించుకొన్నాడు.శ త్రువు దుర్బలంగా ఉన్నప్పుడే కోట పేటల్ని చూర గొనాలి. జూకాల్ మేనమామకి ఆ ఎత్తులన్నీ బాగా తెలుసు!

మేరీని "టాంక్ బండ్ కి వెళదాం... వొస్తారా" అనడిగాడు మోహన్.

"మీరు పిలవడం నేను రానననడమా? నాకన్ని గుండెలెక్కడున్నాయ్ బాబూ?" అంది మేరీ నవ్వేస్తూ!

ఇద్దరూ బస్సెక్కారు. డబల్ డెక్ బస్ టాంక్ బండ్ కి పోతోంది. ఆ నిమిషాన హఠాత్తుగా గుర్తొచ్చినట్లుగా మేరీ వేపు తిరిగి –

"రేపటితో నాకు ఇరవై ఆరు వెళతాయి!" అని అన్నాడు ..

మేరీ కళ్లు పెద్దవి చేసి, అతన్ని నిలువునా చూసింది.

ఆఫీస్ లో చేరిన మొదట్లో మేరీ మోహన్ తనవయస్సు ముప్ఫయ్ మూడు అని నిజం చెప్పాడు. వయస్సులో అనుభవంలో ముకుందంకంటే తానెక్కువనీ, ఐనా ఈ ఆఫీసులో తగిన స్థానం లభించలేదని మేరీతో వాపోయిన సంగతి మోహన్ మరిచిపోయాడు.

కానీ, మేరికి ప్రతిమాటా గుర్తుంది. ఆడవాళ్ళ జ్ఞాపకశక్తిపై అవగించంత నమ్మకం కూడా లేని మోహన్కి మేరీ కళ్లు పెద్దవిచేసి చూసిందంటే మరోలా అర్థం తోచింది. తనని “నిట్టనిలువునా కళ్ళల్లో నిల్పుకోడానికే సుమా అలా చూసింది” అని అనుకొన్నాడు మోహన్. ‘మగవాడు అంతకన్నా మరేం అనుకుంటాడు కనక!

టాంక్ బండ్ వద్ద టీ స్టాల్ పక్క దుకాణం ఉంది. అక్కణ్నించి మోహన్ రెండు ప్లేట్ల కబాబ్ లు తెప్పించాడు. మేరీ! మాంసపదార్థాలంటే చచ్చే ప్రేమ. తనకు మేరీ అంటే తగని ఇష్టం. ఈ ఐదారు మాసాలలో మోహన్ జందెం ఇంట్లో పారేసి గుడ్లూ, మాంసం అలవాటు చేసుకొన్నాడు. తినమరిగాక పులివాట మయింది, ఆకలి కూడా.

తను చెప్పాలనుకున్నదేదో ఎలా మొదలుపెట్టాలో తెలీక మోహన్ కాబాబ్ ని గబగబా నమలడంతో భావ ప్రకటనకి నాంది పలికాడు.

మేరి కొంచెంగా నవ్వి, ఇంకొంచెం నాజూకుగా తినమని గోముగా ప్రేమగా చెప్పింది.

చిన్నకుర్రాడు బిక్క మొగం వేసుకుని “అమ్మా” అన్నట్లు "మేరీ” అని పిలిచాడు మోహన్.

“ఊ..” అతని వైపు చూడకండానే మత్తుగా నవ్వింది మేరీ. కబాబ్ లు మరో ప్లేటు తెమ్మని కుర్రాడికి చెప్పింది. ఇందాకటిలాగా మళ్ళా మత్తుగా “ఊ..” అంది.

మోహన్ ముఖం సీరియస్ గా పెట్టాడు.

“‘ప్రేమ' అంటే నీ అభిప్రాయం ఏమిటి మేరీ?” అనడిగాడు.

అదేదో వింత జంతువై నట్లు, అప్పుడే చూసినట్లుగా కళ్ళార్పింది మేరి. రెప్పలు కొంగరెక్కల్లా టపటపలాడాయి.

"చిన్నదాన్ని, నన్నిలా అడిగితే ఎలా? నాకేం తెలుస్తుంది చెప్పండి! అంటూ నవ్వింది" మేరీ. ఆ నవ్వు పచ్చి దొంగనవ్వు, క్రితం రాత్రే చదివిన ఓ వారపత్రికలో సినీతార ఇచ్చిన జవాబుల్లోంచి ఒక జవాబుని అక్షరం తప్పకుండా అప్ప చెప్పింది. ఒక్క తృటికాలం సినీనటి' మేరీకళ్లల్లో మెదిలింది.

“నీకూ నాకూ ఆరేళ్ళగా తేడా. అదేమంత పెద్ద తేడా కాదు. మన దేశంలో, ఈడు జోడూ ఈ మాత్రం తేడా వుండాలి' అన్నాడు గబగబా మోహన్.

"అలాగే, అయితే సరే!" అంది మేరీ!

"చూడు మేరీ! ఈ దిక్కుమాలిన సమాజంలో వాస్తవిక ప్రేమకు విలువ లేకుండా పోయింది! కులాలు మతాలు నీతీ జాతీ" చప్పున నాలిక కొరుక్కుని మళ్ళా "మేరీ ఏదో ఆవేశం నాలో పొంగింది. పడుచురక్తం పల్లవిస్తోంది. ఈ అడ్డగోడలే లేకపోతే నువ్వూ–

నేనూ" వాక్యం పూర్తి కాకముంటే కబాబ్లను గబగబా నమిలి మింగాడు. పొలమారింది. కళ్ళవెంట నీళ్ళు గిర్రున తిరిగాయి.

అతని నెత్తిమీద అరిచేత్తో నెమ్మదిగా తాటిస్తూ మంచినీళ్ళ గ్లాసు నోటికందించింది. మేరీ.

"ఔను మోహన్! నిన్ను నీవే వోదార్చుకో వాలి! స్తిమిత పడాలి.

" ఈమాత్రం నీ సరసన కూచుని హాయిగా మాట్లాడే అదృష్టం అయినా లభించింది. అందుకై నా తృప్తిపడాలి. సంఘ భయం, జైలు భయం లేకపోతే నిజంగా నువ్వూ నేనూ," ఆపైన పూర్తి చేయ

కుండానే మిస్ మేరీ ఏక్ దమ్మున రెండు కబాబ్ ల్ని నోట్లో కుక్కి నమిలిమింగింది.

సరిగ్గా అదే సమయానికి డబల్ డెక్ వొచ్చి ఎదురుగా అగింది. అందులో జాన్ వున్నారు. జాన్ వీళ్ళని చూడలేదు. మేరీ అతన్ని చూసింది. తుళ్ళి పడింది. డబల్ డెక్ వెళ్ళిపోతోంది.

"ఏమిటి మేరీ అలా ఉలిక్కి పడ్డావ్" అనడిగాడు మోహన్,

"అబ్బే, మరేం లేదు మోహన్. ఇవాళ ఇంటికి తొందరగా వెళ్లాలి. మా అమ్మకి మళ్ళా జబ్బు తిరగబెట్టింది. డాక్టర్ కి చూపించాలి. నెలమధ్యకదూ! గుర్తొచ్చి గుండెల్లో బరువెక్కింది" కళ్ళల్లో నీళ్ళు తొంగి చూడబోయి ఆగాయి. గొంతులో ఏడ్పు మూల్గు రాబోయి ఆగిపోయాయి. మోహన్ గుండెలు కరిగి నీరైపోయాయి.

"నేనుండగా నువ్వు భయపడక్కరలేదు. మేరీ! ఇదుగో ఈ పాతిక ఉంచు. సరిపోతుందిగా! నువు టాక్సీమీద ఇంటికి వెళ్ళిపో. టాక్సీ చార్జీలు కావాలిగా ఇది ఉంచు" అంటూ హడావుడిగా జేబులో డబ్బంతా తీసి మేరీ చేతిలో పెట్టేశాడు. మేరీ కృతజ్ఞతతో

మరీమరీ చూసింది. అంతకే తలకిందులై మోహన్ టాక్సీని పిలిచాడు. మేరీని ఎక్కించాడు.

ఒక్క నిమిషంలో జాన్ మేరీని మిస్ అయ్యాడు. మేరీ టాక్సీమీద బస్ స్టాండ్ కి వొచ్చి జాన్ కోసం వెతికింది. విసుగెత్తి టాక్సి వొదిలేసి, చార్మీనార్ బస్సెక్కేసింది.

ఆ రాత్రి ఒంటరి చీకటిగదిలో కూచున్న జాన్ గుడ్లగూబలా మిటకరించి, తల బద్దలుకొట్టుకుని ఓ చిన్న జాబురాశాడు. ఆఫీస్ లో లోకల్ టపాలో మేరీ ఆ జాబుని అందుకుంది!

"డియర్ మేరీ! డిశంబర్ లో మన పెళ్ళి కాకపోతే నేను బతకలేను. నాకు చాతకాదు. బతకను అంటే అర్థం హుసేన్ సాగర్ లో నా శవం పోలీసులకి దొరుకుతుంది. అస్పత్రి వాళ్లు దాన్ని కోసి "ఒక్కో అక్షరం ఒక్కో ఫిరంగి గుండులా మేరీ గుండెల్ని తాకి తూట్లు

పొడిచాయి. ఎటొచ్చీ మేరీ మొండి ఘటం కనక ఓ అరకప్పు కాఫీ తాగి అంతలో తేరుకుంది. జాబుని మరి పూర్తి చేయకుండానే జాకెట్ లోపల దాచేసుకుంది.

ఆ వేళ ఆఫీస్ కు మోహన్ రాలేదు. ముకుందం ఒకడే వున్నాడు. మోహన్ కు ఏమన్నా జబ్బుచేసిందా? చేస్తే? మరి ఆలోచించలేకపోయింది మేరీ. మోహన్ ఎప్పుడో మాటల్లో తన ఇంటి చిరునామా చూచాయగా చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది.

ఆఫీస్ నించి పెందరాడే బయటపడి మేరీ చార్ మీనార్ బస్సెక్కకుండా సనత్ నగర్ బస్సెక్కేసింది. నిన్న తనకింత సహాయం చేసినందురు మోహన్ కి స్వయంగా కృతజ్ఞత చెప్పడానికి వెళుతోంది. ఇంతకన్నా ఆడపిల్ల పం చేయగలదు?

సనత్ నగర్ లో దిగి మేరి మోహన్ ఇంటిని త్వరలోనే కనుక్కోగలిగింది. తెలివిగలమటం! ఆ సమయాన మోహన్

ఇంట్లో లేదన్న సంగతి మేరీకి ఎలా తెలుస్తుంది!

అక్కడ ఒంటిగది కొంపలు చాలా ఉన్నాయి. అలాంటి కొంపల్లో ఒక దాంట్లో మోహన్ ముసలి తల్లిదండ్రులు కాళ్ళుజాపుకుని కూచున్నారు. బజారు మట్టిలో పొర్లాడుతూ గాలికెదుగుతున్న ముగ్గురు భావిభారత పౌరుల్ని

మేరీ చూపింది. వాళ్లు ముగ్గురూ మోహన్ సంతాన రత్నాలని పసిగట్టింది. వాళ్లని పలకరించింది.

వాళ్ళనించి మోహన్ జాడ తెలిసే అదృష్టం లేదు.

పెంకి ఘటాల్లాగ వున్నారు.

ఇంతలో ఇంట్లోనించి శ్రీమతి మోహన్ వొచ్చింది. అవిణ్ణి చూడగానే మేరీకి సినిమాల్లో కనపడే రోలర్ లాంటి వ్యక్తి గుర్తుకొచ్చింది. మేరీని చూడగానే "ఈ మాయా మోహిని ఎవరా!" అని తర్కించుకొంది శ్రీమతి మోహన్, నోరు విప్పింది.

కొద్ది సెకన్లతో తన స్థితి మేరీకి అర్ధమయింది. తనని నడివీధిలో నిలబెట్టి ఊరూ పేరూ జాతీజన్మా అంతా అడుగు

తున్న శ్రీమని మోహన్, ఏమాత్రం నిజం చెప్పినా తనని కడిగేసి దులి పేస్తుందని గ్రహించింది. చప్పున మేరీ అందమైన అబద్ధాలతో అల్లిన పెద్ద బుట్టలో శ్రీమతి మోహన్ ని కూర్చోపెట్టేసింది. ఆఖరికి తన పేరు కూడా మార్చేసి చెప్పింది. గిరుక్కున మరలి బస్ స్టాండ్ కి వచ్చేసింది.

ఆ రాత్రి –

మేరీకి చాలాసేపు నిద్ర పట్టలేదు. సంగతులన్నీ మరిచిపోడానికి ప్రయత్నించింది. మరిచిపోగలననుకున్నాక

భగవంతుణ్ని మనస్ఫూర్తిగా ప్రార్థించి మేరీ నిద్రపోయింది. తెల్లారి నిర్మలంగా లేచింది. హాయిగా ఆఫీస్ కి వొచ్చింది. ముకుందాన్ని మోహన్ ని విడివిడిగా జంట జంటగా పలకరించి చిరునవ్వుల్నీ చిలకరించింది.

స్వయంగా కేలండర్ లో రెండో షీట్ ని చించేసింది. కొత్త నెల, కొత్త రోజు జీతాలు పుచ్చుకొనే రోజు వొచ్చింది.

ఆఫీస్ జాస్మిన్ పరిమళాలతో కాకపోయినా సోపు వాసనతో నిండిపోయింది.

సంవత్సరాంతంలో పరంధామయ్య గారు బోనస్ లిస్తారని తెలిసిపోయింది. వచ్చే నెలాఖరున జీతాలు బోనస్ లు కలిపి అప్పులు తీర్చేయగలమని మగ గుమాస్తాలు ఆశించారు.

ఒక వారం రోజులుగా ముకుందం చాలా హుషారుగా ఉంటున్న సంగతి జాకాల్ మేనమామ మోహన్ పసికట్టేశాడు. అతి జాగ్రత్తగా ముకుందాన్ని గమనిస్తున్నాడు.

టీ సమయంలో మేరీ ముకుందాన్ని చాలా మృదువుగా ఇంగ్లీషులో “మీరు తీసుకొన్న మాగజైన్ తిరిగి నాకు

ఇమ్మని అడిగినట్లయితే – మీరు మరోలాగ అనుకోరని నేను అనుకోవచ్చువా?" అనడిగింది.

ముకుందం పచ్చి తెలుగులోనే అన్నాడు.

"సారి మేరీ!" మరో రెండు రోజుల్లో ఇచ్చేస్తాను. మరోలా అనుకోకు! ప్లీజ్! "

మేరీ ఏమనుకోలేదు కాని పాము చెవులప్పగించి వింటున్న మోహన్ చాలా అనుకొన్నాడు.

"ఇదేదో మిస్టరీ! కాతా పుస్తకాలు తప్ప, ప్రపంచంలో మరో అక్షరం ఉందని ఈ ముకుందానికి తెలీదే! అలాంటి ముకుందం మాగజైనుని వారం రోజులుగా చదువుతున్నాడా అది తప్పకుండా ఏదో రహస్యతంత్రమే సుమా. ఇన్ని రకాలుగా ఆలోచించాడు మోహన్.

ముకుందం మాత్రం డ్రాయర్ తెరచి, తెరచి ఉంచిన మాగజైన్ ని తదేకంగా చూస్తున్నాడు. ఈ వారం నించి అతను చూస్తున్నది ఒకే ఒక పేజీని. ఆ పేజీలో ప్రధానమైన విశేషం ఒకటి ఉంది. ఆ పేజీ ఫజిల్ పేజి.

క్రితం ఫజిల్ లో ఇరవై వేలు మొదటి బహుమతి పొందిన సైకల్ షాపు వోనరు రామయ్య ఫొటోఉంది. అదృష్టవంతుడు. సైకిల్ షాపు ఎత్తేసి చిన్న కార్ల కంపెనీ పెడతాడేమో! ముకుందానికి చెప్పరాని చిరుకోపం వొచ్చింది. "పేజీ మధ్యలో మరో కొత్త ఫజిల్ ఉంది, ముకుందానికి తన తెలివితేటలపై అపారమైన నమ్మకం వుంది. ఈసారి బహుమతి మొత్తం రెట్టింపు వుంది. నలభై వేలు! గెలిచి తీరాలి! గెలిచి తీరతాడు!

ఈ మాగజైన్ మేరీ చేతులలోంచి వొచ్చిందయ్యె. మేరీ హస్తవాసి మంచిది. మేరీ ముఖం చూసి బయలుదేరితే

రితేసరి కొత్త అప్పులు పుడుతున్నాయి. అంత మంచి ముఖం. ఈ నలభైవేలు చేతికి రావడంతో తన దశ తిరిగిపోతుంది! మేరీ? డబ్బుకి దాసోహమనని వారు చరిత్రలో లేరు. ముకుందం కళ్లు జ్వలిస్తున్నాయి. తలమాత్రం కొంచెం తిరిగినట్లయింది.

మేరీ ఆమధ్య ఒక నాడు పబ్లిక్ గార్డెన్ లో జాన్ ని కలుసుకుంది! మొద్దుబారేలాగ చివాట్లు వేసింది. విరహ గీతాలు పాడ్డం మానేయమంది!

హత్యలు అత్మహత్యలు సినిమాలకేకాని జీవితాలకు కాదని బుద్ధిచెప్పింది. వొట్టేయించింది. ఘాటైన మందు తగిలితే మలేరియా పారిపోయినట్లు జాన్ కి అన్ని బద్దకాలు వదిలిపోయాయి. మేరీకి ప్రమాణం చేశాడు. హుషారు వచ్చింది. ఆ సంతోషానికి చిహ్నంగా తనుకొన్న కొత్త మాగజైన్ ని మేరీకి ధారాదత్తం చేశాడు. అందులో గమ్మత్తయిన ప్రేమకథ వుంది చదవమన్నాడు. ఓకే అంది మేరీ!

మేరీ ఆ పత్రిక తెరవలేదు. నూరు ప్రేమకథలు చదివి నేర్చిందానికంటే జీవితం నేర్పిన ఏ చిన్న పాఠమైనా గొప్పదని మేరీ నమ్మకం. ఇంతవరకు దాన్ని ఎవరూ తొలగించ లేకపోయారు హస్తభూషణంగా ఆ పత్రికను ఆఫీస్ కి తెచ్చింది మేలి. ముకుందం పలకరించి మాగజైనుని అందుకున్నాడు. విప్పడమే తరువాయి ఫజిల్ పేజీ కనిపించింది. అంతే. దాన్ని డ్రాయర్లో పెట్టాడు. ఈ వారంరోజులనించి ఒకటే తపస్సులో మునిగి తేలుతున్నాడు.

ఫలించిందా నలభైవేలు చేతికి వొస్తాయి. పరిహసించే ఈ వెధవ ప్రపంచాన్ని ఎడం కాలితో తన్నేయవచ్చు. ముకుందం వొళ్ళు గరిపొడిచింది.

మోహన్ ప్రతినిమిషం మెలకువగా ఉన్నాడు.

ముకుందం జయటికి వెళ్ళినప్పుడు అర్జంట్ కాగితాలు కావాలన్న నెపంతో మోహన్ ముకుందం డ్రాయర్ని తెరిచిచూశాడు. నిమిషాల్లో రహస్యతంత్రాన్ని భేదించాడు. ఆ నిమిషంలో అకాశాన్నించి నలభై వేల వెండి నాణాలు వర్షిస్తున్నట్లు మోహన్ కి తోచింది.

ఆ మర్నాడు ఫజిల్ పంపవలసిన గడువు ఆఖరిరోజు! ముకుందం చాలా హుషారుగా అఫీస్ కి వచ్చాడు. "మేరీని అత్యవసరంగా ఐదు నిమిషాలు పొగిడాడు. ఆ తర్వాత తను పూర్తి చేసిన ఫజిల్ చిత్తు ప్రతి మేరీ చేతిలో పెట్టాడు,

"మేరీ! నీ చేత్తో కాఫీ చేసి ఇస్తే నాకు కలసివొస్తుంది. ప్లీజ్" అని అన్నాడు.

మేరీ సన్నగా నవ్వింది.

"మీకు కలిపివొస్తే నా కొరిగేదేవిటి? "

"ఇదుగో. నువ్వేం కోరితే అది!" అన్నాడు నవ్వుతూ ముకుందం!

"నిజంగా ఇస్తారా? "

ముమ్మాటికీ!

“మాట తప్పరుగా?"

"అడిగిచూడు! నీకే తెలుస్తుంది!"

మేరీ మరోసారి చల్లగా తీయగా నవ్వింది.

"మీరు హాయిగా ఉండడమే నాక్కావలసింది! అంతకంటే నాకు మరేం అక్కర్లేదు" అంది మేరీ–

ముకుందం జావకారాడు. మేరీ ఏదో అడుగుతుందని ఊహించాడు. తనంత దా వలచి వస్తుందనుకున్నాడు.

తలపండిన వేదాంతిలా మాట్లాడాడు.

"మేరీ! భౌతికంగా కాకపోయినా ఆధ్యాత్మికంగా ఈ ముకుందం సర్వస్వం నీది కాదా? నమ్మ లేవు. నిజానికి నీది కానిది నాకేముంది"

మేరీ తలవంచుకుని మేలుప్రతి శ్రద్ధగా తయారు చేస్తోంది. మేరీ మనిషిలాగా దస్తూరి కూడా ముచ్చటగా ఉంటుంది.

ఫజిల్ వెంట పంపనలసిన పోస్టల్ ఆర్డర్ కోసం ముకుందం బయటికివెళ్లాడు.

మోహన్ పక్కమన్నాడన్న సంగతే మరిచిపోయింది. మేరీ! మోహన్ ఆ మాగజైన్ ని ఓ లైబ్రరీలో చరువుతూ చదువుతూ ఫజిల్ పేజ్ ని జాగ్రత్తగా చించి మడిచి జేబులో భద్రపరచుకొన్నాడు. తోవలో పోస్టాఫీస్ లో పోస్టల్ ఆర్డర్లు కొనేశాడు.

ఇపుడు కోరుకొన్న సమయం చిక్కింది.

మేరీ రాస్తున్న దాన్ని నేత్రావధానంతో లాగేశాడు. మేరీ కాపీ రాసేసరికి మోహన్ కూడా పూర్తి చేశాడు.

మేరీ హస్తవాసి మీద మోహన్ కి నమ్మకంవుంది.

కవరు మీద మేరితో అడ్రస్ టైప్ చేయించాడు.

మేరీ ఆశ్చర్యాన్ని దాచుకుంది.

కొద్ది నిమిషాల ముందు గడపదాటిన ముకుందం మోహన్ చేసిన పనిని పసిగట్టేశాడు. తనకు రానున్న నలభై వేలల్లో ఇరవై వేలు మోహన్ వాటా వచ్చేస్తుంది. తప్పదు!

ఒక్క నిమిషం అతని బుర్ర దెయ్యాలకొంపగా మారిపోయింది. నిగ్రహించుకొన్నాడు.

ఏమీ ఎరగనట్లు నను కుర్చీలో కూలబడ్డాడు.

మేరికి ఫోన్ కాల్ వచ్చింది. జాన్ అర్జంటుగా రమ్మన్నాడు. పెందరాడే మేరీ బయల్దేరింది.

ముకుందం పూర్తి చేసిన కవరు మేరీనే పోస్టుచేయమని అభ్యర్థించాడు.

మేరీని సాగనంపడానికి వెళ్ళి మోహన్ తన కవర్ని కూడా పోస్ట్ చేయమని ఇచ్చి తిరిగి వచ్చాడు.

రెండు అదృష్ట జాతకాన్ని చేతబట్టుకుని మేరీ లిఫ్ట్ దిగిపోయింది.

ముకుందం టిఫిన్ కాఫీ తెప్పించి మోహన్ కి అందించాడు. ముకుందం మంచి హుషారులో ఉన్నాడని అనుకొన్నాడు మోహన్. తను చేసిందిముకుందానికి ఛస్తే తెలీదనుకున్నాడు.

ముకుందం "తల మళ్ళీ దయ్యాలకొంపగా మారింది. చిన్నప్పుడు "డాక్టర్ జెకిల్ అండ్ హైడ్" నవల చదివి దడుసుకొన్నాడు. కాని తనలో ఇప్పుడా రెండు రూపాలు తాండవిస్తున్నాయి.

ముకుందం మోహన్ ని మాటల్లోకి దించి చల్ల గాలికి కారిడార్ లోకి తీసుకొని పోయాడు. పిట్టగోడ కానుకుని నగరాన్ని, చీమలబారుల్లా సాగిపోతున్న జనాన్ని చూస్తున్నారు.

ముకుందం మోహన్ కి దూరాన కనిపిస్తున్న నౌబత్ పహాడ్ మీది కొంగనో దేగనో చూపించాడు. మోహన్ అదెక్కడుందని చూస్తున్నాడు.

ఒక్క నిమిషంలో.

మోహన్ రెండు కాళ్ళని పట్టుకొని ముకుందం పైకెత్తేసి వదిలేశాడు. మోహన్ పారాచ్యూట్ లో దిగే యోధుడిలా ఎనిమిదో అంతస్తునించి కింద రోడ్డుమీదికి పడిపోయాడు.

ఆ నిమిషంలో–మోహన్ వేసిన వెర్రికేక ముకుందానికి పిచ్చెత్తించింది. అలాగే నిలబడిపోయాడు.

పోలీసులు, జనం ఎనిమిదంతస్తుల భవనంనిండా ఈగల్లా మూగారు. ముకుందం అరెస్టయినాడు.

కేలండర్ చివరి కాగితంకూడా చిరిగిపోయింది.

ఫజిల్ లో, మొదటి బహుమతి నలభైవేలు మిస్ మేరీకి వచ్చింది.

# వ్యాధిగ్రస్తుడు

## మాలతీ చందూర్

## (1950 – సెప్టెంబర్ ఆంధ్రజ్యోతి మాసపత్రిక నుంచి)




గేటు తోసుకు లోపల కడుగెట్టాను. సరిగా ఆ వేళకి ఏ మల్లెతీగెకిందో, చీడీల పక్కనో, డాబామీదో నవ్వుతూ కనబడే రాధ నా కంటికి అవుపడలేదు. టాయిలెట్ యింకా పూర్తి కాలేదేమో అనుకుంటూ మెట్లెక్కి హాల్లోకి వెళ్ళాను.

మల్లె పువ్వులా తయారై వుండాల్సిన రాధ వాలుకుర్చీలో పడుకుని దీర్ఘంగా ఆలోచిస్తోంది. నా రాకగూడా గమనించినట్టు లేదు. ఆఖరికి నిద్రలేచే వేళకిగూడా నలగకండా, శుభ్రంగావుండే రాధ అంత చికాగ్గా వుందేమిటి చెప్మా అని దగ్గాను.

డాక్టరుగారి భార్యకు పూజలూ పునస్కారాలూ తప్ప మరోగోల తెలియదు. కొత్తగా వచ్చిన డాక్టరుభార్య మటుకు అంతకంటె వుత్సాహంగా వుంటుందా? అనుకున్నాం మేమంతా. వూరికి ఏ ఆఫీసర్లొచ్చినా, వారి భార్యల్ని మాతో పోల్చుకు తృప్తిపడటం మాకో అలవాటయింది.

డాక్టరు వొచ్చి స్థిరపడిన నెల్లాళ్ళకు ఆయన భార్యా వచ్చింది. డాక్టరుగూడా చిన్నవాడు. పిల్లామేకా లేదు. ఆయన భార్య యింటర్ దాకా చదివిందనీ, నాగరిక యువతీమణి అనీ మేమంతా ముందుగానే వినివున్న

**గేటు తోసుకుని** లోపలకి అడుగుపెట్టాను. సరిగ్గా ఆ వేళకి ఏ మల్లెతీగకిందో, చీడీల పక్కనో, డాబామీదో నవ్వుతూ కనబడే రాధ నా కంటికి అవుపడలేదు. టాయిలెట్ యింకా పూర్తికాలేదేమో అనుకుంటూ మెట్లెక్కి హాల్లోకి వెళ్ళాను.

మల్లె పువ్వులా తయారై వుండాల్సిన రాధ వాలుకుర్చీలో పడుకుని దీర్ఘంగా ఆలోచిస్తోంది. నా రాకకూడా గమనించినటు లేదు. ఆఖరికి నిద్రలేచే వేళకి కూడా నలగకుండా, శుభ్రంగా వుండే రాధ అంత చికాగ్గా వుందేమిటి చెప్మా అని దగ్గాను.

తలెత్తింది. నా వంక చూసి 'రా' అంది కుర్చీ చూపిస్తూ మొఖం మీద చిరునవ్వు కనపడదేం?

అసలు రాధకీ నాకూ స్నేహం ఎలా అయి అయిందంటే మా వూళ్ళో వున్న లేడీస్ క్లబ్‌కి అందరికి మల్లే నేనూ వెళ్తూండేదాన్ని. సాధారణంగా మా క్లబ్‌లో చీరలూ, జాకెట్లూ, నగలూ, లేచిపోవడాలూ మాట్లాడుకునేవాళ్ళం.

పూర్వం వున్న గవర్నమెంటు డాక్టరుకి బదిలీ అయి మరో డాక్టరొచ్చాడు. పూర్వపు డాక్టరుగారి భార్యకు పూజలూ పునస్కారాలు తప్ప మరోగోల తెలుయదు. కొత్తగా వచ్చిన డాక్టరు భార్య మటుకు అంతకంటే వుత్సాహంగా వుంటుందా? అనుకున్నాం మేమంతా, వూరికి ఏ ఆఫీసర్లొచ్చినా, వారి భార్యల్ని మాతో పోల్చుకు తృప్తి పడటం మాకో అలవాటయింది.

డాక్టరు వొచ్చి స్థిరపడిన నెల్లాళ్ళకు ఆయన భార్యా వచ్చింది. డాక్టరుకూడా చిన్నవాడు. పిల్లా మేకా లేదు. ఆయన భార్య యింటర్ దాకా చదివిందనీ, నాగరికి యువతీమణి అనీ మేమంతా ముందుగానే విని వున్న వాళ్ళమవడం చేత ఆవిడ రాకకోసం ఆతృతగా చూశాం. కాస్త చదువుకున్న యువతి అయితే మా క్లబ్బులో మెంబరవాల్సిందే. అందులో గవర్నమెంటు డాక్టరు భార్య మెంబరుకాకుండా వూళ్ళో కాపరం చేస్తుందా?

రాధ ఆవరణలో అడుగుపెట్టగానే క్లబ్‌కి కొత్త కాంతి వచ్చింది. అసలు అలా కాంతి వెదజల్లడం రాధలోనే స్వతహాగా వుంది. రాధ తిరిగిన స్తలాలు తళుక్కుమనేవి. మూడు నెలలు తిరక్కుండానే రాధ క్లబ్ సెక్రెటరీ అయింది. క్లబ్‌లో ఎన్ని మార్పులు? వ్యక్తులు సంఘాన్ని ఎలా మార్చేదీ రాధలాంటివాళ్ళు రుజువు చేస్తారు. బకాయిపడ్డ చందాలు రాబట్టడమే కాకుండా విరాళాలు కూడా వసూలు చేసింది. ఎన్నో ఆటవస్తువులు తెప్పించింది. రింగ్ టెన్నిస్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం రకరకాల గేమ్స్ మొదలెట్టించింది. చిన్న లైబ్రరీ వోపెన్ చేసింది. రకరకాల పత్రికలు తెప్పించింది. క్లబ్‌కి జీవం పోసిందంటే నమ్మండి. కాలుతీసి కాలుపెట్టే ఓపిక లేకపోయినా ఈ కీర్తి అంతా రాధకే ఎందుకు దక్కాలనే యీర్ష్యాళువులు మాలో కొందరు లేకపోలేదు. కానీ వాళ్ళేం చెయ్యగలరు? రాధ సమర్ధురాలు కావడంవల్ల యీ కుటిల మనస్కుల్ని లెక్క చేసేది కాదు.

మేమిద్దరం ఒకే వీధిలో వుండటం వల్ల క్లబ్ స్నేహమే కాకుండా యింటిస్నేహం కూడా కలిసింది. నేను లేకుండా రాధ యింతవరకూ ఒక్క సినిమాకు పోలేదు.

"ఏం రాధా ఏవో కలలు కంటున్నావ్?" అన్నాను నవ్వుతూ.

"మనసేమిటో బాగో లేదు" అంది ముభావనగా.

రాధకి మనసు బాగా లేకపోవడమా? యిదే మొదటిసారి నేను వినడం. అందరికిమల్లే రాధ భర్తతో కీచులాడదు. పనివాళ్ళమీద విసుక్కోదు. పెంకిపట్టు పట్టదు. నవ్వుతూ అందర్నీ తన చుట్టూ తిప్పుకోగల రాధకి మనసు బాగుండకపోవడమా? చిత్రంగా వుందే.

"వంట్లో నలతగా వుందా?" అన్నాను.

"డాక్టరు ప్రాణనాధుడై వుండగా నాకు జబ్బేమిటి?" అంది మామూలు ధోరణిలో.

"మనసు బాగా లేకపోవడానికి కారణం?"

"ఏం లేదు" అంటూ టేబుల్ మీద కాయితాన్ని వూరికే చూస్తోంది. బహుశా వాళ్ళవాళ్ళకి వొంట్లో బాగా లేదని వుత్తరం వచ్చిందేమో?

"డాక్టరుగా రొచ్చేవేళయినట్టుంది. కాస్త ముఖం కడుక్కుని చీర మార్చుకోవూ?"

"తొమ్మిదింటిదాకా రారు."

"అంటే అప్పటిదాకా యిలా దిగాలుగా కూచుంటావా?"

"కూచుని నేను చేసేదేమీలేదు" అంది నిరాశగా.

"అసలు నువ్వు చెయ్యదల్చుకుందేమిటి?" అన్నాను జాజిపందిరి కిందకు తీసుకెడ్తూ.

తన చేతిలో ఉత్తరం నా చేతిలో పెట్టి "చదువు – నీకే తెలుస్తుంది" అంది రాధ.

చదివాను. రాధ అన్నగారు రాసిన ఉత్తరం. రాధ తన తల్లిదండ్రుల గురించీ, చెల్లెళ్ళూ తమ్ముడూ గురించీ చెప్పిందిగాని తనకో అన్నగారు వున్నట్లు చెప్పలేదు. ఆరేళ్ళ తర్వాత చెల్లెల్ని చూసేందుకు వస్తున్నాడు. అతని వెంట అచ్యుతాన్నికూడా తీసుకొస్తున్నాట్ట. బాగానే వుంది. ఇందులో ఆలోచించాల్సినంత కారణం ఏమీలేదా? అసలు అన్నగారు వస్తున్నందుకు పొంగిపోవాల్సింది. రాధ దీర్ఘంగా ఆలోచిస్తోంది. తలా తోకా కూర్చుకోలేక ప్రశ్నార్థకంగా చూశాను.

"మా అన్న వస్తున్నందుకు నేను ఆలోచించడంలేదు. వస్తూ ఆ అచ్యుతాన్ని ఎందుకు తేవాలి అని పట్టుకుంది."

"ఏం? స్నేహితుడు కాబోలు. నీకు తెలుసునంటున్నాడయన. ఏదో రెండురోజులుండి వెళ్తారు. దానికి బుర్ర బద్దలు చేసుకోవాలా?" అన్నాను గుక్కతిప్పుకోకుండా.

"నీ కర్థం కాదు. మణీ. నేచెప్పినదంతా విన్న తర్వాత మాట్లాడు.

ఈ అచ్యుతాన్ని ఎనిమిదేళ్ళ క్రితంచూశాను. ఒక సాయింత్రం – అంటే నేను ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్న రోజుల్లో స్కూలునించి యింటికొచ్చేవేళకి మా అన్నా, యీ అచ్యుతం కనిపించారు. అప్పటికి ఏడాది నుంచి అన్నయ్య బొంబాయిలో వుంటున్నాడు. ఏదో చదువుకని వెళ్ళి డబ్బంతా తగలేస్తున్నాడని నాన్న అన్నయ్య మీద నిప్పులు చెరుగుతుండేవారు. అకస్మాత్తుగా అన్నయ్యరావడం నాకు ఆశ్చర్యం వేసింది.

దక్షిణ వేపు గచ్చరుగుమీద నిల్చున్నాను. అప్పుడే సూర్యుడు అస్తమిస్తున్నాడు. చాలా గమ్మత్తుగా వుంది. అరుగుమీద నిల్చున్న నన్ను అచ్యుతం కిటికీగుండా తీక్షణంగా చూస్తున్నాడు కాబోలు. ఆ చూపులు నా వీపుని సూదుల్లా పొడిచినట్టయింది.

వంటింట్లోకి వెళ్ళిపోయాను. కాసేపు అయాక అన్నయ్య నన్ను అచ్యుతానికి పరిచయం చేశాడు. వారిద్దరూ ప్రాణస్నేహితులట.

అచ్యుతానివి మనిషిని నిలబెట్టే చూపులు. అతను అంత అందగాడు కాదు. సన్నగా పొట్టిగా వుంటాడు. ముఖంలో కలాకాంతులు వుండవు. ఆ కళ్ళే సూదుల్లా వుంటాయి.

మొగాళ్ళంటే ఏ మాత్రం నదురూ బెదురూ లేని నేను కొంతసేపటిదాకా అచ్యుతంతో సరిగా మాట్లాడలేకపోయాను. అతని చూపులు కందిరీగల్లా ఝుయ్ మంటూ కుడతాయి. మాటల్లో పడ్డాం. ఏవో కబుర్లు అంజూర చెట్టుకింద సన్నని వెన్నెల్లో కూచుని మాట్లాడుకున్నాం. అచ్యుతం చింతపండు ధర దగ్గరనుంచి చీనా సమస్యదాకా ఒకటేమిటి అన్నీ ధారాపాతంగా మాట్లాడతాడు. లోక జ్ఞానమెరగని నాకు అతనొక మహా పండితుడులా తోచాడు.

అందరం భోజనాలు చేశాం. అన్నయ్యకీ, అచ్యుతానికి దొడ్లో కాకరపాదు నీడలో పక్క వేశారు. నేను పుస్తకాలు పుచ్చుకుని చదువుకి ఉపక్రమించాను. అచ్యుతం కళ్ళూ, మాటలూ నా ఏకాగ్రతని పాడుచేశాయి. ఏదో చదువుకు పోతున్నాను. నా వెనక అడుగుల చప్పుడుకి తలెత్తి చూశాను.

"ఈ ఒక్కరాత్రీ ఆ అర్థంలేని పాఠాలకి సెలవివ్వకూడదు? తెల్లారగట్ల మేం వెళ్ళిపోతాం. ఆ తర్వాత మీరా పుస్తకాల్తో కుస్తీ పట్టచ్చు మీ అన్నయ్య పిలుస్తున్నాడు. రండి. చక్కటి కబుర్లు చెప్పుకుందాం దొడ్లో కూచుని" అన్నాడు అచ్యుతం.

అన్నయ్య మంచం మీద కూచున్నాను. అచ్యుతం దిళ్ళమీద చెయ్యి ఆనించి, అరచేతుల్లో గడ్డం పెట్టుకుని, వొరిగి పడుకున్నాడు. ఏవేవో కబుర్లు, మధ్య మధ్య అతను తన చూపుల్తో నన్ను చీల్చేస్తున్నాడు. అలా చూసినపుడు ఆ కళ్ళు రెండూ పొడవాలనిపించేది. అన్నయ్యా తనూ కలిసి ప్రపంచాన్ని మారుస్తారట. ఆ మార్పుకు ధనం అవసరం. అందుకోసం నాన్న దగ్గరకు అన్నయ్య వచ్చాడు. చుట్టూ వెన్నెల, పుచ్చపువ్వులాంటి వెన్నెల. వెన్నెల్లో కాకరాకుల వంపుల నీడలు, నిశ్శబ్దంగా వుంది ప్రకృతి. పైథాగరస్ థీరం కిందవున్న మూడో రైడరు రాలేదని నాకు మనసులో బాధగా వుంది.

"పొద్దుటే స్కూలికి వెళ్ళాలి. నిద్దరొస్తోంది"అన్నాను అన్నయ్యనీ అచ్యుతాన్నీ వుద్దేశించి. పన్నెండు కొట్టారప్పుడే.

"మేము వెళ్ళేవేళకి లేవరూ?" అన్నాడు అచ్యుతం.

"అలాగే" అంటూ లోపలికి వెళ్ళి పక్కమీద పడ్డాను. నా కళ్ళు మూతలు పడ్డాయి.

తెల్లారగట్ల మూడింటికి అన్నయ్య లేపాడు. తాము రైలుకి వెళ్ళిపోతున్నామని.

గచ్చరుగుమీద కొచ్చి నిల్చున్నాను. వెన్నెల వెలా తెలా పోతోంది. మామిడాకుల నీడలు మామీద పడ్తున్నాయి. అచ్యరం నాచేతిని తన చేతుల్లోకి తీసుకుని వేళ్ళు నొక్కుతూ 'వస్తాన'న్నాడు. నా చెయ్యి ఝల్లుమంది.

ఇంటర్ సీనియర్ చదువుతుండగా నాకు పెళ్ళయింది. నా పెళ్ళయిన నెల్లాళ్ళకు అన్నయ్యకీ నాన్నకీ డబ్బు విషయంలో పేచీలు వచ్చాయి. నాన్న అన్నయ్యని యింట్లోంచి తరిమేసి ఒక్క దమ్మిడీ అడగొద్దన్నారు. అన్నయ్య డబ్బు

బాగా తగలేసిన మాట నిజమే. అచ్యుతం వల్లనే యిలా తయారయాడని నాన్న అప్పుడప్పుడు అమ్మతో భోజనాల దగ్గిర అంటూండేవారు.

ఆ తర్వాత అచ్యుతాన్ని పూర్తిగా మరిచిపోయాను. జ్ఞాపకం వుంచుకునేందుకు ఏముంది కనక? మొదటినుంచి అన్నయ్యకి నా పెళ్ళి యిష్టం లేదు. కానీ అతని యిష్టాయిష్టాల ప్రసక్తి ఎవరికి? అన్నయ్య మాటకు యింట్లో విలువలేదు. ఈ ఆరేళ్ళబట్టీ అన్నయ్య కబురు మాకు తెలియదు. మళ్ళీ యివ్వాల్టికి యీ వుత్తరం. అన్నయ్య వస్తే ఫర్వాలేదుగాని, అచ్యుతాన్ని ఎందుకు తోడు తీసుకురావాలి?

ఆరేళ్ళనుంచి హాయిగా వెళ్ళిపోతోంది. కానీ అతని చూపులు తలుచుకుంటే ఎందుకో భయంగా వుంది. అసలు అతను యిప్పుడు యిక్కడికి రావడం ఎందుకు?"

"ఏం వస్తే? ఆనాటి చిలిపి రాధ యీనాడు ఎలా వుందో చూద్దామని రావచ్చు, ఖంగారు దేనికి? వుండాల్సినంత దూరంలో వుంచు. చిన్నతనంలో జరిగిన ప్రతిదాన్ని యిలా పట్టుక్కూచుంటారా? వడ్ల గింజలో బియ్యపు గింజ" అన్నాను.

"నీకు తెలియదు మణీ. ఆ చూపుల్లోని మంత్ర ప్రభావం నీకర్ధంకాదు. హాయిగా నిర్మలంగా గడిపే నా జీవిత ప్రాంగణంలోకి అతను ఎందుకు రావాలి?"

"ఎంత వెర్రిదానివి. గోరంతలు కొండంతలు చేసుకు పిచ్చిని పడుతున్నావు. మీ ఆయన స్నేహితులెందరు రావడంలేదు మీ యింటికి? చూపుల్లేవు గీపుల్లేవు. లోకజ్ఞానం తెలియనిదానివి కాబట్టి ఆనాడు ఆ చూపులు నిన్ను కట్టేశాయి. ఆరేళ్ళు కాపురం చేశావు. ఒక మొగాడికి భయపడ్తావా? స్త్రీకి వివాహంతో బాల్యమంతా అంతర్ధానమవుతుంది. నీ కిష్టం లేకపోతే వెళ్ళిపొమ్మని చెప్పు. మీ అన్నయ్యని చివాట్లెయ్యి. అంతేగాని యింత కలవరమా?"

"కాని" రాధ వాక్యం నమిలింది.

ఏదో గడ్డు సమస్యే వచ్చేట్టుంది ఆ సాయంత్రం ఎనిమిదింటిదాకా కబుర్లాడి యింటికొచ్చాను. కానీ ఎందుకో ఆ రాత్రి నిద్రపట్టలేదు. రాధ ముఖం పలుమార్లు విచారంగా కనపడింది కళ్ళముందు.

మర్నాటి సాయంత్రం రాధ యింటి కెళ్ళాను. నే వెళ్ళే వేళకి తోటలో వాలుకుర్చీ మీద ఒక ఎముకల పుట్ట వుంది. లోపలి కెళ్ళాను. హాల్లో రాధ లేదు. డాబా మీద చాప పరచుకుని పడుకుంది. ఇరవై నాలుగు గంటలో రాధలో విపరీతమైన మార్పు వచ్చింది. నవ్వే ఆ కళ్ళు నీలి మబ్బుల్లా బరువుగా వున్నాయి. చెక్కిళ్ళు వడలిపోయాయి. ఏదో పెద్ద ఆపదలో చిక్కుకున్నట్టుంది. ఇదెక్కడి అవస్త రాధకి?

"రాధా" అన్నాను.

"వచ్చావా?" అంది నా కోసమే ఎదురు చూస్తున్నట్టుగా. ఆమె అరిచేతులు సలసలా కాగుతున్నాయి.

"ఏమిటి రాధా?"

"ఏముంది – అనుకున్నంతా అయింది"

"అంటే?"

"వచ్చేటప్పుడు చూడలేదూ?"

"ఏమిటి?"

"అతన్నే అచ్యుతాన్ని నా కోసం ఎలా అయిపోయాడో చూడు. ఎంత పాడయిపోయాడో పాపం ఆరేళ్ళు ఎలా కృశించిపోయాడు"

అర్ధం అవుతోంది. వెర్రి రాధ మొగవాళ్ళ డబ్బా మోతల్ని రాధ నమ్ముతోంది. అచ్యుతం ప్లేటు మార్చాడా? రాధ హృదయాన్ని కదిలించపోతున్నాడా? యిద్దరూ కష్టసుఖాలు చెప్పుకున్నారన్నమాట. సాలెగూట్లో నా రాధని చిక్కుకోనిస్తానా? ఈ మొగాళ్ళు ఐంద్రజాలికులు. రాధ అన్నగారు మనిషా పశువా?

"ఈ ఎనిమిదేళ్ళూ నేను అతన్ని మర్చిపోయాను. కాని నన్ను అతను ఒక క్షణం కూడా మరవలేకపోయాడు. గచ్చరుగు మీద ఆనాడు నన్ను చూసిన ఉత్తర క్షణంలోనే ప్రేమించాట్ట, యీలోగా నేను మరొకరి సొత్తునయిపోయాను. ఈ ఎనిమిదేళ్ళూ నన్ను తలుచుకుంటూ ఎలా కృంగి, కృశించి పోయాడో పాపం. చూడు ఒట్టి ఎముకల పుట్ట యీనాడు. నేను హాయిగా నవ్వుతూ అచ్యుతం లాంటి మనిషి ఒకడున్నాడనే సంగతే మర్చిపోయాను. నా ప్రేమకోసం తపనపడి యిలా అయిపోయాడు" అంది.

ప్రేమ పైత్యం రాధకి పూరాగా ఎక్కింది. అచ్యుతం గ్రామఫోను పాటని వోపిగ్గా విన్నదన్నమాట. "అయితే మరి నీ పెళ్ళికాక మునుపే. ఆ ప్రేమని వెళ్ళబెట్టకపోయాడా?" అన్నాను కోపంగా. కసి కనిపించనీకుండా.

"నా పెళ్ళి అంత తొందరలో అవుతుందని అనుకోలేదుట. తనకి నా మీద ప్రేమ వున్న సంగతి అన్నకి తెలుసట. అందుకే అన్న నా పెళ్ళికి యిష్టాపద లేదు కాబోలు."

"పోనీ నీ పెళ్ళి యిద్దరూ కలిసి ఆపించలేకపోయారా?"

"ధైర్యం లేకపోయిందీ? యిప్పుడు నిర్మలంగా గడిపే నీ సంసారాన్ని కలత పెట్టేందుకు ధైర్యం వచ్చింది? రాధా ఎంత యిప్పుడు నిర్మలంగా గడిపే నీ సంసారాన్ని కలతపెట్టేందుకు ధైర్యం వచ్చింది? రాధా ఎంత తెలివిగలవాళ్ళూ, ఒక్కొక్క సందర్భంలో మూర్ఖులైపోతారు సుమా? నువ్వింకొకరి భార్యవి. నీ కనేక బాధ్యతలున్నాయి. మీ అన్నయ్యా అచ్యుతం దేశదిమ్మరులు. నేను కనుక్కుంటా యీ సంగతంతా మీ అన్నయ్యేరీ?"

"అన్నయ్యా డాక్టరుగారూ క్లబ్‌కి వెళ్ళారు."

"మీ ఇద్దర్నీ యింట్లో వదిలా? భేష్"

రాధ చురచుర చూసింది. ఆ ఎముకల పుట్టను చూసి ఏ మానవమాత్రుడూ తప్పు పట్టలేడు. రాధ సౌశీల్యం గురించి కాదు నా చింత. పరిశుభ్రమైన మనసుని పాడుచేసుకుంటోందే అని నా బాధ.

"ఇంతకీ అచ్యుతం యిక్కడికెందుకొచ్చినట్టు?" అని అదిగాను.

"ఏమీలేదు. డాక్టరు టి.బి. అన్నాడు. డాక్టరెందుకు? ఆ మాట మనమేచెప్పచ్చు. శానటోరియంలో జేరాలిట. చివరిసారి నన్ను చూద్దామని వచ్చాడు. అట్టే ఆశలు లేవు. మహా అయితే ఓ యాడాది బతకొచ్చుట. అదిగాక అతనికి జీవించాలని పెద్ద కోర్కె కూడా లేదు" అంది రాధ విచారంగా.

"ఏం?" అన్నాను. జారిపోతున్న రాధని పట్టుకోవలసిన భారం నాది. "అయితే రాధా ఆరేళ్ళనుంచీ రాక యిప్పుడు రావడమేం? ఆరోగ్యం నాశనం చేసుకుని నువ్వు కారణం అని యిప్పుడు చెప్పటం దేనికి? ఇంత హీనస్థితికి రాకమునుపే నిన్ను చూసి వెడితే కనీసం నీకు శాంతి అయినా వుండేదిగా. తను మనసారా ప్రేమించిన మనిషి అశాంతి పాలు కాకుండా వుండేదిగా?"

"నువ్వు నాగురించి తాపత్రయపడుతున్నావుగాని అతని హృదయాన్ని చూడటం లేదు, మణీ. ఏ ఆశా చిగురించక జీవితపు ఆఖరి దినాల్లో యిక్కడికొచ్చి.."

"వొచ్చి? అతనికి ఏం కావాలి? ఎందుకు వచ్చాడు?"

"అతనికి ఏమీ అక్కర్లేదు. నన్ను కడసారి చూద్దామని వచ్చాడు. అతను కోరేదేమిటి? నాకు నేనే" అని నా కళ్ళలోకి చూసి ఆగిపోయింది.

చివరి అధ్యాయం దగ్గరికొచ్చామన్న మాట. "అసలు నీ వుద్దేశం ఏమిటి, రాధా? నువ్వు అతన్ని ప్రేమిస్తున్నావా?"

రాధ నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండా రోగిష్టి నవ్వు నవ్వింది.

"ఎల్లుండి పొద్దుట అతను శానటోరియం లో జేరుతాడు. నా కోసం అతను చనిపోడం యిష్టంలేదు. నా చేతనైన కృషితో మృత్యు ముఖం నించి అతన్ని తప్పించాలని వుంది."

"నువ్వు అతన్ని ప్రేమిస్తూవుంటే నేను చెప్పకలిగిందేమీ లేదు. అది నీ హృదయానికి సంబంధించిన విషయం" అన్నాను ముక్తసరిగా.

రాధ ఆకాశంలోకి చూస్తూ కూచుంది.

"అయితే అతను నీ వల్లే ఈ స్థితికి వచ్చాడని నిజంగా నమ్ముతున్నావా రాధా? నిజంగా నీవల్ల యీ స్థితి కొచ్చిన మనిషి, అంత బాధ భరించగల వోపిక వున్న మానవుడు ఆఖరి ఘడియల్లో పాలల్లో వుప్పురాయి విసరడు. నీ జీవితంతో చెలగాటమాడేందుకు అతనెవరు? నిజంగా స్వార్ధం కనకలేకపోతే అసలు యిక్కడికి రానేరాడు. వొచ్చినా పెదవి మెదపక

వెళ్ళిపోయి వుందును. నువ్వు కళ్ళు తెరిచి ముళ్ళలోకి అడుగెడుతున్నావ్. ఊబిలో కూరుకుపోతావ్. తిరిగి డాక్టరుగారింటిలో ప్రవేశించే అర్హత నీకు వుంటుందా? బాగా ఆలోచించుకో" అని చివాలున లేచాను.

"మేమిద్దరం మాట్లాడుకోవల్సిందేమీ లేదింక. ఇద్దరిదీ చెరోదారి." ఆ రాత్రి ఎన్నీ పీడకలలు వచ్చాయి. రాధ మీద చెప్పలేనంత ప్రేమ పుట్టుకొచ్చింది. నేను ఏం జేసి రాధను కాపాడగలను? నిజంగా నాకు ప్రేమ తెలీదా? ప్రేమించగలిగే హృదయం నాకు భగవంతుడు ప్రసాదించలేదా? 'ఎందుకలా వులికిపడుతున్నావ 'ని ఆయన ఎన్నోసార్లు అడిగారు.

తొలికోడి కూసిన తరువాత, కాస్త కునుకు పట్టింది. ఇంతలో పాలమనిషి దబదబా తలుపు కొట్టాడు. తలుపు తీసి చూతును గదా పాలమనిషికాదు రాధ. నన్ను గట్టిగా కావలించుకుని బావురుమంది.

తెలతెలవారుతుండగా అచ్యుతం తన చేతుల్లోనే నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాట్ట. రాత్రంతా అతన్ని ఎంత శపించి పోశాను.

# ఒకటే చీర

## శ్రీ వేలూరి శివరామశాస్త్రి(శతావధాని)

### (ఆంధ్ర పత్రిక 1947 సెప్టెంబర్ 17 నుంచి)

'**నీవు తిని వచ్చిన** తరువాత నే బోయితిని వత్తును గాని, ముందు నీవేగి తినిరా, చీకటిపడినను నాకు భయములేదు' అని అత్తయనెను

అచ్చరయినను పిశాచముగా జేసివైచు కోక కట్టుకుని కూర్చున్న కోడలొక్క నిమిషమాలోచించి 'కాదు కాదు, మీరే ముందు వెళ్ళవలయును, మీరు వచ్చిన తరువాతనే నేను' అని యనెను.

'మానమును మరియాదయు ఎక్కువ వారికిగాని మముబోటి తక్కువవారికి గావమ్మా! కాబట్టి ఆ సంగతి వదిలిపెట్టు. నీకు మధ్యాహ్నము కూడా కూడు లేదు. పైగా చిన్నదానవు. చీకటిలో ఆ గుంపులో త్రోసికొని వచ్చుటయు ప్రమాదము' అని అత్తయనెను.

'మానమును మరియాదయును, గాలియు, నీళ్ళయువంటి వత్తా! తండ్రియును, కొడుకును తిని పదకొండు గంటలకే నాగరాజుగారి యింటికి వెళ్ళిరిగదా! మీకు మాత్రము మధ్యాహ్నము కూడేది? కాబట్టి ముందర మీరే వెళ్ళిరండు, తరువాతనే నేను వెళ్ళుదును. చీకటి యనియు, గుంపనియు నాకొక దయ్యము చూపితిరి. దయ్యములు నన్ను జూచి పారిపోవును ' అని కోడలనెను.

'కాదమ్మా నీవు పచ్చ పసుపు పోసినట్లులు మెరుపులు ముద్ద చేసినట్లుందువు. నీకు దృష్టి తగులునమ్మా మరి చెప్పను '

'మీ మాటయే నిజమగుగాక మెరుపుల ముట్టినచో షాక్ తగులునత్తా! దానికేమిగానిముందు మీ వంతు.'

'కోడలు మిగుల వినయ విధేయతలు కలది అత్తమాట కెన్నడు నెదురాడి యెరుగదు. ఆడుచో, మరి వింధ్యపర్వతమే ఈ సంగతి ఆ యత్తకు తెలియును కాబట్టి యిక లాభము లేదనుకుని అత్త తన అతుకులబొంత విడిచి అటకమీది చీర తీసి కట్టుకుని నాగరాజుగారి సత్రమునకు వెళ్ళెను.

ఆ బస్తీలో నెటు చూచినను నాగరాజు పేరే నాగరాజు ఆసుపత్రి.నాగరాజు అనాధ శరణాలయము. నాగరాజు దేవాలయము. నాగరాజు కాలేజి, నాగరాజు సత్రము, నాగరాజు కొళాయి, నాగరాజు వీధి. వీధి యేమి కర్మము ఇంక ఆ బస్తీ బస్తీ నాగరాజపురమైపోవునని అనుకొందును.

నాగరాజిపుడు పేదవారికి జావపోయుటకొక సత్రమారంభించెను. ప్రతి దినము సాయంకాలమారుగంటలకారంభము, పది గంటలకు భరత వాక్యము కష్టపడి సంపాదించుకొనువారు గుడ నిట దినమరగి సోమరులయిపోదురను సదుద్దేశముతోడనే యిపుడతడు నూకల జావ పోయుట కేర్పాటొనరించెను. కష్టపడి సంపాదించుకొనగలవారికి ఈ నూకల జావ తినుట అవమానమును అన్నదమ్ములని యతడెరుగక పోవచ్చును.

రోడ్డు కిరుప్రక్కలనున్న మురికి కాలువల నీరు తగలకుండ జనులు కడు జాగరూకతతో గూర్చుండిరి. దుమ్ములేవకుండ రోడ్లమీద నీరు కొట్టిరి. నాగరాజు అండ్ సన్స్ వారి బియ్యపు మరయందును, పిండి మరయందును, నూనె మరయందును, పంచదార మరయందును, పనిచేయువారెందరో వచ్చి విస్తళ్ళు వేయదొడగిరి. నాగరాజును, అతని కొడుకు గంగరాజును బంతుల వెంట దిరుగుచు అజమాయిషీ చేయుచుండిరి. కొందరు పచ్చడియు, మరికొందరు కూరయి వేసికొనుచు బోవుచుండిరి. తరవాత నూకల జావ వచ్చెను. అది పేరునకే జావకాని తినుటకు ముద్దకట్టుగనే యుండెను.

దరిద్రనారాయణులందరును, దంతయంత్రములు విప్పిరి. 'ఇంక నొక యేడాదివరకును తిండిలేక చావమ'ను ధైర్యము వారి మొగములలో గనబడుచుండెను. గ్రుడ్డివారందరును నాగరాజును చూడవలెయననియు, కుంటివారంధ్రందరును నాగరాజు మంగలికి పరువెత్తి జేపట్టవలయుననియు దలచుచుండిరి. అంగవైకల్యము లేనివారందరును నాగరాజును, అతని కుమారుడు తమ నడుమునుండి పోవుచుండగా తలలు వంచుకొనుచుండిరి.

తన యింటిచుట్టును నలువైపులనున్న రోడ్ల నడుమ నడుచుచు, ఈ దరిద్రనారాయణులను జూచుచున్న నాగరాజు హృదయం బరువెక్కెను. శిల్పసంపదతో, రసపురుషుని దెలుపు తన పాలరాతి మేడ చుట్టును కూర్చున్న యీ

జీవచ్ఛవములను జూచుచున్న నాగార్జునకు, సృష్టిచేయు బ్రహ్మకీ విశ్వమునిండ శవములు కనిపించుచో నెటులుండునో యటులుండెను. అతడు వడివడిగా ఆ రోడ్డుదాటి యెడమవైపు రోడ్డుమీదికి దిరిగెను.

అచట బంతులన్నియు పూలమొక్కలు పాతిన చందముగా నుండెను. అతని కంటికి గొంచెము శాంతి దొరకెను. నడుచుచు నడచుచు నున్న వాడచట నాగి యచట గూర్చున్న వారినందరను పరికించెను. పలువురు తన మిల్లులలో పని బాగులవారే 'వీరుగూడ నిచటి కేల వచ్చిరి? ' అని యతడనుకొనెను. ఇక నిలిచినచో బాగుండదు. వారందరు ఆడువాండ్రు. అతడు మెలమెల్లగా పదియడుగులు నడచెను. అచట వింత తోడను, వెగటు తోడను అతడాగిపోయెను. మాతరమ్మ ప్రతిదినమును తనయింటికి పాలు తెచ్చియిచ్చును, బియ్యపు మరలో కూలిది.

మాతరమ్మ జావముద్దు తినుచున్నది. ఆతడాగి చూచెను. మాతరమ్మయు జూచెను. ఆమెలో నెక్కడేని యేమాత్రమేని సందియము లేదు. తన హక్కును తాను వృధాచేయకుండా వినియోగించుచున్న చందముగా తినుచు లోలోపల నాగరాజునకు మ్రొక్కుచున్నది. నాగరాజు కొడుకును బిలిచి సరిగా వినియోగము చేయింపుమని చెప్పి మేడలోనికి వెళ్ళిపోయెను.

'అప్పుడే వచ్చితిరేమి? దరిద్రనారాయణ సేవ సమాప్తమా?' యని యతని భార్య యోగమాయ ప్రశ్నించెను.

'ఇది సేవకాదు, పరీక్ష '

'నారాయణునికి పరిక్షయా?'

'ఆ, దరిద్రనారాయణ పరీక్ష ఈ గుంపులో మన మిల్లులో పనివాండ్లు కూడా పలువురు దూరిరి. వారికేమి రోగము? వారిలో నొకొక్క యాడుదెటువంటి యెటువంటి చీరకట్టుకుని వచ్చినదో యొకపరి చూడు. వైస్రాయివిందుకు వచ్చినట్లు మాతరమ్మయు వచ్చినది. నీవుకూడా అంత విలువగల కోక కట్టవు. నీవెపుడో అట్టి కోక కట్టినటులు గురుతు. '

యోగమాయ కొంచెము సిగ్గుపడి యిటులనెను. 'సరి సరి మాతరమ్మయు నామె కోడలు జయయు, ప్రతిదినమును మిల్లుకు వచ్చుచు పాలు పిండంచి మనకు దెత్తురు. ఒకనాడు నేనే పాలగిన్నె తీసికొనవలసి వచ్చెను. ఆమెను చూతునుగదా గుడ్డలమ్మ. బీరువా తీయగనే ఒక చీర కనబడెను అది కట్టించి ఆమెనపుడు మిల్లుకు పంపితిని వాండ్లు చాలా మంచివాండ్లు. '

'మంచివాండ్లగుచో నిక్కడి కేలవత్తురు? పేదలకు సత్రముగాని వీరికా? వీరికి మనము జీతము లిచ్చుటలేదా?'

'ఏమిచ్చుచున్నారు?'

'నాకు గురుతా? గుమాస్తాని అడుగు'

'మీరిచ్చునది తమకు జాలినచో మాతరమ్మ చచ్చినను సత్రమునకు రాదు '

'ఆడువాండ్రమీద నీ కభిమానము'

'ఒకవేళ నున్నచో అది మీరనుకునినటులు తప్పుకాదుగాని, మీరిచ్చు జీతము వారి కుటుంబమునకు జాలదు అది యటులుండుగాక నాకుకూడ మీ సత్తరువున వారితోపాటు తిని రావలయునని సంకల్పము కలుగుచున్నది '

'ఏమేమి?'

'ఇపుడొకడు ఈ దరిద్రులకు ప్రతినిధిగా మోకాలుదిగని కొల్లాయ కట్టుకొనుచుండగానే నొక యేడాదిపాటు దరిద్రుల దుఃఖమెంతయో కనుగొనుటకు నూకలకూడు తినజాలనా? అదియుగాక కాయకష్టమొనరించి మన సంపదలో గొంతుకు గానున్నను గొంతకు కారణమైన మన యీ కూలివాండ్ర తరువాతనే యీ దరిద్రులు మన యింజనీరుల తరువాతనే యీ దరిద్రులు '

హేతుపూర్ణమైన యీ వాక్ ప్రవాహపుటురవడికి నాగరాజు మనస్సు చాలాదవ్వుకొట్టుకుని పోయెను.

సరిగ్గా ఆ సమయమునకు మాతరమ్మ వారి ముందరికి వచ్చి కొంచెము వెనుకకు తగ్గి తలుపుచాటున నిలువబడెను.

నాగరాజు కొంచెము బిడియపడి మేడమీదికి పోబోయి గదిలోనికి మరలెను.

'కోడలిని దీసికొని రాకుండా నీవొక్క తెవే వచ్చితివేమి?' అని యోగమాయ అడిగెను.

'చీర్ర్' అని ఆగిపోయి కొంచెము సిగ్గుపడి వేదన ననుభవించి మాతరమ్మ వడివడిగా వెళ్ళిపోయెను.

మాతరమ్మ వెళ్ళిన గంట తరువాత కోడలు జయ ఏ రోడ్డు మూలనో కూర్చుండి ఆకలి పోగొట్టుకుని కలకలలాడుచు యోగమాయ యెదుటికి వచ్చి దండము పెట్టి నిలువబడెను.

'గదిలో మీ బాబుగారున్నారు, ముందు వారికి దణ్ణము పెట్టవలెను ' అని యోగమాయ అనెను.

జయ నోరునుండి గబగబ ఈ మాటలు దొరలెను. 'ఇట్టి చీరలు మీ యింట నెన్ని కలవు?'

జయ భయపడెను అత్తగారు చావనయిరి చచ్చునుగాని దొంగతనము చేయదని జయకును దెలియును.అంత నామె భయము తొలగెను. పిదప ఇటులనెను. 'అమ్మగారు పదిరోజుల క్రింద మా యత్తగారికి ఈ కోక ఇచ్చిరి, అదే అక్షయముగా నున్నది''


'మీ రిరువురును గలిసిరాక నీవు వెనుక వచ్చితివేమి?'

జయకు నవ్వును దుఃఖమును వచ్చెను. 'అయ్యా, నేనిపుడు తమ సన్నిధానములో మనవి చేసికొనినదదే అందులకనియే మేమిరువురమును మిల్లు పనిలోనికి రాజాలకున్నాము. ఆమె యొకరోజునను, నే నొకరోజు నను వచ్చుచుందుము. అందువల్ల మా కొకపూటనే తిండి. మా యిరువురుకును కలిపి ఇదొకటే చీర.

# అదృష్టవంతుడు

## - బలివాడ కాంతారావు

(1984 ఆగస్టు 15 ఆంధ్రపత్రిక నుంచి)




**నరసింహం** చిన్నాన్న, అంటే మెచ్చుకోవటమో, తిట్టుకోవటమో వేర్వేరు సమయాల్లో వేర్వేరు కారణాలకు జరిగింది.

ఒకే ఇంటి పేరుండబట్టి చిన్నాన్న అని పిల్చేవాడినిగానీ, అసలు వాళ్ళకూ, మాకూ అట్టే సంబంధాలు లేవట. మా ఊరికి అయిదుమైళ్ళ దూరంలో వున్నా, రోజూ మా ఊరి మనిషిలానే ఉండేవాడు. ఆ రోజుల్లో అతని అపురూపమైన రూపు ఒక ఆకర్షణ అయితే, అతని గొంతు గలగల పారే గంగా ప్రవాహం. గంధర్వుడు దిగినట్లు రాలీ సైకిలు మీదనించి దిగేవాడు. తెల్లని గ్లాస్కో పంచెమీద, మరీ తెల్లని లాల్చీ వేసుకుని వచ్చేవాడు. మీసాలకు కూడా సంపంగి నూనే రాసేవాడేమో ఘుమఘుమ సెంటు వాసనేసేది. డబ్బు విరజల్లేవాడు. నాకు కొబ్బరి ఉండలు కొనిచ్చేవాడు.

మా అమ్మ మొదలు మా వీధిలో ఆడవాళ్ళకు అతనంటే భయంగా ఉండేది. ఎందుకా భయమో ఆ వయస్సులో నాకర్థంకాలేదు. అదృష్టవంతుడు కాబట్టి కలవారి ఇంటికి ఒక్కడై పుట్టాడు. అనుభవించి సుఖపడ్తున్నారన్నట్లు కొందరు మాటాడేవారు.

ఈ అనుభవం, సుఖం గురించి నేను ఇతని వద్ద తెలుసుకోవాలని పెద్దవాడినయ్యాక ప్రయత్నించకపోలేదు. ఒకసారి కలుసుకున్నప్పుడు "నీ తొలి ప్రణయం గురించి చెప్పగలవా, చిన్నాన్నా?" అని అడిగాను.

"నన్నెందుకు అడుగుతావు? ఊర్లో వాళ్ళనడుగు" అనేశాడు.

ఈ నాజూకు విషయం గురించి ఊర్లోవాళ్ళ వరకెందుకు వెళ్ళాలని మా నాన్నతో అన్నాను.

"నరసింహం చిన్నాన్న వాళ్ళ నాన్న మాట వినేవాడు కాదా?"

"నేనే ఆ రోజుల్లో ఒకసారి వెళ్ళి 'నీ కొడుకు మా ఊరొచ్చి పాడైపోతున్నాడు. కట్టుదిట్టం చెయ్యమంటే ఇదేదో మహా గొప్ప పని అనుకుని ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?"

"అందమైన ఆడవాళ్ళను ఆకర్షించిన అదృష్టవంతుడు నా కొడుకు. అందుకే ఏవగించుకుంటున్నావా అని నన్ను తిట్టాడు రా."

"ఈ విషయంలో ఊర్లో పోటీపడి చిన్నాన్న ఒకసారి దెబ్బలు తిన్నాడట"

"బంగారంబొమ్మ ఆ గోపిక. ఈ గోపాలుడి వెంట పడితే ఆ మొగుడన్నవాడు దాన్ని చితక తన్నాడు. వీడు దొరకలేదు. విశేషం ఏమంటే, వారం రోజులనాడు వాళ్ళింట్లోనే మకాం పెట్టి ఆ కొంప కూల్చేశాడు."

నరసింహం చిన్నాన్న బ్రహ్మచారిగా పోనీ ఎన్ని దొంకలంట తిరిగి గోడలు గెంతి కథానాయకుడైనా, పెళ్ళయినాక ఒక క్రమమైన జీవితానికి అలవాటు పడ్డాడేమో.

"పెళ్ళయ్యాక పిల్లలు కలిగారు కాబట్టి పాతను మరిచిపోయావా?" అంటే,

నవ్వుతూ "నేనింకా స్టేజి ఎక్కుతూనే ఉన్నాను. నాకింకా డిమాండు ఉంది" అన్నాడు సగర్వంగా.

ఆస్తి తరిగినా ఇంకా ఆ రాలీ సైకిలు మీద మా ఊరు వస్తూనే ఉన్నాడు. ఇద్దరి కూతుర్లలో ఒక కూతురి పెళ్ళి చేశాడు. ఆ పెళ్ళిలోనూ "నీ అనుభవం చెప్పవా" అని అడిగాను.

"ఇంకా దాహం తీరందే?" అన్నాడు.

"ఈ దాహం తీరేదెప్పుడు" అని అడిగితే తలలో వెంట్రుకలు చూపిస్తూ 'వీటి లెఖ్ఖ. వాటి లెఖ్ఖ పూర్తికానీ' అన్నాడు.

వాటి లెఖ్ఖ? ఆడది అతని వూడిపోయి రాలిపోయే వెంట్రుకతో సమానమన్న మాట అనుకుని ఊరుకున్నాను. పోనీ రెండో కూతురి పెళ్ళప్పుడైనా చెప్తాడని వెళ్తే ఆ రాలీ సైకులు వెనుక సీటుమీద నన్ను కూర్చోమన్నాడు. అలా ఏటి ఒడ్డుకు తీసుకువెళ్ళి సైకిలు స్టాండు వేసి ఆ ఒడ్డుపై ఇసుకలో కూర్చోపెట్టాడు. ఒయ్యారం వదులుగా విడిచిపెట్టే ఆడవాళ్ళు అతనివేపు చూస్తున్నారుగానీ నా వేపు చూడలేదు.

చీకటైపోయింది. లేచిపోతూ "నీలాటి రేవులో ఏం చూశావు?" అన్నాడు.

"చూశాను కానీ మనసు కట్టుకున్నాను" అన్నాను.

అతను ఒక్కొక్క ఆడదాన్ని ఆమె కట్టుకున్న చీర రంగుతో పోల్చి భంగిమలు వర్ణిస్తూ తన ప్రతాపం సగర్వంగా చెప్పుకున్నాడు.

"నాకు ఈ వర్ణనలు అఖ్ఖర్లేదు. కనీసం నీ భార్య ఎదురుగా ఎలా మసిలావో చెపితే చాలు" అన్నాను.

"ఏం? నా గురించి కథ రాస్తావా?"

"కథ కాదు. నవల రాస్తాను."

"పీకలు కోసే వాడికీ ఏదో ఒక న్యాయం ఉంటుంది. అది నీకు అన్యాయం కావచ్చు. వాడి న్యాయం వాడిది. సుఖపడవద్దనడానికి నీకేం హక్కుంది" అన్నాడు.

"సుఖానికి నిర్వచనం చెప్పగలవా?'' అని అడిగుదామనుకున్నాను గానీ అతనితో వాదించి నేను ఏదీ తెలుసుకోలేను. రెండు రకాల జీవితాలను జీవించే వ్యక్తి రెండు గుఱ్ఱాలపై నిల్చుని స్వారీ చేసేలాంటివాడే. 'అలా స్వారీ చేసే తెగువ ఎలా వచ్చింది ' అని తెలుసుకోవడమే నా ఉద్దేశం.

ఆ రెండేళ్ళలోనే అతని భార్య పోయిందని తెలిసి వెళ్ళాను. కనీసం ఇప్పుడైనా ఇతనిలో మార్పు వస్తుందని ఆశించాను. ఈ చావును చాలా చులకనగా తీసుకున్నాడు. ఎవరు మాత్రం మిగిలిపోతారన్నాడు. విలాసాలకు వెచ్చబెట్టగా మిగిలినది భుక్తికి సరిపడని రోజులొచ్చేశాయని గ్రహించాను. ఇప్పుడు సెంటు వాసన వెయ్యలేదు. మడతలు లేని బట్టలు వేసుకుంటున్నాడు. టైర్లు అరిగిన ర్యాలీ సైకిలు ఒక మూలపడి వుంది.

ఈ పరిస్థితిలో ఎవరైనా దగ్గర చేరారా అంటే అదీలేదు. కన్న కూతుర్లే దూరదూరంగా ఉన్నారు. అనుభవించింది జ్ఞప్తికి ఉంటే ఏ గోపికైనా కాస్త వండిపెట్టి పంపించేది. అదేం లేదు. నేను వెళ్ళేసరికి అతనే వండుకుంటున్నాడు. రెండు రోజులున్నా నాకు  ఇతని గురించి తెలిసిందెక్కువేమీ లేదు. అతని నోట విందామని ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఇవన్నీ అతనికి వచ్చిన కష్టాలని, స్వజనం చేసిన పాపాల ఫలితం అని పైవాళ్ళు అనుకున్నా అతనలా తీసుకోవటం లేదు. తన సుఖంలో ఇదో భాగంగా తీసుకుని ధీమాగా మాటాడుతున్నాడు. తిరిగి వెళ్ళిపోతుంటే కొంతవరకు నన్ను సాగనంపాడు. త్రోవలో అన్నాను.

"నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను. జవాబు చెప్తావా, చిన్నాన్నా ?''

"ఆ ప్రశ్నలేవో విననీ" అన్నాడు.

"పిన్ని పోయింది కదా ఆమె అభిమానానికి చిహ్నంగా గుర్తు చేసుకోవడానికి ఏదైనా ఊహ మిగిలిందా?"

"ఇంకో ప్రశ్న."

"పిల్లల అభిమానాలంటూ ఏమైనా గుర్తుందా?"

"ఇంకో ప్రశ్న."

"ఇంతమంది వలపులను కెలికావు కదా! ఏ ఒక్క వలపైనా పున్నమి వెన్నెలలా నిత్యం నీ మనసులో వెలుగుతోందా?"

ఫక్కున నవ్వాడు.

"ఏం నవ్వుతున్నా"వంటే

"నా నవ్వులోనే సమాధానం ఉంది. వెతుక్కో" అని వెళ్ళిపోయాడు.

ఈ కలయిక తరవాత నేను ఉద్యోగరీత్యా దూరప్రదేశాలకు వెళ్ళిపోయాను. రెండేళ్ళు పోయాక మా ఊరు వెళ్ళేటప్పుడు చిన్నాన్నను కలుసుకుని ఈసారి ఎలాగైనా అతనిని కథానాయకునిగా మలిచే నా నవలకు కావలసిన సరంజామా కూర్చుకుందామని బయలుదేరుతుంటే మా నాన్న అడిగారు..

"ఎక్కడికి?"

"చిన్నాన్న దగ్గరకు."

"వాడు అక్కడ లేడు."

"మరెక్కడ ఉన్నాడు?"

"ఎక్కడున్నాడో తెలీదు."

"ఇప్పుడు, పొలం అంతా వదలి సన్యాసుల్లో చేరాడా?"

"అవన్నీ అమ్మేశాడు."

"అమ్మేసి..?"

"తన చిన్న కూతురు వయసులో ఉన్న ఒయ్యారిభామను లేవదీసుకు పోయాడు."

నేను అలాగే నిల్చుండిపోయాను.

"మా వంశాన్ని అప్రతిష్టపాలు చేసేశాడు. వాడి ఖర్మ వాడనుభవిస్తాడులే" అని మా నాన్న తీర్పుకూడా ఇచ్చేశారు.

ఇంచుమించు అయిదేళ్ళవరకు అతని జాడ తెలియకపోయినా, అతను నా మనసులో తిరుగుతూనే ఉన్నాడు.

ఒకసారి మా ఊరు వెళ్ళినప్పుడొక విషయం తెలిసింది. చిన్నాన్న గురించి నేను విన్న వ్యాఖ్యానాలివి:

"గోకి దురద తెచ్చుకున్నోళ్ళ గురించి మరిచిపో" అన్నాడు మోటుగా ఒకడు.

"అదికాదురా అతను కన్ను గిటితే ఆడవాళ్ళు అతనితో లేచిపోయే వాళ్ళని ఎంత గర్వపడేవోడు. ఇది ఇంకొకడితో లేచిపోయి అతగాడి గర్వానికి చెప్పు దెబ్బ కొట్టింది కదరా! అందుకే కూలిపోయాడు."

"వాడికా.. ఇప్పుడు గతీ చెడింది. మతీ చెడిం"దని మా నాన్న అంటే.

మా దాయాది అన్నాడు. "సాగినన్నాళ్ళూ రంకుతో సుఖపడ్డాడు. సాగనప్పుడు మరి జారిపడడా?"

"తన కూతురి వయసు కుర్రది. పాపభీతికన్నా ప్రజాభీతైనా ఆలోచించలేదే?"

"అందుకే దేముడలా చేశా"డని ఇకొకడు కలుగజేసుకున్నాడు.

"దేముడిమీద నిష్టూరం ఎందుకేస్తావు? దేముడిస్తాడు గానీ వండి వార్చి వాతలేస్తాడా?"

"మరి ఈ గతేంటి? అంత బతుకు బతికినోడు ఛస్తే కాలుపట్టి ఈడ్వడానికైనా ఎవరైనా వెళ్తారా?"

"చేసిన పాపానికి నరకం ఇక్కడే అనుభవిస్తారంటారు. మనం ఆపగలమా?"

ఈ మాటలన్నీ వింటూంటే చిన్నాన్న గురించి ఏం రాస్తానని అనిపించినా పుడమి తల్లినించేకాదు, పామునించి కూడా ఏదో ఒక విషయం నేర్చుకోడానికి మనిషికి వీలౌతుందని బయలుదేరాను.

ఆ ఊరు ఆంధ్రా – ఒరిస్సా బార్డరులో ఉంది. రెండు రాష్ట్రాల సరిహద్దులను వేరుచేసే ఏరు మహేంద్ర తనయ ఒడ్డునే ఆ ఊరు. ఊరు శివార్లలో నది ఒడ్డునే జగన్నాధ స్వామి వారి ఆలయం ఉంది. ఆ ఆలయానికి ఆనుకుని పూజారి ఉండడానికి ఒక చిన్న ఇల్లు పెద్ద వరండాతో ఉంది. ఆ వరండా మీద నులక మంచం మీద మా నరసింహం చిన్నాన్న పడి ఉన్నాడు. ఆ మధ్య పాపిడి ఉంగరాల జుత్తు లేకపోతే నేను అతనిని పోల్చుకోలేక పోయేవాణ్ణి.

ఇదివరకు ఎన్నడూ కనిపించని ఎముకలు కనిపిస్తున్నాయి. కండలు కరిగిపోగా, చర్మం ముడతలు దేరిపోయింది. పక్షవాతంతో మంచమ్మీద నుంచి లేవలేకపోతున్నాడు. మూతి వంకరవటం వల్ల మాటలు సరిగా రాలేదు. అసలు మాటాడలేనంత నీరసంగా కనిపించాడు. ముసలితనంలో కూడా వయసుతో వెలుగొందుతాడనుకున్నాం. అలాంటిది వయసు ముదరకుండానే ముసలివాడైపోయాడు. ముడతలు పడ్డ ముఖం వేపు చూస్తుంటే లెక్కకు మిగిలిన తల వెంట్రుకలు కనిపించాయి.

పూజారి ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేరు. నేను వెళ్ళేసరికి మధ్యాహ్నం మూడు దాటిపోయింది. నాకు చిన్నాన్నను చూపించి పూజారి ఇప్పుడే వస్తానని వెళ్ళాడు. ఇదే సమయం అనుకుని నేలమీద కూర్చుని తన చెవి దగ్గరగా నోరు పెట్టి "నీ తొలి ప్రణయం గురించి చెప్పగలవా చిన్నాన్నా?" అని అడిగాను.

కాస్సేపు జవాబు వస్తుందేమోనని చూశాను. అతనిలో చలనం లేదు. వినబడలేదేమోనని చెవి దగ్గరగా జరిగి మళ్ళీ అడిగాను. ఏదో జవాబు వచ్చిందని ముందుకు వంగితే "గుర్తులేదు" అన్నాడు.

ఇతను కాస్త బలంతో ఉన్నాడని, మతి తప్పలేదన్న విశ్వాసం నాలో కలిగింది. ఏంలేకపోయినా జీవితం ఇక్కడ సాగిపోగల అదృష్టవంతుడనిపించింది. అందుకే ఇతని నోట నా ప్రశ్నలకు జవాబు విందామన్న పట్టుదల వచ్చేసింది.

"పిన్ని ఎప్పుడైనా నీ ఎదురుగా ఏడ్చిందా?"

"గుర్తులేదు" అంటూ సైగ చేశాడు.

"పోనీ పిల్లలు నీ గురించి.."

"గుర్తులే"దన్న సైగ చేశాడు.

గుర్తున్నా చెప్పడంలేదన్న అక్కసు నాలో పెరిగిపోతోంది. ఈ పరిస్థితిలో కూడా ఇతను ఆత్మాభిమానంతో అన్నీ దాపరికం చేస్తున్నాడనిపించి గట్టిగా అడిగాను.

"నీ జీవితంలో అనుభవించిన దాని గురించి చెప్పు."

"గుర్తులేదు"

"పోనీ నువ్వు అనుభవించిన సుఖం గురించి చెప్పు" అన్నాను.

"గుర్తులేదు."

"అనుభవం గుర్తులేదు. సుఖం గుర్తులేదు. ఏదీ గుర్తులేదు. నువ్వు మనిషివైతే గుర్తు ఉండేది. జంతువులకే ఏదీ గుర్తుండదు. జంతువు గురించి నేనేం రాస్తాను?" అంటూ చప్పున వచ్చిన కోపంతో లేచిపోబోతూ వెనకనే ఆ పూజారి ఉన్నట్లు గుర్తించాను. అతను నా మాటల్లో ఏం విన్నాడోగానీ ఆ ముఖంలో చిరునగవుతో నా కోపాన్ని దిగమింగజూశాడు. పూజారి వయసు చిన్నాన్న వయసంతే ఉంటుంది. ఎర్రటి గావంచతో ఒళ్ళు కప్పుకున్నా, మెడలో రుద్రాక్ష మాల కనిపిస్తోంది. ముడుకులు దిగని తెల్లని పంచె కట్టుకున్నాడు. ముఖంలో గంధంతో నిలువు బొట్టు పెట్టుకుని ఉన్నాడు.

"వెళ్తాను" అన్నాను.

"ఈ ఒక్కరాత్రి ఉండి నా పాకం రుచి చూడవా, బాబూ?"

ఆ మాటల్లో విధేయత స్ఫురించగా కాదనలేకపోయాను. అది కాకుండా నేను తిరిగి రావడానికి బస్సు లేదు. నేను ఒకసారి ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసి ఏటివేపు వెళ్ళాను. ఏటిలో ముఖం, కాళ్ళూ చేతులూ కడుక్కుందామనుకున్నాను కానీ ఆ నీలి నీటిని చూడగానే స్నానం చేయ మనసైంది. పూజారి వంట పూర్తిచేసి ఏటిలో స్నానానికి వచ్చాడు. తడి బట్టలతోనే వెళ్ళాడు. పట్టు పంచె కట్టుకున్నాడు. జగన్నాథునికి దీపారాధన చేసేటప్పుడు చేతులు కట్టుకుని బయట నిల్చున్నాను. హారతి పళ్ళెరాన్ని నాకే కాదు, చిన్నాన్న దగ్గరకు కూడా తీసుకు వెళ్ళి హారతి కళ్ళకు అద్దాడు. చీకటి పడ్డాక చిన్నాన్న మూలుగు వినిపించింది. కొద్దిగా వణుకుతున్నట్లు అనిపించింది. మంచం గదిలోకి ఈడ్చాడు. ప్రమిదలో దీపం. మొదట చిన్నాన్నకు తినిపించాడు. తరవాత ఇద్దరం రెండు అరటి ఆకుల్లో తిన్నాం. పప్పు, అన్నం, దొడ్లో టొమాటో కాయలు ఉడకవేసిన కూర. తియ్యని ఖర్జూరం పచ్చడీ.

తింటుంటే నాకేంటో ఎప్పుడూ నా జీవితంలో ఇంత తృప్తిగా తినలేదనిపించింది. ఎందుకు నాలో ఈ భావన రావాలని నా మనసు పరిపరి విధాల పోతోంది. ఆ రాత్రి ఆలయ మండపంలో దేవుని వేపు తిరిగి ఆ పూజారి దైవ సంకీర్తన చేస్తున్నాడు. ఆ మధురమైన గొంతుక నా మనస్సును ఆ ప్రభువు నందనవనమునకు అల్లుకుపోతోంది. ఏదో జ్యోతి వెలుగుతూ జీవితపు లోతులు చూడమన్నట్లుందా వాతావరణం.

అతను చాలా రాత్రివరకూ నిద్దరపోలేదు. మాటిమాటికీ లేస్తూ చిన్నాన్న క్రింద సేవజేస్తున్నాడు. అతను సేవచేస్తుంటే బహుశః తన భార్య ఉన్నా అలా చేసేది కాదేమో? చిన్నాన్నకి పూజారికీ ఏదో ఒక అనుబంధం ఉండి ఉంటుంది. బాల్య స్నేహితులో, లేక చిన్నాన్న వలన ఈ పూజారి ఏదైనా ఉపకారం పొందాడేమో? ఈ ఆలోచనలతో నాకూ నిద్దరపట్టలేదు. నేను కదలటం చూసి ప్రక్కనున్న చాపమీద దొర్లుతున్న పూజారి అడిగాడు.

"నిద్దుర రాలేదా, బాబూ?"

"లేదు."

"నీ గురించి ఏ ప్రశ్నలైనా వెయ్యొచ్చా?"

కొంప తీసి ఇతనూ ఒక రచయిత కాదు కదా? లేక నేను చిన్నాన్న చెవిదగ్గర వేసిన ప్రశ్నలన్నీ విన్నాడేమో? అవే నా మీద ప్రయోగించడు కదా? కొంతసేపయ్యాక "అడగండి" అన్నాను.

"మీ నాన్నగారు నిన్ను చిన్నప్పుడు తప్పుచేసినందుకు కొట్టారా?"

"కొట్టారు."

"బడిలో గురువుగారు చెవులు నులిపాడు కదూ?"

కొంపతీసి పూజారికి కర్ణ పిశాచిగాని ఉందేమోనన్న అనుమానం వేసినా నిజం దాచలేదు.

"చెవులు నులవడమేకాదు. కోదండం ఎక్కించాడు."

"మరి మీ అమ్మ చెప్పిన మాట వినకపోతే ఏం చేసింది?"

"ఒకపూట తిండి పెట్టలేదు. ఎంత ఏడ్చానో?"

"పెళ్ళయ్యాక నీ భార్య ఎప్పుడైనా నీ ప్రవర్తన సరిలేకపోతే బుద్ధి చెప్పిందా?"

"అవునవును. నాకు బుద్ధి చెప్పడానికి కొన్నాళ్ళు కన్నవారింటికి వెళ్ళిపోయింది."

"నువ్వెంత అదృష్టవంతుడివి, బాబూ!"

"అంతమందిచేత తిట్లూ, పోట్లూ తినటం అదృష్టమా?"

"అవే నిన్ను మనిషిని చేశాయి. అవి లేకే మీ చిన్నాన్న..."

"అయితే ఆ జంతువు కింద ఇంత సేవ ఎందుకు చేస్తున్నారు? అతనివలన మీరేదైనా ఉపకారం పొందారా?"

"నా సుఖం కోసం."

కాస్సేపు నా నోటంట మాట పెగల్లేదు.

"మీలా మనిషి ఆకారంలో తప్ప మీకూ ఇతనికి అనుబంధం అల్లుకోవలసిన ఎటువంటి గుణాలూ లేవు. అతను ఎన్నో పాపాలు చేశాడు. అలాంటి వాని క్రింద ఎటువంటి ఉపకారం పొందకుండా రాత్రీ పగలూ ఇంత సేవ చేస్తున్నారు. మీరు అనుకున్న ఈ సుఖం స్వరూపం ఏమిటో నాకు అర్థం కావటంలేదు."

కాసేపు నిశ్శబ్దం తరవాత అన్నాడు.

"దేవుని స్వరూపం తెలుసుకున్న వాడే సుఖం స్వరూపం తెలుసుకోగలడని నా విశ్వాసం."

చీకటిలో కూడా అతని చిరునగవు నాకో దివ్యజ్యోతిలా కనిపించింది.

# క్షమించాను

## - శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

(1957 - ఆంధ్ర పత్రిక వార్షిక సంచిక నుంచి)

**"మిమ్మల్ని క్షమించాను."**

చీకటిగదిలో ఆదిశేషయ్యగారు వంటరిగా యీజీ ఛైర్‌లో కూర్చుని ఆరాటంగా అటూ యిటూ మెదుల్తాండగా, అప్పుడే బండి దిగి, చేతి సంచితో, రేగిపోయిన జుట్టుతో, కళావిహీనంగా వున్న ముఖంతో, తడబడుతున్న అడుగులతో లోపలకు ప్రవేశించిన శకుంతల వొణుకుతూన్న చేతుల్తో లైటు వెలిగించి, ఆ దుర్భరస్థితిలో కూర్చునివున్న తండ్రిని చూసి నివ్వెరపోయి "అమ్మకి ఎలా వుంది నాన్నా?" అని ప్రశ్నించింది ఆతృతగా.

ఆయన ఉలికిపడి, మ్లానవదనంతో అటుకేసి చూచాడు. కానీ "వచ్చావా?" అన్న ప్రశ్నార్థకం అందులో లేదు. ఇంత ఆదుర్దాగా వచ్చిన కూతురిని ఏమని సంబోధించి ఏం చెప్పాలో పాలుపోవటం లేదు.

"నాన్నా!" అంది కూతురు భయంగా. ఆయన అయోమయావస్థ యింకా ఎక్కువైంది. ఎడమ చేత్తో లోపలకు పొమ్మని సౌంజ్ఞ చేయటం మినహా ఏమీ ఆచరించలేక తడబడుతూ వూరుకున్నాడు. ఆమె తేజోవిహీనంగా ఓ క్షణం తండ్రి ముఖంలోకి చూసి, సంచి అక్కడే జారవిడిచి, లేని శక్తి తెచ్చుకుని, కంగారుగా లోపలకు వెళ్ళిపోయింది. ఆయన బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు. "మిమ్మల్ని క్షమించాను. మిమ్మల్ని క్షమించాను.. మిమ్మల్ని క్షమించాను."

కళ్ళు తెరిచాడు. అయ్యో దీపం వెలుగుతోంది.

డాక్టర్ మందంగా నడిచి గేటుదాటి వెళ్ళిపోయాడు. పార్వతమ్మ మంచం మీద పడుకుని వున్న విశాలమైన గదిలో బెడ్‌లైటు మాత్రం వెలుగుతోంది సన్నగా. ఆదిశేషయ్యగారు కిటికీదగ్గర నిలబడి గేటుమీదుగా బయట చీకటిలోని శూన్యంలోకి చూస్తున్నాడు. డాక్టర్ రెండు నిమిషాల క్రితం వెళ్ళిపోవటం అస్పష్టంగా కనిపించింది మసకచీకటిలో. చీకటి ప్రథమ దశ, జీవితం చివరిదశ, విషాదంగా వుంటాయి.

"చలివేస్తోంది. తలుపులు మూసివేయరూ?"

ఆయన చప్పున తలుపులు మూసివేసి వెనక్కు తిరిగాడు. నెమ్మదిగా భార్య మంచాన్ని సమీపించి "దుప్పటి కప్పేదా?" అనడిగాడు ఆదరంగా.

"వద్దు. కాని పెద్ద లైటు వెలిగించరూ?" అని ఆమె కోరింది బలహీనస్వరంతో.

"వద్దు దీపం వెలుగు నీకు పరిశ్రాంతి కలిగిస్తుంది"

"అబ్బ చీకటిలోనే చచ్చిపొమ్మంటారా ఏమిటి? యమదూతలు వచ్చే వైనం ముందుగనే కనుక్కుని మీతో కొన్ని కబుర్లు చెబుతాను."

కొంచెం ఆలోచించి, చేసేదిలేక, పెద్దలైటు వెలిగించి వచ్చి దగ్గరగా కూర్చున్నాడు.

"మీ ముఖం అంత దిగాలుపడి ఉందేం? డాక్టరుగారేమైనా చెప్పారా?"

ఓ క్షణమైనా తిరగకముందే, మళ్ళీ తనే ఓమ్లానందహాసం చేసి "మా అమ్మకు అమ్మవారు సాక్షాత్కరించేవారుట. అటువంటి సమయంలో పరమేశ్వరుడు గరళాన్ని నిర్లక్ష్యంగా మ్రింగినట్లు యింతింత కర్పూరం మ్రింగివేసేది. ఓసారి అమ్మవారు మా అమ్మతో అందిట.

"నీ అంత్యదశ దుర్భరంగానూ, నీ కూతురి అంత్యదశ సుఖపూరితంగానూ గడుస్తుందని."

"అబ్బ ఊరుకో నీకు పుణ్యం వుంటుంది."

"అమ్మాయికి నాకు చెప్పకుండా ఎందుకు టెలిగ్రాం ఇచ్చారు? పనికుర్రాడు చెప్పాడులెండి."

"ఊరికేనే.. సరదాకి."

"నా జీవితంలో రెండే రెండు టెలిగ్రాములు వచ్చాయి మీ విలాసానికి. ఒకటి అమ్మ చచ్చిపోయినప్పుడూ, రెండవది నాన్నపోయి బైరాగుల్లో కలిసినప్పుడూ. ఇప్పుడు అమ్మాయికి ఒక టెలిగ్రాము వెళ్ళింది... రెం...డ."

"పార్వతీ"

ఆమె తక్షణం మాట్లాడలేకపోయింది. గాద్గధిక కంఠంతో యిందాకటినుంచీ మాట్లాడుతున్నదల్లా, పొడిదగ్గు వచ్చి ఆయసపడుతూ పడుకుంది. ఆయన నిర్ఘాంతత యింకా వదిలిపోక, చూసేసరికి వృద్ధాప్యం వల్ల కొంతా, జబ్బుచేత

మరికొంతా జీర్ణరేఖలు స్థావరం ఏర్పరుచుకున్న ఆ వదనంలో విషాదం కన్నీళ్ళ సెలయేరులా పారుతోంది. ఆ అశ్రువులు రక్తమిశ్రితమైనవి అయివుంటే, ప్రకృతి దేవత కొట్టిన కఠినమైన సుత్తిదెబ్బ సరిగ్గా మస్తిష్కం మీద తగిలివుండాలి.

"అబ్బా!" అందామె వేదనగా.

"నాలో ఏదో తుఫాను చెలరేగింది."

"ఇంకా?" అని కేవలం మనసులో అనుకున్నాడాయన.

"ఆ తుఫాను నీళ్ళకు నేలమీద మట్టి తడిసి, చెదిరి అడుగున వున్న గచ్చురాళ్ళు బయటపడుతున్నాయి."

"పార్వతీ! ఇదంతా నీవు సరిగ్గా చూడగలుగుతున్నావా?"

"ఆ! నేను చూసినంత అస్పష్టంగా వివరించలేకపోతున్నాను" అని ఆమె ఆకస్మికంగా తెల్లబోయి "నా జీవిత కాలలో నేను మీతో యింత చనువుగా, విపరీతంగా మాట్లాడనేలేదు. ఇంత జబ్బూ పడలేదు. ఒకరికి జబ్బు చేసినపుడు వారి చుట్టూ వున్నవారు సన్నిహితులూ అవుతారు, దూరంగానూ జరుగుతారు. మనం ప్రథమావస్థలో వున్నాము. ఇది మీ ఔదార్యం" అంది.

ఆయన ఆలోచిస్తూ బాధగా "నిజమే. నా జీవితకాలంలో నిన్నెపుడూ దయగా చూడలేదు" అన్నాడు.

" నా మాటలకు ఆశ్చర్యపడుతున్నారా?"

"లేదు. చెప్పు."

"మీరు చెప్పండి. వింటాను"

మొదట ఆశ్చర్యపడినా, కొంత చెప్పాలనుకుంటూ భార్య ముఖంలోకి ఏకాగ్రతతో చూశాడు. ఈమెకు యిప్పుడు యాభయ్యేళ్ళు సమీపించాయి. తనకన్నా అయిదేళ్ళు చిన్న. ఇంచుమించు ముప్పయి అయిదు ఏళ్ళ క్రితం తనతో సంసారయాత్ర ప్రారంభించటానికి వచ్చింది. తామిద్దరూ కలిసి ఎన్నో సుఖాలూ, కష్టాలూ పడ్డారు. ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్నారు. ఇన్ని సంవత్సరాల జీవితంలోనూ ఆమె తనమాటను ఎన్నడూ జవదాటలేదు. తనకెప్పుడూ ఎదురు చెప్పలేదు. క్రోధావేశంలో హింసించినా ఒక్క మాటయినా పన్నెత్తి పలకలేదు. ఈమె స్వాభిమానం మరిచిపోయింది. తానే దైవం అని కొలిచింది. ఒక్కొక్కప్పుడు ఆ అమాయకమైన శరీరం మీద చేయి చేసుకున్నాడు. తాను.

కష్టమ్మీద కన్నీళ్ళను నిగ్రహించుకుంటూ మళ్ళీ ఆలోచించసాగాడు. ఈమె తన భార్య. తనను మనస్ఫూర్తిగా ప్రేమించింది. ఒకసారి తనకేదో వ్యాధివచ్చి నెలల తరబడి మంచం మీద వున్నప్పుడు నిద్రాహారాలు మాని సపర్యలు చేసింది. తనకు తెలిసినంతవరకూ హిందూ సంప్రదాయం అంటే యిదీ అని ఆమెకు ఎవరూ నేర్పినట్లులేదు. ఇది అనాదినుంచి అనుశ్రుతంగా వస్తూన్న స్త్రీ హృదయాలోచన పెట్టిన భిక్ష. ఈమె అందంగురించి తనకు వ్యామోహం లేదు. తాను యాభయి అయిదేళ్ళ క్రితం పుట్టినవాడు కావడంచేత సౌందర్యాన్ని గురించి ఆలోచించే అభ్యాసం తనకులేదు,

అప్పుడప్పుడూ పరాయివారి అందచందాలని గురించి ఆలోచించేవాడు గాని, 'సౌభాగ్యం' అని లోకులు పిలుస్తారే, ఆ యీ లక్షణాలు ఆమెకు ఏ శక్తి అన్యాపదేశంగా ప్రభోదించిందో అటువంటిదే మరో శక్తి తనకూ ఎవరూ యివ్వని హక్కులున్నట్లూ, అధికారం వున్నట్లూ, అది తన సొత్తు అనీ బోధించి చలాయింపచేసింది. వాటిల్లో కొన్ని మాత్రం తండ్రి దగ్గరనుంచీ అనాలోచితంగా నేర్చుకున్నాడు. ఆ రోజుల్లో తల్లిని హింసించేటప్పుడు ఆయనపై కోపగించినా కూడా.

తమ ముప్పయి అయిదేళ్ళ సమిష్టి జీవితం ముగిసిపోయే తరుణం ఆసన్నమైంది. ఒకరాత్రి, రెండు రాత్రులు యిలా వ్యధాపూరితంగా గడిచిపోతాయి. తరువాత దయలేని ఓ భూతం వచ్చి చుక్క పెడుతుంది. ఒక ఎండిన మొండిమ్రాను మాత్రం జీవచ్ఛవంలా బ్రతుకుతుంది. ఈమె తన సహచారిణి. ఈమెకు యింతవరకూ ఎలాంటి ఉపచారమూ చేసి ఎరగడు. చేయాలన్న ఉబలాటం పొంగిపోతోంది ఇప్పుడు. కానీ తామిద్దరూ ముసలివాళ్ళయారు. ఒకరికొకరు తోడునీడగా, అండగా నిలవవలసిన సమయం యిది. చివరికి ఇలా అనుకున్నాడు. "ఇన్నాళ్ళనుంచీ యిది యిలా జరగాలి కాబట్టి జరిగిపోయింది. మా దాంపత్యం అనుకూలమైనదనే అంతా అనుకుంటూ వచ్చారు. ఎంత కాదనుకున్నా యిది నిజమేనని నా మనసు ఘోషిస్తోంది. అబద్ధమని నన్ను నేనెందుకు మోసగించుకోవాలి? మా జీవితంలో లోటు ఏమీలేదు. ఇది నా అదృష్టం."

ఈ చివరి ఆలోచన కలిగేసరికి యీ అదృష్టంలోని అంతరార్ధం మనసుని కలచివేసి, యిహ కన్నీళ్ళు నిగ్రహించుకోలేకపోయాడు.

"ఏడుస్తున్నారా?" అంది ఆమె అది చూసి.

"నిన్నొక్క ప్రశ్న అడిగేదా?"

ఆమె ఓ నిట్టూర్పు విడిచి "మీరు యిదివరలో అనేక చిక్కు సమస్యలను ఎదుర్కొన్నప్పుడు ప్రతిసారీ నా సలహాకోసం అనేక ప్రశ్నలు వేసేవారు. నేను అది పరమభాగ్యంగా యెంచి నా బుద్ధినంతా వుపయోగించి నానా అవస్థపడి జవాబులు చెప్పి మీ ముఖంలో ఎటువంటి భావాలు మెదుల్తున్నాయోనని ఆతృతగా చూసేదాన్ని. ఏనాటికైనా అక్కడ సంతృప్తి చిహ్నం కనిపిస్తుందని నా ఆశ. కానీ ఒక్కనాడూ మీ ముఖ కమలం వికసించలేదు. ఒక్కసారి కూడా నా సలహా ప్రకారం ఆచరించలేదు. అసలు నా ప్రత్యుత్తరాలు వినాలన్న జిజ్ఞాసే కనిపించేదికాదు నాకు మీలో... అవి మా ప్రశ్నలు కావు. కేవలం స్వగతాలు."

"నేనడుగదలచుకున్న ప్రశ్నకు చేరువగా తీసుకు వచ్చావు ప్రస్తావన. పార్వతీ నువ్విపుడు పదిహేనురోజులనుంచీ మంచం మీద పడివున్నావు. మనమిద్దరం యీ స్థితికి లాక్కోబడివచ్చి ఇలా విచిత్రంగా కబుర్లు చెప్పుకుంటామని ఏనాడూ నేను అనుకోలేదు" ఆయన గొంతు జీరవోయింది. ఒక్క క్షణం కల్లోలమై వున్న మనస్సును పదిలపర్చుకున్నాడు. "నేను నీ యెడల చాలా అపరాధాలు గావించాను. అని తప్పనిసరిగా మగజాతి అభిజాత్యంతో ఆదరించాను. కానీ అన్ని

సన్నివేశాలలోనూ నువ్వేనాడూ నాకెదురు తిరగలేదు. ఆ గడబిడలు జరిగిన మరునాడే నేను ప్రేమగా పలకరించేసరికి పరవశమై సర్వం మరిచి నాతో కలిసిపోయేదానవు. ఇంత ఓర్పు నీకెలా వచ్చిందీ? నేను అన్ని అత్యాచారాలు చేసినా నన్నెలా ప్రేమించగలిగావు? చెప్పవూ?"

పార్వతమ్మ భర్తవంక విస్మయపాటుతో చూసింది. నేను వెంటనే ఆమె ముఖం పాలిపోయింది. నేత్రాంచలాలలో కొద్దిగా కన్నీరు చింది ఏటవాలుగా ప్రవహించింది. కానీ అది కొద్ది క్షణాలపాటు మాత్రమే. క్రమక్రమంగా ఆమె ముఖం నిండా ఆనందం నిండి తేజోవంతమైంది. సంశయం నశించి దృఢనిశ్చియం ద్యోతకమైంది.

"ఈ ప్రశ్నకు జవాబు ఒక్క వాక్యంలో ఎలా చెప్పను? ఇలా రండి. నాకు బాగా సమీపంలోకి వచ్చి కూర్చోండి."

ఆయన మంచం మీద ఆమెకు మరీ చేరువుగా జరిగి, స్థబ్ధంగా చూస్తూ కూర్చున్నాడు.

ఆమె చెప్పసాగింది.

"నేను యీ యింట్లోకి కాలు పెట్టటమే విచిత్రంగా జరిగింది. నాన్న యింటి విషయాలు అసలు పట్టించుకోకుండా వుండటమే కాకుండా చీటికీ మాటికీ అమ్మని చెయ్యి చేసుకుంటూ వుండేవాడు. అప్పటికి మట్టుకు ఆమె ఏడ్చి ఆయన మళ్ళీ తనను పలకరిస్తే సద్భావ్యమని తలుస్తూ ఆయన అనుగ్రహం కోసం నిరంతరం సతమతమవుతున్నట్లు నాకనిపించేది. నేను ఎప్పుడూ ఒంటరిగా కూర్చుని ఆమె దుఖాన్ని గురించి అమాయకంగా ఆలోచించటమేగాని, దగ్గరకు వెళ్ళి ఎప్పుడూ కలగజేసుకోలేదు. నాకు పధ్నాలుగేళ్ళ వయస్సు వచ్చాక నా వివాహం కోసం అమ్మ ముప్పొద్దులా తాపత్రయపడేది. నాన్నమాత్రం ఏమీ పట్టించుకోకుండా నిశ్చింతగా తిరిగేవాడు. మాది పల్లెటూరు కావడంవల్ల యిరుగూ పొరుగూవాళ్ళు నాకింకా పెళ్ళి కాలేదని దెప్పి పొడుస్తూ వుండటం నాకు దుస్సహంగా వుండేది. అమ్మ ఒకసారి నాన్న కాళ్ళ మీద పడి బిగ్గరగా ఏడుస్తూ మొరపెట్టుకుంది. ఆయన చాలాసేపు చీదరించుకుని, ఎంతసేపటికీ పాదాలు వదలక పోయేసరికి దయ తలిచినట్లు 'సరే' అని, అప్పటినుంచీ వారం రోజులు తిరిగి ఒక రోజున మీ సంబంధం కుదుర్చుకుని వచ్చేశాడు.

"కాపురానికి వచ్చేసరికి నాకు పధ్నాలుగేళ్ళు యింకా పూర్తిగా నిండలేదు. పల్లెటూరిలో పుట్టి, అక్కడే పెరగటం చేత నేను అభమూ, శుభమూ ఎరుగని పిల్లను. బస్తీవాళ్ళ లక్షణాలూ, సంప్రదాయాలు చాలా కొత్తగా కనిపించేవి. నేనూ మా ఊళ్ళో చాలామంది పిల్లలతో స్నేహం చేశాను. ఆడుకున్నాను. మా పల్లెటూరి ఆడపిల్లల స్నేహాలు విచిత్రమైనవి. కొంతకాలం విడిపోయి వాళ్ళమీద వీళ్ళు వీళ్ళ మీద వాళ్ళు గుసగుసలు చెప్పుకుంటారు. వాళ్ళ విరోధాల కారణాలు చాలా జాలికరంగా, హాస్యాస్పదంగా వుంటాయి. తర్వాత ఎంత ప్రాణమిత్రులుగా వున్నవారైనా సరే పెళ్ళిళ్ళయిపోయాక ఎక్కడికెక్కడికో వెళ్ళి ఒక్క ఉత్తరం ముక్కయినా రాసుకోరు. ఒకరినొకరు త్వరగా మరిచిపోతారు. పెళ్ళయిన మరునాటి నుంచీ పెద్ద ఆరిందలా మాట్లాడుతారు. తన భర్త తనని చిత్తుగా తన్నినపుడు ప్రక్క యింటి యిల్లాలు ఖేదం పొంది, వచ్చి

"అయ్యో పాపం" అను సానుభూతి ప్రదర్శించకబోతే "వెళ్ళండి. ఇది మా స్వవిషయం" అని నిష్కల్మష హృదయంతో పలకటమే పరమ ధర్మంగా ఎంచటం వాళ్ళ పాతివ్రత్య లక్షణం.

అలా మీ యింట్లో అడుగు పెట్టాక యిరుగూ, పొరుగు వాళ్ళని చూసినట్లుగానే నా జీవితమూ ఆరంభమయింది. నేను చదువురాని మొద్దుననీ, అభమూ శుభమూ తెలియనిదానిననీ కూడా నేననుకోకుండా చేసేవాళ్ళు. ఎందుకంటే నా కనుభవంలేదు. ఏది ఎలా జరిగినా అది అలా జరగాల్సిన విషయమే కాబోలునని అనుకుంటూ వుండేదాన్ని. అప్పటిరోజుల్లో అత్తాకోడళ్ళ మధ్య వుండే సంబంధాలూ, ఆ ప్రవర్తనలు, ఆంక్షలు యీ కాలం పిల్లలకు చెబితే అవి కథ అనుకుంటూ నిట్టూరుస్తారు. ఎందుకంటే మన కళ్ళముందు జరిగే విషయాలను మనవికానట్లు ఎవరి కథగానో చెబితే కళ్ళు చెమ్మగిల్లి, దుఃఖపడటం రివాజు.

"నన్ను అత్తగారు నేను పాతికేళ్ళ వయస్సులో వున్నపుడు కూడా కొట్టడం మీకు తెలియదు. నేను హైందవ స్త్రీని కాబట్టి ఆ విషయాలు మీకు తెలియకుండా దాచి నా పతివ్రతా ధర్మం నిర్వర్తించుకున్నాను.

"నేను సంసారంలో కొత్తగా అడుగుపెట్టినా ఆదినుంచి వస్తూన్న అభ్యాసమేమో పద్ధతులన్నీ పాతవిగానే వుండేవి. అత్తగారికి నేను ఒకర్తెనే కోడలినయినా ఆవిడ చర్యలు ఆవిడకే విపరీతంగా వుండకపోవటం అన్యాపదేశంగా పెద్దలనుంచి నేర్చుకున్న విద్య. మరో విచిత్రమైన విషయంకూడా చెప్పనా? ఆవిడనీ మామగారు అడపాతడపా కొడుతూండేవారు. వారికి ఎప్పుడూ ఎదురు పలకకుండా కిమ్మనకుండా వూరుకునేది. నిజమైన సంస్కృతి, సంస్కారం యిక్కడేవుంది. నాకు క్రొత్త అవటంచేత వంటరిగా కూర్చుని అప్పుడప్పుడూ వేదనగా ఆలోచిస్తూ వుండేదానిని. నా బాల్యస్మృతులు, వెర్రి మొర్రి ఆటలు అన్నీ స్పష్టంగా కళ్ళముందు మెదుల్తూ చెప్పరాని బాధగా వుండేది. ఆ బ్రహ్మాండమైన రావిచెట్టు, పండుగలకు పిచ్చి సంబరంతో దానికి ఉయ్యాలలు కట్టి ఊగటం, ఊరికి పడమరగా పోతూన్న కృష్ణ పాయలో పెద్దవాళ్ళతో చలిలో వెళ్ళి స్నానం చేయటం, విన్న పురాణాలే విని ఎప్పటికప్పుడు నూతనానందం పొందుతూన్న మనవాళ్ళు ఆ కథలు మాకు చెబుతూ, తమ చిన్నప్పటి అనుభవాలు పునశ్చరణ చేసుకుంటూ కన్నీళ్ళు విడవటం అవన్నీ గుర్తుకు వచ్చి ఆ జీవితానికీ యీ జీవితానికీ సమన్వయం చేసుకుంటూ చెప్పరాని ఆరాటానికిలోనవుతూండేదాన్ని. ఇటువంటి సమయాలలో ఆ బాల్యజీవితమే అమందానందకరమైనదనీ, తిరిగి అందులోకి పోగలిగితే బాగుందని అనుకోవటం ఎవరికైనా సహజం. కాని మనిషి పెరుగుదలతోబాటూ మానవధైర్యాన్ని పరీక్షించే అనేక సమస్యలు ఉత్పన్నమౌతూంటాయి. ఇది ప్రకృతి సిద్ధం. బాధ్యత అని గుర్తించి నిశ్చలమైన మనస్సుతో నిలబడినవారు ఏదో సాధించగలుగుతారు. పరీక్షలు వరుసగా తప్పుతూన్న విద్యార్థి, ఎలా కృతార్థుడవాలో చేతకాక 'యింతకంటే చిన్నతనమే బాగుంది. అప్పుడు యీ బాదరబందీ ఏమీ లేదు' అని దానిని తలుచుకుని ఉవ్విళ్ళూరుతూంటే యిహ వయసుకు బాధ్యత ఎందుకు? అందులో వీసమెత్తుకూడా ప్రయోజకత్వం లేదు. ఈ సత్యాన్ని తెలుసుకుని నేను విచారాన్ని మరిచి ముందు పురోగమించగలిగాను.

"సంవత్సరానికి ఏ ఒకనాడో తప్ప పుట్టింటికి పోయి ఎరగను. అమ్మ నన్ను ఏవో ప్రశ్నలు వేసేది. ఆదుర్దా పడేది. మళ్ళీ తనే నీతులు బోధించేది. నేను ముభావంగా ఊరుకునేదాన్ని, దేనికీ సమాధానం చెప్పక.

"మీరు అడిగిన ప్రశ్నకు జవాబు యిహ లభించబోతున్నదనుకుంటాను. ఇది మీకు చెబుతూ వున్నంతసేపూ మీరు ఎటూ చూడక సరిగ్గా నా కళ్ళలోకి చూస్తూవుండడి. నా కడసారి ప్రార్థన యిదే.

"నేను మీతో అలవాటు పడిపోయాను. చాలా సంవత్సరాలు గడిచిపోతున్నాయి. పెద్దవాళ్ళమైపోతున్నాం. మీరు నన్ను చాలాసార్లు కొట్టారు. ఒకసారి నా నెత్తి చిల్లుపడి నెత్తురు చుక్కలు రాలాయి. ఒకసారి మణికట్టు బొమిక విరిగి నెలరోజులు మంచాన వున్నాను. ఒకసారి మీ దెబ్బలకు, స్పృహతప్పి పడిపోయాను. కానీ ఏనాడూ మిమ్మల్ని ఎదురించలేదు. క్రోధపూరితంగా మీకేసి చూడలేదు. కిమ్మనకుండా, కిక్కురుమనకుండా వూరుకున్నాను. ఎందుకు?

"ఒకసారి మీరు రోజూ అర్ధరాత్రివేళ లేచి ఎక్కడికో వెళ్ళిరావటం ప్రారంభించారు. అప్పుడు ఒకరోజు రాత్రి పదకొండు గంటలవేళ మీకు పాదాలు పడుతూ కూర్చున్నాను. మీరు 'రెండుగంటలవేళ నన్ను తప్పకుండా లేపమ'ని చెప్పి నిద్రపోయారు. మీరు రెండు గంటలకు లేచి ఎక్కడికి పోతారో నాకు తెలుసు. అయినా అప్పటివరకూ మెలుకువగావుండి మిమ్మల్ని తప్పకుండా లేపుదామనుకుంటూనే, పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని వుండటం వల్ల ఎంత ప్రయత్నించినా నిద్ర ఆపుకోలేక, కూర్చున్నచోటనే నేలమీద వళ్ళుమరిచి వాలిపోయాను. దభీమని పెద్ద బాధతో మెలకువ వచ్చి ఉలికిపడ్డాను. మీరు చేతిలో ఓ కర్రతో ఉగ్రస్వరూపులై ఎదురుగా నిలబడివుండి "రెండింటికి లేపమంటే లేవలేదేం పొగరుబోతా" అని అరుస్తూ నన్ను లేవనీయకుండానే వీపు మీద పది పదిహేను దెబ్బలు కొట్టారు. నేను భయంతో 'ఎంత ప్రయత్నించిన నిద్ర ఆపుకోలేకపోయాన 'ని చెప్పాను కష్టమ్మీద లేచి నిలబడుతూ.

'అంత ఆదమరిచి నిద్రపోతావా భడవా' అని నన్ను చావగొట్టారు. తెల్లారిలేస్తూనే ఆ రోజు మీ చేత అన్ని దెబ్బలు తిన్నాను. బాధకు తాళలేక గ్రుడ్లనీరు క్రుక్కుకుంటూ మీ వంక చూశాను. ఏమీ ఎదురు సమాధానం చెప్పలేదు. క్రిక్కురు మనలేదు. తలవంచుకుని లోపలకు వెళ్ళిపోయాను. ఎందుకు?

మన అమ్మాయి పుట్టిన క్రొత్తరోజుల్లో నేను పగలు ఒంటిగంటకు దాన్ని పడుకోబెట్టి నిద్రపుచ్చి, మళ్ళీ ఎక్కడ లేస్తుందోనన్న కంగారుతో ఆదరాబాదరాగా అన్నం తింటున్నపుడు దబ్‌మని క్రిందపడ్డ చప్పుడు విని నోట్లో ముద్ద నోట్లోనే వుంచుకుని 'అమ్మో' అనుకుంటూ పరిగెత్తుకు వస్తున్నాను. ఆఫీసు గదిలోంచి పరిగెత్తుకు వచ్చిన మీరు 'అంత వళ్ళు తెలియకుండా చస్తున్నావా?' అంటూ నేను అమ్మాయిని యింకా నా చేతుల్లోకి తీసుకునేముందే కాలితో డొక్కలో ఒక్కటి తన్నారు. నేను ఎలాగో లేచి పిల్లను గుండెకు అదుముకుంటూ, బాధనంతా భరిస్తూ అక్కడినుంచి వెళ్ళిపోయాను. ఎర్రగానైనా మీ వంక చూడలేదు. ఎందుకు?

ఒకరోజు నేను గాఢ నిద్రలో వున్నాను. మీరు రాత్రివేళ యింటికి ఆలశ్యంగా వచ్చి తలుపు తట్టినట్లున్నారు కానీ నాకు మెలుకువ రాలేదు. చాలాసేపు తలుపు బాదినా నాకు మెలుకువ రాలేదన్న కోపంతో మీరు కంకర రాయి తీసి కిటికీలోంచి బలంగా విసిరేశారు. ఉలిక్కిపడి 'అమ్మో' అంటూ లేచాను ఏదో పీడకలకంటున్నదానినల్లా నుదురు రక్తం చిమ్ముతున్న చోట తడుముకుంటూ కంగారుగా లేచి వచ్చి తలుపు తీయగానే లోపలకు ఒక్క త్రోపు త్రోసి జుట్టు పట్టుకుని కొట్టారు. నేను మారుకూడా పలకకుండా యీ గొడవకు లేచి, ఏడుస్తున్న పాపని సముదాయించటానికి వెళ్ళాను. ఎందుకు?

"అత్తగారు యింకో రెండు మూడు నెలలకు చనిపోతారనగా మంచానపడి వుండికూడా, ఎవడితోనో నాకు సంబంధం కట్టారు. అది విని మీరు ముందూ వెనకా ఆలోచించకుండా నన్ను చావ చితక్కొట్టారు. ఇంతకంటే అవమానం నాకు వేరే ఏముంది? కాని నేను పెదవి విప్పలేదు.

మీ పరిచర్యల్లో ఏవో లోపాలున్నాయని అడపా తడపా కొట్టారు, తిట్టారు.

"ఒకసారి మణికట్టు బొమిక విరిగిందని చెప్పానే అప్పుడు నెలరోజులపాటు మంచం మీద వుండాల్సివచ్చింది. మీరు విసుక్కునేవారు. చాలాసార్లు ఒక్కొక్కసారి రెండు నెలల తరబడికూడా మీరు జబ్బులో వున్నప్పుడు కూడా నిద్రాహారాలు, సర్వసుఖాన్నీ త్యజించి మీకు సపర్యలు చేశానన్న విషయం మీ స్మృతిలో పడిపోయింది. వారం రోజులన్నా గడవకముందే రాత్రి సమయాలందు ఎక్కడికో రాకపోకలు సాగించరు. మరి నేను మాత్రం మనిషిని కాదా? కానీ మిమ్మల్ని పిలిచి 'నేను నెలలపాటు విస్మరించిన సుఖాన్ని, మీరు కొన్ని రోజులు మరిచిపోలేరా?' అని ప్రశ్నించలేదు.

"మీరు సంతోషంలో వున్నప్పుడు అది గ్రహించి అందుకనువుగా నేను మాట్లాడాలి. కోపంలో చికాకులో వున్నప్పుడు దూరదూరంగా తొలగాలి. ఏ క్షణంలో ఎట్టి అసంతృప్తి కలిగినా చీదరించుకునేవాళ్ళు. దెబ్బలకన్నా పదునైన మాటల్తో తిట్టి అవమానపరిచేవాళ్ళు. అతిహీనంగా చూసేవాళ్ళు. ఏమీ జరగనట్లు మసులుకునేవాళ్ళు. కానీ యిన్ని సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఏనాడూ పన్నెత్తి ఒక్క మాట అనలేదు. కన్నెత్తి కోరగా ఓ చూపు చూడలేదు. ఎందుకు? మీరు కారణం అడిగారు కదూ?

నేను యిప్పుడు మృత్యుముఖాన వున్నాను. మీరుగాని, డాక్టరుగారు గాని నా గురించి చెప్పకపోయినా ఏ అవ్యక్తపు పలుకులో నిజాన్ని వచిస్తూ నా శ్రవణ కుహరంలో ప్రవేశించగలిగాయి. ఇహ ఒకటి రెండు రోజుల్లో నాకు మీ అందరితోనూ ఋణం తీరిపోతుంది. ఇటుపై నాకు ఎవరి ఆంక్షా వుండబోదు. అందువల్లే యీవేళ మిమ్మల్ని నా చెంత కూర్చోపెట్టుకుని, నా మనసు యావత్తూ విప్పి చెప్పటం ప్రారంభించాను.

"ఇప్పుడు తదేకంగా చూడగలుగుతున్న మీ ముఖం వంక యిహపై చూడవలసిన అవసరం లేదు కాబట్టి, యిన్ని ఏళ్ళుగా మిమ్మల్ని ఆశ్చర్యపరచిన నా ఓర్పుకు కారణం చెబుతాను వినండి.

మగవాడు తుచ్ఛమైన కార్యాన్ని ఘనంగా ఎంచుతాడు. ఆడది ఘనమైన ఓ కార్యాన్ని అల్పంగా యెంచుతుంది. మీలోని భర్త నాలోని భార్యను నిర్దయగా కొట్టినప్పుడూ, దారుణ హింసావమానాలకు గురిచేసినపుడూ, ధిక్కరించడమూ, తిరగబడడమూ, పారిపోవటమూ, ఆత్మహత్యలకు పాల్పడటమూ మినహా ఆమె చేయగలిగిన ఘనకార్యం ఏమీ లేదని ఆమె అనుకుంటే యీనాటి ఆత్మ హత్యల సంఖ్యకూ, సంసారాలు పాడుచేసుకున్న వాళ్ళ సంఖ్యకూ మితి వుండేది కాదు. స్త్రీ ఎప్పుడూ తన శక్తికి మించిన పనిచేయాలని ఉబలాటపడుతుంది, సాధిస్తుంది.

పురుషుడు తనని హింసలపాలు చేసినపుడల్లా అతన్ని క్షమిస్తూ వుండటం స్త్రీ సాధించింది.

"మీ వల్ల నేను అవమాన దందహ్యమాన మానసురాల్ని అయినపుడల్లా మొట్టమొదట ధిక్కరిద్దామనుకునేదాన్ని. తరువాత బావిలో పడి చద్దామనుకునేదాన్ని. కానీ మరుక్షణంలో యీ అల్పమైన ప్రయోగాలకు నేనెందుకు పాల్పడాలన్న లజ్జ ముంచుకు వచ్చేది. వీటన్నిటికన్నా మించిన ఒక విశేషాన్ని నా ఆధీనం చేసుకుని మీకన్నా ఉన్నతురాలినన్న సంతృప్తి, గర్వం నాలో నేను ఆవహింపజేసుకోవాలి. వెంటనే మిమ్మల్ని క్షమించేదాన్ని.

అవును. మీరు నన్ను వేధించినపుడల్లా మిమ్మల్ని క్షమిస్తూ వచ్చాను. మిమ్మల్ని క్షమించానన్న ఆనందంతో, అభిజాత్యంతో రోజులు సునాయాసంగా, నిబ్బరంగా గడిచిపోయేవి. ఇదంతా అనుభవిస్తూ నాలో నేను ఎంత పరవశం చెందుతున్నానో మీకేం తెలుసు? పై చేయి నాది. ఇది మీకు చెప్పకుండానే దాచబోయేదాన్ని. కానీ చివరి ఘడియల్లో నా జీవితాన్ని పునఃవిమర్శ చేసుకుని, దేనిని గురించి నేనాలోచనా నిమగ్నురాలనై వున్నానో, దాన్నే మీరు ముళ్ళకంచెతో బురదనీటిని కదిపినట్లు కదిపారు. అందుచేత సర్వమూ మీకు వెల్లడించక తప్పలేదు. ఇదే మిమ్మల్ని విభ్రాంతి పరచిన నా బ్రహ్మాండమైన ఓర్మికి కారణం. ఇన్నాళ్ళూ... మిమ్మల్ని క్షమించాను.

ఆమె వదన మండలమంతా ఉన్మిషితమైపోయింది. మైకంలో మైమరుపులో క్షణకాలం మాత్రం కళ్ళు మూసింది. తర్వాత భర్త వంక చూస్తూ మెదలకుండా పడుకుంది.

ఆదిశేషయ్యగారి ముఖంలో నెత్తురుచుక్క లేదు. మలినపూరితమైన ఆ పదార్ధాన్ని అలానే భరిస్తూ నిర్విణ్ణుడై అలానే కూర్చుని వున్నాడు కొంచెం సేపు.

"ఈమెతో యిప్పుడు సంభాషించాలా?" ఈ భయాందోళనలు ఆయన్ని కృంగదీశాయి. ఇక్కడినుండి తప్పించుకోవటం కూడా కష్టమే. కాని యిక్కడ యీ మానవాతీతురాలిగా కనిపిస్తున్న వ్యక్తి ముందు కూలబడి ఆలోచనలు కొనసాగించటం అంతకంటే కష్టము. ఎలాగో సర్వశక్తులూ కూడదీసుకుని లేచి, తప్పటడుగులతో అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

కూతుర్ని అయోమయ పరిచి గదిలోకి సాగనంపి దీపం వేసి వున్న గదిలో ఆదిశేషయ్యగారు యింకా వంటరిగా కూర్చుని వున్నాడు దీనంగా. వదనంలో విరాగ రేఖలు స్పష్టంగా వ్యక్తీకరించబడ్డాయి యిప్పుడు. తనకు సమాధానం లభించింది. ఈ దీర్ఘకాల సంసారంలో పొందగలిగిన శాంతి, సౌఖ్యాల వెనుక అదమబడివున్న కారణం తెలిసింది. ఇరుగూ పొరుగూ చేత పార్వతీ పరమేశ్వరుల వంటివారని తమలో తామూ, బాహాటంగా కూడా అభినందించబడటంలో యీ ప్రతిష్ట ఎవరికి దక్కాలో తెలిసింది. తనలో దుర్మార్గమనే ప్రత్యేకత వుండికూడా ఆమె పెట్టిన భిక్షవల్ల మామూలు మనిషి క్రింద చలామణీ అయాడు. అసలు మగవాళ్ళంతా యింతేనేమో? మరి లోకం 'దుర్మార్గుడు' అని ఎవర్నయితే పేరుపెట్టి పిలుస్తుందో వాడిలో ఎంత దుర్మార్గం కరుడు గట్టుకుపోయివుండాలో.

తాను క్షమించబడుతూ పాపాలు చేశాడు. క్షమించబడుతూ వృద్ధుడయాడు. ఈ పాపానికి పరిధి వుంది. ప్రాయశ్చిత్తం లేదు కాని..? ఇంకా తనను ఏదో పీడిస్తోంది. అభిమానం చావకుండా నిక్కుతోంది. లజ్జ, నిర్లజ్జల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

"ఈ ముప్పయి అయిదేళ్ళ సంసార జీవితం" ఆయన ఆశ్చర్యాన్వితుడయాడు. ఒక విశాల హృదయం విధివిరామం లేకుండా ప్రసరించిన క్షమవల్లనే నలుగురిలోనూ అల్లరిపాలు కాకుండా కాపాడబడ్డాడు.

ఈ ఆలోచన తోచేసరికి మనసు భయావిష్టమై స్పదించింది. "నేను పరాధీనుడ్ని. పరాజితుడ్ని. పరాభూతుణ్ణి."

గత చరిత్రంతా ఒక్కసారి చెమ్మగిల్లిన నేత్రాలముందు సాక్షాత్కరించి కదలిపోయింది. ఆ కాలంలో అందరూ మానవుల్లా జీవిస్తున్నట్లు తనకు తెలుసునేమో తన భార్య తప్ప.

ఇంతలో మరో సత్యం స్ఫురించి కంపితుడయాడు. తాను ఆమెను ఎన్నిసార్లు కొట్టాడో ఆమెకు జ్ఞాపకం వుంది. తనకు లేదు.

ముచ్చెమటలు పోస్తూండగా కళ్ళు మూసుకుని గందరగోళమైన మనస్సుతో తబ్బిబ్బు అవుతున్నాడు వెనక్కి వాలి. డాక్టర్ యివాళ పెదవి విరిచాడు. మహా బ్రతికితే ఒకటి రెండురోజులు. ఆ తర్వాత తనని క్షమించేందుకు ఎవరూ మిగలరు.

ఈ పదిపదిహేను రోజులనుంచీ దేముడు చాటుగా తనకు అంతిమ కర్తవ్యం ప్రబోధిస్తూ వచ్చాడు. జన్మలో ఆమె గురించి తాపత్రయపడిన సమయం యిది ఒక్కటే. కానీ దానిని గురించి తలచటానికైనా తనకు అర్హత లేదు. ఈ కడపటి వివేకం అసంపూర్ణంగా వుండిపోయింది.

ఇపుడు ఏదో చిత్రమైన అనుభూతి కలుగుతోంది. దాన్ని వారించలేకపోవటానికి అశక్తత ఒక్కటే కారణమవుతోంది. ఇది తన దౌర్భాగ్యం. కాక యింకా అహం పూర్తిగా చావక ఏమూలనుంచో తొంగి చూస్తోందన్న జ్ఞానం కలగటం మరేమిటి?

అవును. తన మానవత్వం యింకా సంపూర్ణత్వం పొందలేదు. అందుచేతనే ఆమె చెంతకుపోయి ఏవో మాటలు చెప్పటానికి  యింకా ఉద్యుక్తుడు కాలేకుండా వున్నాడు.

"కాని తాను ధన్యుడు" ఈ యోచన తనువును పులకరింపజేసింది. మరుక్షణంలో కళ్ళనిండా నీళ్ళు పొటమరించాయి. తనకు యీ లోకం ముందు ధన్యత చేకూర్చిన ప్రాణిముందు మనసారా కృతజ్ఞత వెల్లడించటానికి తటపటాయిస్తే యీ పాపానికి పరిధి కూడా లేదు, 'తాను ప్రపంచంలో ఒకడు' అని ఓదార్చుకుంటూంటే ఎవరో అజ్ఞాత వ్యక్తి ఆ చుట్టు గీతను కూడా తుడిచి పారేసినట్లు ఆయన ప్రకృతి స్థితుడయాడు. వ్యవధానం తక్కువ. నెమ్మదిగా లేచి, ధైర్యంగా లోపలకు వెళ్ళాడు.

"అమ్మా!" అంది కూతురు గుమ్మం దగ్గర నిలబడి భీతిగా చూస్తూ.

పార్వతమ్మ నెమ్మదిగా కళ్ళు విప్పి "ఎవరు?" అనుకుంటూ అటు కేసి చూసింది. ఎవరో చూసి ఆనందపడి "తల్లీ రా.. " అంది నీరస కంఠంతో. కూతురు వచ్చి తల్లికి చేరువగా మంచం మీద కూర్చుని బెదురుగా పరికిస్తోంది. ఆమె మృదుహస్తాన్ని తన శుష్కహృదయం పైకి లాక్కుని పార్వతమ్మ "నాకంత్యకాలం సమీపించింది. నా చివరి మాటలు వినటానికి ఎందుకు వచ్చావు? పిచ్చితల్లీ" అంది డగ్గుకత్తితో.

కూతురు యీ మాటలు విని బెంగతో నిశ్శబ్దంగా ఏడవసాగింది. తల్లి గుండెపై తలవాల్చి "ఇలా ఎందుకయిందమ్మా ఎందుకయింది?"

"వెర్రి తల్లీ మీ తండ్రిగారి కళ్ళముందు నేను దాటిపోవటం నా మాంగల్య మహిమవల్ల అనుకుని ఎందుకు ఊరడిల్లవు? ఈ సౌభాగ్యం అందరికీ ప్రాప్తిస్తుందా?"

ఆనందోద్రేకంతో వెలిగిపోతూన్న తల్లి కృశించివున్న వదనంలోకి తేరిపార చూసింది కూతురు. కాని అందుకు కారణం వేరుగా భావించింది. కేవలం యిప్పుడు ఆడిన మాటల్లోని తాత్పర్యమేనని ఆమె అపోహ.

"అమ్మా" అంది బాధతో. ఏదో చెబుదామనుకుంది. కానీ దుఃఖంతో గొంతు పూడిపడి సాధ్యంకాలేదు. కొద్ది క్షణాలు నిశ్శబ్దవాహినిలో ప్రవహించాయి.

"ఏమిటి?" అంది తల్లి ప్రేమగా.

తన సందేహం తీర్చుకుందామని "నీవింత ఆనందంగా వుండడం నేనెప్పుడూ చూడలేదు?" అంది.

"ఇందులో అంతరార్ధం నీకిప్పుడే తెలియదు"

"పోనీ చెప్పరాదా?"

"నా కడుపున పుట్టినదానవు. నువ్వు కూడా అనుభవశాలివై యీ సత్యం నీ అంతటనీవు శోధించగలిగిననాడు నీవూ యీ అనిర్వచనీయమైన సుఖంలో ఓలలాడుదువుగానిలే."

కూతురు విషణ్ణ వదనంతో ప్రశ్నార్థకంగా చూసింది.

"తల్లీ! నీకు పుణ్య స్త్రీ అంటే అర్థం తెలుసునా?"

"అమ్మా ఏమిటే యిది? నాకేదో భయంగా వుంది. నాన్నని పిలుస్తాను" అంటూ మళ్ళీ ఏడవసాగింది.

"వద్దు. కళ్ళు తుడుచుకో. చెప్పమ్మా. నీకు పుణ్య స్త్రీ అంటే అర్థం తెలుసునా?"

"ఉహూ.. తెలియదు."

ఆమె ఆలోచించి "నాకూ తెలియదు సరిగ్గా. నా జీవితం అందుకు ఉదాహరణ ప్రాయం అన్న అభిప్రాయం యింతవరకూ వుండేది. కాని నిన్ను చూస్తుంటే, అమాయకమైన నీ ముఖంలోకి చూస్తూంటే తప్పటడుగు వేశానేమోనన్న సంశయం పీడిస్తోంది. ఇప్పుడు నేను చేసినది ఒక ఉన్మాదక్రియా?" అని నిట్టూర్చి "అయ్యో ఎంత పొరపాటు జరిగిపోయింది. మీ నాన్నగారూ నువ్వూ ముఖాలు యిహమీదట కూడా చూసుకోవాలికదా అన్న జ్ఞానం లేకపోయిందే నాకు. ఆయనకు కనిపించావా?"

"ఆ... నాన్న చీకటిగదిలో వంటరిగా ఎలాగో కూర్చుండటం చూసేసరికి నాకు భయం పుట్టింది."

"ఏమన్నా అన్నారా నిన్ను చూసి?"

"పలకలేదు. విచిత్రంగా, అయోమయంగా చూశారు."

"ఎంత పాడుపనిచేశాను?" అని ఆమె తనలో తాను మధనపడసాగింది. పాపిష్టిదాన్ని. ఈ మేలుకొలుపు నాకు కలగకున్నా బాగుండేది. తుదిఘడియల్లో నాకు సౌఖ్యగరిమ అంతా నేనే పంచుకోవాలన్న స్వార్థ దాహం ఎందుకు కలిగింది?"

"అమ్మా!"

పార్వతమ్మ కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. ఎడతెగకుండా ప్రవహించసాగాయి. అవి కూతురు చూసి యీ హఠాత్ పరిమాణానికి దిగులు చెందటం కనిపెట్టి "నీ చేతుల్తో యీ నీళ్ళు తుడిచివేయవూ? నీ వల్లకాక మరి ఎవరివల్ల నా దుఃఖం ఉపశమనం చెందుతుంది?" అన్నది.

కూతురు తనలో తాను కుమిలిపోతూ, మృదువైన వ్రేళ్ళతో మెల్లగా కన్నీటిపాయలు, చారలు తుడిచివేసి మెదలకుండా కూర్చుంది.

"నా చేయి ఎత్తాలంటే బలహీనంగా వుంది. ఈ చేతిని నీ శిరస్సుమీద పెట్టుకోమ్మా"

ఆమె తన రెండు చేతుల్తో తల్లి దక్షిణహస్తాన్ని పట్టుకుని తలపై వుంచుకుని శ్రద్ధాభక్తులతో కనులు మూసుకుంది.

తల్లి అస్పష్ట స్వరంతో ఉచ్చరిస్తూ ఏదో ఆశీర్వదించింది. అది కూతురికి యిలా వినిపించింది

"అందరి స్త్రీలలానే బ్రతుకు"

కూతురు ఏదో పలకబోయింది. ఇంతలో గది బయట అడుగుల చప్పుడు వినిపించింది. ఇద్దరూ దృష్టి అటు లగ్నం చేసేసరికి ఆదిశేషయ్యగారు బరువుగా అడుగులు వేసుకుంటూ లోపలకు ప్రవేశించి యిద్దరివంకా తెల్లబోయి చూశాడు. ఒక్క దెబ్బతో ధైర్యమంతా సడలిపోయినట్లయింది.

పార్వతమ్మ కష్టమ్మీద "నాన్నగారు నేను ఏమయిపోతానో అన్న బెంగతో రెండురోజులుగా పచ్చి మంచినీళ్ళుకూడా తాగటం మానేశారు. వెళ్ళి భోజన సదుపాయం చూడమ్మా" అంది. కూతురు లేచి తండ్రివంక ఒకసారి భయభక్తులతో చూసి తలవంచుకుని అక్కడినుంచి నిష్క్రమించింది.

ఆదిశేషయ్యగారు "పార్వతీ" అని పిలవబోయి, తృళ్ళిపడి ఆమెవంక ఏకదీక్షగా అలానే చూస్తూ నిలబడిపోయాడు.

ఆయనవంక చూస్తూ పార్వతమ్మ ఆలోచించసాగింది. ఈయన మళ్ళీ తన ఎదుటకు వచ్చారు. తన మనస్సు యావత్తూ విప్పి చెప్పగానే, ఆ క్షణాలలోనే తన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని అప్పుడు నమ్మింది. కానీ అందుకు భిన్నం. ఇప్పుడు యిద్దరూ ఒకరికొకరు అభిముఖంగా వున్నారు. ఈ అవస్థ భరించటం ఎలాగు? తన ఈ అమర్షభావం ఎందుకు ప్రకటించింది?

"పార్వతీ" అని పిలిచి ఆదిశేషయ్యగారు సమీపించబోయి, ఉలికిపడి, నీరసంగా చూస్తూ అలానే నిలబడిపోయాడు.

పార్వతమ్మ చూపు త్రిప్పుకోలేదు. అలానే వీక్షించసాగింది. ఇదే ఘడియలో తనకు మృత్యువు ప్రాప్తిస్తే బాగుండును. తల వెయ్యి వ్రక్కలైపోతే బాగుండును. ఎంత..ఎంత అదృష్టహీనురాలు?

ఆదిశేషయ్యగారు మెల్లగా సామీప్యంలోకి వచ్చి "పార్వతీ" అని నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఈ మార్పు ఎలా అవతరించింది? ఆ ముఖంలోని ప్రతి అణువూ అలా వివర్ణ రూపం పొందివుందేం? ఆ కనుల్లోని తన్మయం, అభిజాత్యభావం ఏమయిపోయాయి?

పార్వతమ్మ పెదవులు కంపించసాగాయి. "రండి" అంటూ ఆయన్ని ఆహ్వానించింది చివరకు. ప్రక్కకు వచ్చి కూర్చున్నాక ఆయన వొణుకుతున్న చేతుల్ని, తన వణుకుతున్న చేతుల్తో చేరదీసి పట్టుకుని"నన్ను క్షమించరూ?" అన్నది తడబడుతున్న కంఠంతో.

"పార్వతీ" అన్నాడు ఆదిశేషయ్యగారు నిశ్చేష్టితుడై "నేను ఏమయినా...."

"అవును. నన్ను క్షమించండి. నేను మిమ్మల్ని... నన్ను క్షమించండి."

ఈ హృదయ విదారకమైన వేడికోలు ఆయనను ఆసాంతం కలవరపరిచింది. ముందు "ఎందుకు?" అన్న ప్రశ్న నోటి వరకూ వచ్చింది. కానీ సంబాళించుకున్నాడు. ఒక క్షణం ఏదో ఆలోచన పాములా జరజరమని ప్రాకుతూ మనసులో

మెలిసింది. తన పశ్చాత్తాపంలోని ఆ అసంపూర్ణత్వం.. భార్య వంక తీక్షదృష్టితో చూశాడు. మళ్ళీ తలప్రక్కకు త్రిప్పుకున్నాడు. తన నిశ్చయం పటాపంచలౌతుంది. స్వార్ధరేఖ హృదయకుహరంలో మింటికి ఎగబ్రాకే మంటలా ఎగసింది. ఇవేళ యీరోజు యీ రాత్రి పరాభవాల వెనుక పశ్చాత్తాపం వెనుక ప్రశాంతి వెనుక ధృడనిశ్చయం వెనుక..

అంతే ఆకస్మికంగా ఆమె వైపు తిరిగేసరికి ఆయన నేత్రాలు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి. చెప్పరాని మార్పు ప్రవేశించి అస్థిర స్థిరత్వం పొంది వికసించినట్టుగా దృక్కులను ఆమెవరకూ గంభీరంగా త్రోశాయి. బలహీనమైన ఆమె చేతి పట్టు సడలింది. తన హస్తాన్ని ఆమె ఫాలంపై వుంచి "పార్వతీ! నిన్ను నేను క్షమించాను" అన్నాడు.

రాత్రి పన్నెండు గంటల లోపున జరిగిపోయిన ఆ సంఘటనల తర్వాత, సంఘటిల్లిన సంగతులను గురించి ఉల్లేఖించడానికి కలం వెనుక ముందాడుతోంది. ఈ కథలో ఓ ముఖ్య పాత్ర పార్వతమ్మ ఆమెను గురించి వ్రాయటానికి బాధపడి, వదిలివేసి మిగిలిన వారిని గురించి వ్రాద్దామన్నా సాధ్యం కావటం లేదు ఆమె జీవితం చివరిదశలో చాలా విచిత్రమైన పరిణామాలకు గురైంది. ఆమె ఆశించినట్లు చావు దగ్గరకు రాకుండా దూరదూరంగా జరుగుతోంది, విముఖత చూపిస్తూ.

పార్వతమ్మ తనతల్లి మరణశయ్యపై వున్నప్పుడు టెలిగ్రాం అందుకుని వెళ్ళినప్పుడు యిలా జరగలేదు. మరునాడే ఆమె తల్లి కళ్ళు మూసింది.

మరునాటి ఉదయం డాక్టర్ యధాప్రకారం వచ్చినపుడు పార్వతమ్మ పరిస్థితి కొంచెం తేటగా వుండటం కనిపెట్టి ఆశ్చర్యపడ్డాడు. నాడి చూసి సంతోషం ప్రకటించాడు. మగత నిండిన నేత్రాల్తో ఏదో లోకం నుండి చూస్తున్నట్లు ఆయనవంక పరికిస్తూన్న పార్వతమ్మ మనసు చివుక్కుమంది. ఎందుకీయన ఆశాభావం ప్రదర్శిస్తున్నాడు. తనకి చావు మూడటానికి యింకా కొన్ని రోజులు వ్యవధివుందా?

ఆమె ఎవరితోనూ పలకటం మానివేసింది. తాను పలికితే అందులో ఏ అపస్వరం ధ్వనించి, దానిని గురించి సమాలోచించుకున్నపుడు తన గుండెల్లో చిచ్చుపెడుతుందో ఎవరికి తెలుసు? తాను భంగపడింది. శాశ్వతమైన ఆనందాన్ని క్షణికావేశంతో బయటకు వెల్లడించి భగ్నం చేసుకుంది. దేముడూ తనకు రెండు పరీక్షలు పెట్టాడు. ఒక దాంట్లో అద్భుతంగా గెలిచింది. రెండవదాంట్లో చిత్తుగా ఓడిపోయింది. సర్వసాధారణంగా స్త్రీకి లోకం అంటే భర్త. ఆలోకాన్ని ఒక ఉత్తేజంలో ధిక్కరించడం జరిగినా, యిది నిజమైన శాంతి కాదనే అపోహతో మనసులో లేని పరాజయాన్ని బాహ్యంగా ఒప్పుకుంది. ఈ రెండు విధాలా హానికలిగింది. అప్పుడు తన నిజస్వరూపాన్ని అవతలివారికి ప్రదర్శించికూడా, మారువేషంలో తిరిగి సంచరించడానికి వీలులేదు కాబట్టి, 'నిన్ను ఇన్నాళ్ళూ క్షమించాను' అని ఆ పని జరిగిపోయాక చెప్పి, వ్యక్తం చేసి, తిరిగి క్షమించటానికి సిద్దపడటం హాస్యాస్పదం కాబట్టి బ్రతకటానికి వీలులేదు. ఇప్పుడు అంతరంగికంగా

తను అనుభవించని ఓటమిని తన హద్దుదాటి కళంకాన్ని ఆపాదించుకున్నానన్న చింతతో బయటకు అంగీకరించటం ద్వారా గార్హస్థ్య ప్రపంచంలో తన స్థానాన్ని శాశ్వతంగా పోగొట్టుకోవడం చేత, యీ దుర్భర అవమానంతో బ్రతకటానికి వీలులేదు. తాను యిక మనుషులనేవారితో మాట్లాడటం ఉభయులకూ ముప్పు. అందుచేతే కూతురువచ్చి బ్రతిమాలినా, ఏడ్చినా, మొత్తుకున్నా, భర్త వచ్చి "ఏమిటి పార్వతీ యీ చాదస్తం? " అంటూ సానునయన వాక్యాలు పలికినా పెదవి కదపలేదు.

కాని ఆమె ఎంతలేదనుకున్నా మొదటిరాత్రి అనుభవించిన తృప్తీ, సౌఖ్యం రెండుండూరోజులవరకూ పెనుగులాడుతూనే వున్నాయి మానవ బలహీనతవల్ల. ఇది బహుశా భగవంతుడనేవాడికి కూడా తెలియని పరమ రహస్యం. అందువల్లనే డాక్టర్ మరునాడు ఆశ్చర్యపడటం జరిగింది. కాని అతడి ఆశాభావం చూసి పార్వతమ్మ కృంగిపోయింది.

వాళ్ళ అందరి ముఖాలూ వికసించాయి. తనకి చావురాదు. రాదు. అయ్యో. ఈనాడు ప్రపంచంలో తాను తిరిగి బ్రతకాలి ఈ నరకయాతనలో.

ఆమె మనస్ఫూర్తిగా మరణానికి ఎదురు చూసింది.

కాని..

ఒక అత్యద్భుతమైన సంఘటన యిక్కడ సంభవించింది. తనకి చావురాదు. రాదు. తాను చచ్చిపోక బ్రతుకుతుందన్న దుర్భరమైన బెంగతో మానశికంగా కృంగి కృశించి మూడురోజులు గడిచేటప్పటికి క్రమక్రమంగా మరణాన్ని సమీపించసాగింది తిరిగి.

చావనన్న భయంతో పార్వతమ్మ చచ్చిపోతోంది.

డాక్టరు మళ్ళీ సందేహాన్ని వెలిబుచ్చి వెళ్ళిపోయినప్పటి నుంచీ ఆదిశేషయ్యగారు దిగాలుపడి కూర్చున్నాడు. ఈ కొద్దిరోజులనుంచీ ఆమె తప్పకుండా జీవిస్తుందన్న నమ్మకంతో తిరిగాడు. ఎన్నోసార్లు ఆమె దగ్గరకుపోయాడు. మాట్లాడించటానికి ఎన్నోవిధాల ప్రయత్నించాడు. మృదువుగా బ్రతిమిలాడాడు. "ఏమిటి పార్వతీ యీ చాదస్తం?" అన్నాడు.

తాను ఆమెను మనస్ఫూర్తిగా క్షమించి వేశాడు. ఆమె బ్రతకాలి. తనకోసం బ్రతకాలి.

ఆమె యీనాడు మరణిస్తే తన శేష జీవితమంతా కీకారణ్యంలోని చీకటి. అప్పుడు చచ్చినా బ్రతికినా ఒకటే. ఆ జీవితానికి అర్థం లేదు.

తాను ఆమె యెడల ప్రవర్తించిన హింసా విధానాన్ని ఆమెనోట తెలుసుకున్నా, అందుకు బాధపడినా, ఏదో అవ్యక్త శక్తి ప్రేరణద్వారా ఆమెతో మనసారా కొన్నిమాటలు వచించటానికి పోయినప్పుడు, ఆమె తన తప్పు తెలుసుకుని క్షమాపణ కోరింది. అది తనలో తాత్కాలికమైన విస్మయాన్నీ, గగుర్పాటునూ రేపింది. కానీ కొద్ది క్షణాలలో పరిస్థితి మారింది. తన నేత్రాలు ఉజ్వలమైన కాంతితో ప్రకాశించాయి. క్షమించానని చెప్పివేశాడు. ఇప్పుడు యిద్దరిలో సరియైన శాంతి భద్రతలు నెలకొల్పబడినాయి. తనలోని కాఠిన్యం కరిగిపోయింది.

కాని యిదేమిటి? ఆమె జీవించబోవటల్లేదు. ఆ రాత్రి జరిగిన సంఘటనల తర్వాత తాత్కాలికంగా వాటిల్లిన ఆమె ఆరోగ్యంలో అభివృద్ధి చూసి యిహ పరవాలేదనుకున్నాడు. కాని తనకు తెలియకుండా ఏదో జరుగుతోంది. అశాంతి దాపురించబోతోంది. ఇహమీదది తన యీ వృద్ధప్రేమను ఆమెకై గ్రుమ్మరించాలన్న ఆశలన్నీ అడియాసలౌతున్నాయి.

"నాన్నా!" అంది కూతురు. గుమ్మంలోకి వచ్చి నిలబడి ఆదిశేషయ్యగారు తలెత్తి చూసి "ఆ.." అన్నాడు.

కూతురు దగ్గరకు వచ్చి తండ్రి ముఖంలోకి భీతావహంగా చూస్తూ

"అమ్మకి.. ఏమవుతుంది నాన్నా?" అంది.

"ఏ....మో...తల్లీ"

"అమ్మ ఏదో విషాదంలో మునిగివుంది నాన్నా" అంది కూతురు కొంచెం ఆలోచించి ఆవేదనతో.

"నీకు ఎలా తెలుసును అమ్మా?"

"నేను ఊహించగలిగాను నాన్నా? ఇక్కడికి వచ్చిన రోజు రాత్రి అర్ధస్వగతంగా ఏవో మాటలు చెప్పింది. నాకెంతో భయం వేసింది. తాను ఏదో పొరపాటు చేశానని గొణిగింది. ఆ పొరపాటు నీకేమైనా తెలుసా నాన్నా?"

ఆయన తడి ఆరిపోతూన్న గొంతుతో "అబ్బే.. తెలియదమ్మా."

"అమ్మ నాకు సరిగ్గా చెప్పలేదు. అదే ఒకవేళ చెప్పటం ఏమో? 'అందరి స్త్రీలలానే బ్రతుకు' అని నన్నాశీర్వదించింది. ఆమె ప్రవర్తన యీరీతిగా వుండటం నేనెన్నడూ చూడలేదు. నేను అతిగా మాట్లాడుతూంటే క్షమించు. ఏ స్త్రీ కూడా తాను చేసింది పొరపాటని మనసా, వాచా చెప్పివేశాక యిహ దానిని గురించి మధనపడదనుకుంటాను. నన్నో సంశయం వేధిస్తోంది నాన్నా."

"ఏమిటది? ఏమిటమ్మా అది?"

"అమ్మ తాను జీవించాలని కోరుకోవటల్లేదు. నేనిది బాగా గ్రహించాను. ఆమె వెయ్యికళ్ళతో మరణానికి ఎదురుచూస్తోంది."

ఆదిశేషయ్యగారు నిశ్చేష్టితుడయాడు. "తనకు ఏమిటది?" అని జిజ్ఞాస కలిగించిన యిందాకటి మాటలూ, యీ చివరి మాటలూ బాగా మనసులో నాటుకున్నాయి. ఈ విచిత్ర నాటకం విపరీతమైన సంచలనాన్ని కలిగిస్తోంది. ఇంతకీ

ఒకరి మనసు ఒకరు అర్ధం చేసుకోనేలేదన్నమాట. డాక్టర్ 'మీకేం భయంలేదమ్మా ' అన్నప్పుడు ఆమె కళ్ళలో ప్రతిబింబించే వ్యాకులపాటుతో కూడిన గగుర్పాటుకు అర్ధం? ఆయనకు అర్ధమయింది. తాను ఏమీ తెలుసుకోలేని మూర్ఖుడా. ఇప్పుడు యీ జ్ఞానదానం చేసింది తనకన్నా ఎన్నో సంవత్సరాలు చిన్నదైన కుమార్తె.

ఆయనకింతలో మెరుపు మెరిసినట్లు ఓ పరిష్కార మార్గం తోచింది. అది అద్భుతమైన యోచన. కాని భయంకరమైనది కూడా. సర్వసాధారణంగా చావుబతుకుల్లో వున్న మనుషులకు తుది ప్రయత్నంగా ఓ చిట్కా వంటిది ప్రయోగిస్తారు. అది ఫలిస్తే అమోఘంగా ఫలిస్తుంది. లేదా నాశనం వుండనేవుంది. ఈ తక్షణ మార్పుని గమనించి కూతురు కలవరపాటుతో 'నాన్నా ' అంది. ఆయన సమాధానమివ్వకుండా అక్కడినుంచి నడిచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి ఒకనాటి మాదిరి భయానకంగా వుంది. పారతమ్మ పడుకుని వున్న గదిలో బెడ్ లైటు వెల్తురు తప్ప యిల్లంతా చీకటి అలుముకుని వుంది.

"పార్వతీ" అని పిలిచాడు ఆదిశేషయ్యగారు ముందుకు వంగి.

ఈ కొద్దిరోజులుగా వస్తూన్న జవాబే వచ్చింది.

ఆయన ఒకసారి పెదవులు కొరుక్కున్నాడు. బరువుగా ఊపిరి విడిచాడు.

"నాతో యిప్పుడైనా మాట్లాడవా? నీకింత మొండి పంతం ఎందుకు? అమ్మాయి బాగా దిగులు పడింది. చిక్కి శల్యమై పోయింది. "

ఆమె కనీసం సానుభూతిగా ఆయనవంక చూడనన్నా లేదు.

"పార్వతీ ఈ తుది ఘడియల్లో కూడాయిలాగే వేధిస్తావేం?"

"....."

ఆయన రుద్ధకంఠంతో "నీవు భగవన్నామ స్మరణలోనే కాలం గడిపితే నాకు సంతోషమే. మన యింటిలో వున్న రాముల వారి పటం నువ్వు ఏ రోజయినా పూజించకుండా వూరుకున్నావా? పార్వతీ. ఒకసారి ఆ పటం తెచ్చి నీ కళ్ళముందు వుంచేదా?"

"......"

"నీకు ఎలా అనిపిస్తుంది? నా మాటలు నావిగా గుర్తుపట్టగలుగుతున్నావా పార్వతీ?"

"...."

"డాక్టర్ ఏదో చెప్పాడు నీకు నిజంగానే మైకం క్రమ్ముతోందా?"

"..."

"పార్వతీ! పార్వతీ పలకవేం నీ యింద్రియాలు నీకు స్వాధీనంలో లేవా? అలా చూస్తున్నావేం? ఎవరు కనిపిస్తున్నారు నీకు? అయ్యో.. అలా అయిపోతున్నావేం పార్వతీ.. డాక్టర్ చెప్పింది నిజమేనా? నువ్వు...నువ్వు నాకు దక్కవా?"

పార్వతమ్మ తనువు పులకరించింది. ఆనందంతో ఆమె నేత్రాలు విస్ఫారితాలయాయి. తన్మయంగా ఒకసారి భర్తవంక వీక్షించింది. అబ్బ! అబ్బ. ఆ బాధ, ఆ దుఃఖం.. నిజంగా తను... నిజంగా తను..!

పార్వతమ్మ కళ్ళు మూసుకుంది.

తాను చచ్చిపోతోంది. చచ్చిపోతోంది. "భగవాన్ నా కోరిక యీడేరుతోంది."

ఈ లోకంలో ఆదిశేషయ్యగారిలాంటి తెలివైన వాళ్ళువుంటూ వుంటారు. పాపం పార్వతమ్మ బ్రతికింది. కాని అమ్మవారు పార్వతమ్మ తల్లితో ఎందుకు తప్పు చెప్పినట్లు?

# అధికారి

రాచకొండ విశ్వనాథశాస్త్రి

(1959 ఆంధ్ర పత్రిక వార్షిక సంచిక నుంచి)



**ఈ కథ రాయాలని** నాకు చాలా కాలమునుంచీ ఉంది. తీరా రాద్దామని కూర్చునేసరికి ఎలా మొదలుపెట్టడం? ఎలా రాయడం అని చాలాసేపు ఆలోచించవలసొచ్చింది. ఆలోచించగా నాకు తెలిసిన పెద్దమనిషొకాయన గుర్తుకొచ్చి ఆయన చెప్పిన సలహా జ్ఞప్తికొచ్చింది. ఆయన ఏవిటన్నాడంటే కథలో ప్రధాన రసం, లేక ఓ సన్నివేశంలో ప్రధాన రసం – దాని ప్రకారం అన్నీ సరిదిద్దుకోవాలండీ అన్నాడు. వాతావరణమంతా మన కథకి

www.koumudi.net

అనుగుణ్యంగా చిత్రించుకోవాలండీ అన్నాడు. అంటే కథలోని నా మనసులో తుఫాను రేగినప్పుడు, ఉరుములు మెరుపులు పెనుగాలి బీభత్సం వాటినన్నింటినీ పిలకలు పట్టుకు లాక్కొచ్చి వాటిని నా చుట్టూ తిప్పుకోవాలన్నమాట.

సాఫీగా సాగిపోయే నా ప్రేమలత టక్కున తెగిపోయినప్పుడు ఎక్కణ్ణించో అక్కణ్ణుంచి వీణనొకటి ఎత్తుకొనైనా వచ్చి దాని తీగెలు తెంపుకుని వానిమీద నా తలని దీనంగా వాల్చుకోవాలన్నమాట. నా ఆశలన్నీ వాడిపోయి రాలిపోయినప్పుడు, మోడైపోయిన చెట్టునొకదాన్ని వెతికి వెళ్ళి చూసుకుని అక్కడ మోకాళ్ళమీద తలపెట్టుకుని కూర్చోవాలన్నమాట. నాకిష్టంలేనప్పుడు ఆకాశం సిరా పులిమినట్టుగా ఉండాలన్నమాట. నాకు సరదా పుట్టినప్పుడు అది వజ్రాలు పొదిగినట్టుగా ఉండాలన్నమాట. నాకు తెలిసిన ఆ పెద్దమనిషి చెప్పిన సూత్రం ప్రకారం ఈ కథ మొదలు పెట్టేసరికి –

రాత్రి పదకొండు గంటల సమయంలో  ఊరవతల నూకరాజు పాకకి అవతల ఉన్న ఇసక మైదానం, వెన్నెల వెలుగులో, పరిచిన బంగారు తివాసీలా ఉంది. మైదానం మధ్య దంపతుల్లా నిల్చున్న తాటిచెట్ల కమ్మలు, చల్లగాలిపెట్టే కితకితలకి, కిలకిల్లాడుతున్నాయి. వాటి పక్కనే ఇసక తిన్నెమీద ఆడుతున్నాయి. ఆకాశంలో చంద్రుడు ఎలా మెరుస్తున్నాడంటే తిన్నెమీది నూకరాజులా జిగజిగ మెరిసిపోతున్నాడు.

ఈ కథకి నూకరాజు హీరో.

ఆ తిన్నెమీది చంద్రుడు ఏదో చుక్క రాకకోసం ఎదురు చూస్తూండగా, అంతలో అల్లంత దూరంలో ఓ చుక్క మిలమిల్లాడింది. "తాటి నెట్లాన వాలెట్టు"కొని ముందుకి నడిచింది. చుక్కని చూడగానే 'పరిగెట్టి ఎదురెళ్ళి' ఎత్తుకు తీసుకొచ్చి ఒళ్ళో వేసుకున్నాడు నూకరాజు.

ఒళ్ళో ఉన్న పిల్ల పేరు నాగరత్నం.

ఆమె ఈ కథకి హీరోయినా?

మీరే చెప్పాలి.

ఆమె, పదిహేడేళ్ళ కుర్రవాడి కంటికి అట్టమీద కనిపించిన అహల్యాదేవి బొమ్మలా ఉంది. ఆమె పద్దెనిమిదేళ్ళ బంగారం. ఆమె నూకరాజుకి దొరికిన పెన్నిధి.

'జంట తాటి చెట్ల దగ్గర కూర్చున్న వాళ్ళిద్దర్నీ చూడ్డానికి చల్లగాలి చప్పుడు చెయ్యకుండా ఒచ్చింది. వాళ్ళని చూడు చూడని పైనున్న చంద్రుడు పక్కనున్న చుక్కకి సైగచేసాడు. చూసి సిగ్గుపడ్డ చుక్కమ్మ తెలి మబ్బు చెంగుని చాటు పెట్టుకుని దొంగచూపు చూసింది.

చంద్రుడూ, చుక్కలూ, చల్లగాలీ వాళ్ళిద్దర్ని చాలాసేపు చూసాక నూకరాజు నాగరత్నంతో "మనిద్దరం పెళ్ళాడదాం ఏం?" అన్నాడు.

పెదవుల్ని విడిపించుకున్న తరవాత, నాగరత్నం "మా అమ్మక్కూడా ఇష్టమే" అంది.

"నీకెలా తెలుసు?" అనడిగాడు నూకరాజు, సంతోషం పట్టలేకుండా.

"నిన్ను పెళ్ళిసేసుకోమని రోజుకోసారి సెప్తుంది" అంది నాగరత్నం. మరింక నూకరాజుకి సంతోషం ఆగలేదు. ఆ సమయంలో అప్పాయమ్మ అక్కడుంటే ఆమెని కూడా ముద్దులాడేసుండునతను.

ఐదారు సంవత్సరాల కిందటే వచ్చి హార్బర్లో కళాశీగా కుదురుకున్నాడు. అతనుండేది ఊరిచివర ఆరుగదుల తాటికమ్మల వాసాల ఇంట్లో ఓ గదిలో అద్దెకి ఉంటున్నాడు.

ఓ రోజు సాయంకాలం హార్బర్లో కూలిచేసుకుని నెమ్మదిగా ఇంటికొస్తూ ఇంటివైపు చూసేసరికి నూకరాజు కంటికి కొసా గది గుమ్మం ముందు ఉదయకిరణంలా ఓ పిల్ల కనిపించింది. దేవత వెలిసిందా అనుకున్నాడు నూకరాజు. కాళ్ళూ చేతులూ ముఖం తొందరగా కడుగుకుని బోగట్టా చెయ్యడానికి బయలుదేరి వెళ్ళాడు.

సూర్యుడు అస్తమించేసాడు. వెన్నెల మసగమసగ్గా వెలుగుతోంది. ఇంటిముందు నులకంచం మీద నూకరాజు కూర్చున్నాడు. ఎదురుగా ఓ విరిగిన ఇటికమీద కూర్చుని తన వృత్తాంతమంతా అతనితో చెప్పనారంభించింది అప్పాయమ్మ.

వింటే అదేం కొత్త వృత్తాంతం కాదు. సాధారణంగా జరిగేదే. వాళ్ళదసలు తాళ్ళవలసట. అప్పాయమ్మకి 'కన్నోరిదీ అత్తోరిదీ' కూడా ఆ ఊరే. బతికి బాగుపడ్డ ఊరూ అదే. నెత్తిమీద 'కొంగేసుకుని ఒచ్చీసిన' ఊరూ అదే. అక్కడే ఆమె కాపురం కూలిపోయింది. అక్కడే ఆమె సంసారం చల్లారిపోయింది. ఆమె కడుపున పుట్టిన మగపిల్లలంతా అక్కడే 'మంటగలసిపోనారు' తాళికట్టినవోణ్ణి మశూచికమనే అసిరెమ్మ అక్కడే పొట్టనెట్టుకుంది. అక్కడున్న 'దోసిడు గుడిసెక్కా' కోర్టువారు అక్కడికే వచ్చి టమటమలాడించీసినారు. అన్నీపోగా మిగిలిన తాతలనాటి ఇల్లు మట్టి దిబ్బయిపోయి ఇప్పటికీ అక్కడే ఉంది.

'కట్టుకున్న మొగుణ్ణి సంపేసుకున్నాను. కన్న కొడుకుల్ని సంపేసుకున్నాను బాబూ. కాన్నాకు సావు రాలేదు. పుస్తిలతాడు పోనాది పుట్టిన పిల్లలు పోనారు. ఇళ్ళు పోనాయి. ఎడ్లు పోనాయి. ఏరుకున్న గింజలు పోనాయి కడకి నమ్ముకున్న భూదేవకూడా పోనాది.

కాని రమ్మని పిల్చినా అప్పాయమ్మ కింతవరకూ సావింకా రానేదు. మరింకేటుంది? ఒక్కగానొక్క ఆడకూతురుంది ఈ ఆడకూతుర్నెట్టుకుని ఈ ముసిలి ముండ కూతుర్నేటి సెయ్యడం బాబూ? మరింకక్కడ ఏటుంది గనక సెయ్యడానికి. సేసేదేం నేక డొక్కలు సేత్తో ఒట్టుకుని ఇదిగో పట్నావిలా పారొచ్చినాం. కూలిదక్కితే సుష్టు. నేకపోతే పస్తు."

"అరె. అయితే మీకెవరూ దిక్కులేరన్నమాట" అన్నాడు నూకరాజు.

"దిక్కెవరు నూకరాజు బాబూ? ధరణి బూదేవి, ఆపైన దేవుడు. ఆ యెనక నీలాటి మారాజులూను" అంది అప్పాయమ్మ. ముంగిట్లో ఇద్దరూ అలా మాట్లాడుతూ ఉంటే చూరుకింద నీడలో రాటనానుకుని కూర్చుంది నాగరత్నం.

తన కథంతా నూకరాజుతో తల్లి చెప్తున్నప్పుడు ఆమె గుండెలు శోకం వల్ల పొంగిపొంగి దిగాయి. చూరవతలి వెన్నెల ఆమె తడిసిన కళ్ళల్లో సలసలకాగింది.

అనురాగం అంకురించడంతో తలొకరూ తలోలా చేస్తారు. ఒక్కొక్కడు అవతల పార్టీకి తన మనసుని రెండు చేతుల్తోనూ పట్టుకు వెళ్ళి ముందే అర్పణ చేసేస్తాడు. మరొకడు అవతల పార్టి మనసుని జబర్దస్తీగా దోచేస్తాడు. లేకపోతే చల్లగా లాగేస్తాడు. నూకరాజు ఆ సాయంకాలమే తన మనసుని నాగరత్నానికిచ్చేసి ఆమెనీ ఆమె తల్లినీ "ఆదుకుంటాను" అని భీష్మ ప్రతిజ్ఞ పట్టేసాడు. ఆ క్షణం నుంచి వాళ్ళకతను కంటికి రెప్పా, కాలికి చెప్పూను. కొంతమందికి చాకిరీ చేసి మెప్పించడమే కాని షోకు చేసి మెప్పించడం తెలీదు. నాలుగు రోజుల్లో వాళ్ళకి నాలుగేళ్ళ సేవ చేసాడు నూకరాజు.

ఆ రోజున అప్పాయమ్మ కంటికి ఎటు చూసినా ఒక్కలాగే ఉంది. చంద్రుడు బూజు పట్టిపోయి వేళ్ళాడుతున్నాడు. వెన్నెలంతా పాలిపోయి బూడిదలా ఉంది. చెట్లన్నీ జీవచ్ఛవాల్లాగా, పైనున్న చుక్కలన్నీ చావబోయేవాళ్ళ ప్రాణాల్లాగా ఉన్నాయి. మరి, గాలి బిగిసిపోయి చచ్చేపోయింది. ఇంతలో కాలం ఎలా తిరిగిందంటే రాట్నంలా గిర్రున తిరిగింది. ఆరోజున అస్తమించిన సూర్యుడు ఆ తరువాత అరవైసార్లు ఉదయించాడు. నూకరాజు దయవల్ల అప్పాయమ్మకీ నాగరత్నానికీ ఆ అరవై రోజుల్లోనూ కూలిదొరకని రోజు ఒక్క రోజూ లేదు. మరి అప్పాయమ్మకి ఎటు చూసినా ఒక్కలా చక్కగా ఉంది. చంద్రుడికి బూజులు పోవడంతో వెన్నెలకి తేటొచ్చింది. గాలికి చలనం, చెట్లకి చైతన్యం చుక్కలకి ప్రాణాలు వచ్చాయి. అదంతా అలా పున్నమినాటి రేయిలా ఉండడం నూకరాజు పనివాడితనం.

పెళ్ళాడ్డం 'అమ్మకూ్కడా ఇష్ట'మేనని తెలుసుకున్న నాటి రాత్రి నూకరాజుకి సుఖం వల్ల నిద్రపట్టలేదు. అయినా మర్నాడు ప్రొద్దున్న మంచమ్మీంచి సంతోషంతో వచ్చాడు. ఆ విధంగా ఆ రోజు, మర్నాడు, మరో రోజు మరో రోజు వరసగా సంతోషంతోనే వెళ్ళాయి.

అయితే కాలం ఒక్కలా ఉండదనే సంగతి మీకూ, నాకూ అప్పాయమ్మకీ బాగా తెలుసు. ఆ సంగతి నూకరాజుక్కూడా ఓ రోజున బాగా తెలిసొచ్చింది. ఆ రోజు సాయంకాలం పన్లోంచి ఇంటికొస్తూ ఇంటికి అల్లంతదూరంలో టక్కున ఆగాడు నూకరాజు.

*ఈ క్షణం నుంచీ నాకు కష్టాలు ప్రారంభమౌతాయి, నష్టాలు సంభవిస్తాయి అని ఎవరిమట్టుకి వారికి కొన్ని కొన్ని సమయాల్లో, తగినంత బలమైన కారణం లేకుండానే, అనిపిస్తుంది.* అప్పాయమ్మ ఇంటిముందు ఓ పదిమంది మూగి ఉండడం మాత్రం చూసాడు నూకరాజు. 'ఆ, మనకేదో కీడు మూడిందిరా' అని అతనికి తోచడానికి అంతకంటే ఎక్కువ కారణం ఏమీలేదు. ఊరవతల, పాకలవెనక, కొండవెనక సూర్యుడు కునికేసేడు. అటుకేసి చూస్తే కొండవెనక ఊరేదో కాలిపోతున్నట్టుగా ఉంది. అంతటా ఎరుపుడాలు కమ్ముకుంది. నూకరాజు కొంచెం ముందుకి నడిచేసరికి ఓ ఆడమనిషి ఏడుపు అతని చెవిని పడింది. ఏడుపు వినిపిస్తోందే కాని ఏడ్చేమనిషి కనిపించడం లేదతనికి. తొందరగా ముందుకి

నడుస్తూ అతను 'నాగరత్నం నాకిక లేదు' అనుకున్నాడు వెళ్ళి జనాన్ని ఒత్తిగిలించి చూస్తే అక్కడ నాగరత్నం నిజంగానేలేదు అప్పాయమ్మ నెత్తీ నోరూ కొట్టుకుని ఏడుస్తోంది.

ఏం జరిగిందని అడుగుతే 'గోరవైపోనాది బాబూ', 'గోరం గోరం బాబూ ', 'గోరం కాకపోతే ఇంకేటి బాబూ' అనడమే కాని ఎవరూ ఏమీ చెప్పరు, అప్పాయమ్మ మాట్లాడదు, ఏడుపు మానదు. ఆఖరికి నూకరాజు కేకలు వేసి అడగ్గా ఏడుస్తూ ఏడుస్తూ అప్పాయమ్మా, దగ్గుతూ దగ్గుతూ ఓ ముసలాడు కలిసి జరిగిన సంగతంతా చెప్పారు. కొన్ని కొన్ని వివరాలు కొంతమంది మధ్య మధ్య అందిచ్చారు.

అసలు ఏంటి జరిగిందిటా అంటే

సాయంకాలం నాగరత్నం ఇంటికి 'బేగొచ్చేసి' బజారుకి వెళ్ళి గింజలు కొనుక్కొచ్చి వాటిని చేట్లో వేసుకుని ఇంటిముందు కూర్చుని చెరుక్కొంటోందట. అంతలో ఎండాడ మనిషొకామె 'ఎర్రగా పొడుగ్గా ఉంటది, పొడుక్కాళ్ళ డాకూ, ఊరందరమందిరీ ఎరుగుదురు', ఆ మనిషి గోనెమూటొకటి నెత్తిని పెట్టుకొచ్చి, మూట దించుకుని 'ఓలమ్మ కుశిన్ని మంచి నీళ్ళొయ్యమ్మా, దప్పికేస్తంది ' అని నాగరత్నాన్ని మంచినీళ్ళడిగిందట. అమాయికమ్ముండ కూతురు, నాగరత్నానికా మనిషి గురించేమీ 'తెల్దు దా ' అంచేత సేటక్కడే ఎట్టి 'ఇస్తానుండమ్మా' అన్సెప్పి నీళ్ళ కోసరం ఇంట్లో కెళ్ళిందట, ఇంతలో ఆ పొడుక్కాళ్ళ డాకూ ముండ పోలీసు వాళ్ళొస్తున్నారని ఎలా పసిగట్టిందో ఏమోకాని, ఇంట్లోంచి నాగరత్నం వచ్చేలోపున తెచ్చిన మూటక్కడే ఒగ్గేసి మాయవైపోనాదట. అంతలో 'ఏవమ్మోయ్ ఏటామూటా?" అని అడిగేరట వాళ్ళు.

'ఎవరూ. పోలీసోళ్ళు' ముగ్గురు యూనీఫారాల్లో ఉన్నారు. ఒకడు మన తెలుగోడి బట్ట కట్టుకున్నాడు. వాళ్ళలా అడిగేసరికి ముంతలో తెచ్చిన నీళ్ళు ముంతలో అక్కడే జార్చేసి, రెండడుగులు వెనక్కి జరిగి "నాకు తెల్దుబాబూ" అందిట నాగరత్నం

"నీకు తెలవకుండా నీ ఇంటికాడకెలా ఒచ్చింది? రెక్కలెట్టుకొచ్చి వోలిందా? నేక ఇత్తనం వేస్తే మొల్సిందా?" అని వాళ్ళడిగారట.

ఆ మాట మీదట "ఆడమనిసి దప్పిక అడిగింది ఆ మనిసొగ్గేసిపోనట్టుంది బాబూ" అందిట నాగరత్నం

"ఆ మూటేటో తెల్దని ఓ పాలన్నావు, ఆడమనిసొగ్గేసిందని మరోపాలన్నావు. మరింక మూడో పాలేటంటుందో ఏటో మూటిప్పి సూడండ్రా" అని ఆళ్ళల్లో ఆ తెలుగు బట్టేసుకున్న జవాను మూట విప్పించేడట.

మూట విప్పించి చూస్తే అందులో ఇంకేముంది? ఒక రెండుమూర్ల మోటారు ట్యూబు ముక్క నిండా మూడు గేలన్ల దొంగసారా ఉంది. చూసి గజగజ వణికిపోయింది నాగరత్నం.

"అమాయకపుదీ ఆడముండ కూతురూ నిజవే కానీ ఇయన్నీ పోలీసోడిక్కావాలా బాబు? అంజలీ దేవి బొమ్మ నా మాసక్కగున్నావు కాని, ఎవుడికీ తెలవకుండా ఎన్నోళ్ళనుంచోలే ఈ యాపారవూ, అన్సెప్పి ఆడపిల్లని నడునడమని టేసన్‌కి నడిపించుకుపోనారు. గోరం కాకపోతే ఇంకేటి నూకరాజు బాబూ"అని ముగించేరు వాళ్ళు.

'ఇంతా జరిగి ఎంతసేపయింది?'

'ఓ గంటసేపయింది.'

'మరైతే నాగరత్నం పోలీసు స్టేషన్లో నా ఉంది?'

'అక్కడే వుండుండాలి.'

'ఆ పొదుక్కాళ్ళదెక్కడికి పోయింది?'

'ఏమో ఎవడికి తెలుసు? మీరంతా చూస్తూ ఎందుకూరుకున్నారు?'

'మేవేం సూళ్ళేదే.'

"సూడకపోతే ఈ కథంతా మీకెలా తెలిసింది?"

"చూస్తే మట్టుకు మేవేం చేస్తాం, మమ్మల్ని కూడా నడమంటే నువ్వొచ్చి ఇడిపిస్తావా ఏటి?"

"మరైతే ఇప్పుడేం చెయ్యడం?"

గాభరాపడ్డం తప్ప మరేం చెయ్యడమో తెలియడంలేదు నూకరాజుకి. ఇంటికి పోలీసువాడొచ్చినా, అప్పులవాడొచ్చినా, యములాడొచ్చినా ఇంట్లో అందరికీ ఒక్కలా ఉంటుంది ప్రాణాలు పోతున్నట్టుగా ఉంటుంది అవతల అప్పాయమ్మక్కూడా గాభరాగానే ఉంది. ఆమె అకస్మాత్తుగా ఆపదలో పడ్డంతో గోతులో పడ్డట్టుగా అయిపోయింది. అయితే, గోలచెయ్యడమే కాని గోతులోంచి లేవడమెలాగనే ఆలోచన లేదావిడకి నూకరాజు బాబూ. అన్నిటికీ నువ్వే ఉన్నావంటుంది. ఆ మాట నూకరాజుకి మరీ భారంగా ఉంది. అయితే ఇప్పుడేం చెయ్యాలి? నూకరాజు కదే తెలీదు. అతను తెలివైనవాడే కానీ అతందగ్గర కిటుకులు లేవు. మరి – ఎర్రటోపీ, వంట సారా, దొంగకేసు, నల్లకోటు, తప్పుడు సాక్ష్యం, తెలియని తీర్పు, జరిమానా, జెయిలుగొడ ఇటువంటి వాటితో వ్యవహరించి తప్పించుకు తిరిగి ధన్యుడవాలంటే కిటుకులు తెలియాలి నూకరాజుకవే తెలీవు.

అన్నీ తెలిసిన మేస్త్రొకడున్నాడు. అతనిదగ్గరకి వెళ్తానన్నాడు నూకరాజు.

'ఎక్కడికైనా వెళ్ళు. కాని పిల్లని మట్టుకు నాకప్పచెప్పు, నూకరాజు బాబూ, తండ్రీ, వచ్చే జన్మలో నీ కడుపున పుడతానంది' అప్పాయమ్మ.

కాళ్ళీడ్చుకుని నూకరాజు వెళ్ళేసరికి మేస్త్రి మందుమీదున్నాడు. నిషామీద ఉన్నప్పటికీ (నిషామీద ఉండడంవల్లనే) అతగాడు నూకరాజు చెప్పిందల్లా శ్రద్ధగా విన్నాడు. వింటూ చుట్టపొగని బాగా లాగాడు. విని, చుట్టపొగని దూరంగా

వదిలాడు. పోలీస్ స్టేషన్లో జామీను తెచ్చుకోవాలంటే అయిదురూపాయలుండాలన్నాడు మేస్త్రి. తెస్తానన్నాడు నూకరాజు. కాని మరి ప్రమాదముందన్నాడు మేస్త్రి.

'జామీను కోసం స్టేషన్‌కి వెళితే వాళ్ళు నిన్నుకూడా మోసేసి కొట్లో తోసేగల ప్రమాదముందన్నాడు'

నాగరత్నం కోసం అలానే వెళ్ళి కొట్లో కూర్చుంటానన్నాడు నూకరాజు.

'ఇద్దరూ వెళ్ళి కొట్లో కూర్చుంటే మీ ఇద్దర్నీ బైటకి లాగేదెవడు?' అని ప్రశ్నించాడు మేస్త్రి.

'అయినా పోలీసు వాళ్ళు అనవసరంగా నన్నెందుకు లోన వేస్తారు? ' అని అడిగాడు నూకరాజు. నీకేం తెలీదు పొమ్మన్నాడు మేస్త్రి. తరువాత కొన్ని ప్రశ్నలు వేసాడు.

'పిల్ల వయసులో ఉందా?'

'ఉంది.'

' పిల్ల బావుంటుందా?'

'సినీమా స్టార్‌లా ఉంటుంది.'

'పిల్ల నేరవేం చెయ్యలేదు నిజమేకదా?'

'చెయ్యలేదు. నిజం.'

'అందుచేత ఏమన్నమాట? 'ఆ పిల్లమీద అబద్దం కేసెట్టడానికి ' పిల్లమీద వాళ్ళకి కావేషీ అయినా ఉండుండాలి లేదా, ఆ పిల్ల మీద వాళ్ళలో ఎవడో ఒకడు కన్నైనా వేసుండి, చేతిలోకి లాగుదామనే ఉద్దేశంతో లోపలకి లాగుండాలి. ఏదైనప్పటికీ మద్దెన నువ్వడ్డొస్తే నిన్ను మరి కోనేరా వాళ్ళు?' అన్నాడు మేస్త్రి.

"అంతన్నాయమా?" అన్నాడు నూకరాజు.

"నీకూ నాకూ అన్నేయం కాని పోలీసోడిక్కాదు. ఆడిసేతిలో పవరుంది సేతిలో పవరుంటే నెత్తికి పొగరెక్కుతుంది" అన్నాడు మేస్త్రి

"మరైతే జడ్జి, కోర్ట్‌నేదా?" అనడిగాడు నూకరాజు.

"ఉండకేం? జడ్జి, కోర్టూ వున్నది మున్సీబు కోర్టూ వున్నది. మేస్ట్రీటు వోరి కసేరి కూడా వుంది కాని అక్కడాళ్ళందరూ కళ్ళుమూసుకుని తూకం ఎయ్యాలంట. అది రూలు. నీకు తెల్దు కామోసు" అని మనకి పడమటనుంచి పంపిణీ అయిన న్యాయశాస్త్రపు మూలసూత్రాన్ని నూకరాజుకి టూకీగా తెలియజేసాడు మేస్త్రి. మేస్త్రి దగ్గర అన్ని విషయాలూ తెలుసుకున్నాడు. కానీ ఏమీ హెచ్చరిగ్గా లేదు నూకరాజుకి. ఆకరికి మేస్త్రి ఏవిటన్నాడంటే "రేపు కోర్టు కెళ్ళాల. తేలే రంగేదో అక్కడే తేలాల" అన్నాడు.

ఇంటికి తిరుగు ముఖంపట్టాడు నూకరాజు, మనసంతా ఎలా ఉండాలో అలా ఉంది నూకరాజుకి. అంతా తల్చుకుంటే అతనికి అదోవిధమైన జుగుప్స కలిగింది. నాగరత్నం పోలీస్ స్టేషన్లో ఉన్నదనే విషయం అతని అణువణువునీ బాధపెట్టింది. బంగారు చిలకని ఆలుగ్గుడలో అదిమి పెట్టినట్టుగా అనిపించినదతనికి. మల్లె మొగ్గని మంటలోకి తోసినట్టుగా అనిపించిందతనికి అసలతనికి ఇంటికి వెళ్ళాలనిపించడంలేదు. పిల్ల ఏదని అడిగే అప్పాయమ్మతో ఏమని చెప్పడం? నాగరత్నాన్ని, వెన్నెల్లో ఇసక తిన్నెమీద కూర్చుని, ముద్దులాడ్డం సులభమే "ఆ పని నువ్వే చెయ్యాలా ఏవిటి? చాలా మంది చెయ్యగలరు, చేతనైతే చిలక పిట్టని ఇనప తెరనుంచి బైటకి లాగి అప్పుడు చూపించు నీ తడాఖా" అని అప్పాయమ్మ అనదు కాని ఆమె అన్నట్టుగానే బాధపడ్డాడు నూకరాజు. అతనికి వళ్ళంతా చెమట పట్టేసింది. అతనికేదో ఒకటి చేసేద్దామనుంది, కానీ ఏం చెయ్యాలో ఏ విధంగా చెయ్యాలో అతనికి తెలియడం లేదు. బలమైన పనులు చాలా చెయ్యగలడు తను. కానీ ఈ పని చెయ్యలేకుండా ఉన్నాడు. అరవై ఘనపుడడుగుల ఎత్తుకు తిరగ గలిగీ, అరడుగులే లోతున్న నీట్లో ఈదలేని వాళ్ళా అయిపోయేడతను. ఇంటికి వెళ్తూన్నప్పుడు నెత్తిమీద ఏ బరువూ లేకపోయినా అతని అడుగు నెమ్మదిగానూ బరువుగానూ పడుతోంది. ఆ అడుగులు బరువుగా పడి పడి ఇంటికి అరవై అడుగుల దూరంలో ఆగిపోయింది. ఆగి చూస్తే అతనికి మరో దృశ్యం కనిపించింది.

అప్పాయమ్మ గది గుమ్మంలో దీపం వెలుగుతోంది. దీపం పక్క నాగరత్నం కూర్చునుంది. ఆమె దేదీప్యమానంగా వెలుగుతోంది.

చిన్నప్పుడొకసారి నూకరాజింట్లోంచి ఆవొకటి తప్పిపోయింది. దాని కోసం ఊరంతా తిరిగి తిరిగి అది దొరక్క పోగా 'వెర్రి మొహం' వేసుకుని వెనక్కి తిరిగొచ్చాడు. ఇంటికొస్తే అది గుమ్మంలో కట్టేసుంది అప్పుడు సంతోషించకుండా ఉండలేకపోయాడు కానీ అదోలా 'ఫీ'లయేడు. కళ్ళు మూసి జెల్లకొట్టి కంటిముందు మిఠాయిపొట్లం పెట్టినట్టయిందతనికి తిరిగి అలాగ మళ్ళీ ఫీలయ్యాడు నూకరాజు.

రాత్రి పదిగంటలవుతుంది. గుమ్మంలో నాగరత్నం కూర్చునుంది. ముంగిట పది పదిహేను మందిదాకా కొలువు తీర్చి కూర్చున్నారు. మాములుస్థానంలో తిరిగిన ఇటిక ముక్క వేసుకుని అప్పాయమ్మ కూర్చోనుంది, వాళ్ళందరికి ఎదురుగా నులకమంచం మీద ఠీవిగా మరో ఆసామీ కూర్చున్నాడు. నూకరాజుతో పాటు మరో నలుగురైదుగురు కూడా అప్పుడేవచ్చి కూర్చోడంతో అతనిరాక నెవరూ గమనించలేదు

నూకరాజు గుండెలు నీరసంగా కొట్టుకున్నాయి. గుమ్మంలో పిల్లని చూడగానే నెత్తిమీద బరువు దిగిపోయినట్టుగా అతను తేలిక పడ్డప్పటికీ, అతనికి వంట్లో సత్తువంతా కూడా దాంతోపాటు పోయినట్టయింది చుట్టూ కూర్చున్న వాళ్ళంతా మంచం మీద కూర్చున్న ఆసామివైపే చూస్తున్నారు. అతన్ని అప్పాయమ్మ తెగపొగుడుతోంది.

ఆ సమయంలో నూకరాజుకి తన చిన్ననాటి సంగతొకటి తటాల్న గుర్తుకొచ్చి ఆ నాటి దృశ్యం అతని కళ్ళముందు నిలిచింది.

తల్లీ తండ్రితో పల్లెటూళ్ళోనే ఉండేవాడు నూకరాజు. అప్పటికి బాగా చిన్నవాడు పశువుల్ని చూసే పనంతా అతనిదే ఆ రోజుల్లో. అప్పట్లో అతనికి రవ్వలకొండ అనే చెలికాడుండేవాడు ఒక రోజున ఇంకా మధ్యాహ్నం కాలేదు. పదీ పదకొండు గంటలవుతుందేమో. తమ కళ్ళం దగ్గర పాకలో పొయ్యిదగ్గరెందుకోగాని కూర్చున్నాడు నూకరాజు.

బైట కనుచూపుమేరలో అంతా పచ్చ పచ్చగా ఎర్రెర్రగా కనిపిస్తోంది. గాలి మందంగా వీస్తోంది. దుమ్మెక్కడా లేకపోడం చేత, వడబోసినట్టుగా ఎండ శుభ్రంగా ఉంది. రాజుగారి లోగిలో సిమెంటు గచ్చులా ఆకాశం చక్కగా సాఫుగా మెరుస్తోంది దూరాన్న ఉన్న కొండల గుంపులు ఘనీభవించినమబ్బుల్లా కనిపిస్తున్నాయి నీట్లో చేపల గుంపులా ఆకాశంలో కొంగలబారొకటి గీత గీసుకుని గిడిమీద పోతున్నట్టుగా నిదానంగా పోతోంది. కాలవకి అవతలివైపున మామిడితోటల్లో చిలకలు చేసే అల్లరి కలకల వినిపిస్తోంది. దూరాన్న రామినాయుడి పొలంలో కుప్పమీదికి చేనుకట్టలు ఎగుర్తున్నాయి. కుప్పమీద కుర్రవాడొకడు ఎగెరి గెంతి తలపాగా ఊడిపోగా కేకలేసి సర్దుకుంటున్నాడు. ఎక్కడో ఆడంగులు పాడేపాట గాలికి కెరటాలు కెరటాలుగా వినవస్తోంది. అల్లంతదూరంలో గట్టంట ఓ పదేళ్ళ పిల్ల కుడిచేతిని చక్రంలా తిప్పుకుంటూ చెంగు చెంగున పరుగెడుతోంది. కమ్మల సాలలో కూర్చుని చూస్తే అంతా స్వచ్ఛంగా సుందరంగా నిజంగా దేముడు సృష్టించినట్టుగానే ఉంది. పచ్చగా ఆకు పచ్చగా నీలంగా నిర్మలంగా లోకంలో పాపం అంటూ ఎక్కడా లేనట్టుగా ఉంది.

సాల్లో పొయ్యి దగ్గర కూర్చున్న వాడు లేచి బైటకొచ్చి సాలముంగిట నిల్చున్నాడు. నూకరాజు నిల్చున్నాడేకాని నిల్చున్న కొంతసేపటిదాకా తన పక్కనే రవ్వలకొండ కూడా నిల్చున్నాడని చూసుకోలేదతను.

రవ్వలకొండ అంత నిశ్చలంగా ప్రతిమలా నిల్చున్నాడు. ఆ కుర్రవాడి ముఖం ఆ సమయంలో అతి అమాయకంగా ఉంది బాల బుద్ధుళ్ళ ముఖం పెట్టి నిల్చున్నాడు కాని వెనక్కి దాచిన అతని చేతుల్లో అలుగ్గుడొకటుంది "ఏవిట్రా వీడెందుకిలా నిల్చున్నాడు?" అని నూకరాజు అనుకునే లోపున ఓ పిట్ట కీచుకీచుమంది. అంతలో మరో పిట్టకూడా కీచుకీచుమంది. ఏవిటని చూసే రవ్వలకొండ చేతిలో అలుగ్గుడు మధ్య ఓ పిట్ట మూడురంగుల్తో ముద్దుగా ఉందది. గిలగిల్లాడుతోంది. పక్కనున్న జామచెట్టుమీంచి మరోపిట్ట గాభరాపడి రివ్వున పదడుగులు పైకెదగిరి మళ్ళీ చెట్టుమీద వాలి తన (ప్రియుడా? ప్రేయసా?) నేస్తం కోసం విలవిల్లాడిపోయి గోలగోల పెట్టేసింది.

ఆ సమయంలో మధ్యాహ్నం తోడిపోసుకున్న నూతి నీళ్ళల్లా గాలి చల్లగా హాయిగా ఉంది శీతాకాలంలో వేసుకున్న చలిటోపీలా ఎండ వెచ్చగా సుఖంగా ఉంది. గంగతో కడిగినట్టుగా ఆకాశం నిర్మలంగా ఉంది. పండిన పొలాల్తో భూమంతా బంగారంలా ఉంది. అల్లంత దూరంలో మామిడి తోటలు నందనవనంలా ఉన్నాయి.

మరి అలాంటి సమయంలో అలుగుడు దెబ్బ తమ మీద పడుతుందని పిట్టల జంటకి తట్టలేదు. అవి గొంతుకలు చించుకుని గోలపెట్టి భగవంతుణ్ణి ఎలుగెత్తి ప్రార్థించాయి.

పిట్టని "ఒగ్గీరా" అన్నాడు భగవంతుడు నూకరాజు ద్వారా. రవ్వలకొండ ఒగ్గలేదు. చేతిలో ఉన్న పిట్టని చెట్టుమీదున్న పిట్టకి చూపించి ఊరించడం మొదలు పెట్టాడు.

అప్పుడు నూకరాజేం చేసేడంటే పక్కనున్న కర్రతీసి రవ్వలకొండ చేతిమీద సడెన్‌గా బలంగా కొట్టాడు. ఆ కొట్టడంలో ఇద్దరూ కుస్తీకి దిగిపోయి నేలమీద పడిపోయి చిక్కుపడిపోయారు. 'పెద్దోళ్ళొచ్చి' ఇద్దర్నీ తన్ని విడిపించవలసొచ్చింది. కానీ అదంతా వేరే సంగతి ముందా పిట్టల జంట తుర్రున పైకెగిరి రెక్క సాచి నందనవనంలోకి ఎగిరిపోయింది. నూకరాజుకి ఆనాటి విషయమంతా గుర్తుకొచ్చి, ఆ దృశ్యం అంతా కళ్ళకి కట్టినట్టయింది.

ఆనాడు అలుగ్గుడలో పిట్టని పట్టుకున్న రవ్వలకొండ ఇప్పుడు పట్నంలో పోలీసు జవానుగా ఉన్నాడు. ప్రస్తుతం అప్పాయమ్మ ఇంటిముందు మంచం మీద తాజాగా రాజులా కూర్చున్నాడు. అతని నోట్లోంచి సూటిగా పైకొచ్చే సిగరెట్టు పొగ రంగుల మేఘంగా అల్లుకుని వన్నెలూ చిన్నెలూ తెచ్చుకుని వయ్యారంగా నాట్యం చేస్తోంది రవ్వలకొండ కాలుమీద కాలువేసుకుని రెండు చేతులూ వెనక్కి ఆనించి, తలపైకెత్తి, సిగ్రెట్టుని నోట్లో నిల్చోబెట్టి, చూరుకిందకి వారచూపు చూస్తున్నాడు.

ఈ కథకి రవ్వలకొండ విలననే సంగతి వేరే చెప్పనక్కర్లేదు.

చూరుకింద గుమ్మంలో దీపపు వెలుగులో మెరిసే నాగరత్నం కళ్ళు కాంతిపుంజాల్ని వెదజల్లుతున్నాయి. ఆమె కళ్లనిండా రవ్వలకొండే ఉన్నాడు. ఆమె మనసు అటు ఊగిందనడానికి పెద్ద తార్కాణం ఏమీ అక్కర్లేదు. ఆమె వొక్క చూపు చాలు కథంతా తెలియడానికి. నూకరాజు మానసికంగా కుప్పకూలిపోయాడు. బంగారు పువ్వుక్కూడా పురుగుపడుతుందని అతననుకోలేదు.

అతనిరాకని అప్పాయమ్మ చూడలేదు. అతణ్ణి రవ్వలకొండ గుర్తించనేలేదు రాకపోకలు గమనించే అవస్థలో నాగరత్నం లేనేలేదు. దగ్గే ముసలాయన మాత్రం నూకరాజుని చూసి పలకరించాడు. అంతట అప్పాయమ్మ కూడా అతణ్ణి చూసి, పోయిన పెన్నిధి తిరిగెలా వచ్చిందో జరిగిన సంగతేమిటో అంతా చెప్పింది.

మేస్త్రి దగ్గరకి నూకరాజు వెళ్ళొచ్చేలోపున "అంతా రొండు మినేట్లలో చెటిల్మెంటయిపోనా"దట

"ఈ జవాను బాబు దరమదాత – దేవుళ్ళా ఒచ్చిపడి పేనానికి పేనం అడ్డేసి పిల్లని బైటకి లాగేసి"నాట్ట.

"ఇనకాస్ పెట్రో ఏటో, ఆ మాటే నాకు రాదు. ఆ బాబు పేరేటి బాబూ?" అనడిగింది అప్పాయమ్మ కొండబాబుని.

"సబినస్పెట్రు" అన్నాడు కొండబాబు

"అవునా ..బాబే" అంది నాగరత్నం

"అది ఆ బాబుతో ఈ బాబు, సంగతేటో అసలేటి జరిగిందో ఏటో, అంతా టకాల్ టకాల్‌మని మూడు ముక్కల్లో సెప్పేసినాడు 'పిల్ల చూస్తే ఒట్టి ఎఱ్ఱిగొఱ్రె ' తల్లి సూస్తే దిక్కుమాలినముండా, ఆ సారా అంటే యేటో సారాయేపారం అంటే ఏటో ఆళ్ళెరగరూ, ఎండాడముండా మాటొగ్గేసి పోనాదిగాని ఈ పిల్లకి సారా అంటే సూపేనేదు" అని ఆ పెద్దబాబుతో సెప్పేసి ఆ బాబు నొప్పించి పిల్లనిడిపించుకొచ్చినాడు ఈ బాబే ' అని చెప్పి రెండు చేతులూ ఎత్తి జోడించి రవ్వల కొండవైపు తిరిగి "రచ్చించినావు కొండబాబూ రచ్చించినావు యెయ్యి దేవుళ్ళతో సమానం నువ్వు" అంది అప్పాయమ్మ. ఒక పోలీసువాడు వెయ్యి దేవుళ్ళతో సమానమనే సంగతి నూకరాజు కింకా తెలీదు.

జరిగిన సంగతంతా చెప్పాక అప్పాయమ్మ ఇంకా ఏమన్నదంటే "నూకరాజుబాబూ, జవాన్ గోర్ని ముందే ఎరిగుంటే అప్పుడే ఎళ్ళి ఆ బాబు కాళ్ళట్టుకుందువు ఎడంసేత్తో. ఈ బాబిప్పుడే ఈ సిక్కంతా ఇదదీసేసాను. అసలప్పుడీ సిక్కేనేకపోను" అంది అప్పాయమ్మ.

అయితే 'ఈ సిక్కంతా ఎలా ఒచ్చిందో' అప్పాయమ్మకీ తెలీదు, నూకరాజుకీ తెలీదు అధికార్లనే వాళ్ళుంటారని వాళ్ళకి తెలుసుకాని, అధికార్లకి కత్తులుంటాయనిగాని అవి రెండు వైపులా పదునుగా ఉంటాయనిగాని వాళ్ళకి తెలీదు. కోటీశ్వరన్‌గారు నీకంట పడకుండా నిన్ను గుమ్మంలోంచి తరిమికొట్టగలడు, లేకపోతే నీ చేత పదిరూపాయలు పెట్టి నీ చేత కాళ్ళు పట్టించుకోనూగలడు. మంత్రిపుంగవుడు నిన్ను కొమ్ముల్తో పొడవగలడు. కాకపోతే, పాలకుల ప్రతినిధి కాబట్టి నీకు పాలిప్పించి సాకనూగలడు. న్యాయాధిపతి నీమీద వచ్చిన సాక్ష్యాన్ని నమ్మనూగలడు, నమ్మకపోనూగలడు. రక్షకభటుడు నీమీద లేని నేరాన్ని సృష్టించగలడు. ఉన్న నేరాన్ని మాఫీ చెయ్యగలడు. పక్క సందులోని గూండా నీ ఇంటిమీదకి రాళ్ళు రువ్వించనూగలడు. రువ్వినవాణ్ణి తిప్పి కొట్టనూగలడు. వాళ్ళందరూ కూడా నిన్ను తహతహలాడించగలరు లేకపోతే మేల్ మేలని నీచేత చేయెత్తి దండాలు పెట్టించుకోనూగలరు.

వెఱ్ఱిగొఱ్రెలు నువ్వు. వాళ్ళు కాదు.

అందుచేత ఆనాటి ఆ వెన్నెలరేయి రవ్వల కొండకి జేజేలు కొట్టి బాజాలతో వెళ్ళింది.

మర్నాడు సాయంకాలం మార్కెట్టునుంచి చేపలు కొనుక్కుని ఒస్తూన్న నాగరత్నం నెత్తిమీద కిరీటం పెట్టుకు నిలుచున్న కొండబాబుని చూసి పకోడీల దుకాణం పక్క ఆగి అతనివైపు ఓరగా చూసింది. రవ్వలకొండ ఆమె దగ్గరకి వెళ్ళి పలకరించి మొన్న రాత్రి సినిమాలో నాయకుళ్ళా నవ్వునవ్వి, ఆ నవ్వులో ఆమెకి కితకితలు పెట్టి చివరకామెని సాగనంపి వచ్చీరావడంతో మరో నెంబరు టోపీ అతణ్ణి వీపుమీద సెభాషని చరిచి,

"బలేపిట్టని పట్టేవే" అన్నది.

"మరి, కిస్తా ఎలాటి కిస్తా ఏసేననుకున్నావ్?" అన్నాడు రవ్వలకొండ.

"ఏటాకిస్తా?" అన్నాడు రెండో జవాను

అంటే అంతా చెప్పాడు రవ్వలకొండ

అప్పుడా మరో నెంబరుగల రెండవ జవాను ఆశ్చర్యపోయి,

"ఎనకనించి గోతులో తోసేయడవూ నువ్వే? ముందుకొచ్చి సెయ్యట్టుకు లెగదియ్యడవూ నువ్వే?" అన్నాడు.

"గోతులోకి తొయ్యకపోతే సేతిలో కెలా ఒస్తందనుకున్నావ్?" అని ప్రశ్నించాడు రవ్వలకొండ

మరో నెంబరుగల టోపీగలవాడు అంతట ఒక్క క్షణం సేపు గుడ్లు పెద్దవి చేసి అరక్షణంసేపు ఆలోచించి, తలనూపి,

"అన్నేయమైతే అయిందిగాని, గొప్ప అరేంజిమెంటు చేయిస్సినావురా. నీ దగ్గర ఎవడాడు? శకుని మావ.. శకుని మావ కూడా నీ దగ్గిర బలాదూర్" అని మెచ్చుకున్నాడు. అతని కళ్ళు ఆనంద బాష్పాలతో నిండిపోయాయి

మొన్నటి నాయకుడి నువ్వు మళ్ళీ నవ్వాడు రవ్వలకొండ. నవ్వుతూ ఏమన్నాడంటే "అయి మనకి తెల్లోడిచ్చేడ్రా" అన్నాడు

"తెల్లో డేటిచ్చాడు మనకి?"

"ఫుల్ పవర్స్ పులి పవర్లిచ్చేడు. అంచేత, పట్టుపట్టడం మనవే ఇడుపు ఇడవడమూ మనవే. అంతా మనిష్టం మనకత్తెలాటికత్తో ఎరికా? మన కత్తికి రెండేపులా వాడే. గేపకవుంచుకో" అన్నాడు రవ్వలకొండ.

మరో నెంబరు జవాను కొత్తగా సర్వీసులో చేరేడు. గురూపదేశాన్ని గుర్తుంచుకునే ఉంటాడు.

అందుచేత, నాగరత్నం ఆవిధంగా వలలోపడి, గాలిలోపడి చివరకి జవానుగారి వళ్ళోపడింది. ఆమె అలా రవ్వలకొండ వళ్ళో పడగలదని అనుకున్నాడు కాని పడిపోయిందని తెలుసుకోలేదు నూకరాజు. ఆమె తనకి ఎడంగా పోతోందని గ్రహించాడు, కాని ఆమెని తిరిగి దగ్గరకెలా తెచ్చుకోవాలో తెలుసుకోలేకపోతున్నాడతను. *లోకం నైజం తెలిసినవాడంత కష్టపడడు. ఉపాయం ఎరిగినవాడు కష్టపడడు. కపటం తెలిసిన వాడూ అంత కష్టపడడు.* నూకరాజు మాత్రం చాలా బాధాపడ్డాడు. అయితే, ఆ బాధ ముసురు ముసురుగానే ఉంది చివరకోరోజున అది తుపానుగా మారింది.

రాత్రి డ్యూటీ దిగి ఇంటికొస్తున్నాడు నూకరాజు. రెండో ఆట సినిమా విడిచి పెట్టారు. జనం చాలా మంది వెళ్ళిపోతున్నారు. అతనూ సినీమా గేటు దాటేసరికి జనం పల్చబడ్డారు. గేటు దగ్గరుండే రిక్షా గుంపు చెదిరిపోయింది. అప్పుడు చూసాడు నూకరాజు.

పక్కనున్న ఓ కిల్లీ కొట్టు దగ్గర సిగరెట్టు అప్పుడే ముట్టించి చకచక ముందుకి నడిచాడు మఫ్టీలో వున్న రవ్వలకొండ, అతని మెళ్ళో పాములాటి మఫ్లరుంది. చేతిలో వజ్రాయుధంలా ఓ టార్చిలైటుంది. దుకాణానికి పదడుగుల దూరంలో ఓ ఆడమనిషి నిల్చుని అతనికోసం నిరీక్షిస్తోంది. ఆమెని చూసి నాగరత్నం అనుకోలేదు నూకరాజు. ఆమెని

పోల్చగానే అతని వళ్ళంతా గజగజ వణికింది. ఆమె పూర్వం ఎలా ఉండేదంటే పొద్దున్నే పూసిన సొగసైన పువ్వులా ఉండేది. ఇప్పుడామె దీపాల వెలుగులో వజ్రాల విగ్రహంలా కనిపిస్తోంది.

అలా నిల్చుండిపోయాడు నూకరాజు. వాళ్ళతణ్ణి చూళ్ళేదు. ఆమెకి దగ్గరగా వెళ్ళి రవ్వలకొండేదో అన్నాడు ఆమె కూడా ఏదో అంది. రెండడుగులు ఇద్దరూ ముందుకి నడిచారు. మరో మూడడుగులు ముందుకి నడిచి రిక్షాని కేకవేసాడు. జబ్బపట్టుకుని నాగరత్నాన్ని రిక్షా ఎక్కించి తనూ అందులో కూర్చున్నాడు రవ్వలకొండ. రిక్షా కదిలింది.

వాళ్ళిద్దరూ నడుచుకు వెళ్ళిపోయినా బావుండునేమో కానీ ఆవిధంగా జంటగా రిక్షాలో వెళ్ళడం చూసిన నూకరాజు వాళ్ళిద్దరి సంబంధాన్ని కళ్ళారా చూసినట్టుగా బాధపడ్డాడు. అతనికి కడుపులో దేవేసినట్టయింది. అతని కాళ్ళకింద భూమి వణికింది. నీరసంగా కిల్లీ కొట్టుదాకా నడిచి అక్కడ పైనున్న బల్లమీద కూర్చుండిపోయాడు. అయిదు నిమిషాలసేపు అలానే ఉండిపోయాడు.

నూకరాజుకి తల దిమ్మెక్కిపోయింది. అతను వెలిగించుకున్న జ్యోతులన్నీ అకస్మాత్తుగా అతని కట్టెదుటే ఏట్లోకి దిగిపోయి ఆరిపోయాయి. అతను వేసుకున్న రంగుల డేరా అతని కళ్ళెదుటే మండి మాడి మసైపోయి మాయమైపోయింది. అతను వేసుకున్న పూలతోట అరక్షణంలో పాములపుట్టగా మారిపోయింది. అతనికి తూర్పు దిక్కు ఎటో వెళ్ళిపోయి పడమట దిక్కు ఎదురొచ్చింది. అతని వళ్ళంతా జలదరించింది. అతని మనసులో తుఫాను రేగి చెలరేగింది.

కిల్లీకొట్టువాడు దుకాణం మూసేయడానికి ముందు ఆరోజొచ్చిన డబ్బులు లెక్కపెట్టుకుంటూ దబ్బున ఏదో పడ్డ చప్పుడు చెవిని పడీపడ్డంతో తుళ్ళిపడి తలెత్తి చూసాడు. చూస్తే కొట్టుముందర బల్ల తిరగబడిపోయింది. పదిగజాల దూరంలో హార్బరు కళాశీ ఒకడు పులిలా పరిగెడుతున్నాడు. పదినిమిషాల తరవాత, లేక పదినిమిషాల్లోపునేనేమో దివాంజీగారి ప్రహరీగోడపక్క వెన్నెల కూడా చొరలేకుండా పాపంలా పెరిగిన చెట్ల దట్టపు చీకట్లో రోడ్డుమీద ఓ రిక్షా తిరగబడిపోయింది, ఆ రిక్షావాడు బాబో బాబో అనుకుంటూ పరిగెట్టి పారిపోయాడు, ఆ వెంటనే రూళ్ళకర్రతో కొబ్బరిపీచుమీద కొట్టినట్టుగా కొద్దిసేపు చప్పుడయింది, ఓ మగవాడి మూలుగూ, ఓ ఆడమనిషి ఆర్తనాదం చెట్ల నీడల్లో చిక్కుకుపోయి, చీకట్లో క్షీణించి పోయాయి.

పావుగంట తరవాత ఊరవతల పాకవతల ఇసక మైదానంలో జంట తాటిచెట్ల దగ్గర కూర్చునున్నాడు నూకరాజు. అతని పక్కనే రక్తంతో తడిసిన టార్చిలైటొకటి ఇసకలో పడుంది.

రాత్రి రెండుగంటలు దాటింది. చల్లగాలి చేసే సవ్వడి తప్ప మిగతా అంతా నిశ్శబ్దంగా వుంది.

అలిసిపోయిన వాళ్ళూ, అంతా పోయినవాళ్ళూ, మరింక ఎత్తిల్లనివాళ్ళూ, దెబ్బతిన్నవాళ్ళూ, దరిద్రులూ, దౌర్భాగ్యులూ ఎలా కూర్చుంటారో అలానే మోకాళ్ళమీద తల పెట్టుక్కూర్చున్నాడు నూకరాజు.

ఒక్కసారి కాబోలు తలెత్తి చూసాడు.

అతని చుట్టూ ఉన్నది ఎడారి కాదు. అక్కడ మండుటెండాలేదు.

అది స్మశానమేంఈ కాదు. అక్కడ తుఫానూలేదు. ఆనాడూ నాకు తెలిసిన పెద్దమనిషి చెప్పిన ప్రకారం నేను వర్ణించాలనుకున్నట్టుగా అది ఆవిధంగా లేనేలేదు.

అతని చుట్టూ అదంతా ఎలా ఉందంటే స్వర్గంలో భాగంలా ఉంది.

వర్షం పడి బంగారుపొడి రాలినట్లుగా మైదానమంతా మిలమిల మెరుస్తోంది. పాలరాతి మందిరంలో నీలిరంగు దీపంలా వెన్నెలంతటా నిగనిగలాడుతోంది. ఎన్నెన్నో పూలతోటల్ని ముద్దులాడొచ్చినట్లుగా చల్ల గాలి కమ్మకమ్మగా వీస్తోంది.

అక్కడదంతా మోహనంగా దివ్యంగా ఉంది. అది నువ్వెప్పుడో చూసిన చక్కని బొమ్మలా ఉంది. అది నువ్విదివరకెన్నడూ చూడని మనోహరమైన చిత్రంలా ఉంది.

ఆ సమయంలో వెన్నెలతో నిండిన నూకరాజు కళ్ళు మాత్రం మరుగు నీళ్ళతో నిండాయి. మరుగు నీళ్ళతో నిండిన అతనికళ్ళు మంటలతో మండాయి.

అవునంతే మరి అలానే జరుగుతుంది.

మెరిసే నీకళ్ళంట చుక్కచుక్కలుగా నెత్తురంతా రాల్తుంది. బంగారు చేల మధ్య బ్రతికే నీ బ్రతుకంతా బూడిదపాలే అవుతుంది.

నువ్వు నిలబెట్టుకున్న నీ ఇల్లొకనాటి శరద్రాత్రిలో చల్లగాలిలో వెన్నెల తడిలో భగ్గునమండి తగలడుతుంది. నీ కాపురమంతా చప్పున కాలి చల్లారుతుంది. భగవంతుడు దయతో సృష్టించిన ఈ దివ్యలోకంలో నీకు ఆఖరికి దిక్కుమాలిన చావు దక్కుతుంది. అవును. మరి అలానే జరుగుతోంది కదా!

# జ్యోతి

## - బుచ్చిబాబు

## ( 1961 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

**నాకు నిజంగా ఈ కథ చెప్పే అర్హతలేదు**. ఇందులో ప్రధాన వ్యక్తులని స్వయంగా ఎరగను. మొదట్లో 'జ్యోతి' అన్న పేరు అందమైనదనుకోవడం తప్ప వేరే కుతూహలం ఆమె పట్ల లేదనే వొప్పుకోవాలి. 'జ్యోతి' అన్న పేరు నాకిష్టం అంతే.

ఇంకా మంచి పేర్లు లేవని కాని, వాటిని నేనెరగనని కాని అనడంలేదు నేను. ఎరుగుదును. ఉదాహరణకి, హేమభాగిని, వేగవాహిని. వాళ్ళని చూశాక మరోమారు చూడాలనిపించదు.

జ్యోతి అల్లాకాదు. ఆనాటి నాట్య ప్రదర్శనం ఇంకా ప్రారంభం కాలేదు. రావల్సిన పెద్దలు వొస్తేకాని ఆరంభం కాదట. కాలేజీలో ప్రొఫెసర్‌గా వుంటున్న మిత్రుడు రామంతో సంభాషిస్తున్నప్పుడు జ్యోతి ప్రస్తావన వొచ్చింది "ఇప్పుడు భర్తతో వుండటం లేదు" అన్నాడు క్లుప్తంగా మిత్రుడు రామం.

'ఆమే జ్యోతి' అని మా ముందు సీట్లల్లో కూర్చున్న జ్యోతిని చూపించాడు.

మాకు ఆమె వెనక భాగం కనపడుతోంది. నాట్య ప్రదర్శనకి అనువైన దుస్తులు కాబోలు, పాతకాలపు జరీ పూలచీర, మోచేతుల మీదికి జారిన ఎర్ర సిల్కు, మామిడి గుత్తుల జరీ డిజైన్ జాకెట్టు వేసుకుంది. మెడకింది భాగం, వెన్ను దిగువభాగం దీపం వెలుగులో మెరుస్తున్నాయి. మరోమారు చూసేటట్లు చేసింది ఆమె జడ. అందులో ఎర్రపూలు, ఎత్తుగా దట్టంగా, నిగనిగ మెరిసిపొయ్యే తల వెంట్రుకలు, బలంతో మెలి తిప్పితేకాని, పాయకి లొంగనట్లు, లాగి బిగించి, అమర్చిన పొడుగాటి జడ, కుర్చీకిందికి జారుతోంది. ప్రక్కనున్న మరొకామెతో మాట్లాడ్డానికి తల తిప్పినపుడు జ్యోతి మొహం చూశాను. ప్రశ్నార్ధకంగా స్ఫుటంగా తీర్చిదిద్దిన ముక్కు, దూరానికి ముడుచుకున్న గులాబిలాంటి నోరు, నల్లటి చిరువెంట్రుకల వెనకదాగిన చెవిని మెరిసే డైమండ్ దుద్దులు, కొవ్వొత్తి వెలుగులా, ఆఠీన్ ఆకృతిలో నుదుటనున్న ఎర్రటి కుంకుమ. నిజంగా జ్యోతి అన్నపేరు సార్ధకమైమదనుకున్నా.

*యవ్వనం వెలుగులో ఏళ్ళు, పురుగులలా నశింపవుతాయి.* ఆమె వయస్సెంత అన్న ప్రశ్న రాలేదు. రామం చెప్పాడు. పాతికమించవని. యవ్వనానికి వీడ్కోలివ్వడానికి సిద్దంగా లేదామె.

"పిల్లలా?"

"ఉహూ."

తర్వాత, ఏవో, అవీ ఇవీ మాట్లాడుకున్నాం. అయినా, ఎక్కడో మెదడులో మూలగా జ్యోతి వృత్తాంతం వుండనే వుంది. నేనేకాదు రామం కూడా అంతేననుకుంటా. ప్రదర్శన సగం అయిన తర్వాత, విరామం వచ్చింది. జ్యోతి వెనక్కి తిరిగి చూసినప్పుడు మళ్ళా ఆమె మొహం పూర్తిగా చూసే అవకాశం వచ్చింది. ఏదో ఒక ఆకర్షణ వుంది. నవ్వు మొహమా? మెరిసిపొయ్యే నేత్రాలా? ఆ పెద్ద తలకట్టా? శీలం సూచించే ఆ ముక్కా? ముంగురులు మరుగుపరచలేని వొంపు తిరిగిన నుదురా? ఇవేవీ కాక, కేవలం, ఆ దుస్తులూ, ఆభరణాలూ, ఆ డైమండ్ దుద్దులూనా? ఏమో, నాకప్పుడు తెలిసింది కాదు.

అందం అనే పదాన్ని చులకనగా వాడేసే స్వభావం మనందరికీ వుంది. ఒకరికి అందంగా అగుపడిన వ్యక్తి. మరొకరికి అందంగా కనపడకపోవచ్చునని చెప్పుకోడమూ వుంది. ఇందుకు నేనొప్పుకోను. వ్యక్తిగతమైన అభిరుచులతో

నిమిత్తం లేకుండా. ఏదో శాస్త్రీయరీత్యా నిర్ణీతమైనట్లు, అందరికీ అందంగా కనపడ్డప్పుడే, 'అందం' అనే పదం ప్రయోగించాలనే తత్వం నాది. ఒక వ్యక్తిని వందమంది చూస్తే, ఆ వందమందికీ అందంగా వున్నప్పుడే ఆ వ్యక్తి అందమైనదన్న నిర్వచనం చెయ్యొచ్చు. అలా అంగీకరించికూడా, ఆ వందమందిలో కొందరికి నచ్చకపోవచ్చు. అది వేరే విషయం. మొత్తానికి అందరూ అందంగా వున్నదని అంగీకరించడం ముఖ్యం.

ఆ విధంగా, అందరూ అంగీకరించగల అందం జ్యోతిది అనుకున్నాను. అది ఎందులోవుందో విభజించి చెప్పడం నావల్లకాదు. జడ, ముక్కు, కళ్ళు, పేరు – ఇవేవీ కావేమో ఆమెపట్ల ఏర్పడ్డ కుతూహలానికి కారణం "ఇప్పుడు భర్తతో వుండటంలేదు" అని రామం చెప్పిన విషయమే నా కుతూహలానికి కారణం. ఈ విధంగా కుతూహలపడ్డ వ్యక్తి నేనొక్కణ్ణే కాననీ, ఇంకా చాలామంది వున్నారనీ తర్వాత తెలిసింది. జ్యోతిని గురించి మళ్ళా చెప్పడం మొదలుపెట్టాడు.

"భర్త ప్లీడరు."

"భర్తతో వుండటం లేదంటే?" అని అడిగాను.

"అంటే, అంతే."

"మరెక్కడ వుంటోంది?"

"వాళ్ళవూళ్ళో. అమ్మా, నాన్నా దగ్గర."

"చదువుకుందా?"

"కాలేజిలో వొకేడు చదివి మానేసింది"

"ఏం?"

"పెళ్ళి చేసుకుంది."

"ప్లీడర్నా?"

జ్యోతికి మా సంభాషణ వినబడుతుందని కాబోలు, కంఠం దించి, దగ్గరగా జరిగి చెప్పడం మొదలుపెట్టాడు రామం, మధ్య మధ్య ఆమెవైపు చూస్తూ. ఆమె కాస్త దూరంగా కూర్చోడం మెరుగైంది. దగ్గరలో వుంటె ఆమెని చూస్తూ కూర్చోడం తప్ప, మాట్లాడ్డానికి అవకాశమే వుండదు.

"అవును. పేరు కోదండరామయ్య. ఓ రకం బంధుత్వం కూడా వుందిట. చాలా స్థితిపరుడు. ఒకర్ని వొకరు ఎరుగుండి, చాలా ఏళ్ళ స్నేహం, ప్రేమగా పరిణమించింతర్వాత జరిగిన పెళ్ళి"

"మరెందుకు విడిచి వెయ్యడం? సంతానం లేకనా?"

"ముందు కలగొచ్చుగా. ఇప్పుడు అతని వయస్సు ముప్పై రెండు మించదు. నాలుగైదేళ్ళగా కలిసి కాపరం చేస్త"

మళ్ళా ప్రదర్శన ప్రారంభమైంది. మా సంభాషణ నిలిచిపోయింది. అప్పుడప్పుడు జ్యోతి కూర్చున్నవైపు చూసినప్పుడు, ఆమె కాళ్ళు కదల్చడం గమనించాను. కాళ్ళు కదపడం మొగాడి అలవాటు. ఆ పని స్త్రీలు చేస్తే హర్షించరు. ఎర్ర వెల్‌వెట్ జోళ్ళ పాదాలు వూగిసలాడుతున్నాయి. ఆ చర్య మానసిక అసంతృప్తి చిహ్నం అనుకుంటా. నోట్లో, ముక్కులో, చెవులో వేళ్ళు పెట్టుకోవడం, కాళ్ళు కదల్చడం, చేతివేళ్ళు మడిచి తెరవడం ఇట్లాంటి ఆలవాట్లు చాలామందికుంటాయి, మిలిటరీవాళ్ళలో తప్ప. ఇతరులు మందలిస్తే గ్రహించుకుని కొందరు విడిచి పెడతారు. ఇవన్నీ మనస్సులో ఊహలో జరిగే కల్లోలాన్ని ఆరాటాన్ని శరీరరీత్యా అదుపులోకి తీసుకురావడం కోసం జరిగే పెనుగులాట నిదర్శనాలనొచ్చు. ఊహతో సమరం, స్త్రీలో అంత ప్రస్ఫుటంగా బహిర్గతం కాదు, గనక, అల్లా కాళ్ళు వూపిన స్త్రీలో ఏదో వొక పేచీ వుండి తీరుతుందనుకుంటా, నాట్య ప్రదర్శన కార్యక్రమంలో చివరి అంశం జరుగుతుంటే, ముందు సీట్లలో వొకరిద్దరు వ్యక్తులు బైటకి వెడుతున్నారు. ముందుగా ఇంటికి వెళ్ళేందుకు వాహనాలు వెదుక్కునేవారు కాబోలు. జనం వొత్తిడి లేకుండా కాస్త ముందుగా వెళ్ళే అలవాటు నాకూ వుంది. కాని ఆనాడు మిత్రుడు రామంతోపాటే లేవడానికి, సంసిద్ధుడనయ్యాను. మరో నాలుగైదు నిమిషాలుందేమో.

"అదుగో – అతనే కోదండరామయ్య" అని రామం, ముందుగా వెళ్ళే వ్యక్తికేసి చూపించాడు. అతను మేం కూర్చున్న గేటు ముందునుండే నడుస్తున్నాడు. అంత పరిశీలనగా చూడలేకపోయినా, వ్యక్తి బానే వున్నాడనుకున్నా. పాంట్, లోపల కాలర్ బనీన్ టెన్నిస్ ఆటగాడు వేసుకునేది, ఎగదువ్విన క్రాపింగ్, కళ్ళజోడు, కాస్త ఎత్తుగా, కొంచెం ఎరుపుగా, బలంగానే కనిపించాడు. అంతా బాగానేవుంది కాని...

"పద. పోదాం" అని రామం లేచాడు. తొందరగా గేటుదగ్గరకి నడిచాం. ప్రదర్శన పూర్తయింది. కాని జనం లేవలేదు. చివరలో ప్రముఖుని అభినందన ఉపన్యాసం నాట్యబృందానికి పతకాల బహూకరణ ఇంకా తంతుంది కాబోలు. నేనూ, అతనూ, అట్లాగే గేట్లోనుండి పొయ్యాము. మరో ఐదారు నిమిషాలయ్యాక, మా ముందు సీట్లలో బృందం కదిలారు. వారిలో జ్యోతి వుంది. మా ముందుగా నడిచి వెడుతున్నారు. జ్యోతిని పరిక్షగా చూశాను. రాత్రిపూట ఏదో పెద్ద ఉత్సవం జరుగుతుండగా, దీపాలన్నీ ఆర్పోయి, ఎవరో వొక కాగడా వెలిగించినట్ళుగా వుంది, జ్యోతిని చూస్తే. పెద్ద అడివిమధ్య చీకట్లో ప్రవహించే నదిలో చందమామ ప్రతిబింబం మెరిసినట్లు..

ఆలయంలోపల చీకట్లో వొక్క ప్రమిదలో వెలిగిన జ్యోతిలా..

ఇంటికి వెడుతున్నాం.

"కోదండరామయ్యకేం లోటు నిక్షేపలా వున్నాడు" అన్నాను.

ఆ రాత్రి భోజనాలయ్యాక చెప్పాడు మిత్రుడు రామం.

"కోదండరామయ్య జుట్టు నెరిసిపోయింది అందుకట" అని నవ్వడం మొదలుపెట్టాడు. వెంటనే స్ఫురించకపోయినా, నేనూ నవ్వడం మొదలుపెట్టాను. అప్పుడు జ్ఞప్తికొచ్చింది. కోదండరామయ్య అన్నివిధాల బాగానే వున్నాడనుకున్నా, ఏదో ఒక లోటుంది, అది ఏమిటో అతన్ని చూసినప్పుడు లోపలున్న అసంతృప్తి, స్వరూపం తెచ్చుకుని పైకి రాలేదు. అవును, పైకి ఎగదువ్విన క్రాపింగ్ చాలా భాగం నెరిసినట్లేవుంది. అలా అక్కడకక్కడ తెల్లవెంట్రుకలుంటే, అదొక అందం కూడాననుకున్నా. రామంతో అన్నాను.

"అక్కడకక్కడ నెరిస్తే పేచీలేదు. పూర్తిగా నెరిసింది. అదే జ్యోతి గొడవ" అన్నాడు రామం.

"అంతమాత్రానికే ప్రేమించి చేసుకున్న భర్తని విడిచెయ్యాలా? ఈ రోజుల్లో బోలెడు మందులున్నాయి. వెంట్రుకలు నల్లబడటానికి."

"జ్యోతి పోరు పడలేక, ఆ మందులన్నీ వాడేవాడట. అసలవి వాడటంకూడా వొక అపరాధం క్రింద భావించిందట."

"దాని మూలాన అతనేమీ వికృతంగా లేడే"

"తనకేమీ లేదు. తనని ఎరుగున్న స్నేహితురాళ్ళు, బంధువులు, తన భర్త సంగతి చెప్పుకుని హేళన చెయ్యడం తనకి తలవొంపుగా వుండేదట" అని నవ్వుతున్నాడు రామం. లోపల ఈ సంగతి వింత ధోరణిలో వితర్కించుకుంటూన్నా, ఆ సమయంలో నేనూ పైకి నవ్వేశాను. అసలు ఇంకా ఏదో వుండాలి. కేవలం కాసిని తల వెంట్రుకలు నెరిసినంత మాత్రాన భర్తని విడిచెయ్యడం, మన సమాజంలో జరగదు. కాని, జనం ఇలా చెప్పుకుంటారు కాబోలు. ఆ కారణంగా విడిచిపెట్టి వెయ్యాలన్న ఉద్దేశం లోలోన వున్న స్త్రీలు ఈనాటి సమాజంలో వున్నా, దాన్ని ఆచరణలో పెట్టగల సాహసం వున్నవారు అరుదేమో. ఆ రాత్రల్లా జ్యోతిని గురించి ఆలోచించాను. సాహసించి, తెగించి. తనకి చేతనైనంతలో ప్రధానంగా తోచినవాటిని పొందేటందుకు కొన్ని సౌకర్యాలను త్యాగం చెయ్యాలన్న ఆధునిక తత్వం బాగా ఎముకలకి పట్టిన నవయువతులకు ప్రతినిధిలా కనిపిస్తోంది జ్యోతి. సౌందర్యం కోసం, సౌకర్యం త్యాగం చెయ్యడం నాగరికత అంటున్నారు. సౌందర్యాన్ని గాఢంగా ప్రేమించేవారు వుండడం అరుదుకాదు. తమచుట్టూవున్న వ్యక్తులు, వస్తువులు, తాము, ఎప్పుడూ అందంగా వుంటేనే. తమ ప్రాణం కుదుటపడ్డట్టుగా వుంటుంది. అట్లాంటి వారికి బట్ట, బొట్టు, జుట్టు, మాట, చూపు అన్నీ అందంగా చేసుకోవాలి వారు. నలుగురూ చెప్పుకోవాలి.

ఆ అందంవల్ల వారు దైనందిన జీవితంలో సాధించే ప్రయోజనం ఏమీ వుండదు వారి మనస్సు బాగుంటుంది. అంతే. ప్రయోజనం ప్రసక్తితో మలినం కాని సౌందర్యాన్ని ఆరాధించినవారు సాధించే విలువలు కూడా లేకపోవొచ్చు. కాని వారి నిజస్వరూపం, ఉనికి  అందంలోనే వుంటుంది, యోగి తపస్సుద్వారా శాంతిని సాధించడంలో ఉన్నట్లు. యోగి తపస్సువల్ల ఇతరులకు సంక్రమించే ప్రయోజనం ఏమీ లేనట్లే. వీరి సౌందర్యసాధనకూడాను. జ్యోతి గాయకురాలు కాదు. కవయిత్రికాదు, నర్తకి కాదు. తను తనుగా వుండటమే, తను సాధించిన ప్రయోజనం. ఇది సాధించడం అనుకున్నంత

సుళువు కాదు. పైకి నలుగురితోపాటు హేళనగా నవ్వేసినా, లోలోన ఆమెని అభినందించానని వొప్పుకోక పోవడం, నన్ను నేను వంచించుకోవడం అవుతుంది. ఆమెని ఆదర్శవ్యక్తిగా ప్రదర్శించడంలేదు నేను. గాఢంగా విశ్వసించి అలవర్చుకున్న ఆదర్శాన్ని అమలు జరుపుకోవడంలోగల శీలాన్ని అభినందిస్తున్నాను.

మరో రెండేళ్ళు గడిచాకగాని జ్యోతి విషయం తెలుసుకునే అవకాశం రాలేదు. నా మిత్రుడు రాజన్న కాలేజీలో జీతాలిచ్చే ఎకౌంటెంట్. అతని భార్య రంగనాయకమ్మ. ఆమె చెప్పింది జ్యోతి వృత్తాంతం.

"మొగుణ్ణి విడిచేసిందిగా."

"అవునవును. ఇదివరలో విన్నాను. భర్త క్రాపింగ్ నెరిసిందిట. నలుగురూ చెప్పుకుని వెటకారం చేస్తూండడం సహించలేక విడిచేసిందని విన్నాను" అన్నాను.

"అవును. అందగత్తె. స్ఫురద్రూపి. బారెడు జడ. నెరిసిన క్రాపింగ్ చూసి స్నేహితులంతా ముసలాణ్ణి కట్టుకుందంటున్నారు" అంది రంగనాయకమ్మ. ఆ వొక్క వాఖ్యతో రంగనాయకమ్మ పట్ల నా గౌరవభావం పెరిగింది. ఒక స్త్రీ మరో స్త్రీ అందమైందని వొప్పుకోవటం నే ఎరగను. "జుట్టు రంగు ఏదైతే ఏం? వైఖరి, మొహం అసలు వయస్సు చాటదంటారా?" అన్నాను.

"ఎందుకు చాటదు? నిక్షేపంలాంటివాడు కోదండ రామయ్య చదువుకున్న వాడు, ఏదో ప్రాక్టీసుంది. బోలెడాస్తి మంచి కుటుంబం. ఆమెని తృప్తి పరచడానికి రంగు వేసుకున్నాడట. దాంతో వొచ్చింది పేచీ" అని నవ్వుతుంది రంగనాయకమ్మ.

రంగనాయకమ్మ అందమైన మనిషే అనుకుంటా. ఇందాక చెప్పినట్లు, శాస్త్రరీత్యా కొలత బద్దతో చూస్తే. ఏ అవయవానికా అవయవం. అందంగా, క్రమంగా ప్రతి అవయవమూ ఏర్పడివుంది. కాని అదేం చిత్రమో. అవన్నీ కలితే గొప్పగా వుండాలిగా అలా లేదు. ఏదో తిరకాసుంది. నడివయస్సుతో వచ్చే నిండుతనం ఆమెకి ఒక హుందాతనాన్ని కల్పించింది. కాస్తలో బెసికిపోయిన అందంతో చనువుగా వుండటం నాకంత కష్టంకాదు.

"విడిచివేస్తే మాత్రం, ఫలానా వ్యక్తి భార్యగా ఆమెని స్నేహితురాండ్రు వెక్కిరించడం మానతారంటారా?"

"విడిచేసిందని మరీ చెప్పుకుంటారు. నిజమే. కానీ ఆమెకి అది అంత బాధగా తోచదు కాబోలు."

మధ్యలో అప్పుడే కాలేజినుండి వచ్చిన రాజన్న అందుకున్నాడు.

"అసలు సంగతి అదికాదు. మా కాలేజ్‌లో హిస్టరీ లెక్చరర్ మధుసూదనాన్ని ప్రేమించిందట. గడువేదో వుందట. అదవగానే విడాకులిచ్చి వివాహం.."

"చాలు చాల్లెండి" అంటూ భర్తమీద విరుచుకు పడింది రంగనాయకమ్మ. జ్యోతి ఆదర్శవ్యక్తనీ, అట్లాంటి పని తలపెట్టదనీ, ఆ దంపతులిద్దరూ ఉత్తములనీ. ఏదో కారణాంతరాలవల్ల విడిపోయినా, మళ్ళీ కలిసి తీరతారనీ, ఆవిడ ఉపన్యాస సారాంశం. నాకు రంగనాయకమ్మ వాదం నమ్మదగిందిగా వున్నా. వొప్పేసుకోడానికి మనస్సు చటుక్కున సిద్ధపడలేదు. *ప్రతివార్ని గురించి మంచిగా చెప్పేవారంటే నాకు మొదటినుంచీ భయం.*

"అయినా మీకెట్లా తెలుసు?"

"మా కాలేజీలో జరిగేవి నా చెవిని పడకుండా వుంటాయా? జ్యోతి కాలేజీలో చేరిందిగా, తను తీసుకొన్న సబ్జెక్ట్ హిస్టరీ. మధుసూదనం హిస్టరీ లెక్చరర్, కుర్రవాడు. ఈ మధ్యనే ఫస్టుగా ప్యాసై కాలేజీలో చేరాడు. స్కాలర్‌షిప్ మీద ఇంగ్లండుకూడా పంపుతారట" అన్నాడు రాజన్న.

కానీ ఈ ప్రేమ ఉదంతం రంగనాయకమ్మ అంగీకరించలేదు. భర్తని బాగా చివాట్లు పెట్టి కంఠం దించి మాట్లాడేటట్లు చేసింది. ప్రేమ తాత్కాలికమైందనీ. దాని వల్ల పెద్ద ఉపద్రవం జరగదనీ ఆమెవాదం. కలరా క్రిమి చిన్నదే. కాని చాలా గడబిడ చేస్తుందంటాడు రాజన్న. వారిలా జ్యోతి విషయం తగువులాడుకున్నా, వారిద్దరి మధ్య వున్న అన్యోన్యం, స్నేహం, నన్ను ముగ్ధుణ్ణి చేస్తుంది. ఒకరికొకరు అంతగా కావల్సి వచ్చినవారు తగవులాడుకోవడం, సంసార జీవితంలో మధుర ఘట్టాలలో ఒకటి. అప్పట్లో జ్యోతి తొక్కిన కొత్త పంథాని ఎక్కువగా వితర్కింపలేదు నేను. ఏమిటో చిత్రం, మరీ ఎక్కువ వితర్కించినా అసలు వితర్కించకపోయినా జీవితం అర్థంకాదు.

మరో ఐదారు మాసాలు జరిగాక, ఈసారి మా మిత్రుడు రామం ద్వారా మరి కొన్ని విషయాలు విన్నాను.

"మధుసూదనాన్ని ప్రేమించిందో లేదో నాకు తెలియదు. విడాకులిచ్చిన పిదప పెళ్ళి చేసుకోవాలన్న సంకల్పం వున్నట్లు తెలుస్తోంది" అన్నాడు రామం. రామం కూడా ఆ కాలేజీలోనే పనిచేస్తూ వుండడం వల్ల, అతను పోగుచేసిన భోగట్టాని తోసెయ్యకూడదు. పెండ్లి విషయం సంకోచం లేకుండా చెపుతున్నాడు రామం. కానీ ప్రేమించిన విషయం చెప్పడంలేదు. ఆమె ఎవర్నీ ప్రేమించడం అతనికిష్టంలేనట్లు. రామం ఇంకా యువకుడే, సౌందర్యాన్ని చూసి ఆనందించగలగడం యవ్వనానికే సాధ్యం అంటారు పెద్దలు.

"ప్రేమలేకుండా పెళ్ళి చేసుకుంటుందా జ్యోతి?" అని అడిగాను.

"ప్రేమించి చేసుకున్న పెళ్ళి కోరినట్లు పరిణమించలేదు. వివాహం నెగ్గడంలో, బాహ్య స్థితిగతులకి, వంశపారంపర్యా సంక్రమించే విలువలకి కూడా కొంత ప్రమేయం వుంటుందేమో. కేవలం ప్రేమించుకున్న వారి వ్యక్తిత్వాలపై ఆధారపడుతుందని అనలేం. ఈసారి ఆ పొరపాటు చెయ్యకుండా బాహ్యస్థితిగతులను మాత్రం చక్కబెట్టుకుని, ఆ వివాహం ఫలితం ఎట్లాంటిదో చూడ సంకల్పించిందేమో తెలీదు" అన్నాడు కొంచెం దిగులుగా రామం.

"అంత దిగులుగా చెబుతున్నావేం?"

"నవ్వొస్తుంది – జాలితో కూడుకున్న నవ్వు సుమా."

"ఏం కథ?"

"చెప్తావిను. మధుసూదనం ఇంగ్లాండెళ్ళిపోయ్యాడు. రెండు నెలలైంది. మేమంతా పార్టీ కూడా ఇచ్చాం. విద్యార్థిని అవడం మూలాన. జ్యోతి పార్టీలో లేదు. ఆమెకు చెప్పకుండా వెళ్ళాడుట."

“అదేంటి, చిత్రంగా వుందే”

“ఉత్తరానికి జవాబు కూడా లేదుట.”

“ఎందుకో?”

"నాకు తెలీదు. కానీ ఊహించగలను. పూర్తిగా ఊహ కాదు సుమా,"

"చెప్పు, చెప్పు విన కుతూహల పడుచుంటి."

"జ్యోతి తల నెరిసిపోయింది. అందుకు"

ఇద్దరం మౌనంలోపడ్డాం. ఎన్నో ప్రశ్నలు లేచిపోయిన ప్రియురాల్ని వెదుకుతున్నట్లు. వాటి వెనక వేగిరపడే అస్పష్టమైన సమాధానాలు.

"అదంతా. నాలుగైదు నెలల్లో జరిగింది. ఒక ఉదయం తలంటుపోసుకుని అద్దం చూసుకుంది. చాలాభాగం తెల్లవెంట్రుకలే" ఇది విన్నాక. తలంటు పోసుకుని అద్దం చూసుకోవాలంటే భయమేస్తుంది.

"రంగు వేసుకుంటున్నారుగా ఇప్పుడు" అన్నాను.

"అది ఆమెకిష్టం లేదు. వాళ్ళ నాన్నకి కూడా చిన్నతనంలోనే వెంట్రుకలు నెరిసిపొయ్యాయిట. అది మొదటినుంచీ కుటుంబ పెద్దల శరీర వైఖరిట. అక్కడో తెల్ల వెంట్రుక. ఇక్కడో తెల్ల వెంట్రుక కనబడటం మొదలెట్టి క్రమంగా ఐదారు నెలల్లో చాలాభాగం తెల్లబడిపోయిందట. మధుసూదనం ఈ కారణంగా ఆమెనుండి పారిపొయ్యాడనుకోలేను కాని, గమనించకుండా వుంటాడా? ఈ కారణంగా ఆమె భర్తను విడిచేసిందని అతనికి తెలియకుండా వుంటుందా?" రామం ఆలోచనలో పడ్డాడు.

ఏ రకం ఆలోచనో నేనీమారు ఊహించలేకపొయ్యాను. జ్యోతి పరిస్థితికి జాలేసింది. వెంటనే ఆమె దగ్గరకెళ్ళి వోదార్చాలనిపించింది. ఈ క్షుద్రజగత్తునుండి ఆమెను దూరంగా ఏదో సౌందర్య సీమలో దిగవిడిచి రావాలనిపించింది, లక్ష్మణుడు, సీతాదేవిని వనంలో విడిచినట్లు. అంతగా సౌందర్యాన్ని కాంక్షించి, అది లోపించిన భర్తను త్యాగం చేసిన జ్యోతికే ఇది సంభవించడం. విధివేసే కుప్పిగంతులన్నింటిలోనూ హేయమైందిగా కనబడింది.

"నువ్వు జ్యోతిని చూశావా?" అన్నాను.

"చూడకేం. రోజూ చూస్తూనే వున్నాను."

"నే చూడ్డం వీలవుతుందా?"

"అవదేమో.. ఇంగ్లండ్‌కి జ్యోతి ఏర్‌మెయిల్ లెటర్స్ వ్రాస్తే. సమాధానమే లేదుట."

"నీకెట్లా తెలుసు?"

"అబ్దుల్‌ఖాదర్ అతని స్నేహితుడు. మా కాలేజీలో లెక్కల ప్రొఫెసర్‌లే. అతనికి వ్రాస్తూ, ఇంగ్లండ్ రాకుండా అక్కడే వుంటే చిక్కులో పడేవాడిననీ, అందుకు కారణం, అబ్దుల్‌ఖాదర్ వూహించగలడనీ, వ్రాశాడుట మధుసూదనం" అన్నాడు రామం.

"ఆ మాత్రానికే బెసికిపోయినవ్యక్తి. ఆమె ప్రేమ పొందడానికి అర్హుడుకాడేమో" అన్నాను కాస్త రోషంతో.

"అట్లాగయితే కోదండరామయ్య ప్రేమ పొందడానికి జ్యోతి అర్హురాలా?" అన్నాడు అంత ఆవేశంతోనూ.

ఇది చవకబారు ఎత్తి పొడుపులా ధ్వనించింది ఆ క్షణంలో.

జ్యోతి ఒక ఆర్టిస్టు. ఇతరులకి అన్వయించే కట్టుబాట్లు, విలువలు, ఆర్టిస్టుకి అన్వయించవు. సంప్రదాయం అనే 'గ్లవ్స్'తో బండచేతులను కప్పి ఆ చేతులతో ఆమెను ఆరాధించడం, పవిత్ర ప్రేమ శిఖరంపై మట్టికాలుపెట్టి మలినం చెయ్యడం అనిపించుకోదా ఏమిటో ఇదంతా అర్ధంలేని ఆవేశం.

"ఇంతకు చూడటం ఎందుకు వీలుపడదు?" అని అడిగాను.

"మధుసూదనం చూపిన విముఖత, నిర్లక్ష్యం ఆమెని గాయపరిచాయి. పరీక్షకి కూర్చోడం మానేసి, వాళ్ళవూరు వెళ్ళిపోయింది. చూడదగ్గ వ్యక్తి. ఆ తెల్లవెంట్రుకలు మెలితిప్పి కట్టిన ముడి, ఆమెకొక కొత్త ఠీవిని, దర్జానీ ఆపాదించాయంటే నమ్ము. వృద్ధులలో తెల్లవెంట్రుకలు గమనించం మనం. జ్యోతిని ప్రతివాడూ తేరబారి చూడాల్సిందే."

అల్లా వర్ణిస్తుంటే రామం మొహంలో నేనెన్నడూ చూడని వొక కాంతిని, వికాసాన్ని చూడగలిగాను ఆనాడు. ఆమె స్మరణే అంతటి చైతన్యానికి కారణమైందంటే జ్యోతి ఆర్టిస్టు అనుకోడంలో నా తప్పేమీలేదు.

"అంటే ఆమె జీవితం? పర్యవసానం ఏమిటో?"

తనకేమీ పాలుపోనట్లు పెదవి విరిచాడు రామం.

"కోదండరామయ్య చాలామంచివాడు" అన్నాడు రామం, రెండుమూడు నిమిషాలయ్యాక. అది అర్ధంలేని నిర్వచనం. *నాకు మంచివాళ్ళంటే ఎందుకో భయం, అందులోనూ చాలా మంచివాడంటే మరీ భయం. మంచివాడు అనగానే స్వార్ధరహితుడు. తనకేం జరిగినా పట్టించుకోడు. తబ్బిబ్బవడు; తనకి జరగనట్లు సర్దుకుపోతాడు. ఏమీ చెయ్యడు, చర్యకి దిగడు,* ఎంతగానో ప్రేమించిన సౌందర్యమూర్తి జ్యోతి, తనని విడిచిపోతే. ఏమీ చెయ్యలేదు. తనకి సంబంధం లేనట్లు ఊరుకున్నాడు. అది నడివయస్సులో సంక్రమించే స్తబ్దతకాదు. అతని వయస్సు, ముప్పై, ముప్పై మూడు దాటలేదు. అణిచేసి, విడిచేసిన శరీర శక్తులూరుకుంటాయా? ఎప్పుడో అప్పుడు, తిరుగుబాటు చేసి అతనిచేత ఏదో భయంకరమైన

కార్యం చేయించి తీరతాయి. జ్యోతిని హత్య చెయ్యొచ్చు; ఆత్మహత్య చేసుకోవొచ్చు. సన్యసించవొచ్చు. మధుసూదనాన్ని చంపొచ్చు.

*నాగరికుడిలో పశుత్వం, ప్రాచీనత్వం విజృంభిస్తే ఏవిధంగా చెలరేగుతాడో ఎవ్వడూ చెప్పలేడు. అందుకనే నేటి సమాజంలో చాలామంచివాళ్ళంటే భయం నాకు.*

"ఆమె తన దగ్గరకొస్తే కోదండరామయ్యకి ఏ అభ్యంతరమూ లేదు. ఎగిరిగంతేసి కౌగలించుకుని, స్వీకరించి పువ్వులలో పూజించడానికి సిద్దం. ఆమె పట్ల ద్వేషమూ, కోపమూ లేవట. నేరస్థురాలుగా పరిగణించదుట. క్షమించవల్సింది ఏదీ లేదుట. పరిస్థితులు, బాహ్యసౌందర్యం, ఆమెచేత ఆ పని చేయించినవి గాన, ఆమెలో 'వ్యక్తి' బాధ్యతలేదు. ప్రేమించిన వ్యక్తి ఎలాంటిదైనా బెసికిపోక స్థిరంగా వుండే ప్రేమే ప్రేమ. అల్లా కాకపోతే ప్రేమకి అర్ధంలేదుట" అని స్వగతంలా, క్లాస్‌లో లెక్చర్ ధోరణిలో చెప్పుకుపోతున్నాడు రామం. ఇదంతా రామం ఊహలో కల్పించిన వ్యాఖ్యానం గాని నిజంగా కోదండరామయ్య అభిప్రాయాలుగా స్వీకరించలేకపోతున్నాను. నేనేమంత మంచివాణ్ణి కానేమో. అంతటి మంచితనం పట్ల నాకు విశ్వాసం లేదేమో. ప్రగల్భంతో ఆదర్శశిఖరానికి ఎగబాకే బడాయికోరైన ప్రతి మంచివాడూ, కుంటివాడని నమ్మేవాడినేమో, అలా భావించినందుకు. నాపైన నాకు గౌరవం సన్నగిల్లడమూ వుంది, మళ్ళా అదేమిటో.

"నీకెలా తెలుసు?"

రామం ఉలిక్కిపడ్డాడు మంచులో నడుస్తుంటే పాదానికి నిప్పుకణం తగిలినట్లు.

"ఆమెకి ఉత్తరాలు వ్రాశాడు. కబురంపాడు, అత్తమామలతో చెప్పుకున్నాడు. అంతటి మంచి భర్తలుండరు."

భర్తగా మాత్రం అంత మంచివాడంటే నాకంత పేచీలేదు. అంగీకరిస్తాను. భర్తగా తన ధర్మం అల్లా నిర్వర్తిస్తుంటే, అతనెలాంటి వ్యక్తో ఊహించి విలువలు కట్టగలను. కొంతమెరుగు. అమ్మయ్య అనుకున్నాను.

ఐదారు నెలల తర్వాత మళ్ళా రామంని కలుసుకున్నాను. ఆ రోజు పండుగ. రాజన్న మమ్మల్ని ఇద్దర్నీ వారింటికి భోజనానికి ఆహ్వానించాడు. రంగనాయకమ్మగారి భోజనం అంటే నాకెంతో ఇష్టం. ఇద్దరం వెళ్ళాం. భోజనాలయ్యాక తాంబూలం వేసుకునే తంతు జరుగుతోంది.

"మీకు జ్యోతిని చూడాలనుందా?" అన్నాడు రాజన్న.

"ఎందుకుండదు. ఆయనకింకా పెళ్ళి కాలేదుగా" అంది రంగనాయకమ్మ కొంటెగా.

"అయిన వాళ్ళకి చూడాలనుండకూడదా?" అన్నాడు రామం.

"అసలు వాళ్ళకే ఎక్కువుంటుంది. కర్మ పైకి ప్రకటించకూడదు. మావార్ని చూడరాదు" అంది రంగనాయకమ్మ.

"నన్నూ జతచెయ్యండి" అన్నాడు రామం. దానితో సంభాషణ ప్రమాదంగా మారే అవస్థదాటింది. మళ్ళా లెక్చరర్ ధోరణిలో మొదలెట్టాడు రామం.

*"సంబంధం చూడ్డానికి వెళ్ళినవాడు పెళ్ళికూతుర్ని మాత్రం పరిశీలనగా చూస్తాడు. నిజానికి అది చాలదు. ఆమె తల్లిదండ్రుల్ని పరీక్షగా చూడాలి. పెళ్ళికూతురు పెద్దయింతర్వాత, ఏ అవతారం దాలుస్తుందో, అమ్మా నాన్ననీ చూసి వూహించుకోవచ్చు. మన పూర్వులు అందుకే కుటుంబ సంప్రదాయం. చరిత్ర తెలుసుకోవాలని నిక్కచ్చి చేసేవారు.* పెళ్ళికూతురు కుటుంబంలో ఉన్మాదం, హిస్టీరియా, ట్యుబర్క్లోసిస్. నేరస్థుల నైజం. జైలురికార్డు, అవయవాల అవకతవక మడత నాలుక, మెల్ల మొదలైనవి. ఇవన్నీ చూసి. నచ్చిన పిదప చేసుకోమని శాసించారు. అల్లాగే, చిన్న వయసులో తలనెరవడంకూడాను. పెళ్ళికూతురు తలిదండ్రుల తల నలభయ్యో పడిలో నేనెరిస్తే, అమ్మాయి వైఖరికూడా అల్లానే అవుతుందని అంచనా వేసుకోవొచ్చు."

విరామం వొస్తే అందుకోడానికి సిద్దంగా వున్న రంగనాయకమ్మ, విరామం రాకుండానే అందుకుంది.

"అమ్మాయిలమాట చెప్పారు – బాగానే వుంది. అబ్బాయిలమాటో? ఏ మేనమామనో, గుమాస్తానో తీసుకుని పెళ్ళిచూపుల కొస్తాడు అయ్య. పెద్దయితే అతని అవతారం ఎల్లా వుంటుందో వూహించే భాగ్యం అమ్మాయిలకి అక్కర్లేదేం? మీరు అమలు జరపబొయ్యే శాసనంలో. పెళ్ళికొడుకుతోబాటు పెళ్ళిచూపులకి అతని అమ్మానాన్నా కూడా వొచ్చి తీరాలని వ్రాయించండి" రాజన్న, భార్య చమత్కారానికి నవ్వుతున్నాడు.

"పెళ్ళికొడుకు రూపురేఖలు ముఖ్యంకాదని పెద్దలన్నదే గనక. ఆ తీర్మానం ఉపసంహరించుకోడం మంచిది" అన్నాడు.

"అవును మరి పెద్దలకి చక్కదనం పట్టదు. అక్కర్లేదు. కాని కన్యకి కావాలి. పాపం నోరులేదు పైకి చెప్పరు. ఈనాడంటే కాస్తో కూస్తో చదువుకున్న ఆడది సాహసించి చెప్పగలుగుతోంది. కాని ఆమె ఘోష అమ్మానాన్నకి అర్ధంకాదు. వాళ్ళకి ఏవేవో కావాలి చదువు, ఉద్యోగం, హోదా, ఆస్తి, విధవైన చెల్లెలు లేకపోవడం వగైరా" అంటూంది రంగనాయకమ్మ. తాంబూలంతో ఎర్రబడిన ఆమె నోరు ఎంతో అందంగా వుంది. చెప్పాగా, దేనికది, చెవులు.ముక్కు, నోరు. కళ్ళు, విడివిడిగా ఆకర్షణీయంగా వుంటాయి. అవన్నీ కలిస్తేనే ఏదో లోపించినట్లయిందని. మళ్ళా అందుకుంది.

"మరోటి. తల్లితండ్రి స్ఫురద్రూపులు అయికూడా, సంతానం కోతులవడంలేదంటారా? అట్లాంటప్పుడు, పెళ్ళిచూపులకెళ్ళినవాడు కాబొయ్యే అత్తగారి చక్కదనానికి మురిసిపోయి కూతురు మర్కటమ్మని కట్టుకోగూడదేమో?"

నాకీవాదమూ సబబుగానే తోచింది. కాబట్టి ఏమిటి చెయ్యాలి? లోపల వేసుకున్న ప్రశ్నకి సమాధానం ఎవరు చెబుతారు. వీట్కి సమాధానం దొరకక, మతిపోయి. పెద్దలు, విధిపైనా. దైవంపైనా తోసేశారు. పెళ్ళి పర్యవసానం. నాకిదిష్టంలేదు. వారు ఏరికోరి చేసుకున్నదానికి వారే బాధ్యులు కావాలి. లేకపోతే నైతిక చింతనకి తావేలేదు. సమాజం కట్టుబాట్లే లేవు. సమాజంతో నిమిత్తంలేని ఏ కొద్దిమంది మేధావుల విషయం నినహాయిస్తే. ఉదాహరణకి.. నా ఊహ తెలుసుకుని వాక్యం పూర్తిచేసినట్లు రంగనాయకమ్మ అనేసింది.

"జ్యోతి విషయం. ఎంచక్కా మొగుడి దగ్గరకి చేరింది."

ఆశ్చర్యం ప్రకటించాను. పూర్తిగా చెప్పమని కోరాను. కోరిక అక్కర్లేకుండానే చెప్పడానికి సిద్దంగా వుంది రంగనాయకమ్మ.

"జ్యోతికి వాళ్ళనాన్న కొంత స్థలం వ్రాసిచ్చాడు. ఆ స్థలంకొని ఇల్లు కడదామని కోదండరామయ్య సంప్రదింపులు జరిపాడు. జ్యోతి అమ్మడానికి అంగీకరించింది. స్థలం తాలూకు కాగితాలు అవీ సంతకాలు పెట్టించి తీసుకెళ్ళడానికి వాళ్ళ ఊరు వెళ్ళాడు కోదండరామయ్య. ఆ రోజు జ్యోతికి జ్వరం తగిలింది. డాక్టర్ దేవళ్‌రాజుని తనే తీసికెళ్ళి మందిప్పించాడు. ఆమెకి నయమైంది. రెస్టుగావుంటుంది, తనింటికి రమ్మని ఆహ్వానించాడుట. ఆమె సరేనందిట. అతని ఔదార్యానికో, జ్వరం నిమ్మళించిన అవస్థలోనో. జ్యోతి ఏడ్చేసిందిట"

"భర్త భుజంపైన తల ఆనించి కన్నీరు కార్చింది అనాలి వెర్రిదానా" అని సవరించాడు. రాజన్న.

"భర్తభుజంపైన తల ఆనించి ఏడిస్తే ఏ మొగాడికీ పట్టదు. ప్రియుడి భుజంపైన ఆనించి ఏడిస్తే, కథలు, కావ్యాలూ అల్లుతారు, పెళ్ళాం అట్లకాడ పోట్లకీ, రాచ్చిప్ప విసురుళ్ళకీ తలలు బొప్పికట్టిన కవిశ్రేష్ఠులు" అన్నది రంగనాయకమ్మ.

అందరం నవ్వుతున్నాం. పోస్టు జవాను ఉత్తరాలు పడెయ్యడంతో అంతరాయం కలిగింది.

"ఇదిగో చూడండి" అని రాజన్న కవరు లోంచి తీసి తన పేరవచ్చిన ఆహ్వానపత్రాన్ని మా ముందు పడేశాడు.

"చూడు,. కోదండరామయ్య స్థలం కొని ఇల్లు కట్టేశాడు. రేపు గృహప్రవేశం –"

అందులో జ్యోతి, కోదండరామయ్య దంపతులు తమ నూతన గృహం 'జ్యోతి' గృహప్రవేశానికి బంధుమిత్ర సమేతంగా రావాల్సిందిగా ఆహ్వానం. ఆ పత్రం ఆకర్షణీయంగా వుంది. మొదటిపుట. రెండు తలుపులుగా. అవి తెరవగానే 'జ్యోతి' అన్న అక్షరాలు, దానివెనక, మిగత వాక్యాలు.

"మీరు చూడాలనుకుంటున్నారుగా, మాతో మీరూ రండి" అంది రంగనాయకమ్మ.

రామం కూడా జ్యోతి చదివిన కాలేజిలో పనిచేస్తున్నాడు గనక. అతనికీ ఆహ్వానంవొచ్చి వుంటుంది. కానీ ఆహ్వానం లేనిదే నేనెల్లా వెళ్ళను?

"బంధుమిత్రులనుందిగా ఫరవాలేదురా" అని రాజన్న నిక్కచ్చి చేశాడు. నిజంగా అంత నిక్కచ్చి అవసరంలేదు – ఎల్లానూ వెళ్ళాలనుంది.

ఆ మర్నాడు, నేను, రామం, రాజన్న దంపతులూ గృహప్రవేశానికి బైలుదేరాం. రామం, రాజన్న వొట్టిచేతులతో వెళ్లకుండా ఏదేనా ఇవ్వడానికి నిశ్చయించుకున్నారు. నేనూ కొంత వేస్తాను ముగ్గురం కలిసి, వెండి దీపం శెమ్మ ఇద్దాం. అన్న నా సలహా అంగీకరించారు.

సాయంత్రం ఆరు కావొస్తోంది. వొచ్చేజనం పొయ్యేజనం. దీపాలు, కొత్త భవనం తాలూకు చిహ్నాలు, సిమెంట్ బస్తాలు, ఇంకా అమర్చని గేట్లు. సున్నం, కోసిన కఱ్ఱ వోమూలగా, టెంట్ కింద కనిపిస్తూనే వున్నాయి. పాటకచ్చేరి సాగుతోంది.

జ్యోతి, కోదండరామయ్య వేదికవద్ద కూర్చున్నారు. ఆమె తలంటు పోసుకుంది. పాపిట రెండుప్రక్కలా తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. కోదండరామయ్య క్రాపింగ్ చూశాను. ఆశ్చర్యమేసింది. దాన్ని చర్చించే అవకాశంలేకుండా, నా మిత్రులిద్దరూ లాంఛనంగా తెచ్చిన దీపం శెమ్మ ఇవ్వడం, అది స్వీకరించి, కోదండరామయ్య కృతజ్ఞత చెప్పడం జరిగింది. రంగనాయకమ్మ వారికి నన్ను పరిచయం చేసింది. జ్యోతి నాకేసి ఆశ్చర్యంగా చూసింది. సంభాషణలేదు. అట్లాంటప్పుడు ఏమనాలో నాకు బాగా తెలియదు.

"రండి 'జ్యోతిని' చూద్దాం" అని రంగనాయకమ్మ కదలడంతో, అందరం లేచి, ఇల్లు చూడ్డానికి వెళ్ళాం. ఏ గదిలో కెళ్ళినా జనమే. పిల్లల పరుగులు, వంటసామాను కలకలం, నీళ్ళు. కొబ్బరికాయలు. తమలపాకులు, జనంతో నిండిన కొత్తిల్లు పథకం నాకు బోధపడదు. కోదండరామయ్య, ప్లాను. కొలతలు, ఖర్చులు, ఇంకా ఏమేమి చెయ్యదల్చుకొన్నది చెబుతున్నాడు. ఆ వర్ణనంతా పూర్తయ్యే అవకాశంలేదు. జడ్జిగారు, వారి సతీమణి రావడంతో, వారిని ఆహ్వానించేటందుకు 'జ్యోతి' భర్త వెళ్ళిపొయ్యారు మరొకాయన్ని అప్పగించి. ఆయన కొంత చెప్పి, మరొకర్ని అప్పగించి వెళ్ళాడు. ఇల్లు నాలుగుమూలలా చూసి. మండువాలో అమర్చిన కుర్చీలు, బల్లల దగ్గరకు చేరుకుని, ఏర్పాటైన ఫలహారాలు సేవిస్తుండగా, జ్యోతికి ఆ మధ్య జబ్బు నయం చేసిన, డాక్టర్ దేవరాజు చక్కా వొచ్చాడు. ఆయన రామంని ఎరుగును. సంభాషణతో మాకు కాలక్షేపం కలిగించాడు, “మనం కూడా వెళ్ళి సంగీత కచ్చేరి విందాం” అంటూనే.

కోదండరామయ్యని దగ్గరగా చూసిన క్షణం నుండీ నన్నొక ప్రశ్న బాధిస్తూంది. దానికి సమాధానం డాక్టర్ చెప్పిన కబుర్లలో దొరికింది. కోదండరామయ్య క్రాపింగ్ నల్లగా వుంది. బాగా పరిశీలించి చూశాను. ఎక్కడా వొక్క తెల్లవెంట్రుక కనిపించలేదు. జ్యోతి జుట్టు అక్కడక్కడ, ముందుభాగం, మధ్యభాగం, నెరిసింది. ముంగురులుగా నుదుటిమీద, చెవులమీదా మూగిన వెంట్రుకలు కూడా, దీపం వెలుగులో, స్ఫుటంగా. తెలుపుగా, నలుపుగా, కనిపించాయి.

ఈ డాక్టర్ చెప్పిన సలహా ప్రకారం చికిత్స జరిపితే. అతని క్రాపింగ్ నల్లబడిందా? అట్లాగయితే ఆ చికిత్స జ్యోతికి కూడా జరిపించవచ్చుగా.

డాక్టర్ విపులీకరించాడు. ఏ చికిత్సా జరగలేదుట. రంగు వేసుకోలేదట. ఒక వయస్సులో చర్మంలో కొన్ని లోపించి, తాత్కాలికంగా వెంట్రుకలు తెల్ల బడటం వుంటుందిట. సరైన పోషణ, తిండిలో జాగ్రత్త. వ్యాయామం, కుదుటపడిన మనస్సు. ఇవన్నీ సక్రమంగా వుంటే. మళ్ళా మామూలుగా నల్లబడతాయట. ఆ రకం మార్పు. వయస్సులో వచ్చిన తెల్ల

వెంట్రుకలకు వర్తించదట. ఎండోక్రీన్ పాటరన్ హార్మాన్స్. ఫాలికిల్స్, మెటబాలిజమ్మ్ పిగ్మెంట్. ఏవేవో పదాలు వాడి విపులీకరించాడు. అర్థమైనట్టు, తలలూపుతున్నాం.

"అవుతే జ్యోతి విషయం?" రామం అడిగేశాడు.

డాక్టర్, చిరునవ్వు ప్రదర్శించి, మాట్లాడటం మొదలెట్టాడు.

"జ్యోతి జుట్టు మళ్ళా నల్లబడుతుందనుకోను. ఆమె తలిదండ్రులకు నడివయస్సులోనే నెరవడం జరిగిందనుకుంటే జ్యోతికి కూడా అదే జరిగిందనుకోవచ్చు. అదికాకపోయినా, మానసిక ఆలోచన శరీరంపై ఛలాయించిన ప్రభావంవల్ల, అలా జరిగిందని నా నమ్మకం.."

"ఆ రకం బెంగ, మనోవ్యాధి వున్నవారందరి జుట్టూ. ముప్పై ఏళ్ళలోపుగానే నెరిసిందనగలమా?" అన్నాడు రామం.

"అనలేం. బాల్యంలో తన శరీరంపై ఆమెకి ఎక్కువ ఆకర్షణ వుండివుంటుంది. శరీరం అంతలోనూ ముఖ్యంగా జడంటే అమిత ఇష్టం అనుకుందాం. దానికేం జరిగినా భరించలేదు. ఊడడం, నెరవడం, వగైరా ఇబ్బందులు. అట్లాంటిదేదో తన జడకి జరుగుతుందన్న భయాన్ని, ఆమె మనస్సులోని అధోలోకంలోకి అదే 'లిబిడో' అంటె, నెట్టివేసి వుండచ్చు. భర్త జుట్టు నెరవడం, నలుగురూ చెప్పుకోడంతో ఆ దాచేసిన భయం, మళ్ళా పైకివొచ్చి, శరీరాన్ని ఆవరించి, జుట్టుపై తన ప్రభావం చూపించివుండాలి ఆ జుట్టు నెరవడంతో తన వ్యక్తిత్త్వంలో. జీవితంలో వొకలోపం స్థిరపడిపోయిందని గ్రహించుకుని, సమాధానపడి, మళ్ళా భర్తతో కాపురం కొనసాగించడానినికి నిర్ణయించుకుంది. భర్త చాలా మంచివాడు. ఆమెపట్ల నిజమైన ప్రేమగలవాడు. గతాన్ని దిగవిడిచి ప్రస్తుతాన్ని నిబ్బరించగలవాడు. హాయిగా రోజులు గడుస్తున్నాయి. అతని ప్రాక్టీసు పెరిగింది. ఆమెను చూడాలని వచ్చేవారు లేకపోలేదు. వారి ఇప్పటి అన్యోన్యం చూసి అసూయని ఆప్యాయతగా మార్చుకుని చూసి కుతూహలాన్ని తృప్తిపరచాలని వచ్చేవారూ వున్నారు. బోలెడంత ప్రాక్టీసు పైగా అతని జుట్టు నల్లబడింది. దానితో జ్యోతి వ్యక్తిత్వంలో తికమకలు సర్దుకుని, సమాధానపడగల నిగ్రహాశక్తులు స్థిరపడిపోయి, ఆమె జీవితానికొక విషాదఛాయని ఆపాదించాయనే అనుకుంటున్నాను" అన్నాడు డాక్టర్.

నాకో సందేహం వచ్చింది.

"క్రమక్రమంగా, కొన్ని సంవత్సరాలపాటు నెరవాల్సిన తల, అంతా. వొక నెలలోగా నెరిసిపోవడం ఎల్లా జరిగిందంటారు?" అని అడిగాను.

"నెలకూడా అవసరంలేదు ఒక్క రోజులో నల్లజుట్టు తెల్లగా అయిపోవడం లేకపోలేదు. ఒక్క గంటలో కూడా ఆ మార్పు జరగొచ్చుట. అదంతా ఆవేదన వొత్తిడి, ఆ పరిస్థితుల్లో శరీరంలో తట్టుకునే శక్తుల సమూహ బలం వాటిపైన ఆధారపడుతుందంటారు. ఫ్రెంచి విప్లవంలో లూయీ చక్రవర్తి ఆయన సతీమణి మేరీ అంటాయినె ప్రజల దౌర్జన్యానికి గురై

తలలు పోగొట్టుకున్న ఉదంతం ఎరుగుదురుగా. ఆ మేరి అంటాయినె జుట్టు వొక్క రాత్రిలో తెల్లబడిపోయింది. అలాంటివి అరుదనుకోండి.."

ఇంకా చెప్పబోతుండగా, దీపాలు పొయ్యాయి.

ఎందుకో తెలియదు. ఒక్కసారిగా సందడి నిలిచిపోయింది. అంతటా నిశ్శబ్దం గాత్రపాట, వయలిన్ నిలిచి పొయ్యాయి. వొక్క మృదంగం మాత్రం కొనసాగుతుంది.

అందరం ముందువైపుకు నడిచాం. కొందరు బ్యాటరీలైట్లు, సిగరెట్ లైటర్లు, అగ్గిపుల్లలు వేస్తున్నారు. ఎవరో కొవ్వొత్తులు వెలిగించి వేదికపై వుంచారు. మేం హాల్లోంచి నడిచి కుడివైపు గదికేసి వెళ్ళగా, జ్యోతి ఆ గది తలుపు తీసి లోపలికెళ్ళింది. దీపం శెమ్మ వెలిగించింది. ఆ చీకటిలో ఆమె కోల మొహం, జ్వాలలా వెలిగింది. నుదుట జ్వాల ఆకృతిలో ఎర్ర కుంకుమ, పాపిట మధ్య కుంకుమ, నుదుటిమీద మూగిన ముంగురులు, ఎర్రటి పెదవుల మధ్య తళుక్కుమన్న పళ్ళవరస ప్రేమాన్వేషణ విరమించిన చేపలలా సగం ముడుచుకున్న నేత్రాలలో దైన్యం. సిల్కుచీర పమిట మడతల వెనక స్ఫుటంగా కనబడే రొమ్ములు చటుక్కున గాలికి శెమ్మలో జ్వాల ఆరిపోయినా, చీకట్లో మరికొంతసేపు మెరిసిన ఆ విషాద సౌందర్య దృశ్యం నేనెన్నడూ మరిచిపోను.

మానవ చరిత్ర ప్రారంభంలో నిర్ణీతమైన శారీరక శక్తులలో చిక్కుకుంది జ్యోతి– అందరిలాగే. ఒక్కసారి విప్లవం చేసి విముక్తికోసం పెనుగులాడింది. ఓడిపోయింది. శరీర శక్తులు జయించాయి. ఆ ఓటమి ఆమెకొక నిండుతనాన్ని, సంపూర్ణత్వాన్ని ఆపాదించింది. ఎన్నెన్నో నాగరికతలు విజృంభించి, పతనం చెందాయి. వెలిగి ఆరిన దీపాలవలె. ఆ అగ్నిజ్వాలలు కొండగుహలలో వేసిన నల్లకాల్పు మచ్చలు మాత్రం మిగిలాయి.

జుట్టు అకారణంగా తెల్లబడి, మళ్ళా అకారణంగా నల్లబడిన కోదండరామయ్య అదృష్టవంతుడు. అతని జీవితం, లెక్కల పుస్తకం చివరలో వుంటుంది. ఆ సమాధానం చూసి, ఆ సంఖ్య వొచ్చేలాగ ఏవో అంకెలు వేసిచూపి, సమాధానం సరైందిగా మార్కులు తెచ్చుకుని, ఉపాధ్యాయుణ్ణి మోసగించిన విద్యార్థిలాగ, అతను సమాధానం తెలుసుకున్నాడు కాని అది ఎలావొచ్చిందో తెలియదు. అది జ్యోతికి తెలుసు. అందుకే వారిద్దరూ అన్యోన్యంగా, ఆదర్శదంపతులుగా ఏకమైనారేమో.

# చింపేసిన పేజీలు

## కొమ్మూరి ఉషారాణి

( 1961 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

**తుంపర్లు.. వాన తుంపర్లు** సన్న సన్నవాన తుంపర్లు గాలి విసురుకి రోడ్డుమీద కాయితాలూ, చెత్త అటూ ఇటూ చెదిరిపోతున్నాయి. చెట్లనుంచి రాలిన ఆకులు తడి రోడ్లకి అంటుకుపోయి, పచ్చని చుక్కల తివాసీ పరచినట్లు వుంది. ఇంకా దూర దూరంగా చూస్తే మంచు, కనీ కనిపించకుండా వూగుతున్న చెట్లు, నిర్మానుష్యంగా వున్న రోడ్డు. ఎవరో పాలకుర్రాడు కామోసు నడవలేక తడిసిపోతూ గబగబా అడుగులేస్తున్నాడు. దొడ్లో పారిజాతం చెట్టు గుప్పున వాసన కొడుతోంది. చూస్తున్న కొద్దీ ఎంతో బాగుంది. ఆ దృశ్యం జీవితమంతా తను అలా గడపగలిగితే ఎంత బాగుణ్ణు.

ఆ ఆశ క్షణమాత్రంలోనే సావిత్రి మనసుని వీడిపోయింది. సావిత్రి మనసు వాన తుంపర్లకుమల్లె తడితడిగ అయిపోయింది. సావిత్రి ఆలోచనలు గాలి విసురులా అటూ ఇటూ చెదిరిపోతున్నాయి. సావిత్రి కోరికలు రాలిన ఆకులల్లె నేలకి ఒరుగుతున్నాయి. సావిత్రి భవిష్యత్తుకూడా దూరాన మంచల్లె అస్పష్టమయిపోతూంది.

"ఇంతలోనే ఎంత కోరిక. జీవితమంతా ఇలా కూర్చుండిపోవాలని ఎంత ఆశ. ఇలాటి కోర్కె మునుపు ఎన్నిసార్లు కలగలేదు. జీవితం ఒక్కోప్పుడు ఎంత భ్రమ కలిగిస్తుంది" సావిత్రి అడ్డుకుంటున్న కన్నీళ్ళని తుడుచుకుంది.

బైట సన్నాయి మోత హెచ్చవుతూంది. శుభకార్యానికి వచ్చిన బంధువులూ, స్నేహితులూ యింట్లో సందడి కలగ జేస్తున్నారు. ముహూర్తపు వేళ సమీపిస్తున్నది. సమయానికి ఈ చీదర, వాన ఏమిటి? అభ్యాగతులు విసుక్కుంటున్నారు. పట్టు పరికిణీలు తడుపుకుంటూ పిల్లలు వరండాల్లో చేరి కాయితాల పడవలు తయారు చేస్తున్నారు. లోపలనుంచి పెద్దవాళ్ళ కేకలు లౌడు స్పీకరులో హిందీ సినిమా పాటలు. వీధి చివర మూగుతున్న బిచ్చగాళ్ళు వానజోరు హెచ్చింది.

"అమ్మాయి గదిలో ఏం చేస్తున్నావే? లేచి యిలారా? వేళయిపోతూంది"

కాంతమ్మ బైటనుంచి తలుపుతడుతోంది.

సావిత్రి గబగబ ట్రంకుపెట్టె తెరిచి, చీరల అడుగునుంచి ఓ చిన్న పుస్తకం బైటికి తీసింది. మాసిపోయిన పచ్చ అట్ట, అలుక్కుపోయినట్లున్న అక్షరాలు. అక్కడక్కడ ఏవో అంకెలు తన ఆశలకీ ఆనందానికీ, కన్నీళ్ళకీ చిహ్నంగా

నిలిచిపోయింది ఈ డైరీ. మరికొద్ది క్షణాలలో ఈ డైరీని తననుంచి శాశ్వతంగా విడదీయాలి. ఈ కాయితాలు చింపేయగలిగితే తనకి పునర్జన్మ కలుగుతుందా?

ప్చ్.. సావిత్రి కిటికీలో ఓరగా కూర్చుని పేజీలు తిరగవేస్తోంది. రెండు వాన చినుకులు టపటపమని ఆ పేజీల మీద పడ్డాయి. బైట ఈదురుగాలి, వాన లోపల సన్నాయి మోత తన నుంచి శాశ్వతంగా విడదీయవలసిన ఆ జీవిత పుటలని, ఆతురతతో, వణుకుతున్న చేతులతో పట్టుకుంది సావిత్రి. ఒక్కో అక్షరం రెండేసి అక్షరాలుగా కనపడుతున్నాయి.

*2-2-57 విజయవాడ*

ఇవాళ వెంకట్రావు గారింట్లో పార్టీ. యింకా నాలుగన్నా కాలేదు. అంతా తయారవుతున్నారు. పార్టీలంటే వీళ్ళకి యింత పిచ్చేమిటో. నాకు వెళ్ళాలనిలేదు. ఏదో సాకు చెప్పి వెనక వుండిపోవాలని వుంది. కానీ వుండనిస్తారా? ప్రాణం తీస్తారు బయలుదేరేవరకు? "సోషల్‌గా వుండాలి" అటుంది పిన్ని. కాస్త చూడచక్కగా తయారయితే ఆక్షేపణలేదు అంటారు. లలిత, వనజ. ఏమిటో వీళ్ళింట్లో అంతా గందరగోళంగా వుంది నాకు. ఒకటే హడావుడి, నిత్యం వాదోపవాదనలు. ఇంటికి వచ్చీపోయే అతిధులు.

13-5-57

ఇప్పుడే జీన్ క్రిస్టాఫర్ ముగించాను. ఇంకా ఏమీ చదవకుండా, ఏమీ ఆలోచించకుండా అలా పడుకోవాలనివుంది. లలిత పిలుస్తోంది. పిన్నికి యివాళ జ్వరం. వంట సహాయం చేయాలి. అమ్మ వచ్చేముందర చెప్పింది, యింట్లో ఒక మనిషిగా కలిసి మెలిసి సహాయం చేయమని. పనిమాట ఎలా వున్నా కలిసి మెలిసి నాకు చేతకావటంలేదు. ఈ సంవత్సరం ఓపిక పడితే ట్రైనింగు పూర్తయి యింటికి వెళ్ళిపోవచ్చు. పంతులమ్మ పని ఏమిటి? ఐ.ఏ.యస్. అయినా కట్టకపోయావా అంటాడు బాబాయి. కానీ వాళ్ళకేం తెలుసు. ఒక చిన్న స్కూలు, పిల్లలు, ఆ పిల్లలకి పాఠాలు చెబుతూ నేనూ యిదే నా ఆదర్శమని.

5-7-57

ఆదర్శాలంటూ వుండి ఏం లాభం, అవి ఫలించే వాతావరణం లేకపోయినప్పుడు ముందుగదిలో చర్చ జోరుగా సాగుతోంది. అతని గొంతు స్పష్టంగా వినపడుతోంది. తతిమ్మా ఎవర్నీ పెదిమ కదపనీయకుండా అంతా తనే మాట్లాడేస్తున్నాడు. చాలా చక్కగా కబుర్లు చెబుతాడు. ఎంత చిన్న విషయమైనా చాకచక్యంతో, కళ్ళప్పగించి అలా వినేట్లు చేయగల శక్తి వుంది అతనిలో. 'చైల్డ్ సైకాలజీ ' పుస్తకం మూసేసి ఆ మాటలనే వింటున్నాను. ఇదివరకు చాలాసార్లు

యిలాగే జరిగింది. ఆ కంఠం విన్నప్పుడల్లా నాకు యింకోపని చేయబుద్ధి పుట్టటంలేదు. చూసేందుకు ఏదో కాలేజీ కుర్రాడల్లే సామాన్యంగా వుంటాడు. కానీ చాలా సంస్కారంగల వాడు, చదువుకున్నవాడు, అయ్యుండాలి.

23-9-57

"అబ్బే! నేను అట్టే చదువుకోలేదు. డిగ్రీలు నాకసలు లేవు. అదృష్టం కొద్దీ యింగ్లీషు కంపెనీలో ఉద్యోగం దొరికిందిగానీ లేకపోతే ఏ క్లర్కుగానో వుండవలసింది" ఈ విషయం అతను చాలా నిస్సంకోచంగా, నవ్వుతూ చెప్పాడు, అన్నీ అంతే. మనసులో ఏమీ దాచుకోకుండా, నిర్మొహమాటంగా చెప్తాడు. తనని గూర్చి తను ఎక్కువ మాట్లాడడు. ఆ మాటలు ఎంత నిర్మలంగా వుంటాయో, ఆ నవ్వూ అంతే. అంత హాయిగా నవ్వేవాళ్ళని. అంత దయగలచూపులనీ నేను యిదివరకెన్నడూ ఎరుగను. దాదాపు రోజూ వస్తూనే వున్నాడు. ఆదివారాలు అసలు తప్పడు. ఆ మాటలు, అతనలా రావటం మాకు చాలా అలవాటయిపోతున్నాయి. అతనికి మట్టుకు అలాకాదు. కబుర్లు చెప్పేందుకు మనుష్యులూ, తను చెప్పేది గ్రహించే తెలివిగలవాళ్ళు చుట్టూ వుంటే చాలు. ఎవరివంకా ఎగాదిగా చూడడు. ప్రత్యేకం ఒక మనిషి కోసం అతను యిక్కడికి వస్తున్నట్లు తోచదు.

12-10-57

"ఎంతసేపు యిలా కూర్చోడం? అలా బైటికి పోదాం రండి. కాస్తనడిచినట్లు వుంటుంది" నా అంగీకారం కోసం ఎదురుచూడకుండా లేచి నుంచుని బూట్లు సరిచేసుకుంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేరు. పిన్ని లోపల వంటచేస్తూంది. వనజ, పద్మ ఏదో సినిమాకి వెళ్ళారు. కాలేజీనుంచి అప్పుడే వచ్చానేమో చాలా అలసటగా వుంది, కదలాలని లేదు.

"క్షమించాలి. చాలా టైర్ అయి వున్నాను" ఎలా అనగలిగానో కాస్త గట్టిగానే అన్నాను.

"ఓకే అలాగయితే యిక్కడే కూర్చుందాం" నిరాశ చెందినట్లుగనీ, మరే భావంగానీ లేదు ఆ ముఖంలో.

4-12-57

"మంచి నాటకం ఒకటుంది. షేక్సుపియరు ప్లే. రాకూడదూ?"అన్నాడు యివాళ యధాలాపంగా. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆ చనువుకి చిరాకు కలిగింది. కానీ ఎందుకో ఏం అనలేక పోయాను. 5 నిముషాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి.

"చదువుకున్నవారు. మీకు యిలాటి భావాలు వుంటాయనుకోలేదు. అయినా నేను మంచివాణ్ణి" అతను నవ్వుతున్నాడు. నేను నేలకేసి చూస్తున్నాను, ఉన్నట్లుండి అతని ముఖం సీరియస్‌గా అయిపోయింది.

"మా అమ్మకి యివాళ 103 జ్వరం, మూసినకన్ను తెరవకుండా పడుకుని వుంది. నాకు పిచ్చెక్కినట్లు వుంది. ఇక్కడికి రాకూడదనీ, అలా ఒంటరిగా నడుచుకుంటూ పోవాలనీ అనిపించింది. కానీ తీరా బయలుదేరాక నా కాళ్ళు నన్ను యిటేలాక్కొచ్చాయి."

అతను రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. నాకు జాలివేసింది. చాలా జాలివేసింది. చప్పునలేచి "పదండి" అన్నాను.

ఆరోజు మేం నాటకానికి వెళ్ళలేదు. గోదావరీతీరం వరకూ అలా నడుచుకుంటూ వెళ్ళాం.

26-1-58

అలా వెళ్ళటంలో నాకు తప్పేం కనిపించలేదు. కానీ ఆ మొదటిరోజు అతని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు చాలా చెప్పాడతను. అలాటి అవకాశం దొరికినందుకు నాకు చాలా ఆనందం వేసింది. ఆ ఆనందం తాత్కాలికమైందికాదు. నా చేతికి సంకెళ్ళు బిగిస్తోంది. ఊపిరాడనివ్వటంలేదు. చాలా భయంగావుంది. జీవితంలో కొత్త ఆనందం, సొంపు, మాధుర్యం రేపుతున్న ఈ ఆనందం నన్ను శాశ్వతంగా కట్టివేయదుకదా! ఏమో? చాలా భయంగా వుంది.

23-3-58

ఆ రోజు పౌర్ణిమ. యిద్దరం పార్కులో కూర్చుని వున్నాము. వాళ్ళ నాన్న జైలుకి వెళ్ళటం. పీటలమీద అక్క పెళ్ళి ఆగిపోవటం. యివన్నీ అతను చెప్పుకుపోతున్నాడు. నేను 'వూ' కొడుతున్నాను నాకు జాలి వేసింది. చాలా జాలివేసింది. అతని చేతిని నా చేతిలోకి తీసుకుని, "అబ్బ! యింత వయసుకే యింత జీవితం చూశారా?" అని అడగాలనిపించింది. అతనికి ఏ విధంగానైనా సహాయం చేయాలని అనిపించింది. అది ఫలానా అని చెప్పలేను. దాని నిర్వచనం మాటలలో కష్టం.

2-4-58

క్షణికంలో కలిగిన భావంకాదు నాకది. చాలా రోజులుగా పాతుకుపోయిన భావ పరంపరల ఫలితం. అతని జీవిత భాగస్వామి అయి, సుఖం, దుఃఖం పంచుకోవాలనే పవిత్ర వాంఛ అది. కానీ నా హృదయంలోనే పదిలపరచుకోవాలన్న ఆ వాంఛ, అనుకోనంతగా బయటపడిపోయింది. మొదట అతనికే పట్టు పడిపోయాను.

"ఇంకా నయం. ఈ బీదవాణ్ణి చేసుకుని నువ్వేం సుఖపడతావు. ఈ ప్రపంచం చాలా విశాలమైంది" సలహాయో, మందలింపో తెలీదు. అతని ముఖం విచారంగా వుంది. రాత్రంతా ఏడుస్తూ పడుకున్నాను.

26-7-58

కానీ ఆ దిగులు అట్టేసేపు నన్ను బాధించలేదు, ఇవాళే అన్నాడతను నాతో.

"ఏమిటో అనుకున్నాను. ఇక్కడికి రాకుండా వుండలేను, నిన్ను చూడకపోతే ఎలాగో వుంటుంది" నా గుండె ఆగిపోయినట్లనిపించింది. వెంటనే ఏమనాలో కూడా తెలియలేదు. నెమ్మదిగా ఒంగి అతని ఒళ్ళో తలపెట్టుకున్నాను. మరి మాటలు లేకపోయాయి ఆరోజు మా యిద్దరికీ.

30-8-58

పొద్దున లేచింది మొదలు నా మనసు ఏమీ బాగాలేదు. బాబాయి, పిన్ని, ఏదో గుసగుసలాడుకుంటున్నారు.

"చూడమ్మా నువ్వు పరాయి పిల్లవికాదు. అందుకని మనసు విప్పి నాలుగూ చెబుతున్నాను. చదువుకున్నదానివి. మళ్ళీ ఏం అనుకోబోతావో అని నా భయం. నువ్వు అతన్ని గురించి ఏమనుకుంటున్నావో ఏమో, మన కులం కాదు. సంప్రదాయంకాదు. పెద్ద చదువులేదు, కుటుంబం పెద్దది, బాధ్యతలు ఎక్కువ. కబుర్లకని రావటం, పోవటంగానీ యితన్ని గురించి మాకు ఎక్కువ ఏమీ తెలియదు.

"నేను ఈ విషయం గురించి ఏమీ మాట్లడలేను, వినాలనీ లేదు."

అంటూ బైటికి వెళ్ళిపోయాను. సాయంత్రం అతనొస్తే సరిగ్గా మాట్లాడలేకపోయాను. ఏమనుకున్నాడో పాపం. నా మనసంతా గందరగోళంగా వుంది. కొన్ని విషయాల గూర్చి ఆలోచించేందుకే భయంగా వుంది.

4-10-58

ఇంటి దగ్గర్నుంచి దాదాపు రోజూ ఉత్తరం వస్తోంది. నాన్నకి ఒంట్లో కులాసాగా లేదు. తమ్ముడు ఈ సంవత్సరం పరీక్ష తప్పాడు. నా మనసు ఏం బాగాలేదు. అతను కనిపిస్తే, ఆ కబుర్లు వింటే కాస్త తెరిపిగా వుంటుంది. అతనికి జీవితంపట్ల కొంతకూడా భయంలేదు. ఎంత క్లిష్టసమస్యనైనా చిటికలో, చాకచక్యంతో తేల్చివేస్తాడు. మనకున్న శక్తులన్నిటిలోకీ ముఖ్యమైంది మానసిక శక్తి. దాని సహాయంతో ఎంతయినా సాధించవచ్చు అంటాడు.

18-11-58

ఇంటి సంగతులు చెప్పకపోయినా అతను గ్రహిస్తున్నాడు. మునుపులా రావటంలేదు. పరీక్షలు దగ్గిర పడుతున్నాయి. ఈ మధ్యన అట్టే కలుసుకోవటంలేదు. జీవితం చాలా వెలితిగా వుంటోంది. అతన్ని చూసి చాలా రోజులయినట్లుంది. పుస్తకాలు పట్టుకొచ్చి యిస్తానన్నాడు. కానీ నౌఖరుచేత పంపాడు. ఇక్కడికి రావాలనిలేదు కామోసు. లలిత, వనజ నన్ను చిన్న చూపు చూస్తున్నారు. బాబాయికి నామీద గౌరవం సన్నగిల్లింది. పిన్ని అమ్మకి ఏదో ఉత్తరాలు రాస్తున్నట్లు అనుమానంగా వుంది. ఈసారి కనపడినప్పుడు పరిస్థితులన్నీ అతనికి చెప్పాలి.

6-12-58

గోదావరి ఒడ్డు ప్రశాంతంగా, చలల్గా వుంది. వెన్నెల బాగా కాస్తోంది. అలలమీంచి వస్తున్న గాలికి నా ఒళ్ళు జలదరిస్తోంది. సిల్కుచీర కొంగు మెడచుట్టూ కప్పుకున్నాను. యిసుకలో అతని నీడకేసి చూస్తున్నాను. చాలా దగ్గిరగా కూర్చున్నా అతను నాకెంతో దూరంగా వున్నట్లున్నాడు ఇవాళ. కనుబొమలు కొద్దిగా ముడిపడ్డాయి. కబుర్లు, నవ్వులు లేవు. అతన్నల్లా చుస్తుంటే నాకెంతో జాలివేసింది. కళ్ళు చెమ్మగిల్లాయి. అతని చేతిని నా చేతిలోకి తీసుకుని, కళ్ళమీద ఒత్తుకున్నాను. "ఏమైంది? మిమ్మల్ని యిలా చూడటం యిదే మొదటిసారి" అన్నాను. అతను తలపైకి ఎత్తలేదు, ఆ రెండో చెయ్యిని కూడా నాకు యిచ్చి అలల కేసి చూస్తున్నాడు. అలా ఎంతసేపు కూర్చున్నామో, తిరిగి వచ్చేవేళకి చాలా పొద్దుపోయింది. ఏమీ మాట్లాడుకోపోయినా, మేమిద్దరం ఎంతో మాట్లాడుకున్నట్లు అనిపించింది నాకు.

8-3-59

రైలుకి యింకా అరగంటవుంది స్టేషనంతా ఆతురతగా చూస్తున్నాను. పిన్నికీ, వాళ్ళకీ తెలుసు అతను వస్తాడని, అతన్ని చూడగానే దూరంగా జరిగి నిల్చున్నారు. వాళ్ళ పిచ్చిగానీ యింక ఆ క్షణంలో మాట్లాడుకోవటానికి ఏముంటుంది? అతను బాబాయితో మాట్లాడుతూ మధ్య మధ్య నాకేసి చూస్తున్నాడు. నేను మూగగానే సమాధానం చెబుతున్నాను. గంట కొట్టారు. బండిలో ఎక్కాను. కిటికీ దగ్గరగా ఒంగి బైటికి చూశాను. అంతా చెల్లాచెదురుగా కనిపిస్తోంది. రైలు గబగబా వెళ్ళిపోతోంది. ఆపుకోలేనంత దుఃఖం వచ్చింది. గొంతులో ఏదో అడ్డుపడ్డట్లు ఊపిరాడలేదు.

10-2-60 గుంటూరు

స్కూలు, పిల్లలు, పేపర్లు దిద్దటం, మళ్ళీ పాఠాలకి తయారవటం.. ఈ జీవితంలో ఎంతో ఆనందం, తృప్తి నాకు. ఇంకా పై పరీక్షలకి కట్టాలనివుంది. కానీ వ్యవధి చిక్కటంలేదు. ఈ వూరొచ్చి అప్పుడే సంవత్సరం కావస్తోంది. ఈసారి సెలవులకి వెళ్ళకపోతే కోపాలు వస్తాయి. కానీ అతను వస్తానన్నాడు. ఎలా వెళ్ళటం? ప్రతి ఉత్తరంలోనూ అతను ఈ

రావటం గురించే వ్రాస్తున్నాడు. మరి యింటి దగ్గిర్నుంచి కూడా నా ప్రయాణం గురించే ఉత్తరాలు. ఈ పాటికి యిక నన్ను వాళ్ళు వదులుకుంటారనుకున్నాను. కానీ లాభంలేదు, పెద్దన్నయ్య మరో పట్టుదలగా వున్నాడు. నేను ఈ గుంటూరు వదిలేసి హైద్రాబాదు మార్చుకోవాలని. నా మనసుకి మట్టుకు ఈ ఊరుకూడా కాదు యింకా పల్లె ప్రంతాలకి ఎక్కడికైనా వెళ్ళాల్ని వుంది. బస్తీ జీవితానికి దూరంగా, పచ్చని పొలాల మధ్య, నిర్మలమూ, ప్రశాంతమూ అయిన పల్లెలో వుంటే ఎంత బాగుంటుంది. ఈ మధ్య నా మనసేం చెప్మా యిలా పోతూంది?

❦❦❦

21-4-60

స్కూలు మూసేశాక చాలా తీరిక కలిగినట్లుంది. ఈ ఒక్కనెలలో ఎన్నిపుస్తకాలు చదివానో? నాకే, ఆశ్చర్యంగా వుంది. అతను రేపు వస్తున్నాడు. ఈ 'రేపు' కోసరం జీవితమంతా కాచుకుని వున్నానా అన్నట్లుంది. రేపు మాట్లాడవలసిన విషయాలు నెమరు వేసుకుంటే నా హృదయం దడదడ కొట్టుకుంటోంది. అన్నం సయించటం లేదు. ఉదయం పేపరుకూడా సరిగ్గా చదవలేకపోయాను. అన్నట్లు రోజాపువ్వులు ఆ ఫ్లవర్ వాజ్‌లో పెట్టాలి.అతనికి "కరీంఖాన్" పాటలు యిష్టం. ఓ నాలుగు తెప్పించి వుంచాలి. నోట్ పుస్తకాలు, బట్టలు గది చిందరవందరగా వుంది. సరిగ్గా సర్దాలి. అద్దంలో ముఖం చూచుకుంటే పీక్కుపోయినట్లు వుంది. నాలో చాలామార్పు వస్తోంది.

❦❦❦

22-4-60

అతను స్తంభానికానుకుని నిల్చుని వున్నాడు. నేను ఎదురుగా కుర్చీలో కూర్చుని వింటున్నాను. కొంతవరకే ఆ మాటలు నాకు వినపడ్డాయి. ఆ తర్వాత మరింకేమీ వినలేక పోయాను. కళ్ళు చీకట్లు క్రమ్మి, పక్కకి ఒంగాను. భూమిలోకి కృంగిపోతానేమో దేన్నయినా ఆధారంగా పట్టుకుందామన్నట్లు నా చేతులు కుర్చీకర్రని వెతుకుతున్నాయి. ఎంతసేపు అలా కూర్చున్నానో తెలియదు. తెలివి వచ్చేసరికి అతనక్కడలేదు. గుమ్మం దగ్గిరగా నిలబడి, బైటికి చూస్తున్నాడు. నాకు జాలివేసింది, చాలా జాలివేసింది. అంతగా ఎప్పుడూ నాకు దిగులూ, బాధా వెయ్యలేదు. వెనుకగా వెళ్ళి అతని దగ్గిరగా నిలబడ్డాను.

"ఎంతసేపూ నా సుఖం గురించీ, కలల గురించీ, తాపత్రయ పడ్డాను. మీ గురించి ఆలోచించలేకపోయాను. జీవితం చాలా చిత్రమైంది. మన స్నేహం చివరికి యిలా ఓ శాపంలా పరిణమిస్తుందనుకోలేదు"

అతను వెనక్కి తిరిగేలోపు నేను గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాను. దీపం ఆరిపోయింది.

❦❦❦

30-7-60

వెలుగున్నచోట నడవటం సులభమే. చీకట్లో వెలుగు చేసుకోవటమే జీవితం. నా విషయంలో యిది అక్షరాలా నిజమయింది. తల్లి ఆత్మశాంతి కోసరం, కుటుంబ క్షేమం కోసం అతను ఒక త్యాగం చేయబోతున్నాడు. అందులో నా సహాయం ఎంతయినా అవసరం అతనికి. నేను అతన్ని మర్చిపోగలిగితే, నా జీవితాన్ని మరోబాట నడిపించగలిగితే అతను ఈ బంధనాన్నుంచి విముక్తి పొందుతాడు. అతనివైపునుంచి ఎన్నో యిబ్బందులు, ఒడిదుడుకులు సర్దుకుంటాయి.

"నిన్ను వివాహమాడే అదృష్టం నాకీ జన్మలో లేదు. నేను అభాగ్యుణ్ణి"

ఆమాటలు వింటుంటే, మొదలంటా నన్ను ఎవరో నరికివేసినట్లయింది. ఏదో భయం, బాధ పెదిమలు ఒణికాయి. ముచ్చెమటలు పోశాయి. తలతిరిగినట్లయింది. నా మనసులో రకరకాల భావాలు. అనుమానాలు పరుగెత్తనారంభించాయి. కానీ నాహృదయంనిండా అమితమైన జాలి, కరుణ నిండుకున్నాయి. ఉప్పెనగా వచ్చిన అనుభూతి మరి యితర భావాలన్నిటినీ ముంచి వేసింది.

3-2-61 హైదరాబాదు

చాలా రోజుల తర్వాత యింటికి వస్తే ఏదో కొత్తగా వుంది. అంతా మామూలుగానే వున్నారు. మార్పు నాలోనే. ఎవరూ అతన్ని గురించి అడగలేదు. ఆ విషయం తెలియనట్లే మసలుకుంటున్నారు. ఇంతటి సంస్కారంగల మనుష్యుల మధ్య వుండేందుకు నోచుకోవాలో? మళ్ళీ ఉద్యోగం చేయాలని వుంది. ఇంట్లో తోచటంలేదు. పెద్దన్నయ్య తనతో బాంబే రమ్మంటున్నాడు. వెళ్ళాలనిలేదు. కానీ యిక్కడ చేసేదేముంది? అక్కడేదయినా ఉద్యోగ ప్రయత్నం చేయవచ్చేమో? నేనెప్పటికయినా కోలుకుంటానా?

1-11-61

గతాన్ని గురించి ఆలోచించీ యిక నేను చేసేదేమీ లేదు. వర్తమానమా నాకు చింతలేదు. యిక భవిష్యత్తు ఎలాగున్నా ఒకటే. ఈ మూడ్‌లోనే పెళ్ళికి ఒప్పుకున్నాను. జీవితం నన్ను చాలా మోసం చేసింది. లేదు, లేదు. నన్ను నేనే మోసం చేసుకున్నాను. కానీ జీవితంతో రాజీపడాలి. తప్పదు. అర్థంలేని నా జీవితానికి ఓ అర్థం కల్పించుకోవాలి, అని నిశ్చయించుకున్నాను.

శూన్యంగా కనిపిస్తున్న నా భవిషత్తులో ఓ చుక్క వెలిగింది.

సావిత్రి పుస్తకాన్ని మూసింది. కిటికీ వూచలకి తల ఆనించి బైటికి చూసింది. వాన జోరు హెచ్చింది. చెట్ల పచ్చదనం తప్ప బైటంతా అలుక్కుపోయినట్లు వుంది. పాలకుర్రాడు తిరిగి వెళుతూ కామోసు, చెట్టుకింద ఆగాడు. జల్లు లోపలికి వచ్చి సావిడి తడుస్తోంది. రివ్వున గాలి వీచి దొడ్లో చెట్టుకొమ్మ విరిగి కిందపడింది.

"అమ్మాయి సావిత్రీ యింకా రావేమే"

సీతమ్మ తలుపు బాదుతోంది.

సావిత్రి చేతిలో నలిగి, ముక్కలైన కాయితాలు బురద నీటిలో కలిసిపోయాయి.

## త్రికళ

- వడ్డాది పాపయ్య.

( 1961 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

**జగన్నాథ** రథచక్రాలు తిరుగుతున్నాయి. ఊరుత్తరాన జరుగుతున్న తొలి రథయాత్ర. వస్తున్న రథం మీదకు జనం అరటిపళ్ళు విసురుతున్నారు. ఆటవస్తువులూ, హరివిల్లు రంగుల చీనా విసనికర్రలు అమ్మేవాళ్ళు ఎక్కడివాళ్ళక్కడే నిలడ్డారు.

గోడవారగా నిలబడి శివా తలెత్తి పక్క పక్కనే అంటించిన ద్రౌపదీ వస్త్రాపహరణం, ద్రౌపదీ మాన సంరక్షణం పోస్టర్లని చూస్తున్నాడు.

అక్కడికి ఒక చిన్నపిల్ల చేరుకుని వెనక్కు చేతలు కట్టుకుని శివా చేతిలోని తైతక్క బొమ్మను చూస్తూ నిల్చుంది. అది ఆడబొమ్మ.

అన్ని బొమ్మలూ అమ్ముడుపోగా శివా దగ్గర ఆ ఒక్క బొమ్మే బిగిలింది. అవి తోలుబొమ్మలాట బొమ్మల్లాంటి చిన్న అట్టబొమ్మలు. వాచీ మార్కు సిగరెట్టు పెట్టెలు కత్తిరించి కీలుముళ్ళు పెట్టి రంగులు దిద్ది పట్టుకుని ఆడించడానికి మధ్యగా వెదురుబద్ద తగిలించిన వాటిని శివా తండ్రి ధర్మయ్య తయారు చేస్తాడు.

ముందరికి గుండ్రంగా చుట్టిన జటకు కట్టిన నెమలికంఠం రంగు టఫెటా సిల్కు గుడ్డతో బాలకృష్ణ విగ్రహం లాగున్న ఆ పిల్లను చూసి శివా బొమ్మ అందించి "అణాపరక – ఆరుకాన్లు" అన్నాడు. పిల్ల బిక్కముఖం వేసింది.

ఆ పిల్లకంటే శివా కొంచెం పెద్దుంటాడు.

"డబ్బుల్లేవా? ఎలాగ కొంటావు మరి" అన్నాడు.

"మా వూరు కాంచెనకోటకి రావూ?" అన్నది అమ్మాయి.

"ఓహ్హో! మీ వూరొస్తే డబ్బిస్తావన్నమాట. మరి నీ పేరు?"

"బాల...బాలామణి. వేణుగోపాల్సామి గుడిలేదూ పక్కనే మా ఇల్లు. మా తాతయ్య ఎన్నో డబ్బులిస్తాడు" అంది. ఆల్చిప్పల్లాంటి కళ్ళు గుండ్రంగా తిప్పుతూ.

"మీ వూరు రాను" అన్నాడు శివా మూతిబిగించి. బాలబొమ్మ యిచ్చేస్తూంటే తీసుకోకుండా నవ్వుతూ "వొద్దులే, బొమ్మ ఊరికే తీసుకో" అన్నాడు.

బాల తటపటాయించి ఏదో తీసి శివా చేతిలో పెడుతూ "పోనీ ఇది తీసుకో. అత్తయ్య కొనిచ్చిందిలే ఆరు కాణీలే.." అంటూన్నంతలో ఒక పెద్దావిడ వగర్చుకుంటూ "బాలా" అని కేకపెట్టి "హమ్మయ్య నిన్ను వెతుకుతూ చచ్చానే బాలామణీ" అంటూ బాలను బిరబిరా లాక్కుపోయింది.

రథం అవతారాల మందిరానికెదురుగా నిల్చింది. పెద్ద రథం. బల్ల నిచ్చెన ఎక్కి బలభద్ర, సుభద్ర, జగన్నాథుల్ని జనం సేవించుకుంటున్నారు. శివా చేతిలోది చూశాడు. ఎర్రటి ఉంగరం.

"శివా.. నా దగ్గర బొమ్మలుండి పోయాయి" అంటూ ధర్మయ్య వచ్చాడు. అరుగుమీద బొమ్మలు పడేసి, శివా దగ్గరి డబ్బులు లెక్కెడుతూంటే శివా హనుమంతుడి బొమ్మ తీసి ఆడిస్తూ "ఇది ఉండిపోయిందా? హనుమాన్లే కావాలని పిల్లోళ్ళంతా గోలచేశారులే" అని చెబుతూంటే ధర్మయ్య "ఒకబొమ్మవి తక్కువరా అబ్బీ. డబ్బులుచ్చుకోడం మరిచావు" అన్నాడు శివా.

"లేదయ్యా.. ఊరికే యిచ్చా" అన్నాడు.

"ఏంటీ ఊరికే యిచ్చావా? ఎవరికిరా" అన్నాడు ధర్మయ్య.

అదే సమయంలో దర్శనం ముగించు కొని రథం దిగబోతూన్న అత్తతో చేతిలో బొమ్మ అల్లాడుతుండగా అంత ఎత్తున బాల కనిపించింది.

"అదుగో నాన్నా అదో" అంటూ శివా చూపించాడు. ధర్మయ్య చూశాడు. ఆవిడెవరో కాదు, రాజరత్నమ్మ. ఆవిడది అరసవిల్లి. శివాతల్లి ధర్మయ్య భార్య నాగమణికి రసానుగుణ్యంగా 'ముఖారి' రాగాన్ని ఎన్ని రకాలుగా పాడవచ్చునో నూరిపోసి నేర్పింది. బొమ్మలాటల్లో నాగమణి సీత, సైరంధ్రి, మండోదరి, సుధేష్ణలకి వెనుక పాట పాడేది. మహా మహా వాళ్ళే మెచ్చుకునేవారు. నాగమణి గుర్తుకొచ్చి ధర్మయ్య కళ్ళు నీళ్ళు నిండాయి.

"అదేంటయ్యా అలా చూస్తావు" అన్న శివా మాటకి తెప్పరిల్లాడు. జనం కిటకిటలాడుతున్నారు. చీకటి పడుతోంది.

ఇంటికెళ్ళాక ఆ రాత్రి బాల బొమ్మను మరీ మరీ ఆడించి నిద్దట్లో బొమ్మలాగే ఛెంగు ఛెంగున గాలిలో ఆడినట్లు కలగన్నది.

శివా పదే పదే ఉంగరాన్ని చూసుకుంటూ, నిద్దట్లో బాల – బాలామణి, కాంచెన కోట అని కలవరించాడు.

శ్రీగాకోళానికి వారధి దాటితే ఏటి అవతల మరో రథాయాత్ర, రథోత్సవాల చివరి రోజు. అవతారాలు చాలించి జగన్నాథుడు నిత్యాలయానికి వేం చేస్తున్నాడు. ఆ యాత్తర్లో రాజరత్నం ధర్మయ్యను పిల్చి "అక్కడ యాత్తర్లో పిల్లది బొమ్మకి పైసలివ్వలేదట" అంటూ ఇవ్వబోతుంటే శివా ముందుకొచ్చి "ఈ ఉంగరం యించిందమ్మా" అంటూ జేబులోంచి తీసి యివ్వబోతూంటే ధర్మయ్య నివ్వెరపోయాడు. రాజరత్నమ్మ "అది నీ వ్రేలికే పెట్టుకోరా అబ్బీ" అంది నవ్వుతూ.

"ఎవరమ్మా ఆ చిట్టిది, ఈ యాత్రకి రాలేదేం?" అన్నాడు ధర్మయ్య.

"మా బాబాయి మనవరాలు, ఆటా పాటా అబ్బుతుందని నా దగ్గరుంచారులే. ఆ భడవా బొమ్మతోపాటు గెంతుతూ రమ్మన్నా రాలేదు" అని చెప్పి రాజరత్నమ్మ "ధర్మా! పిల్లవాడికి మాటా, పాటా బాగా నేర్పు. కొడుకు రూపంలో మళ్ళీ నాగమణి బతికొచ్చిందనిపించాలి సుమీ" అన్నది.

ధర్మయ్య నిట్టూర్చి సినీమాలొచ్చేశాయి గదమ్మా. అన్నిటినీ సినిమా మింగేస్తాది. ఇప్పటికే బొమ్మలమ్ముకుంటున్నాం గద" అన్నాడు.

రాజరత్నం ఔనన్నట్లు బదులు చెప్పకుండా "అన్నట్టు మా అరసవిల్లిలో వస్తూన్న కార్తీకంలో తెప్పతిరణాలనాడు బొమ్మలాటకి ఏర్పాటు చేయిస్తాను. అప్పుడు చూస్తాగా నీ కొడుక్కేం నేర్పావో. ఒక్క పలుకైనా పలికించు" అని చెప్పి వెళ్తూంటే ధర్మయ్య "అలాగేనమ్మా అలాగే కానియ్యండి" అన్నాడు.

రాజరత్నమ్మ శాస్త్రీయ నాట్యం, గానం, వీణావాదనం, ఫిడేలు వాయిద్యం నాల్గింటిలో మంచి విద్వాంసురాలు. తగిన ఔత్సాహిక సమాజాల్లో చంద్రమతి, దమయంతి పాత్రలు వేసి మెప్పించిన ఒకనాటి రంగస్థల కళాకారిణి. ధనకాంక్ష, కీర్తికంక్ష లేకుండా విద్యకే అంకితమైపోయింది.

ధర్మయ్య బొమ్మలాట బృందంతో ఊళ్ళు తిరుగుతుంటాడు. బొమ్మలాడిస్తూ మాటలు పద్యాలు చదువుతాడు. మద్దెల వాయిస్తాడు. వాళ్ళు వీధి నాటకాలు, పగటి వేషాలు కూడా కడ్తుంటారు. 'నవాబు గులాము' నాటకం కడితే జనం తిరగబడేవారు.

ఒక నవాబుకి గులామాలీ అనే విధూషక సేవకుడు నీలమ్ అనే నాట్యకత్తెను కుదురుస్తాడు. నవాబును పొగుడుతూ హుక్కా అందిస్తుండడమే వాడి పని. నాట్య నాట్యానికి నవాబు హారాలు తీసి నీలమ్ కి యిచ్చేస్తూ అంగరఖా కూడా ఇచ్చి చిరుగుల జుబ్బాతో చిప్పపట్టుకుని జనంలోకి వెళ్ళి అడుక్కుంటుంటే గులామాలీ నవాబు అంగరఖా హారాలు వేసుకుని నీలమ్ తో ఖుషీగా గెంతుతుంటాడు. గులామాలీ వేషం చూస్తేనే నవ్వు పుడుతుంది. ముఖం నిండా మసి పూసుకుని, గోనెపీచు చింపిరిజుట్టు తగిలించుకుని నవాబుకీ, తనకీ సంచీల్లాంటి పక్క జేబుల్లో 'బుడ్లు' కుక్కుకుని, మువ్వలు కుట్టిన లాగుతో కడుపులు చెక్కలయ్యేలాగ నవ్విస్తుంటాడు. హడావుడి అంతా వాడిదే. గులామాలీ వేషానికి ధర్మయ్యకు మంచిపేరు.

బాల వెళ్తూ వెళ్తూ అత్తయ్య దగ్గర చాలా నేర్చుకుంది. నృత్యం మీద ఆసక్తి పెరగడానికి, స్వంత రీతి సంతరించుకోడానికి బొమ్మ మంచి ప్రేరణ అయ్యింది.

కాంచనకోట గైరమ్మ సంబరానికి బొమ్మలాట కట్టించారు. సుందరకాండ ఆడుతున్నారు. జనంలో ఆడాళ్ళ గోల ఎక్కువ కావడంతో బంగారక్క, గంధోళి బొమ్మలు తెరకెక్కించడంతో చూడ్డం చాలించి తాతయ్యతో ఇంటికొస్తున్న దారిలో బాలకు బొమ్మ గుర్తొచ్చింది. అది తన పెట్టె అడుగున భద్రంగా ఉంది.

"బాలా, నీ నాట్యంకూడా పాదాలు నేల తాకనట్లు ఆ బొమ్మ ఛెంగుల్లాగె కనిపిస్తుంటుంది సుమీ. ఆ పద్యాలు చదివాడులే" అంటున్నాడు తాతయ్య. తనకేమో తెరవెనక సీతకి మాటలు చెప్పి, పాడిన తియ్యటి గొంతు ఎంతో బాగుంది. ఎప్పుడో విన్నట్టే అనిపించింది బాలకి.

మర్నాటి ఉదయం బాల పరికిణీ వోణీ వేసుకుని తెల్ల చామంతులు కనకాంబరాలు పెట్టుకుని వాకిలి గోడనానుకుని వీధిలో గోడమీది 'మాలపిల్ల'ను చూస్తున్నది. అల్లంత దూరమ్నుంచే బాలను చూసి ఘల్లుఘల్లు గజ్జెల మోతతో వచ్చిన ఆడవేషం ఇంటిముందాగింది.

"అమ్మాయి లలితా త్రిపురసుందరీదేవి" అంటూ తాతయ్య అప్పుడే ఇంట్లోంచి వచ్చాడు. బాల చిత్రంగా చూస్తోంది. "అలాగే పిలుస్తా మరి యిప్పుడు నువ్వు లలితవు. నాలుగు రోజులుపోతే పెళ్ళి పీఠాన్ని అధిష్ఠించి రాజరాజేశ్వరి అవుతావు" అంటూ సోదె వల్లిస్తున్న తాతయ్య మాటల్ని ఆడవేషం బాగా విన్నది.

మద్దెల పెద్దవాడు మిగతా హంగుదార్లూ చేరుకున్నారు, రాత్రి బొమ్మలాట వేసి తెల్లారగనే ఊరు తిరిగి కట్నకానుకలు దండుకోవడం వాళ్ళ మామూలు.

"నల్లవాడే.. గొల్లపిల్లవాడే" మాలపిల్ల లోని పాట పాడుతూ ఆడుతూన్న వేషం కళ్ళు మాటిమాటికి చూస్తూ 'నువ్వు నాకు తెలుసు' అంటున్నాయిగాని బాలకు వినిపించలేదు. సిగ్గనిపించింది. అంతే. తాతయ్య ఇచ్చే రూపాయి, జరీఖండువా యిచ్చాడు. మద్దెల పెద్ద జయవాక్యాలు చదివి దారి తీశాడు. రాత్రి సీతకు తెరవెనక గొంతు యీ ఆడవేషానిదే.

"లలితమ్మా ఆ పాట బసవరాజు అప్పారావు గీతం. ఉర్రూతలూగిస్తున్నదనుకో. ఇదే మొదటి తెలుగు సినీమా పాట అనొచ్చు" అంటూ తాతయ్య చెబుతున్నాడు. వయసుకి పెద్ద అయినా కళాభిరుచిలో కుర్రాడికంటే కుర్రాడు తాతయ్య. ఇప్పటికీ హార్మోనియం వాయిస్తూనే ఉంటాడు.

పక్కనున్న వేణుగోపాలస్వామి గుడికి దండం పై బొమ్మలాట జట్టువెళ్తున్నారు. అందరి వెనకా నడుస్తూ 'ఆడపిల్ల' వేషం వెనక్కు చూస్తూనే నడిచింది.

ఆ చుట్టుపక్కల బొమ్మలాటలు కదుతూ కాంచనకోటలో పగటి వేషాలు వేస్తూ వాళ్ళు చాలా రోజులున్నారు. ఆ రోజుల్లోనే బాలామణి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నృత్యం ప్రదర్శించింది. రాజరత్నమ్మ వచ్చి వీణ వాయించింది. నృత్యాంతంలో బాల అత్తయ్య పాదాలమీద ప్రణమిల్లింది. మర్నాడే రాజారత్నం వెళ్ళిపోయింది.

బాల నృత్యం బొమ్మలాటవాళ్ళూ చూశారు. పగటి వేషాల చివర వచ్చిన అర్ధనారీశ్వర వేషం 'నీ నృత్యం చూశాను" అన్నట్లుగా మెచ్చుకోలుగా బాలను చూస్తూ ముసుగు మారుస్తూ చాలాసేపు ఆడింది. బాలకు ఆ అర్ధనారీశ్వర వేషం బాగా హత్తుకుపోయింది.

తర్వాత నవాబు వేషం కూడా ఊరు సంత బయల్లో కట్టారు. కొంచెం పిన్న వయస్సనిపించినా నీలమ్ వేషాన్ని, నృత్యాన్ని ఊళ్ళో జనం తెగ మెచ్చుకున్నారు. ఊళ్ళో అంత గొప్పగా చెప్పుకుంటున్న ఆ నాట్యంలో ఏముందోగాని, బాల చూడలేదు. తన నృత్యాన్ని కొందరే అభినందించారు గాని ఊరంతా చెప్పుకున్నట్టులేదు. గులామాలీ కొత్తవాడట, అంత చెప్పుకోలేదు.

అవి రెండో ప్రపంచ యుద్ధం రోజులు. రేషనింగు కర్కోటకంగా అమలు జరుగుతున్నది.

ధర్మయ్య కాలం చేసి పదోరోజు. శివా అమ్మమ్మ పండు ముసలిది తెస్తున్న చిన్న మూట ధాన్యాన్ని 'కింకరుడు' కలబడి గుంజుకున్నాడు. ముసలిది తూలిపడి సొమ్మసిల్లిపోయింది. శివా ఆ కింకరుణ్ణి చావబాదాడు. శివాను పోలీసులు లాక్కెళ్ళారు.

శివాకి అదొక పెద్ద మలుపు. దొరతనం మీద కసి. ఉడుకుతూన్న యువక రక్తం, ఎదురు తిరగాలన్న మొండి ఉత్సాహం.

అజ్ఞాతవాసంగా పాతాళచరులైన అతివాదులకు విధ్వంసక చర్యలకు సాయపడుతున్నాడని మళ్ళా జైల్లో తోశారు. దెబ్బలు తిన్నాడు, బాధలు పడ్డాడుగాని గుట్టు రట్టు చెయ్యలేదు. ఆ రోజుల్లోనే విశ్వంతో మంచి స్నేహం ఏర్పడింది.

శివా జైళ్ళు చూశాడు. తప్పించుకు పారిపోయాడు. చాలా ప్రాంతాలు, జిల్లాలు తిరిగాడు. దొరతనం వ్యతిరేకంగా ప్రదర్శనల్లో, బుర్రకథ దళాల్లో తిరిగాడు. విప్లవకారుల మూఠావాడనిపించుకున్నాడు.

పీడకల అంతరించింది. బంగారు కలలు పండించుకునే స్వంతరోజులు వచ్చాయి ప్రజలకు. మంత్రులు వస్తున్నారు, వెళ్తున్నారు.

ఔనో కాదోగాని శివాను 'నక్సలైటు' అని తోలుకెళ్ళారు. తర్వాత శివా సంగతి తెలిసిరాలేదు.

విశ్వం ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలన్న ఆశయంతో రాజకీయ రంగం నుంచి చిత్రరంగానికి మారాడు.

శివా రకరకాల బాధల్నీ, కారాగారాల్ని, ఆకలిని జీర్ణించుకున్నాడు. ఆరోగ్యం బాగా పాడైంది. కూటికోసం కోటి విద్యల్లో మరేది తెలియదు గాని, చిన్నతనంలో తండ్రి దగ్గిర నేర్చుకున్న బొమ్మలు చెయ్యడం తప్ప.

జగన్నాథ రథచక్రాలు తిరుగుతూనే ఉన్నాయి. పెద్ద రథాలు శిథిలమైపోయి దూరమయాయి. చిట్టిరథాలు, త్రోపుడు రథాలు వచ్చాయి. యాత్తర్లు జరుగుతూనే ఉన్నాయి. చిరుచక్రాలు తిరుగుతూనే ఉన్నాయి.

త్రికళ... త్రికళాదేవి. అమ్మవారి దర్శనార్థం వస్తున్నదట. కాంచెనకోటలాంటి చిన్న ఊరూపేరూలేని ఊరికి వస్తున్నదట. ఎప్పుడో మొక్కుకుందట. అదీ వార్త.

అది కాంచెనకోట మధ్య నుంచి పోతూన్న గ్రాండ్ ట్రంకు రోడ్డు, నల్లని తారు రోడ్డు. రోడ్డుకి ఇటు అమ్మవారి గుడి. అటు సినిమాహాలు. ఆ రోజు అమ్మవారి ఉగాది జాతర. సినీమా హాల్లో 'అల్లరి చిల్లరి చలాకి బుల్లోడు'కి తొలిరోజు, బుల్లోడి వయస్సు రెండేళ్ళు పాతబడినా.

గుడి దగ్గిర జనం కిటకిట, హాలు దగ్గిర జనం కిరకిర కరకరా.

శివ బొమ్మలు పట్టుకుని రోడ్డుమీద తిరుగుతున్నాడు. కాంచనకోటకు వెళ్ళాలనిపించింది. వచ్చాడు. వేణుగోపాలస్వామి గుడిపక్క ఇంటినేనాడో అమ్మేసి వాళ్ళు మహాపట్నం వెళ్ళిపోయారట. కొత్త మేడేదో ఉంది. శివా శూన్యంగా చూస్తూండగా ఒక పలైకారు పిల్లవాడు చేతులు వెనక్కు కట్టుకుని బొమ్మలు చూస్తున్నాడు. శివాకేదో గుర్తొచ్చి వాడికో బొమ్మ ఇచ్చాడు.

దాన్ని వాడు ఆడిస్తూంటే ఇంకో కుర్రాడు "ఎందుకురా అది? ఆ డబ్బుల్తో సిన్మాకెళ్ళొచ్చుగదా" అన్నాడు. అంతలోనే వాడి తల్లి వచ్చి "అదెలాగొచ్చిందిరా" అని గద్దిస్తుంటే "డబ్బులడగనేదు. ఊరికే యిచ్చిండు" అన్నాడు కొడుకు. తల్లి బొమ్మలు ఎగరేస్తూ "ఓ పని సేద్దాం పద. నువ్వూ నేనూ సినీమా సూడొచ్చు" అంటూ వాణ్ణి లాక్కెళుతూంటే "డిసుకోలూ, ఫైటింగులూ ఉంటాయి గదే" అంటున్నాడు కొడుకు.

త్రికళ.. త్రికళ వస్తున్నాది. కలకలంతో జనం రోడ్డువార్లకి తప్పుకుని బార్లు నిలబడుతున్నారు.

ఎవరీ త్రికళ. మహామాయ త్రికళ ఆ అమ్మవారి పేర్లేనట. బాల, లలిత, రాజరాజేశ్వరి ఆ ప్రకృతిమాత రూపాలేనట. తన చిన్నతనంలో ధర్మయ్య నలుగుర్నీ కూకోబెట్టుకుని గంజాయి పీలుస్తూ చెబుతుంటే అర్థంకాక పోయినా తను వింటుండేవాడు త్రికళ. పేరు బాగుంది. బాలను తాతయ్య లలితా – రాజరాజేశ్వరి అంటూండగా చెవినైె పద్దం గుర్తొచ్చింది. నెమరు వేసుకుంటూ తిరుగుతున్నాడు శివా.

త్రికళ ఉత్తమ తరగతి నాట్యతార. ఉజ్వలంగా ప్రకాశిస్తూ కోరి తగ్గించుకుంటూంది యిపుడిపుడే. నృత్య ప్రధానమైన నాయికా పాత్రల్లో రాణించి ఉగ్రూతలూగించింది.

స్వంతంగా రూపొందించిన ప్రక్రియ 'రాధాకృష్ణ' విచిత్ర నృత్యాన్ని రంగస్థలం మీద ప్రదర్శిస్తూ విఖ్యాతినందుకున్నది. దానికి ఆధారం పగటి వేషాల్లోని అర్ధనారీశ్వరీ వేషం.

రంగం మీద నేర్పుగా పెద్ద దర్పణం అమర్చి ఉంటుంది. ముందు వెనుకగా రాధాకృష్ణులు పక్కవాటుగా కనిపిస్తుంటారు. అద్దం ముందు రాధ ఉంటే అద్దంలో కృష్ణుడు, కృష్ణుడు ముందుంటే రాధ రెప్పపాటున మారుతుంటారు. అలా త్రికళ గిర్రున తిరుగుతుంది. రాధాకృష్ణుల పరిష్వంగాలూ కనిపిస్తాయి. అంటే త్రికళ తన్ను తానే అలా పట్టుకుని ఇద్దరు అనే భ్రమ కలిగిస్తుంది. అద్దం తెలియకుండా చుట్టూరా లతలు పువ్వులు కప్పి ఉంటాయి.

పెళ్ళి చేసి చూడు చిత్రంలోని 'రాధనురా – నీ రాధనురా ఎంతో తెలిసిన వేదాంతులకే అంతులు తెలియని గాధను రా!' అనే పాటనే పద్యంలో వినిపిస్తూంటుంది. ఆ పాట త్రికళకి అభిమానమట.

త్రికళ నాట్యం చేస్తూంటే గాలిలో తేలుతూన్నట్లు తోలుబొమ్మలాట చెంగు చెంగులు స్ఫురణకొస్తుంటాయని పెద్దవాళ్ళు అంటుంటారు. ఆమె భర్త పేరూ డబ్బూ వస్తూన్న చిత్రాలతోబాటు ప్రయోజనాత్మక విప్లవధోరణి చిత్రాలూ తీస్తున్నాడు.

హంసలాంటి తెల్లటి కారు నిశ్శబ్దంగా గుడికెదురు రోడ్డువార ఆగింది. ఉత్తపాదాలతో త్రికళ ఒక్కతే దిగింది. జనం ఆమె త్రికళ అని నమ్మలేదు. ఎర్రటి సాదాచీర రవికెతో నిరాభరణంగా అతి నిరాడంబరంగా ఉంది. జుట్టు గాలిలో ఎగురుతున్నది. రోడ్డు దిగి నాలుగడుగులు వేసి ఆగిపోయింది.

కుర్రాడు బొమ్మ పట్టుకుని నిలడ్డాడు. మెరుపులాగ ఆ బొమ్మ ఆమె కళ్ళకు గుచ్చుకున్నది.

"బొమ్మ కావాలంటే మీరు తీస్కోవచ్చునమ్మగోరూ రూపాయి పెట్టి కొన్నాం" అంది పక్కనే వున్న తల్లి.

త్రికళ తలలో చక్రాలు తిరుగుతున్నాయి. వెనక్కు. ఇలాగే ఇలాంటి కుర్రాడే గోడవార బొమ్మపట్టుకుని నిలబడ్డాడు, అప్పుడది ఆడబొమ్మ. ఇప్పుడది మగబొమ్మ. పనితనం ఒక్కలాగే ఉంది.

త్రికళ ఆ మగబొమ్మను తీసుకుని ఎంత నోటో? కుర్రాడికిచ్చింది.

త్రికళను పిచ్చిదాన్ని చూసినట్లు చూసి నోటు లాక్కుని కుర్రాడితల్లి గబగబా కొడుకుని ఈడ్చుకుంటూ పలాయనం చిత్తగించింది.

జనం రోడ్డుమీదకు పరుగెడుతున్నారు. అది ఏక్సిడెంట్లకి గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందిన రోడ్డు మలుపు. ఏదో జరిగింది. త్రికళకి అదేమీ తెలీదు. బొమ్మపట్టుకుని దాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయింది.

"రాజేశ్వరీ ఏమైంది?" అని కేకేస్తూ విశ్వం కారు దిగాడు.

పెళ్ళికి పేరు బలాలు సరిపోతాయని 'రాజరాజేశ్వరి' అని మార్చారు. పెళ్ళైన కొత్తలో రాజరాజేశ్వరి 'బంగారుపాప' సినిమాని ఎన్నోసార్లు చూసింది. 'తాథిమి తకథిమి తోల్‌బొమ్మా దీని తమాస చూడర..' అంటూ రంగారావు ఆడించే బొమ్మ ఆటకోసం. 'త్రికళాదేవి' ఆమె వెండితెర పేరు. విశ్వం భార్యని రాజేశ్వరి అని పిలుస్తాడు.

విశ్వంకి రోడ్డుమీద మూగిన గుంపు మధ్య ఏం కనిపించిందో, పరుగున వెళ్ళి "శివా" అంటూ గావుకేక పెట్టాడు. నల్లని తారురోడ్డుమీద బొమ్మలు చెల్లాచెదురుగా ఉన్నాయి.

ఎలా జరిగిందోగాని శివాను గుద్దేసి లారీ యమవేగంతో పారిపోయిందట. శివా రోడ్డు అంచున పడ్డాడు. స్పృహలేదు. విశ్వం శివా తల తొడమీద పెట్టుకుని సోడానీరు ముఖం మీద చల్లి రుమాలుతో విసురుతున్నాడు. "అతను మీకు తెలుసా?" అన్న ప్రశ్నతో అక్కడకు చేరిన త్రికళ బక్కచిక్కి గడ్డం పెరిగిన శివాను చూస్తున్నది. శివా జేబులోంచి చిల్లరతోబాటు జారిపడి ఏదో దొర్లుకుంటూ ఆమె పాదం ముందాగింది.?

"మా శివా. నీ గురించి శివా చెపితేనేగదా ఆనాడు యీ వూరు నీకోసం వెతుక్కుంటూ వచ్చింది" అన్నాడు విశ్వం.

త్రికళ పాదం ముందున్నదేమిటో చూసింది. ఏనాటిదో, మెరుపుపోయిన తెల్లటి గాజుపొడితో చిన్న సెలూలాయిడ్ రబ్బరుది ... ఎర్రటి ఉంగరం.

త్రికళ మెదడులో రథచక్రాలు తిరుగుతున్నాయి. ఎంత భద్రంగా దాచుకున్నాడో. ఎందుకు దాచుకున్నాడో? చక్రాలు ముందుకూ వెనక్కూ జోరు జోరుగా తిరుగుతున్నాయి.

శివా కళ్ళు తెరిచాడు. త్రికళను విశ్వాన్ని చూశాడు. త్రికళాదేవి అంటూన్న జనం కలకలం చెవుల్లో పడుతూంది. శివా కళ్ళలో వెయ్యి జ్యోతులు వెలిగాయి. త్రికళ చేతిలో మగబొమ్మ అల్లాడుతోంది.

త్రికళ ఎవరో తెలిసింది "అమ్మా! త్రికళాదేవీ నువ్వేనా?" అనాలనుకుంటున్నాడు. నోరుకదుపుతున్నాడు కానీ మాట పెగలడంలేదు. ఆనందంతో గుండె వ్యాపిస్తున్నట్లుంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. మూసుకున్న రెప్పల్లోనే బాల, లలిత, రాజరాజేశ్వరి రూపాలతో త్రికళ కనిపిస్తూనే ఉండిపోయింది.

వన్నె తగ్గుతున్న ఎర్రటి సంధ్యలో పాడ్యమి నెలరేఖ లీలగా కనిపిస్తున్నది. శుక్రతార పొడిచింది. గుడిలో జేగంట మ్రోగుతూన్నది.

ఎక్కడో "కల యిదనీ నిజమిదనీ తెలియలేదులే..." అంటూ ఘంటసాల అమర కంఠాన్ని టేపు రికార్డరు వినిపిస్తోంది.


పాదం ముందున్న ఎర్రటి ఉంగరాన్ని దివ్యలోకమునుండి జారిపడిన సురమందారాన్ని తీసినట్లు తీసి కళ్ళకద్దుకుని దాన్ని అలాగే చూస్తూన్నది. చక్రాలు తిరగడంలేదు. జగన్నాథ రథం నిలిచిపోయింది. ఆ చిన్న ఎర్రటి ఉంగరాన్ని కన్నార్పకుండా చూస్తూన్నది త్రికళ. ఆ నాటి బాల.

# అరుదైన ఆత్మహత్య

- అవసరాల రామకృష్ణారావు

( 1961 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)

**కాలేజ్** కమిటీ సెక్రటరీ నుంచి వచ్చిన ఎపాయింట్‌మెంట్ ఆర్డరు చూస్తే వెంకటేశ్వరరావు ఉత్సాహం సగం చచ్చిపోయింది. అతను అనుకున్నట్టు ఉద్యోగం టౌనులో కాదు. అక్కడికి పదిమైళ్ళ దూరంలో ఉన్న ఒక పల్లెటూళ్ళో. వాళ్ళ మేనేజ్ మెంటు కిందే ఉన్న మరో కొత్త కాలేజీట అది. ఇంటికి రాగానే రంగ పై ఎడ్రసు చూసి, మొగుడి మొహం చూసి అర్థం చేసుకోలేక మరింత ఉక్కిరి బిక్కిరి అయింది. రావు జరిగింది చెపుతూ అన్నాడు.






'మనం ఈ మారుమూల పల్లెటూళ్ళో ఉండలేక దీనికి ఎప్లై చేశాం. పట్నం ఏమోనని ఆశపడ్డాను. ఇంతా చేస్తే మళ్ళీ ఇలాంటి దిక్కుమాలిన ఊరేనా? వద్దని రాసేస్తాను.'

'తొందరపడకండి. అంత మరీ పల్లెటూరు అయితే అందరు స్టూడెంట్సూ లెక్చెరర్సూ అక్కడెలా ఉండగలరు? ఒకవేళ టౌన్ నుంచి కాలేజీ బస్ ఏర్పాటు ఏదైనా ఉందేమో?'

'నోర్ముయ్. నిన్నెవరూ అడగలేదు. ఆడదాంతో ఆలోచిస్తే అఘోరించినట్టే' అన్నాడు రావు ఆ కోపాన్నంతా భార్యమీద చూపిస్తూ. అలాంటి కోపం అతని కళ్ళలోంచి వస్తుందో, నోటిలోంచి వస్తుందో, లోపల్నుంచి వస్తుందో రంగకి బాగా అనుభవమే. గదిలోకి వెళ్ళి ఓ పచ్చనోటు పట్టుకొచ్చింది. పొద్దుట మనియార్డరొచ్చింది. "నాన్న పంపాడు, దీపావళికి మనం వెళ్ళలేదుగా, బట్టలు కుట్టించుకోమన్నాడు."

"ఆయనంతలా ప్రాధేయపడతాడు కాబట్టి పుచ్చుకోవలసి వచ్చింది. లేకపోతే నీ సొమ్ము అందుకోడానికి నాకేం ఖర్మ? అలా బల్లమీద పెట్టి లోపలికి వెళ్ళు, మా ఫ్రెండ్స్ వచ్చే వేళయింది" అన్నాడు రావు అటు తిరిగి.

రంగ నోటక్కడ వుంచి లోపలికి వెళ్ళిపోయింది. రంగా వాళ్ళ నాన్న అంటూంటాడు. 'ఆత్మాభిమానులమని తమంత తాము అనుకునే కొందరు మొగవాళ్ళు అత్తగారివైపు పూచిక పుల్ల పుచ్చుకోరు. మంచిదే. కానీ పుట్టింటినుంచి ఏమీ తేలేదని భార్యలను సాధించని క్షణం ఉండదు. ఇలాంటి వాళ్ళందరికన్నా మా అల్లుడు కాస్త నయమే.' ఆ మాట జ్ఞాపకం వచ్చి రంగకి నవ్వొచ్చింది. ఆ చప్పుడు వినబడి రావు లోపలికొచ్చాడు.

"ఎందుకా నవ్వు?"

రంగ తలెత్తి మొగుణ్ణి చూసింది. ఆ మొహం చూడగానే మరింతగా నవ్వింది. ఇంతలో ఎవరో వచ్చి అతన్ని పిలిచారు.

"సంసారికి అంత విరగపాటు పనికిరాదు. కాస్త అణచుకో" అతను వీధిలోకి వెడుతూండగా ఆమె పైట చెంగు నోట్లో దోపుకుంది. తలుపులు మూసి ఉన్న ఒక గదిలో కూచుని ఇలా అనుభూతుల్ని అణుచుకోవలసిన అవసరం తన కేముంది? కాపురానికి వచ్చిన కొత్తలో రంగని ఈ ప్రశ్న చాలా బాధించింది.

మొట్టమొదటి రోజుల్లో ఒకసారి వెంకటేశ్వర్రావూ అతని క్లాసుమేట్సూ వీధిలో డ్రాయింగ్ రూంలో కూచుని ఏదో మాటాడుకుంటున్నారు. రంగ కాఫీ టిఫినూ తెచ్చి అక్కడ బల్లమీద పెట్టింది. ఎవరైనా పలకరిస్తారేమో, భర్త తనని ఎవరికైనా పరిచయం చేస్తాడేమో అని అయిదు నిమిషాలు అక్కడ ఆగి చూసింది కూడా. నిరాశతో లోపలికి వెళ్ళిపోయింది. వాళ్ళని వెళ్ళనిచ్చి రావు చరచరా లోపలికి వచ్చాడు.

"నీకేమైనా మతుందా, పోయిందా?"

"అదే నేను మిమ్మల్ని అడగదల్చుకున్నాను. అలా నేను నిలబడిపోతే, వాళ్ళందరూ నన్ను గుచ్చి గుచ్చి చూస్తుంటే, కూర్చోమనైనా అనరేం, నన్ను వాళ్ళకు యింట్రడ్యూస్ చెయ్యరేం?"

"పరాయి మొగాళ్ళ పరిచయానికి ఎగబడే నీకు బుద్ధి లేకపోతే పోయింది, అలా ఎంకరేజ్ చెయ్యలేదేమని నన్ను తప్పుపడుతున్నావా? గృహిణికి ఉండవలసిన ఆ మాత్రం సిగ్గూ లజ్జా కూడా వదిలేశావా? ఇంట్లో ఇద్దరు నౌకరీ వెధవలుండగా అసలు నలుగురు మొగాళ్ళ మధ్యకి వచ్చే అవసరమేం కలిగిందంట నీకు?"

మలినమైన హృదయంతో వికారమైన మొహంతో రంగ తలెత్తింది.

"చూడూ, ఇలాంటి వేషాలేం నాకు నచ్చవు. ఇంకేమీ అడక్కు. చెప్పించుకోకు – తెలిసిందా?"

తాత్కాలికంగా నోరు అవునన్నా కాదు కాదని మనసు రొదచేసింది. ఎత్తుగా, తెల్లగా, ఒళ్ళుగా ఉన్న తన మొగుడు నుంచి కొన్ని వందల ఏళ్ళ క్రిందటి భావాలు ఆమె ఆమోదించలేకపోయింది.

"అలా ఇద్దరం కలసి చల్లగాలిలో కొంతదూరం నడిచివద్దామా?" అంది ఒకనాడు సాయంకాలం భర్త యింటికి రాగానే. చూస్తుండగా అతని కనుబొమలు ముడిపడిపోయాయి.

"ఏం, మనం యిలా చల్లగా సంసారం చెయ్యడం నీకిష్టం లేదా?" ఎదురు చూడని ఈ జవాబుకి రంగ గిలగిల్లాడిపోయింది.

"ఇందులో తప్పేముందండీ, నేను మీతో వస్తానన్నానుగాని మరెవరితోనైనా.." అంటూ నాలిక కరుచుకుంది.

"పోనీ నీకంత సరదాగా ఉంటే అలాగే చెయ్యకూడదూ?"

అయినా రంగ ఊరుకోదలుచుకోలేదు.

"మొగుడూ పెళ్ళాం అన్న తరవాత సరదాలే ఉండవుటండీ?"

"అవి కథల్లో, సినిమాల్లో. సంసారాల్లో మాత్రం కాదు."

"మరి చెయ్యీ చెయ్యీ పట్టుకుని చిలకా గోరింకల్లా తిరుగుతున్న ఈ అశేష జనానికి ఈ మాత్రం జ్ఞానం లేదంటారా?"

"ఒకళ్ళ సంగతి నాకు అనవసరం. వెధవ్వేషాలేసి లోకం ఎలా తగలడిపోతోందో యింట్లో కూచున్న ఆడకూతుళ్ళకేం తెలుస్తుంది."

"అందుకనే కాస్త మీ కూడా నాలుగు వీధులూ చూపెడితే.."

రంగ వీపు చుర్రుమంది.

"ఇలాంటి బుర్ర తిరుగుడు కబుర్లు యిప్పుడు చెబితే చెప్పేవ్ మరెప్పుడూ చెప్పకు.."

రంగ భర్తతో మరెప్పుడూ అలా చెప్పలేదు. కానీ పక్కింటి శంకరీబాయి ముందు దుఃఖమంతా వెళ్ళగక్కుకుంది. ఆమె ఫకాలుమని నవ్వింది.

"మళ్ళీ పెద్ద వ్యాపారస్థుడి కూతురినంటావ్. ఆ మాత్రం వ్యవహార జ్ఞానమైనా ఒంటబట్ట లేదుటే అమ్మాయ్, నీకూ, పొద్దుకు పదింటికి వెడితే మళ్ళీ అయిదింటికి గాని యిళ్ళు చేరుకోరు మొగాళ్ళు. వాళ్ళతోనే ప్రపంచం అనుకుంటే మనకెలా కుదురుతుందీ? వాళ్ళున్న కాస్సేపూ మాటకి మాటా అని కోపం తెప్పించడం ఏం గడుసుతనం? ఇక వాళ్ళు యిల్లుదాటాక అన్నావా వాళ్ళు ఏడుపు వాళ్ళదే మన ఏడుపు మనదే"

అయితే ఆమె హితోపదేశం ఊరికేపోలేదు. బొత్తిగా తన ప్రపంచం తనదే అనుకోకపోయినా రంగ తెలివి కలిగి ప్రవర్తించడం మరిగింది. నిజం చెప్పి బతకడం కన్నా చిన్న చిన్న అబద్ధాలు చేర్చడమే హాయి అని గ్రహించింది. దూరమైపోతాడేమో అని బెంగపెట్టుకున్న భర్తను మరింత దగ్గిరగా తిప్పుకోడం నేర్చుకుంది. లేకపోతే పాతకాలపు బూజుల్ని పటం కట్టి భద్రపరచే తన భర్త పల్లెటూరి కాపురం తను వద్దని పట్టుపడితే మాత్రం వినేవాడేనా? 'ఈ పరాయి పల్లెటూళ్ళో మనవైపు మంత్రాలు వచ్చిన ఒక బ్రాహ్మణుడైనా కనపడడు. పూజా, వ్రతకల్పము చెప్పే వాళ్ళులేక ఆ మధ్య మంగళ గౌరీ వ్రతమూ చెయ్యలేకపోయాను. వీర్రాఘవుడికి దీపం పెట్టుకుందామనుకున్నాను. అదీ కుదిరింది కాదు.

మొన్నటికి మొన్న కార్తీక సోమవారం పూజా యిలాగే చేజేతులా చెడింది. భాష తెలియని ఈ దిక్కుమాలిన ఊళ్ళో ఏ నోమూ నాకు కుదరదు. పుణ్యమూ, పురుషార్థమూ కలసి వచ్చే మరో చోటికి నన్ను తీసుకెళదామని యీయనకి తోచదు"

ఈ మాట భర్త చెవిని పడ్డానికి వీలుగా మరికాస్త  గట్టిగానే అంది రంగ. పట్నవాసమనేది పతివ్రతా ధర్మానికి ఏమంత వ్యతిరేకంగా తోచలేదు. వెంకటేశ్వర్రావుకి వెంటనే అప్లై చేశాడు.

2

పోనీ ఓ మారు వెళ్ళి చూసొస్తే ఏం పోయిందని వెంకటేశ్వర్రావు తను పని చేస్తున్న పల్లెటూరునుండి ఆ టౌనుకి వెళ్ళాడు. టౌనులో ఉండి ప్రతిరోజూ బస్సుమీద పదిమైళ్ళూ వెళ్ళిరావడానికి అవకాశం ఉందో లేదో కనుక్కున్నాడు. కాలేజి బస్ అంటూ ఏమీ లేదటగాని,ప్రతి అరగంటకీ ఆ టౌన్ నుండి ఆ కాలేజీ ఉన్న గ్రామానికి బయలుదేరే స్టేట్ బస్‌లు ఉన్నాయట.

"ఇంత మరీ పల్లెటూళ్ళలో కాలేజీలు పెట్టడం దేనికో వీళ్ళు?" అన్నాడు రావు, అప్పుడే పరిచయమైన బోటనీ లెక్చరరు భాస్కరమూర్తితో, అతను మొదట్నుంచీ రాష్ట్రేతర ఆంధ్రుడే. అతను చెప్పాడు 'పల్లెటూరని ఆ పేరు గల ఒక ఊరు పిల్లలే ఆ కాలేజీలో చదవరు. ఆ చుట్టుపక్కల అన్ని పల్లెల నుండీ వచ్చి చదువుకుంటారు. వీళ్ళల్లో యిప్పుడిప్పుడే విద్యాసక్తి పెరుగుతోంది."

ఆ అన్యరాష్ట్రం గురించి వెంకటేశ్వరరావుకి ఆట్టే మంచి అభిప్రాయం లేదు. దాని గురించి అట్టే పొగడ్డం వినలేకపోయాడు. "దానికేంగాని మీరు యిక్కణ్ణుంచి రోజూ వెళ్ళి వస్తారా? అథారిటీస్ ఎలా చేస్తారా?"

"ఇప్పటికేం అబ్జెక్ట్ చెయ్యలేదు మరి. అదిగాక యీ టౌన్‌లో మా ఓన్ హౌసుంది. పొద్దుటెళ్ళి సాయంకాలం వచ్చేస్తూంటాము."

"బహువచనం వాడుతున్నారు."

"అవును నేనొక్కణ్ణీ కాదు. ఇంకా కెమిస్ట్రీ లెక్చర్రూ, ఆయనా తెలుగాయనే. సినిమాల వెర్రెక్కువ. అందుకని కంట్రీ లైఫ్ లైక్ చెయ్యడు. తక్కిన యిద్దరు లెక్చరర్లూ మన భాష వాళ్ళు కాదనుకోండి, ఇద్దరూ ఇంగ్లీషు చెబుతారు. వాళ్ళతనే ఒక ఫిజిక్సు డిమానిస్ట్రేటరు ఉన్నాడు. ఇందరం ఇక్కణ్ణుంచి వెళ్ళి వచ్చేవాళ్ళమే."

"ఏమో బాబూ నా మటుకు నాకు తల్చుకుంటే భయం వేస్తోంది. ఉద్యోగం లేకపోతే పీడాపోయిరి. ప్రతిరోజూ ఇరవైమైళ్ళు ట్రావెల్ చెయ్యడం, అందులో బస్సుమీద, మీకెంత ఓపికో ఏమో నావల్ల మాత్రం కాదు"

భాస్కరమూర్తి చిన్నగా నవ్వాడు.

"ఇది ఇవాళా నిన్నా పుట్టింది కాదు సార్. ఎటొచ్చీ సమస్య జటిలమైతే అది వేరే విషయం. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్. కలకత్తాలో పనిచేస్తున్న మా పెద్ద బావకి ఆఫీసుకీ యింటికీ పద్దెనిమిది మైళ్ళ దూరం. కిక్కిరిసిన బస్సుల్లో ట్రాముల్లో ఎలా

వెళ్ళివస్తున్నాడంటారు? అతని సర్వీసెంతో తెలుసా, పదిహేనేళ్ళు. మెడికల్ రిప్రజెంటేటివ్స్, సేల్సు మెన్ వీళ్లంతా మైళ్లకొద్దీ తిరక్కపోతే వీళ్ళ ఉద్యోగాలు ఎలాగ?"

ఇంతలో ఒకామె అక్కడి కొచ్చింది.

"మిస్ మనోరమా చటర్జీ.. బెంగాలీ చెబుతారు."

"గ్లాడ్ టు మీట్ యు" అని ఆమె చెయ్యి జాపింది. అటు చూడనట్టు నటించి వెంకటేశ్వరరావు పక్కకి తిరిగిపోయ్, అక్కణ్ణుంచి రహస్యంగా ఆమెను చూడ్డం ప్రారంభించాడు.

"ఆ మొహం అంత తెల్లగా ఉంది. ఇంకా అంత పౌడరెందుకు? ఆ మెడ అంత తెల్లగా ఉంది. ఆ ముత్యాల దండ కూడా ఎందుకు? ఆ చేతులు అంత తెల్లగా ఉన్నాయి? ఆ దంతపు గాజులు దేనికి? అసలు మనిషే అంత తెల్లని మనిషి. అంత మరీ తెల్లచీర ఎందుకు?"

వెంకటేశ్వరరావు తెల్లబోయాడు. ఇంతకు ముందు ఏ ఆడదాని వల్లా తనిలా ఆకర్షితుడయింది లేదు. ఎవరి గురించీ ఇలా ఆలోచించిందీ లేదు.

ఆమె భాస్కరమూర్తితో ఏదో అంటోంది. ఆ భాష రావుకి వచ్చి చావదు.

"ఏమిటంటుంది ఆవిడ?" అని అడిగాడు.

"చెప్పమన్నారా?" అని మూర్తి ఆవిడ్ని అడిగాడు.

చెప్పండి నేనేం లేని మాటంటే కదా, నాకేం భయం?" అందావిడ.

"మరేం లేదు. నన్ను చూసి తెలుగు వాళ్ళంతా నల్లగానే ఉంటారని ఆవిడనుకుందిట. ఇప్పుడు మిమ్మల్ని చూస్తే ఆ అభిప్రాయం మార్చుకోవలసి వచ్చిందిట. ఎండబడితే ఎరుపెక్కేంత తెలుపుతనం మొగాళ్ళకుండడం ఎంతైనా చిత్రంట."

"బాగుంది వరస" అన్నాడు రావు.

"ఏమిటంటారు ఆయన?" మనోరమ అడిగింది.

ఇద్దరూ గట్టిగా నవ్వేశారు. మూర్తి కాస్త మార్చి చెప్పాడు.

"ఆవిడకు ఈ టౌనులో బంధువులున్నారు కాబోలు. చూడ్డానికి వచ్చిందా ఆ గ్రామం నుంచి?" అని రావు అడిగాడు.

"లేదే ఆవిడా రోజూ మాతోపాటు బస్సులో వస్తూ పోతూ ఉంటుంది.

ఈసారి వెంకటేశ్వర్రావుకి తల తీసేసినట్టయింది. మొదటి పరిచయంలోనే ఎండ కన్నెరుగని సుకుమారుడుగా ఆవిడ తనని వేళాకోళం చేసింది. ఎందుకూ పనికిరాని ఆడకూతురే ఈ బస్సు ప్రయాణానికి సిద్ధపడితే తనకైనా అంత చేతకానిది? ఆఖరికి యీవిడకన్నా తీసిపోయాడా తను? డేమ్మ్ ఇన్సల్ట్. తన కొకడికే కాదు. యావత్ మగ జాతికి.

"ఏమిటండీ, ఏం డిసైడ్ చేశారు? మా కాలేజీలో జాయిన్ అవుతారా లేక అక్కడే కంటీన్యూ చేస్తారా?" భాసకర్ రామ్మూర్తి అడిగాడు.

"వచ్చేస్తానండీ .. బస్ జర్నీ టీడియస్‌గా ఉంటుందేమో అనుకున్నా. ఇందరుండగా నాకేం లోపం? ఇవాళే కాలేజీ అథారిటీస్‌కి నా అంగీకారం తెలియబరుస్తా. ఈలోగా ఈ టౌన్‌లో నాకో మంచి యిల్లు చూసిపెట్టాలి. ఆర్టీసీ కన్సెషన్ టికెట్‌కి ఎలా అప్లై చెయ్యాలో చెప్పాలి" అనేశాడు వెంకటేశ్వర్రావు గబగబా.

3

కొత్తకాలేజీ, కొత్త ప్రిన్సిపాలూ కొత్త స్టూడెంట్సూ పట్నంలో కొత్త ఇంట్లో తమ కాపురమూ యివేవీ తరువాతి ఆరు నెలల్లో వెంకటేశ్వర్రావు ప్రిన్సిపుల్సుకి ఏ మాత్రమూ అడ్డురాలేదు. ఒకరి జోలికి వెళ్ళకుండా తన పనేదో తను చూసుకుపోతాడనీ, ఇచ్చిన లెక్చరయినా బాగా ప్రిపేరయి స్టూడెంట్సుకి బాగా అర్థమయేలా చెబుతాడనీ అతనికి పేరు కూడా వచ్చింది. అయితే మానసికంగా అతని పరిస్థితి వేరు. ప్రతి క్షణం మనోరమ అతనికి ఓ పెద్ద సమస్యై కూచుంది. అదెలా పరిష్కరించడమో అతనికి అర్థం కూడా కాలేదు. ప్రతీరోజూ బస్సులో ఆమెతో ప్రయాణమూ అతనికి తప్పలేదు. ఎంత తలొంచుకుని కళ్ళు మూసుకుని కూచున్నా ఆమె ఆలోచన్లూ అతన్ని విడవలేదు.

విషయమేమిటంటే స్త్రీల విషయంలో వెంకటేశ్వర్రావు మనసులో కొన్ని పరిమితాలైన పరిధులున్నాయి. అవి మార్చుకోవలసిన అవసరం లేకుండా అతనికి ఈ పాతికేళ్ళూ గడిచిపోయింది. 'మొగవాడు ఎంత పెద్ద పదవిలో ఉంటేనేం, అతన్ని నడిపించేది ఆడదే" అనే అభిప్రాయం అతను ఏ మాత్రమూ ఆమోదించదు. గృహ నిర్వహణ పురుషులూ, ఉద్యోగ నిర్వహణ స్త్రీలూ పూర్తిగా నిర్వహించే రోజులు ఒకవేళ్ వచ్చినా వెంకటేశ్వర్రావు ఒప్పుకోడు. వంట చెయ్యడం, పిల్లల్ని కనడం యింతకు మించి ఆడదానికి ఉద్యోగమేమిటని అతని ప్రశ్న. మొగాడు బొత్తిగా చేతకాని వాడైతేనే పెళ్ళాం చేత ఉద్యోగం చేయిస్తాడని అతని నమ్మకం. భర్త చనిపోయినా, లేదా ఉన్నా పరమ చవట దద్దమ్మ అయినా తప్పని పరిస్థితుల్లో జీవనోపాధికోసం ఆడది సంపాదించవచ్చుననీ, అదయినా ఏ అప్పడాలు వత్తో, ఏ వంటపని చేసో అంతకుమించి ఆడదాని ఉద్యోగం అతను భరించలేడు. రావులో చెప్పుకోదగ్గ లక్షణం ఉంది. అతని భావాలు సాధారణంగా పైకి వెలిగక్కాడు. ఎవరితోనూ వాదించడు. కనీసం ప్రస్తుత పరిస్థితులతో పోల్చుకోడు. ఇంటిదగ్గర కూడా అతనికి అపజయం లేదు. అట్టే చదువుకోక సంసారపక్షంగా ఉన్న రంగనాయకిని తను చేసుకున్నాడు. మొదట్లో కొద్దిగా తెలివి తక్కువతనం చూపించినా తరవాత తరవాత రంగ తనకెన్నడూ మనఃక్లేశం కలిగించలేదు. తన మానసిక చిత్రం చెరుపుకోవలసిన అవసరం వెంకటేశ్వరరావు కెప్పుడూ కలగలేదు. కానీ ఇదేమిటీ మనోరమ? తను మనోరమను ప్రేమిస్తున్నాడా? మానసికంగా వ్యభిచరిస్తున్నాడా? లేదు. ఎంతమాత్రం లేదు. ప్రేమించడం మాట దేముడెరుగు. మనస్పూర్తిగా ద్వేషిస్తున్నాడు. ఆ ద్వేషాన్ని నిలుపుకునే అవకాశాలు దొరక్క విచారిస్తున్నాడు.

ఆవిడ బెంగాలీ ఎమ్మేట. రావుకేమో ఆ భాష కొద్దికొద్దిగా వచ్చు. అప్పుడే ఏడాదై ఆ ప్రాంతాల్లో ఉన్నాడు గనక ఒకరు మాట్లాడితే ఓ మోస్తరుగా అర్థమౌతుంది. తను తిరిగి చెప్పలేడు. పోనీ ఇంగ్లీషులో మాటాడదామంటే అతని ఉచ్చారణ ఆమెకూ, ఆమె ఉచ్చారణ అతనికీ ఇంపుగా ఉండక ఏమిటో మాట్లాడుకున్నామన్న సంతృప్తే మిగలదు. భాస్కరమూర్తయితే కొంచెం సీరియస్‌నెస్ ఉన్న వాడు గనక ఉన్నదున్నట్టు యింటర్‌ప్రెట్ చేస్తాడు. కెమిస్ట్రీ లెక్చరర్ మోహనరావు మాత్రం లేనిపోనివి చెప్పి వేళాకోళం పట్టిస్తాడు. అయినా పరాయి ఆడది ఆవిడతో తనకి మాటలేమిటి? కానీ ఈ మనోరమ అలా బతకనివ్వదే? తనని ఒక్క క్షణమైనా నిశ్శబ్దంగా ఉండనియ్యదు. తన ప్రతీ అనుభూతీ ఎదుటివారు పంచుకోవాలి. చిన్నా, పెద్దా ఆడా, మొగా? కొత్తా, పాతా ఈ భేదమేలేదు ఆమెకి. నోరు మూసుకుని విని చెప్పిన దానికల్లా అవునని తలలూపే చచ్చురకం శ్రోతల్ని ఆమె ఏ మాత్రమూ భరించలేదు. అలాంటి ఆమెను రావు ఏ మాత్రమూ భరించలేడు.

"చలనమూ, చైతన్యమూ, సౌందర్యమూ ఉన్న మానవులం మనం ఊరికే ఎలా పడుండగలం" అన్న ధోరణిలో మాటాడుతుంది ఆమె.

"బరితెగించిన రకం" అని అర్థం చేసుకుంటాడు వెంకటేశ్వర్రావు. చాలా నీటుగా ముస్తాబై వస్తుంది మనోరమ ఎంతో అందంగా హుందాగా కనబడుతుంది. ఎక్కడా చెక్కు చెదరకుండా మడత నలగకుండా అలంకరించుకుంటుంది. కానీ బస్సు ప్రయాణం ఆమె 'ఎలిగెన్సును' హరించి వేస్తుంది. నిజం చెప్పాలంటే ఆమె నలిగిపోడం బస్సు కుదుపువల్ల కాదు. అంతూదరీలేని ఆమె కబుర్లవల్ల. అలా కబుర్లు చెబుతున్నపుడు ఆ కళ్ళు, ఆ జడలు, ఆ చేతులు అలా నాట్యం చెయ్యవలసిందే. అయితే చిత్రమేమిటంటే అలా బస్సు దిగిన మనిషి తిన్నగా లేడీస్ వెయిటింగ్ రూంలోకి కాలేజీలో ఆమెకు ప్రత్యేకించినది-వెడుతుంది. లోపల అంత తక్కువ టైంలో ఎలా ఏం చెయ్యగలుగుతుందో యివతలికి వచ్చేసరికి రాత్రంతా అమ్మని తెగబరికి, కడుపునిండా పాలు ఊనబట్టి, ఒళ్ళు తెలియని నిద్రతీసి, అప్పుడే మేలుకున్న పసిపాప కళ్ళలోని వెలుగులా నిర్మలంగా తయారయి వస్తుంది. లోపల ఎంతెంత లోపాలు లేకపోతే ఇన్నిన్ని పై మెరుగులు దేనికి? ఆడదానికి అతి ముఖ్యమైనది శీలం. పాతికేళ్ళు పైబడినా యీమెకు పెళ్ళి కాలేదంటే అలా కాకపోయినా ఇంత పైలాపచ్చీసుగా తిరుగుతోందంటే ఏనాడో చెడిపోయి ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది. అవి కప్పెట్టుకోవడానికే ఇన్ని నాటకాలు ఆడుతోంది" అనుకున్నాడు వెంకటేశ్వర్రావు.

కానీ దానికి ఒక్క రుజువు దొరక్క అతని మనసు బాధపడింది. "ఇలాంటి వాళ్ళు పైకి తేలతారా నా వెర్రిగాని. అని సమాధాన పరుచుకుందామన్నా అతనికి ఉండబట్టలేదు. ఎప్పుడూ ఏ విషయమూ ఎంత తెలిసిన్ వాళ్ళదగ్గరైనా ఎక్స్‌ప్రెస్ చెయ్యడం ఎరగని అతను యీ విషయం తెలిసిన ఇద్దరు ఆంధ్రా లెక్చరర్సు దగ్గిర వెళ్ళగక్కక తప్పలేదు.

"రామ, రామ. ఆమె గురించి అంత నీచంగా మాట్లాడ్డం ఘోరం" అన్నాడు భాస్కరమూర్తి. అంతేకాదు. ఆమె గొప్పతనాన్ని గంటల తరబడి చెప్పడం ప్రారంభించాడు. రెండేళ్ళై ఆమెను ఎరుగునట. వెకిలితనం మచ్చుకైనా లేదుట. వాళ్ళది చాలా సాంప్రదాయమైన పెద్ద కుటుంబమట. వాళ్ళ కుటుంబానికి మనోరమ కొంత ఆర్థిక సాయం కూడా చేసున్నదట.

"ఆ చల్లని చిరునవ్వు వెనక, ఆ తెల్లని బట్టలవెనక, చక్కని హృదయంకూడా ఉంది. ఓసారి బస్సులో ఏం జరిగిందనుకున్నారు? బస్సు కుదుపుకి, అది రాత్రయినా, పట్టపగలయినా, సగం పైగా ఆప్రయాణీకులు నిద్రకి ఉపక్రమించడం మీకే తెలియని విషయం కాదుగదా, రావుగారు? అవాళ మనోరమ పక్క సీట్లో ఓ పదేళ్ళ కుర్రాడు కూచున్నాడు తలనిండా బాగా నూనె రాసుకున్నాడు. మనోరమ అవాళ కొత్తచీర కట్టుకొచ్చింది. వాడు నిద్రలో జోగిజోగి ఆమె మీద పడడం. ఆమె చీర భుజం దగ్గీ పెద్ద నూనె మరక అయిపోయింది. ఈ సంగతి చూసి పక్కనే ఉన్న ఆ కుర్రాడి తల్లి వాణ్ణి ఓ లెంపకాయ వేసింది. మనోరమ ఏ మాత్రమూ విసుగయినా కనబరచకపోగా తన గురించి ఆ కుర్రాడు దెబ్బతిన్నందుకు ఎంతో బాధపడి, బస్సు దగ్గిరకి అప్పడాలు అమ్మొస్తే వాడికి కొనిపెట్టి ఊరుకో పెట్టింది. ఇంకా అది నయమే. మరోసారి...'

'ఎందుకులెద్దురూ నేను కొంత వరకూ చూస్తున్నాను గదా"

"అలాకాదు వినండి ఒకావిడ ముగ్గురు పిల్లల్ని వెంట బెట్టుకుని బస్సెక్కింది. మనోరమ పక్కనే కూచుంది.ఇద్దరు పిల్లల్ని ఒకవైపు కూచోపెట్టుకుని మూడోవాణ్ణి చంటిపిల్లాణ్ణి తొడమీద బుర్రపెట్టి జోకొట్టింది. వాడు కాళ్ళు దర్జాగా మనోరమ టెర్లిను చీర మీదకు జాచాడు. ఆమె ఏమీ అనకపోగా ఆ కాళ్ళని తన ఒడిలోకి లాక్కుని మృదువుగా వాణ్ణి జోకొట్టింది. వెల్లకిలా పడుకుని ఇంద్రభోగం అనుభవిస్తున్న ఆ గుంట నాగమ్మ ఊరుకోవచ్చా? మరుక్షణం ఫౌంటెన్‌లోంచి వచ్చినట్టు, ఆమె కళ్ళూ బుగ్గలూ పావనం చేశాడు. అక్కడ మనోరమకాక మరెవరున్నా పెద్ద రాద్ధాంతం జరిగి ఉండేదే. బట్టలు పాడయినందుకు కాకపోయినా బస్సులో వాళ్ళు నవ్వినందుకయినా మరొకరు ఆ పాపను బజాయించి ఉందురు. "మిస్చువన్ రాస్కెల్" అంది నవ్వుతూ. ఆ పక్కనున్న ఇల్లాలు మరీ మరీ క్షమాపణ చెప్పుకుంది.

"డోంట్ వర్రీ సిస్టర్. మనం ఆడవాళ్ళం. ఎప్పుడో అప్పుడు ఇలాంటి అవస్థలకు సిద్దంగా ఉండవలసిందే" అంది తేలికగా.

"పిల్లల్ని కన్నవారు కాబట్టి మీరు అర్థం చేసుకున్నారు. ఇంకోళ్ళయితే ఎంతగొడవ చేద్దురో" అంది ఆ పిల్లల తల్లి ఆమె గురించి తెలీక. మనోరమ నవ్వేసి ఊరుకుంది.

"ఎందరమ్మా మీకు పిల్లలూ?" అని మళ్ళీ ఆవిడే అడిగింది. మనోరమ ఏం జవాబు చెప్పి ఉంటుందో మీరు ఊహించగలరా రావుగారూ?'

భాస్కరమూర్తి ప్రశ్నకు వెంకటేశ్వర్రావు కళ్ళు చిట్లించి జవాబు చెప్పాడు.

'దీనికి పెద్ద ఊహించలేనిదంటూ ఏంఉంది? జవాబుగా మళ్ళీ నవ్వేసి ఉంటుంది."

'అదేంకాదు, మనోరమ చెప్పిందీ ప్రస్తుతం నాకు రెండొందల యాభైమంది పిల్లలు అని"

"అంటే?"

"ఆ మాత్రం పోల్చుకోలేరా? మన కాలేజీ స్టూడెంట్సు మొత్తం అంతేగదా" భాస్కరముర్తి మనోరమ గురించి యింకా చెప్పబోతుండగా వెంకటేశ్వర్రావే వినలేక అక్కణ్ణుంచి ఏదో వంకపెట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు. అతనిలో పుట్టిన అగ్నిహోత్రం మరింత ప్రజ్వలించింది. మోహనరావుతో మాటాడినపుడు మాత్రం అంత బాధపడలేదు. కారణం మోహనరావు యింకా బాగా కుర్రాడు. ఎలా బడితే అలా మాట్లాడగలవాడు.

"భాస్కరమూర్తి ఆవిణ్ణంతలా వెనకేసుకు రావడంలో అర్థం లేకపోలేదులెండి" అన్నాడతను అదోలా నవ్వుతూ. వెంకటేశ్వర్రావుకి కాస్త ప్రాణం తెప్పరిల్లనట్లయింది.

"మనం ఎందరుండనీండి. షి ప్రిఫర్స్ టు సిట్ బై హిజ్ సైడ్ ఇన్ ది బస్, ఎంచేతంటారు?"

రావు మోహన్‌తో కలసి హాయిగా నవ్వాడు.

"మరి చెప్పరేం?" అంటూ స్పెషల్ టీకి ఆర్డరిచ్చాడు. ఐతే దానికి రుజువు ఆ మర్నాడే దొరకడంతో రావుకి ఇంకా ఈ ప్రపంచం ఎందుకు భగ్గని మండిపోలేదో అర్థమయింది. ఆవేళ లాస్టు పిరియడ్ క్లాస్ పూర్తి చేసుకుని రావుమోహన్‌తో కలసి బస్సు దగ్గిరకి వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది. బస్సు నిండిపోడంచేత నిలబడవలసి వచ్చింది. ఎక్కడో ముందు సీట్లో మనోరమ భాస్కరమూర్తీ ఉండడంచేత, బస్సుకిక్కిరిసి ఉండడం చేత వీళ్ళకి వాళ్ళెక్కడ ఉన్నారో సరిగా కనబడలేదు. ఇంక టౌను ఒకటి రెండు మైళ్ళుందనగా మోహన్ అటుచూడమని రావుని మోచేత్తో పొడిచాడు.

'ఫరవాలేదు. యు కెన్ రెస్ట్ ఆన్ మి' అంటోంది మనోరమ. భాస్కరమూర్తి కళ్ళు మూసుకుని ఆమె భుజం మీద తల వాల్చుకుని పడుకున్నాడు.

రైలు స్టేషన్లో, బండి లేటుకదా అని ఒక లావుపాటి ఆసామీ నిద్దరోతున్నాడు. ఒక జేబుదొంగ అతని ప్యాంట్ జేబులో చెయ్యిపెట్టే వేళకి అతను అట్నుంచి ఇటు ఒత్తిగిలడం సంభవించింది.

అంతే. ఆ చెయ్యి మరి రాలేదు. ఇద్దరు పోలీసులు సాయంబట్టి విడిపించారు చివరికి.

'నిండు బస్సులో పట్టపగలు ప్రేమ పారవశ్యం. ఆ రెండూ వదిలేస్తేసరి ప్రపంచంలో ఎలాగేనా బతకొచ్చు' అన్న మోహన్ ఆ క్షణంలో రావుకి ఆప్తమిత్రుడయిపోయాడు. 'కేవలం లెక్చరర్సేకాక టౌనునుంచి ప్రతీరోజూ విలేజికి వచ్చి చదువుకునే స్టూడెంట్సూ ఎప్పుడూ బస్సులో ఉంటారు. కనీసం వాళ్ళున్నారనయినా.."

"దీనికి ఏదో ఒకటి చెయ్యాలి. ఈ మనోరమలాంటి వాళ్ళని రూపుమాపుతేగాని ఈ దేశం బాగుపడదు" అన్నాడు రావు.

బస్సు దిగి వాళ్ళు వెళ్ళిపోయాక అతను ఉండబట్టలేక పక్కనున్న స్టూడెంట్‌తో అన్నాడు.

'చూశావుటోయ్ వైకుంఠం, ఈ మూర్తి సంగతి ఏమన్నా బాగుందీ?"

"ఏం బాగులేదు సార్. పాపం బస్సులో చాలా బాధపడిపోయారు. బెంగాలీ లెక్చెరరు ఆయన్ని హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. ఉన్నట్టుండి ఒక్కసారి వచ్చేసింది. నూట నాలుగు జ్వరం"

"ప్రేమజ్వరం కాబోలు" అన్నాడు మోహన్, రావు చెవిలో. కానీ రావుకి ఆ సమాధానం ఏ మాత్రమూ తృప్తినివ్వలేదు.

4

"ఏమోగాని మీరు మునపట్లా ఉండడంలేదు. పరధ్యానం ఎక్కువై పోయింది" అంది రంగనాయకి ఒకనాడు భర్తతో. అతనేమీ మాటాడలేదు. మునపటి కాలేజీయే నయం. నిక్షేపంలా ఉండేవారు. ఇక్కడ నీళ్ళూ అవీ ఒంటబట్టలేదేమో, సన్నపడి పోతున్నారు. అనవసరంగా నేనే పల్లెటూరు పల్లెటూరని మిమ్మల్నిక్కడికి లాక్కొచ్చాను. నిత్యం మైళ్ళకు మైళ్ళు యీ బస్సు ప్రయాణం మీకు పడ్డట్టులేదు"

రావు అప్పటికీ మాట్లాడలేదు.

"మునపటి ప్రిన్సపాలుకన్నా ఇతనెంతో మంచివాడన్నారు. ఎవళ్ళపని వాళ్ళు చేసుకుపోడమేగాని కాలేజీలో ఎలాంటి రాజకీయాలూ లేవన్నారు. మరి మీకొచ్చిన చికాకు ఏమిటి?"

"నీతో చెప్పవలసింది కాదు. నువ్వు తీర్చేది కాదు. నీ పనేదో నువ్వు చూసుకో– లోపలికి పో.

నాకు కాలేజీకి వేళయింది. ఎప్పుడూ ఆ వీధి గుమ్మంలోనే అఘోరించకు. కాస్త అప్పుడప్పుడూ లోపలికి కూడా తగలడుతూండు"

వెంకటేశ్వర్రావు బస్సుస్టాండు వైపు గబగబా నడిచిపోయాడు. అయిదు నిమిషాలు అక్కడే నిలుచుని చూసింది రంగ. మూతి విరిచింది. చేతులు వెక్కిరించినట్టు తిప్పింది. భళ్ళని తలుపు వేసేసింది. అరగంటలో భోజనమూ పైపనీ ముగించింది. పెట్టె తెరచి పర్సు తీసింది. రెండు పదిరూపాయల నోట్లూ, నాలుగు రూపాయల నోట్లూ, రెండ్రూపాయల చిల్లరా పర్సులో వేసుకుని పెట్టె తలుపు వేసేసింది. శుభ్రమైన చీరా జాకెట్టూ వేసుకుని మరోమారు తలదువ్వుకుని, పౌడరద్దుకుంటే బాగుణ్ణేమో అనిపించింది ఆమెకు, బీరువాలో బిగించబడిన అద్దంవైపు చూసుకుంటే, "ఎబ్బే. ఇప్పటికే ఆలస్యమైపోయింది" అనుకుని గబగబా వీధి తాళాలు వేసుకుని వీధినిబడి తొందరగా నడవసాగింది, దరిలో దాసీమనిషి ఎదురుబడి ఆ స్పీడు చూసి నవ్వుతూ అంది.

"పరుగేనా పెట్టండి తల్లీ. ఆనక పని చెడిపోయేను."

"ఒసే మంగీ నోరుముయ్యి. నేనిలా వెడుతున్నానని బాబుగారికి ఎవరివల్ల తెలిసినా సరే ముందు నీ పీక నొక్కుతాను తెలిసిందా?"

"అలాగే. చెప్పకుండా ఉన్నందుకు లంచం ఏమిస్తారు?"

"పీక నొక్కకపోడమే వెళ్ళు అంటగిన్నెలు ఎదురుచూస్తున్నాయి" రంగ తాళాలగుత్తి తీసి ఒక తాళం వేరే తీసి యిచ్చింది. అది అందుకుని మంగి వెళ్ళిపోయింది రంగ మరింత చకాచకా నడుస్తూ ఒక ఇంటి ముందు ఆగింది. ఒక్కసారి అటూ యిటూ చూసి లోపలికి వెళ్ళిపోయింది. అది ఆదర్శమహిళామండలి. అక్కడ ఉదయము పది మొదలు సాయంకాలము నాలుగు వరకు ప్రతిదినము డబ్బేసి పేకాట ఆడబడును.

సరిగ్గా ఇదే సమయంలో వెంకటేశ్వర్రావుతో మనోరమ బస్సులో అంది.

"ఎన్నోసారులు మీ మిసెస్‌ని చూపిస్తానన్నారు. ఒకే ఊళ్ళో ఉన్న మనకు ఇది యింత యింపాజిబుల్ థింగ్ అంటే ఎవరేనా నవ్వుతారు. ఈ ఆదివారం మీ ఇల్లెక్కడో నేనే వెతుక్కు వస్తాను. వస్తే తగిలెయ్యరు కదా? ఏమో ఆ వేళకి మీ శ్రీమతిని ఎక్కడికైనా పంపిచేస్తే? అలాకాదు చెప్పాపెట్టకుండా నేనే ఎప్పుడో వచ్చి మీ ఆవిణ్ణి ఎత్తుకుపోతాను. అప్పుడు మీరే నన్ను బతిమాలుకోవలసి వస్తుంది. అయినా ఈ ఇరవైయ్యో శతాబ్దంలో యింకా యింత ఆర్థోడాక్సు ఏమిటండీ మీరు? ఒక్కసారైనా ఆవిణ్ణి మీకూడా పైకి తీసుకురారేం? అసలు ఈయనికి పెళ్ళైందా? అని. భాస్కరమూర్తిగారూ. మీరు మిసెస్ వెంకటేశ్వర్రావ్‌ను చూశారూ?"

"బాగుంది, ఆడాళ్ళ  కంటపెట్టడానికే ఆయనకి భయం. ఇక మా లాంటి మొగ ముండాకొడుకులికి చూపిస్తాడూ, ఇంకేమైనా ఉందా?" బుగ్గలేకాక మెడంతా ఎర్రపడేదాకా మనోరమ నవ్వింది.అలా విరగబడి నవ్వుతున్న మనోరమ పక్కని రంగని తలుచుకుంటే ఒక్కసారి అసహ్యంతో రావు మనసు వికలమైపోయింది.

"నేనే ఎప్పుడో వచ్చి మీ ఆవిణ్ణి ఎత్తుకు పోతాను" అన్న ఆమె మాట తరతరాల మన భారతీయ సంస్కృతికి గొడ్డలి పెట్టుగా అతనికి తోచింది.

"నీతికీ నిబంధనకీ ఎప్పుడయితే కట్టుబడి వుండదో అప్పుడే ఆడది చెడింది, ఆడది ఎప్పుడిలా రచ్చకెక్కిందో ఆనాడే దేశం నాశనమయింది. అనుకున్నాడతను, "రేపొద్దున నాకూ ఆడపిల్లలు పుడతారు. ఇలాగే చేజేతులా భ్రష్టుల్ని చేస్తానా? ఇంట్లోనే తెలుగూ లెక్కలూ చెప్పిస్తాను. పదహారు వెళ్ళకుండా పెళ్ళిళ్ళు చేసి అత్తారిళ్ళకు సాగనంపుతాను. పతివ్రతా తిలకాలైన నా కుమార్తెలు ఏ యింట్లో పాదం పెడతారో అక్కడ మళ్ళీ మన సత్సాంప్రదాయం జీవం పోసుకుంటుంది. భారతమాత మోహం మళ్ళీ కళకళలాడుతుంది" రావు తెల్లని బుగ్గల్లో తగుమాత్రం అరుణిమ తొంగిచూసింది.

"మనం చెప్పిందంతా విని రావుగారు 'టెలిపతి' ద్వారా వారి భార్యకు అందచేస్తున్నారనుకుంటాను. కావలస్తే ఆ మొహం చూడండి."

భాస్కరమూర్తీ, మోహన్ అన్నాడు.

"అతని తియ్యని కలలు పాడుచెయ్యకండి పాపం"

"అక్కర్లేదు. మనం ఎన్ననుకున్నా ఆయన ధోరణి ఆయనదే"

వెంకటేశ్వరరావు గట్టిగా జవాబు చెబుదామనుకున్నాడు. కానీ సమయానికి అతని నోటంట మాట పెగల్దు. భాష సరిగ్గా పట్టుబడక అనుకున్నవన్నీ అతను చెప్పలేదు కూడాను. పైకి కక్కలేని జవాబులు మాత్రం అతనిలో రెడీగానే ఉంటాయి.

'నాది నాది కాక నీ దోరణీ నా ధోరణీ ఒకటెలా అవుతుందే మనోరమా? అసలు నీకు యింకొకరితో పోల్చుకునే యోగ్యతెక్కడిది? తప్పుదారిన నడిచే నీలాంటి వాళ్ళకి విద్యార్థులైన వారి దుస్థితికి ముందు విచారించాలి. ఈపాటికైనా నీకు తగిన మారుపేరు ఒకటి తగిలించి క్లాసులో కొచ్చేసరికల్లా ముప్పుతిప్పలూ పెట్టని విధ్యార్థుల అమాయకత్వానికి విచారించాలి. ఇలాంటి వాళ్ళని తెలుసుండి ఉపేక్ష చేస్తున్న పరిపాలకవర్గం చేతకానితనానికి విచారించాలి. కానీ, మనోరమా నీ ఆటలు ఎల్లకాలం సాగవు. ఎల్లకాలం ఇలాగే నవ్వుతూ గడపగలననుకోడానికి నీ జీవితంలో చెప్పుకో తగింది ఏం సాధించావు గనక. ఇంత బహిరంగంగా విచ్చలవిడిగా తిరుగుతున్న నీకు పెళ్ళనేది గగనకుసుమం కదా" వెంకటేశ్వ్రరావు తనలో తనే నవ్వుకున్నాడు.

"అల్లరి చిల్లరి తిరుగుళ్ళే తిరిగావుగాని చల్లని సంసారం అదెంత చకక్కిదో అనుభవించే గీత పాపం నీకు లేదుకదే" అని అతడు గర్వపడినన్నాళ్ళు పట్టలేదు. ఆ మరుసటి వారం ఆమె నాలుగు రోజులు వరసగా శెలవు పెట్టింది. ఎవరితోటీ ఎక్కువ ఏమీ మాటాడక రిజర్వుడుగా ఉండే రావుకి ఏ కబురయినా అందరికంటే ఆఖరున తెలియడం మాములే. అదైనా ఆ మోహన్ వల్లే తెలిసింది.

"మీరు వినలేదా ఏమిటి? మనోరమా ఛటర్జీ పెళ్ళినిశ్చయమైందిట" రవు 'షాక్ 'లోంచి తేరుకోక పూర్వమే అతను మళ్ళీ చెప్పాడు.

"అతను కూడా ఎమ్మేనే అట. ఫస్టు క్లాసే కాక యూనివర్సిటీ ఫస్టుట. రిసెర్చి స్కాలరుగా ఉంటున్నాడట."

వద్దనుకున్నా ఆ కబుర్లు చెవిలో పడ్డాయి. వద్దనుకున్నా మనసు ఆలోచించడం మానలేదు. ఎవరో ఎరక్క ఈ ఉచ్చులో చిక్కుకున్నాడంటే అది వేరే విషయం. ప్రఫుల్ల చంద్రకుమార్ ఆవిడ మేనత్త కొడుకేట.

మానసికంగా తనకు జరిగిన ఈ అపజయాన్ని వెంకటేశ్వ్రరావు ఎంతమాత్రం తనలో యిముడ్చుకోలేకపోయాడు. ఎప్పుడూ లేనిది అవాళ లెక్చరు క్లాసులో కొన్ని తప్పులు చెప్పాడు. ధైర్యమూ తెలివి తేటలూగల ఒక కుర్రవాడు అవి ఎత్తి

చూపిస్తే ఆనవసరంగా ఇరిటేటై క్లాసంతటినీ తిట్టిపోశాడు. క్లాసంతా వాకౌట్ చేద్దామనుకున్నారుగాని సమయానికి ప్రిన్సిపాలు వచ్చి సర్దిచెప్పాడు. ఆ దెబ్బతో రావు మూడురోజులు క్యాజువల్ లీవు పెట్టేశాడు.

ఆ మూడురోజుల్లో ఇంటిదగ్గిర వెంకటేశ్వర్రావు సజీవ సమాధి అనుభవించాడు. ఆ బాధ మింగలేనిది, కక్కలేనిది. ఆ విసుగంతా సహజంగా సహధర్మచారిణి మీద చూపించాడు. భర్త యింట్లో చేరి ఆమె నిత్యకృత్యానికి అడ్డురావడం చేత ఆమెకూడా సహజంగా సహనం కోల్పోయింది. ఎప్పుడూ లేనిది మాటకు మాట జవాబు చెప్పింది. దాంతో అతను రెచ్చిపోయి నాలుగు తగల్నిచ్చాడు.

"ఆడదాని బతుకు అర్ధాన్నపు బతుకు. ఎంత పెట్టి పుడితేనేం ఒకరి పంచచేరి, అణిగి ఉన్నాక?" అంది రంగ ఏడుస్తూ. రావుకి ఆ మాటలో ఏదో అర్థంతోచింది. అతని చిక్కులన్నీ విడిపోయినట్టయింది ఎప్పుడూ లేనిది రంగని దగ్గరకు తీసుకుని అనునయించాడు.

"అక్కర్లేదు. అవతలి కెళ్ళండి. మీరు మునపట్లా లేరు. కొన్నాళ్ళు దూరమైతేగానీ నా విలువ మీకు తెలిసిరాదు. నాన్నదగ్గిరకు మండపేట పోతాను. నాకేం లేదా, పోదా?" రావు ఆమెను బతిమాలాడు.

భగవంతుడు ఆమెనోట నిజం చెప్పించి తనకు మళ్ళీ జీవం పోశాడు. ఎంతటి ఆడదయినా అణిగి మణిగి ఉండక తప్పదు. ఎంత మేనత్త కొడుకయినా మొగుడు మొగుడే. అంత చదువుకున్నవాడు వాడి ఖర్మ కాలిపోతే, పెళ్ళాం చేత ఉద్యోగం చేయించుకుంటాడా? అందులో యీవిడ వేషాలు ఏమాత్రం తెలిసి వచ్చినా గడప దాటనిస్తాడా? అక్కడితో ఆగుతుంది మనోరమ నాటకం. అంతటితో కుదురుతుంది మనోరమ సంకటం. గాలిపడగలా సోలిపోడం నీటి నురగలా తేలిపోడం ఇంకెన్నాళ్ళు? అన్నీ చప్పగా కుదిరి మొహం నిండా ముసుగు వేసుకుని ఏ వంటింట్లోనో ఏ మండీ మండని కర్రల పొయ్యి దగ్గరో ఏడుస్తూంటే అప్పుడు చూడాలి ఆ మోహినీ అవతారం. ఆ ఒళ్ళు తెలియని కబులూ, ఆ నవ్వులూ బస్సులో ఉన్నా బస్సును మిచిన ఆ స్పీడూ, ఇంకెన్నాళ్ళు? ఆవిడ రాజీనామా పత్రం కాలేజీకి వచ్చిననాడు తనకు పుట్టినరోజని బొంకి వెంకటేశ్వరరావు ఘనంగా టీపార్టీ చేశాడు.

## 5

ఆవిడ రిజైను చెయ్యడం ఖాయమే అని తెలిసిననాడు ఆ కాలేజీ విద్యార్థులలో సంచలనమే చెలరేగింది.

"బంకిమ చంద్ర చటోపధ్యాయ సంపుటీకరించిన 'బిబిధ ప్రబంధ' ఆవిడే చెప్పాలి. గిరీశ చంద్రఘోస్ రచించిన 'బుద్ధదేవ చరిత'లో పద్యాలు ఆవిడ నోటనే వినాలి. ఠాగూరు గీతాంజలి ఆవిడే బోధపరచాలి. ప్రపంచ సాహిత్యంలో ప్రసిద్ధ భాగమై కూచున్న వంగ భాషా వాఙ్మయం వన్నె చిన్నెలు ఆవిడే చాటాలి. మరీ ఓ లెక్చరరు దగ్గిర అవి ఆశించడం అనూహ్యం. కనీసం యీ యేడాదయినా దీదీ కంటిన్యూ చెయ్యకపోతే మేం స్ట్రయికు చేస్తాం" అని కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుద్వారా ప్రిన్సుపాలుకు కబురు వెళ్ళింది. "ఆవిణ్ణి కాపురానికి వెళ్ళనియ్యకుండా మీ గోల ఏమిటర్రా? మీరు స్ట్రైక్

చేస్తే రేపొద్దున్న ఆవిడ మొగుడొచ్చి ఆకలి దప్పులు మాని కాలేజీ గేటు దగ్గర సత్యాగ్రహం ప్రారంభించగలడు" అన్నాడాయన నవ్వుతూ. కుర్రాళ్ళను సమాధానపరచి పంపే సరికి అతని తల ప్రాణం తోకకి వచ్చింది.

ఇక 'సెండాఫ్'నాడు ఎంత హడావుడి జరిగిందో చెప్పలేం. పిల్లలందరూ ప్రెజంట్లతో ఆమెను ఉక్కిరి బిక్కిరి చేశారు. ఆ సాయంకాలం ఆవిడ వెళ్ళిపోతుందని తెలిసి సాయంకాలం అవుతున్నది కొద్దీ పిల్లల మొహాలమీద మరింత స్పష్టంగా విచార రేఖలు కనుపింపజొచ్చాయి. ఒకరిద్దరు ఉండబట్టలేక ఏడ్చేశారు కూడాను.

"మనవాళ్ళ పెళ్ళిళ్ళలో అప్పగింతలంటూ ఒక తంతు పెడతారు. దాన్లో ఉన్న స్పిరిట్ ఏమిటో ఇవాళ తెలుస్తోంది" అన్నాడు భాస్కరమూర్తి. ఫేర్ వెల్ పార్టీ, ఫోటో, టీ పార్టీ అన్నీ అయిపోయాక మనోరమ భర్తను తీసుకు వచ్చి వెంకటేశ్వరావుతో అంది.

"మా పెళ్ళికి మీరొక్కరే రాలేదు. నేనెంత డిసప్పాయింట్ అయానో తెలుసా? వీరేనండీ నేను చెపుతూ వచ్చానే ఎకనమిక్స్ లెక్చరరు. ఈ కొద్ది నెలల్లోనే పిల్లల దగ్గిర చాలా బాగా చెబుతారని పేరు గడించారు. రోజూ మా కో ట్రావెలరు. ఎటొచ్చీ కొంచెం మితభాషిగాని మనిషి చాలా మంచివారు. కదుటండీ, రావుజీ, మిమ్మల్నే"

రావుకి ముచ్చెమటలు పోశాయి. లోలోపల గొణుక్కున్నాడు.

"ఉద్ధరించావుగాని వెళ్ళు కావాలంటే వందమంది ఎక్స్ట్రాల చేత అప్పగింత పాట పాడిస్తాను. ఈ కాలేజీనీ, ఈ పరిసరాల్నీ ఇంతవరకు నువ్వు పావనం చేసింది చాలు. ఇక వెళ్ళు చిట్టితల్లీ"

మర్నాడు వెంకటేశ్వరావు చాలా హుషారుగా వున్నాడు. ఆవాళ బస్సులో ఎప్పట్లా మనోరమ లేదు. "ఇప్పటికి భగవంతుడి దయవల్ల ఈ శని వదిలింది. నిజంగా యింత త్వరలో యీ పీడ పోతుందనుకోలేదు. ఎప్పుడో ఋషులు రాసి పెట్టేశారు. ఆడది తిరిగీ, మగాడు తిరక్కా చెడకూడదన్నారు. అబల అన్నారు, చపల అన్నారు. అనుక్షణం ఒకరి రక్షణలో ఉండాలన్నారు. ఇలాగే గద్దెనెక్కమన్నారా, బల్లగుద్ది చెప్పమన్నారా? ప్రతీ ఆడదానికి ఎంత రాసిపెట్టి ఉండాలో మనోరమకీ అంతే జరగాలి, అంతే జరిగింది కూడాను" రావుకి తన ఆనందం ఎవరితోనైనా పంచుకోవాలనిపించింది. భాస్కరమూర్తి మొహం ఎత్తి చూశాడు. అన్నీ కోల్పోయినట్టుంది అది.

"ఇన్నాళ్ళూ ఈ బస్సులో నేనే ప్రయాణం చేశానా అనిపిస్తోంది. ఒక్క రోజుకే ఇంత బోరింగుగా ఉంటే యింక ముందు ముందెలాగో"

మోహన్ కూడా ఆ పక్క సీట్లోనే ఉన్నాడు. ఆఖరికి అతను కూడా అన్నాడు.

"మనో దీదీ ఉండేది కాబట్టి మనకేం తెలిసేది కాదు. ఇక ఈ ఇంజను హోరూ, ఈ బ్రేకుల చప్పుడూ కండక్టరు కేకలూ యివి తప్ప మనకి మరొకటి వినపడవు. ఈ దిన దిన గండం ఇక మనవల్ల కాదు. కాలేజీ దరిదాపుల్లోనే ఒక రూం చూడండి భాస్కరమూర్తి గారూ, అక్కడే మనం పడి ఉందాం."

రావు ఖాళీగా ఉన వెనక సీట్లోకి వెళ్ళిపోయాడు. అక్కడే కూచుని దీర్ఘంగా ఆలోచించాడు. తర్వాత వారం పదిరోజులు చాలా చోట్ల కూర్చుని దీర్ఘంగా ఆలోచించాడు. మనోరమ నిజంగా వెళ్ళిపోయింది. అక్కడే ఉంటే మనోరమ ఒక్క చోటే ఉండేది. ఆమె వెళ్ళిపోయాక ఎక్కడ చూసినా మనోరమే.

ఆవాళ క్లాసులో కూచున్నా పాఠం చెప్పక వెంకటేశ్వర్రావు స్టూడెంట్సుకి ఏదో వర్కిచ్చి ఎప్పట్లా దీర్ఘంగా ఆలోచిస్తూ కూచున్నాడు. లెక్చరర్ హాలు గేటు దగ్గిర బంట్రోతు ఉన్నాడు. వాడి మొహం చూస్తే ఏమంటున్నట్టు ఉంది? "కష్టం సుఖం తెలిసిన తల్లి వెడుతూ వెడుతూ పదిరూపాయల నోటు చేతిలో పెట్టింది. వెయ్యేళ్ళు వర్ధిల్లాలి" కిటికీలోంచి దూరంగా చూస్తే ప్రిన్సుపాలు కనిపించాడు. అవాళ స్టాఫ్ కామన్ రూంలో ఏమన్నాడు?

"నా సర్వీసులో ఎందరో లెక్చరర్సుని చూశాను. ఇంత బాధ్యతాయుతంగా పని చేసిన వ్యక్తిని ఎక్కడా చూళ్ళేదు. ఇంత కొద్దికాలంలోనే ఈ కాలేజీలో ప్రతి అంగుళానికి ఆత్మీయురాలైపోయింది. ఆమెను ఒక క్షణం మరచినా మనం మనుషులమే కాము"

దూరంగా హెడ్ క్లర్కు ఎక్కడికో హడావిడిగా వెడుతూండడం కనిపించింది. వాణ్ణి చూస్తూంటే మొదట్నుంచీ మంట. లేకపోతే అవాళ కుర్రాళ్ళ దగ్గిర ఆవిణ్ణి వెనకేసుకొస్తూ ఏమిటి కూశాడు?

"మీరింకా యింకా ఆవిణ్ణి యిక్కడ వుండిపొమ్మని బలవంత పెట్టడం బాగులేదబ్బాయిలూ. ఇంతగా అభిమానించిన యిందరు పిల్లల్ని ఒక్కసారి వదిలిపెట్టి వెళ్ళయిందా? దానికి ఆ తల్లి ఎంత కుమిలి పోతోందో మీకేం తెలుసు? కానీ అంతా అలా వచ్చింది. ఈవిడ అత్తగారికి కీళ్ళ వాతంతో ఒక్కసారి రెండు కాళ్ళూ పడిపోయాయి. కళ్ళు కూడా సరిగా కనబడవు. నిత్యం ఎవరో మనిషి ఆసరా కావాలిట. ఏం చెయ్యమంటారు చెప్పండి. ఆవిడకి ఏది ముఖ్యం?"

"అస్తమానూ నవ్వేదానికీ, తేలికయిన విలువగలదానికీ ముఖ్యమూ, అముఖ్యమూ అంటూ ఏముంటాయి? అంతా నాటకం" అనుకున్నాడు రావు. దానికి వచ్చింది ఒకటే ఒకటి మోసం మాయ. లేకపోతే ఇంతమందిని ఒక్కసారి సమ్మోహితుల్ని చెయ్యగలదా? వెంకటేశ్వర్రావు విద్యార్థులందర్నీ ఒక్కసారి తేరిపార చూశాడు. ఆ వెనక బెంచీవాళ్ళు తన గురించి చెప్పుకుని నవ్వినట్లయింది. మనోరమ ప్రవర్తన మంచిదికాదని తాను చూచాయిగా ఆ మధ్య అనబోతే కొట్టినంత పని చేసిన రౌడీ వెధవలు వాళ్ళేకదూ. పట్నానికి వెళ్ళి స్టేషను దాకా ఆ దంపతుల్ని దిగబెట్టి వచ్చిన దౌర్భాగ్యులేకదూ యీ ముందు బెంచీ వాళ్ళూ.

లాభం లేదు, మనోరమ కలుషితం చేసి పారేసిన ఆ సంస్థలో తనకిక స్థానం లేదు. ఈ కరువు, కాటకాలు ఎందుచేత ఏర్పడుతున్నాయో దీన్ని ఎందుకు కలికాలమంటారో రావుకి ఒక్కసారిగా అర్థమయింది. లెక్చరు క్లాసులోంచి ప్రిన్స్‌పాలు రూంలోకి ఒక అంగలో వెళ్ళి రిజిగ్నేషను దాఖలు చేశాడు. ఏవో లేనిపోని కారణాలు జతచేసి, ప్రిన్సుపాలు అన్నాడు.

"లాభంలేదు. మిమ్మల్నిలా మధ్యలో రిలీవ్ చెయ్యలేము"

"మనోరమగార్ని ఎలా రిలీవ్ చేశారు?"

"అది అడగడానికి మీకధికారం లేదు. కావాలంటే పైకి రాసుకోండి. ఒక మంత్ నోటీసయినా లేకుండా మిమ్మల్ని వదల్లేము"

రావుకి పట్టుదల పెరిగింది. ఒక నెలజీతం కట్టి అప్పటికప్పుడు రిలీవు చేయించుకున్నాడు. 'ముందూ వెనకా చూసుకోకుండా సత్సాంప్రదాయాల్లేని యిలాంటి సంస్థల్లో దూరినందుకు యిదే ప్రాయశ్చిత్తం. కానియ్యి. పతివ్రత అయిన భార్యా, ధనికుడైన మామగారూ నాకున్నారు. ఈ ముష్టి జీతం ఒకటేనా నాకు ముఖ్యం, మనశ్శాంతిగాని."


వెంకటేశ్వర్రావు యింటికి చేరేసరికి రంగ రైల్లో ఉంది. ఆమె బదులుగా గూట్లో చీటీ ఉంది.

"బొత్తిగా పలకరిస్తే కసిరికొట్టే మీ వ్యవహారం ఈ వారం రోజుల్నుంచి చూస్తుంటే నేనూ ఓ మనిషిననిపించుకోడం ఎలాగో ఇవాళకి తెలిసింది. నాన్న ఆస్తి రెండు మేడలూ అమ్మేసి నా పేర వేసేసి కాశీ వెళ్ళిపోయాట్ట. ఇవాళేకాయితాలూ, ఉత్తరమూ వచ్చింది. రక్షించ్చు. నేనూ, నా నగలూ, ఆ ఆస్తీ క్షేమం. ఇంక నా ఏడుపు నాదే అనుకుంటే నాకు మరింత క్షేమం. నాతో మీ సంబంధం తెగిపోయందని యిందు మూలంగా తెలీయ్జేస్తున్నాను గనక మీరు మరో పెళ్ళి చేసుకోవచ్చు. ఇంట్లో కనిపెట్టుకుని వుంటుంది కనక మోకాళ్ళవరకు తెగిన వనితనెవతెనైన పెండ్లాడిన బాగుండునని నా సలహా."

# ఇల్లు అమ్మకం

## -పాలగుమ్మి పద్మరాజు

## ( 1961 యువ దీపావళి ప్రత్యేక సంచిక నుండి)




**ఏడేళ్ళు అప్పుడు** నాకు. ఈ ఇంట్లో నేను కుడికాలు పెట్టినప్పుడు. 'బొమ్మల పెళ్ళిలాగుందే' అన్నాడు మామయ్య మా అమ్మతో. 'అదేరా ముచ్చట' అంది మా అమ్మ. ఆయనకి పన్నెండు – డెబ్బయి రెండేళ్ళయింది ఈ ఇంట్లో అడుగుపెట్టి.

అలమారు తలుపు పుచ్చిపోయిందన్నాడు రామన్న. చేయించాలి మళ్ళీ. ఏమిటో పుచ్చిపోయినా పాతవే బాగుంటాయి. అలవాటైపోయాయి

పాతవి.

పుచ్చిన తలుపుని చేత్తో తడిమింది అమ్మ ఆప్యాయంగా. కళ్ళు బొత్తిగా కనిపించడంలేదీ మధ్య. ఏదో నీడలాగా తెలుస్తుందంతే. ఆపరేషన్ చేయించాలన్నాడు రామన్న. కళ్ళకి ఆపరేషను. నూటయాభయి రూపాయల గుమాస్తాగిరీ, చెరువంత ఇల్లూ, పదిమందిగల సంసారం. పుచ్చిన అలమారు తలుపు మళ్ళీ వేయించడానికి డబ్బులేదు. ఆపరేషనుకి ఎక్కణ్ణించి తెస్తాడు రామన్న? అమ్మే వద్దంది ఆపరేషను. అమ్మ ఇల్లు వదలి బయటికి వెళ్ళదు. 'ఇంక చూపెందుకు నాకు? ఇంట్లో అన్ని మూలలూ అలవాటయినవే."

"శకుంతలా"

"ఎవరు బాబూ? ఓహో వెంకటప్పయ్యగారబ్బాయివి కదూ. కూచో లోపలుంది. స్నానం చేస్తోందేమో?

"అమ్మాయి, అమ్మాయి... నీకోసం.." లోపలికి వెళ్ళింది అమ్మ.

శంకరం ఇటూ అటూ పచార్లు చేస్తున్నాడు. హాల్లో శకుంతల కోసం ఎదురు చూస్తూ చీపురు కట్ట పట్టుకొచ్చింది శకుంతల అక్కయ్య సుభద్ర. శంకరం ఒక గుటక మింగాడు. సిగరెట్టు అంటించి గట్టిగా దమ్ము పీల్చి, తమాయించుకున్నాడు.

"ఛండాలం... అప్పుడు తుడిచిన ఇంట్లో అగ్గిపుల్లలు, సిగరెట్టు పీకలు బుద్ధుండాలి. వొచ్చే పీనుగులకి. నలుగురు మసిలే ఇల్లు పాకీదొడ్డిలా చేసి పారేస్తారు."

సుభద్ర కసిగా తుడిచింది సిగరెట్టు రెట్టలూ, అగ్గిపుల్లలూ శంకరం పాంటు మీదికీ, అద్దంలా పాలిష్ చేసిన అతని బూట్లమీదికీ. ఊడ్చిన పక్కకి తిరోగమించాడు శంకరం.

"మళ్ళీ ఊడ్చిన పక్క కరాబు చెయ్యకపోతే. ఈ పక్కనే వెయ్యరాదూ ఆ పాడు రెట్టలు."

శంకరం ఆత్మరక్షణ కోసం సిగరెట్టు అవతల పారేశాడు గుమ్మంలోంచి. ఒక్క క్షణం ఆలోచించి అవతలకి వెళ్ళిపోయాడు.

శకుంతల హాల్లోకి వచ్చింది. మల్లెపువ్వులాంటి చీర కట్టుకుని, పుస్తకాలు చేత్తో పట్టుకుని.

"అదుగో వచ్చాడు మీ దుష్యంతుడు. కార్లో ఎక్కించుకుపోతాడు గావును. కాలేజీకి" చూసింది సుభద్ర.

"అతని కార్లో నేనెప్పుడన్నా ఎక్కానా?"

"ఏమో? నాకేం తెలుసు?

"అతని పేరు దుష్యంతుడు కాదు"

"అది మాత్రం నాకేం తెలుసు? వాడితో నేనెప్పుడన్నా కాలేజీల్లో చదివానా? సినిమాలకి తిరిగానా?"

బొట్టులేని శకుంతల నుదుటిమీద బొట్టులాంటి మడత పడింది. శకుంతల చిరాకుగా వెళ్ళిపోయింది.

"ఏవిటే అక్కయ్యా! అనవసరం గొడవ" అంటూ వచ్చాడు ఇవతలికి రామన్న. ఇరవై అయిదేళ్ళ ముసలి వృద్ధుడు. ప్రపంచ భారమంతా అతని వంగిన నడుం మీదుంది.

"ఏవిట్రా అనవసరం గొడవ? అది బొత్తిగా తెగించేసింది. మన కుటుంబం ఏమిటి మన సంప్రదాయం ఏమిటి? అడ్డమైన వాళ్ళతోటీ ఈ తిరుగుళ్ళేమిటి? అమ్మకి తెలిస్తే ఉరేసుకు చచ్చిపోతుంది" సుభద్ర తుడవడం అతి ఆవేశంగా ముగించింది.

"ఎవరన్నా వింటే నవ్విపోతారే అక్కయ్యా. ఊళ్ళోనూ, కాలేజీలోనూ దానికెంత మంచి పేరుందో తెలుసా? నీలాగా దానికీ ఒక మొగుడూ కాపురం లేదు. పెళ్ళవగానే పోయాడు దాని మొగుడు. ఏదో తన కాళ్ళమీద అది నిలబడుతుందని కాలేజీలో చేర్పిస్తే.."

"మొగుడు చచ్చాడు గనకే దాని పుణ్యం పుచ్చింది. తెల్లటి స్త్రీ చీరలూ, కాలేజీ చదువులూ నా మొహానికి నేను నోచుకో లేదు మరి. చూసి చూసి ఎవడో లక్షాధికారి దాన్ని లేవతీసుకుపోతాడు. తీరిపోతుంది."

"అమ్మా, అమ్మా పెనసలూ రబ్బరూ కొనుక్కోవాలే" అన్నాడు సాంబడు.

"చూడవే అమ్మా ఫ్రాకు చినిగిపోయింది. బడి కెల్నాగే వెళ్ళడం? " అంది సుబ్బి.

"చావండి. వెధవ పిల్లలూ, వెధవ కాపరం. ప్రాణాలు తీస్తున్నారు" సుభద్ర చేతిలో చీపురు పిల్లల వీపుమీద తిరగబడింది. పిల్లలు తారాస్థాయిలో యుగళగానం మొదలు పెట్టారు. సుభద్ర చర్రున వెళ్ళిపోయింది లోపలికి. ఉక్రోషం కన్నీళ్ళుగా అనువాదంకాకముందే. రామన్న నడుం మరికాస్త వంగింది. ఊపిరితిత్తుల్లో గాలంతా ఒక్కసారి బైటికి పోయింది. "రండర్రా. నేను కొనిపెడతాను" అంటూ ఏడుస్తున్న పిల్లల్ని చెరొక చేతా పట్టుకుని నడిపించుకుపోయాడు రామన్న.

అలమార్లో దేవుడిగది, అలమార్లో వ్యాసపీఠాన్ని తీసింది అమ్మ. చెంగుతో తుడిచింది. మళ్ళీ అలమార్లో పెట్టింది. దాని పక్కనే ఉంది ఆయన కళ్ళజోడు. అదీ తీసి తుడిచింది అమ్మ చెంగుతో. ఒక్కసారి పెట్టుకుని తీసేసింది. కళ్ళజోడుకి ఒక పక్క కాడ విరిగిపోయింది. ఆయన పడిపోయినప్పుడు. వ్యాసపీఠం మీద భాగవతం పెట్టుకుని చదువుతుండేవారాయన. పక్కని కూచుని వింటుండేవారు అమ్మా, పిల్లలూ. ఎంత బాగుండేది ఆయన గొంతు. ఇప్పటికీ మోగుతూనే ఉంటూంది ఆ గదిలో 'కలలోనన్నా తను మున్నెరుంగని మహా కష్టాత్ముడైనట్టి దుర్బలు డాపత్సమయంబునన్" అన్న పద్యం కుచేలోపాఖ్యానంలోది చదువుతూ పడిపోయారాయన.

"ఈ ఇల్లు విడిచిపెట్టి బతగ్గలనా?"

ఎడం పక్క మూడో గదిలో నులక మంచం మీద పడుకుని మీసాలు మెలేస్తూ ఆలోచిస్తున్నాడు కనకరాజు.

"అందరి భోజనాలూ అయాయి. మీరు కూడా ఆ పిండాకూడు కానిస్తే, వంటిల్లు అలుక్కుని తగులడాలి" అంది సుభద్ర.

మెల్లిగా లేచాడు కనకరాజు, మీసాలు మెలేస్తూనే "పిండాకూళ్ళూ, తగలెయడాలూ మనిషి చచ్చింతరవాత. నేనింకా బతికే ఉన్నాను."

"మీ తమ్ముళ్ళు చావగొట్టి బ్రహ్మజెముడూ డొంకలో పారేశారు. మీరు చచ్చారనుకుని. ఈసారి వాళ్ళకి దొరికారంటే అంతపనీ చేస్తారు."

"పిచ్చి పీనుగా మహా ఆశపడ్డావు పాపం. నేను చచ్చిపోయాననని"

"పాపీ చిరాయువనీ.."

"బాగా అన్నావు. అబ్బో! ఆంజనేయులూ, మార్కండేయుడులాగా చిరంజీవి కావడానికి ఎన్ని పాపాలు అవసరమో అంత కన్నా ఎక్కువే చేశాను. నువ్వు మొత్తుకు చచ్చినా నేను చావను. విన్నాన్లే శకుంతల మొగుడు చచ్చాడని నీకు మహా కడుపు మంటగా ఉంది. నేను చస్తే దానిలాగా కాలేజీలో చేరతావా? చెప్పవే.. "

"అబ్బ పాడుమాటలు శుభం పలకరా మంకెన్నా అంటే.."

ఫెడీలు మంది సుభద్ర దవడ.

"నోరు మూసుకుని అన్నం వడ్డించు. నోరు సంబాళించుకోకపోతే నడుం విరుగుతుంది."

"నా కర్మ. వందెకరాల ఆస్తి, చెరువంత ఇల్లు. అన్నీ పోయి వీళ్ళ నెత్తిన పడ్డాం. అదేవిటంటే తన్నులూ, గుద్దులూ"

"కుళాయి కట్టెయ్యి, కట్టెయ్యి."

"అబ్బో! ఈ ప్రయోజకత్వం, ఆస్తి నిలబెట్టుకోడానికి మాత్రం పనికి రాలేదు. ఆ సరసవసానిముండ యదాన్ని"

కనకరాజు నవ్వాడు వెటకారంగా.

"మొగుణ్ణి నిలబెట్టుకునే ప్రయోజకత్వం ఆడదానికుండాలే. అది లేకపోతే మొగుడూ, ఆస్తీ మరొకరికి దాఖలు పడిపోతాయి. అలా నిలబడ్డావేం? అన్నం పెట్టమంటే.."

కనకరాజు గొంతులో హెచ్చరిక గుర్తు పట్టింది సుభద్ర. చర్రుని వెళ్ళింది. కనకరాజు నవ్వాడు తృప్తిగా.

"వడ్డించి పిలు" అన్నాడు నులక మంచం మీద నడుం వాలుస్తూ.

వెంకన్న ఎక్కడున్నాడో. ఎలా ఉన్నాడో. నన్నొదిలిపెట్టి వారం రోజులుండలేదు. ఏణ్ణర్ధం అయింది కలకత్తానుంచి గావును ఉత్తరం రాశాడన్నాడు రామన్న. పిచ్చివాడు. గుడ్డలన్నీ ఇక్కడే ఒదిలేసి పోయాడు. చంద్రారెడ్డితో కలిసి లక్షణంగా కలపవ్యాపారం చేసుకుంటున్నావు. అంత అర్ధంతరంగా ఎందుకు వెళ్ళిపోయాడో వొదిలేసి. ఢిల్లీ కలకత్తాల్లో ఎంత సంపాదించి ఏం లాభం? ఈ వేళ రావాలి ఉత్తరం. పెద్ద వ్యాపారమని రాశాట్ట. మరి డబ్బంతా ఏం చేస్తున్నాడు?

కొంతగాకపోతే కొంతన్నా ఇంటికి పంపడేం? కలప వ్యాపారంలో బాగానే మిగిలేది. రామన్నకి అంత కష్టముండేదికాదప్పుడు. రామన్న పాపం ఈ సంసారం లాగలేక నలిగిపోతున్నాడు. పెద్దమ్మాయి కాపరం ఇలా అర్ధాంతరం అయిపోయింది. శకుంతలన్నా బి.ఏ అవగానే నాలుగురాళ్ళు తెస్తే దాని బతుకది బతికితే రామన్నకి పెళ్ళి చెయ్యాలి. బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా...

అమ్మ వెంకన్న పెట్టి తీసి బట్టలు దులిపింది.

"అమ్మాయి వెంకన్న బట్టలు ఎండలో వెయ్యవే?"

ఈ ఇల్లు అలవాటైపోయింది. డెబ్బై రెండేళ్ళయింది. ఈ ఇంట్లో నేను కుడికాలు పెట్టి. దక్షిణం వేపు పెణకవారిందన్నాడు రామన్న. రెండు దూలాలు కొత్తవి వేయించి ఎత్తించాలి. నూటయాభై ఏళ్ళయిదట ఇల్లు కట్టి. ఎన్నాళ్ళుంటాయి ఇళ్ళు. ఇంకా పాతకాలపు ఇల్లు గనక.

"తమ్ముడూ ఇల్లారా నీ పేరేమిటి?"

"సాంబమూర్తి" అన్నాడు సాంబడు.

"శంకర్ వొచ్చాడని మీ పిన్నితో చెపుతావూ"

"బాబో మా అమ్మ చంపేస్తుంది" అంది సీతి.

"అమ్మకి తెలీకుండా చెప్పు. ఇదుగో చెరో పదిపైసలు."

"వొద్దు బాబూ అమ్మకి తెలిసిందంటే" అన్నాడు సాంబడు.

"అమ్మకెందుకు తెలుస్తుంది మనం చెప్పకపోతే. ఉంచండి, ఫరవాలేదు."

శంకరం చెరో పదిపైసలూ వాళ్ళ జేబుల్లో వేశాడు. పిల్లలకి పది పైసల మీద ఆశ ఒక పక్కకీ, అమ్మంటే భయం రెండో పక్కకీ లాగుతుంటే, అల్లాగే నిలబడిపోయారు. ఎటు వెళ్ళాలో తేల్చుకోలేక.

"మీరంతా ఎన్నాళ్ళుంటారిక్కడ?"

"ఇక్కడే ఉంటాం" అంది సీతి.

"మీ ఊరెళ్ళరూ?"

"మా ఊరెడితే మా నాన్నని చంపేస్తారు" అన్నాడు సాంబడు.

"ఎందుకు?" అన్నాడు శంకరం ఆశగా.

"మా చిన్నాన్నల ఆస్తంతా కాజేసి, సరవ చటుక్కుని సాంబడి నోరు మూసింది సీతి.

"ఆస్తంతా పాడు చేశాడని మా చిన్నాన్నలకి కోపం."

"సీతీ, సాంబిగా ఎక్కడ తగలడ్డారర్రా. తిండక్కర్లే?"

సీతీ సాంబడూ లోపలికీ, శంకరం అరుగు మీదికి పరుగెత్తారు.

శంకరం అరుగుమీద తడిక గదిలో కూర్చుని ఒక ప్రేమలేఖకి శ్రీకారం చుట్టాడు. తరవాత ఎల్లా దాన్ని సాగించాలో తోచక పెన్ను పెదవులమీద ఆనించి ఆలోచనలో పడ్డాడు.

"రామన్నగారూ ఏవండో రామన్నగారూ"

"వాడిప్పుడు లేవడండీ. ఒళ్ళు నెప్పులుగా ఉందని పడుకున్నాడు" అంది సుభద్ర లోపల గుమ్మంలో నిలబడి.

"చాలా జరూరు పనుందని చెప్పండి."

"అంత జరూరు పనైతే రేపు ఆఫీసుకెళ్ళి చూడండి. ఆదివారంపూట ఇంటికొచ్చి చంపితే ఎల్లాగ? పైగా చెయ్యి తడిచేయించుకునే గుమాస్తాలయితే ఆదివారంపూట జరూరు పన్లు ఇంటిదగ్గర చూస్తారు. ఆ తెలివితేటలూ లేవు మా వెర్రి పీనుక్కి."

"అయ్యా! మీరేమన్నా చెయ్యి తడిచేసే ఉద్దేశంతో వొస్తే ఆవిడ లేపుతుంది" అన్నాడు వెటకారంగా వెనకొచ్చి నిలబడ్డ కనకరాజు. అని హాల్లోకొచ్చి కూచున్నాడు.

"కూచోండి" అన్నాడు వచ్చిన ఆసామిని మర్యాద చేస్తూ. మా బావమరిది వెర్రి పీనుగైతే, మనం కాస్త ఈ పెద్ద మనిషికి సాయం చేసి ఆ లాభం మనవే ఎందుకు పొందకూడదు? అన్న ఆప్యాయత ఉంది ఆ మర్యాదలో.

"చంద్రారెడ్డిగారా?" అన్నాడు హాల్లోకి వస్తూ రామన్న.

"చంద్రారెడ్డి" అంది సుభద్ర.

"ఓహో" అన్నాడు విషయం అర్థమై కనకరాజు. శకుంతల హాల్లోకొచ్చి తలుపు మూసింది.

"అక్కయ్యా అమ్మదగ్గరుండవే ఆవిడకి తెలిస్తే.."

"అమ్మ ఎక్కడ లేస్తుందిప్పుడు? భోంచేసి హాయిగా నిద్రపోయింది" అంది లోపలికి వెళ్ళడానికి ఇష్టంలేని సుభద్ర.

అరుగు మీద తడికల గదిలో ప్రేమలేఖకు పదాలు దొరక్క తెలుగు భాషా దారిద్ర్యాన్ని నిందించుకుంటున్న శంకరానికి ధ్యానభంగమయింది.

మూసిన కిటికీలో చిల్లుకోసం వెతికింది అతని కన్ను చిల్లు అవతలి శకుంతలకోసం.

"యెంకటేశ్వర్లు ఊళ్ళో కొచ్చాడంటండీ" అన్నాడు చంద్రారెడ్డి.

రామన్న అక్కయ్యవంకా, చెల్లెలు వంకా చూశాడు. సుభద్రా శకుంతలా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కనకరాజుకి ఈ వ్యవహారం అంత లాభపాటిది కాదని తేలిపోయింది. మీసాలు మెలేసుకుంటూ తన నులకమంచం

దగ్గరకు వెళ్ళిపోయాడు. సుభద్ర బ్రతుకు జీవుడా అని లోపలే అనుకుని తలుపు గొళ్ళెం పెట్టేసింది. హాల్లో కెవరూ లోపల్నించి రాకండా.

"తెలిసిందండీ" అన్నాడు రామన్న.

"చీటీ రాసి పంపాడు" అంది శకుంతల.

"రామన్నగారూ మీ యెంకటేశ్వర్లుకి పేణమిచ్చానండీ. తమ్ముడికన్నా ఎక్కువగా సూసుకున్నాను. కలప అడితికి పెట్టుబడంతా నేనెట్టి లాభాల్లో సగం వాటా ఇచ్చాను."

"ఆ డబ్బు వాడు తినలేదన్న సంగతి మీకూ తెలుసు చంద్రారెడ్డిగారూ" అన్నాడు రామన్న.

"అదేం మాటండీ? నే తిన్నానంటారా ఆ నాలుగువేలూ? పోనీ డబ్బు వాడేసుకున్నాడు. నేనింత నమ్మి యాపారమంతా అతని మీద పెట్టినందుకు నాతో ఉన్నదున్నట్టు సెప్పొచ్చు గదాండీ"

"మిమ్మల్ని మోసగించాలని వాడి ఉద్దేశమేలేదు. ఎవరో స్నేహితుడికి ప్రాణావసరమొస్తే సర్దాడు. మళ్ళీ పూడ్చలేకపోయాడు."

"ఆ సంగతి నాతో సెప్పొచ్చుగదాండీ ఎందుకు పారిపోవాలా అని."

సుభద్ర అందుకుంది. "రెడ్డిగారూ వాణ్ణిప్పుడూ అరస్టు చేయిస్తే మీకొచ్చే లాభమేమిటి?"

"అయితే నా డబ్బు నాకు పారెయ్యవమ్మా."

"ఎల్లా ఇవ్వగలమండీ, మా పరిస్థితులు మీకు పూర్తిగా తెలుసు" అన్నాడు రామన్న.

"అదేంటండీ మీకివ్వాలనుంటే ఇల్లమ్మేసి పారేత్తారు."

"ఇల్లా" అన్నాడు రామన్న.

"అమ్మడమే" అంది సుభద్ర.

శకుంతల అంది "మా అమ్మ బతికుండగా ఇల్లు అమ్మలేవండీ. ఆవిడకి జ్ఞానం వొచ్చినప్పటినించీ ఈ ఇంట్లోనే ఉంది. ఈ ఇల్లు అమ్మేస్తే.. మా అమ్మ బతకలేదండి"

చిల్లుగుండా చూస్తున్న శంకరం గొంతులో ఏదో అడ్డుపడింది. శకుంతల కంటితడి చూడ్డంతోటే.

"అమ్మా యెంకటేశ్వర్లు సేసిన తప్పుకి సిచ్చ మీకెందుకు పడాలమ్మా మీరేదో ఇత్తారని వొచ్చానంటారా? ఆడిమీద పీకదాకా ఉంది కసి నాకు. నా కసి తీరాలంటే మీరు పెద్ద మనుషులు కదా సెపుదావని వొచ్చాను"

చంద్రారెడ్డి లేవబోయాడు రామన్న అతని చేతులు పట్టుకున్నాడు.

"ఒక రెండు రోజులు గడువిప్పించండి"

"రెండు రోజుల్లో మట్టుకు మీ రెక్కణ్ణించి తెత్తారండీ సొమ్ము?"

"మా మీద దయుంచి ఆ మాత్రం సహాయం చేయించండి."

"సరే కానీండి"

చంద్రారెడ్డి వెళ్ళిపోయాడు. కనకరాజు వీధిగుమ్మంలోంచి వచ్చాడు లోనికి. ఇంక అక్కడుండడం క్షేమం కాదని శంకరం వెళ్ళిపోయాడు.

"వెర్రిపీనుగా తలుపు గడియేస్తే, రాదలచుకున్నవారికి అడ్డుటే? దొడ్డి తలుపు తీసుకుని వీధిలోంచి తిరిగొచ్చా."

సుభద్ర గొళ్ళెం తీసి లోపలికి వెళ్ళిపోయింది. భర్త దగ్గరనుంచి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని.

"ఏం బావా" అన్నాడు కనకరాజు చంద్రారెడ్డి లేచిన కుర్చీలో కూచుంటూ. రామన్న సమాధానం చెప్పలేదు.

"చంద్రారెడ్డిగారన్నది నిజమే. రెండురోజుల్లో నాలుగువేలు ఎక్కణ్ణించి తెస్తాం?"

"ఏమే" అంటూ వొచ్చింది సుబద్ర లోపలికి.

"ఓసి పిచ్చి పీనుగా తలుపు వెనకాల నుంచుని వింటే ముక్కో మూతో ఎగిరిపోతుందే. నాలాగా ధాటిగా తలుపు తీసేవాడుంటే" అన్నాడు కనకరాజు. సుభద్ర ఆ విషయం తనకి చెప్పినట్టు కాదనుకుని, కొంచెం ఆప్యాయం, కాస్త ఆశా, పిసరంత గుళ్ళూ మిళాయించి, చెల్లెలి భుజం మీద చెయ్యేసి అంది. "ఏమే పోనీ వాడెవడో నీ స్నేహితుడున్నాడుగా అప్పేమన్నా ఇస్తాడేమో?"

"ఇచ్చినా నేనడగను."

అప్పుచ్చుకుంటే తీర్చడ మెల్లాగే?" అన్నాడు రామన్న.

"అతనిస్తే అంత అప్పుకింద యిస్తాడా ఏవిట్లే" అంది సుభద్ర. ఆ పిసరంత కుళ్ళూ కుంకుడు కాయంత పెంచి.

"అంటే?" అంది శకుంతల. అక్కగారి కళ్ళలోకి సూటిగా చూసి. సుభద్ర కళ్ళల్లోకి చర్రున పాకింది విషం.

"ఏమో అతని మనస్సులో ఏ అభిప్రాయాలుంటాయో డబ్బిచ్చేతప్పుడు, నాకేం తెలుసు? నిన్ను పెళ్ళాడాలనో"

"హ-హ-హ.." కనకరాజు నవ్వు నెంబుకున్న టపాకాయిలా అకస్మాత్తుగా పగిలింది. సుభద్ర విషం కక్కేసింది గనక నీరసపడి లోపలికి వెళ్ళిపోయింది. శకుంతల కళ్ళలో కోపమూ దిగిపోయింది ఆ నవ్వుతో.

"నువ్వు తీరాజేసి అంత లక్షాధికారినీ పెళ్ళాడేస్తావేమోనని దాని ఏడుపు" అని తన నవ్వుని వ్యాఖ్యానించాడు కనకరాజు.

"విధవకి పెళ్ళేవిటి బావా మన కుటూంబాల్లో ఎక్కడన్నా అనుకోడవన్నా విన్నావా?" అన్నాడు రామన్న.

"ఒరేయ్ నువ్వింకా ఇక్ష్వాకులకాలంలోనే ఉన్నావురా బావమరిదీ విధవలు కాలేజీల కెళ్ళి బి.ఏ.లూ, ఎమ్. ఏలూ చదువుకోడం మాత్రం మన కుటుంబాల్లో ఎక్కడుందిరా? కాలం మారిపోయింది. నన్నడిగితే ఏం తప్పులేదు. హాయిగా బతుకుతుంది అదైనా చేసెయ్యి నా మాట విని."

"ఏవిటేవిటీ? విధవలకి పెళ్ళా? మనింట్లోనా?" అంటూ వొచ్చింది మళ్ళీ సుభద్ర.

"తలుపు వెనకాలొద్దే అని చెప్పా. నీకు బుద్ధిలేదు."

"ఈ పెళ్ళే గనక జరిగితే అమ్మ ఉరోసుకు చచ్చిపోతుంది" వచ్చినంత వేగంగానూ లోపలికి వెళ్ళిపోయింది సుభద్ర

"దిగుతా దిగుతా అన్న నాసయితేగాని, దిగిన నాసయితి లేదన్నారు. అయినా ఎప్పుడో చచ్చిపోవలసిన ముసలి పీనుగుల కోసం పడుచువాళ్ళు బతుకులు పాడుచేసుకోడం ఏమిటి?"

కనకరాజు మీసం మెలేస్తూ లోపలికి వెళ్ళాడు. ఇంక అడపాతడపా సుభద్ర ఇవతలికి రాకుండా.

"అన్నీ ఇలాంటి అపస్వయం మాటలే అపసవ్యం మనిషి" అనేసి, వంగిన నడుం మరికాస్త వంచి, వీధిలోకి వెళ్ళిపోయాడు రామన్న. శకుంతల మనసులో ఆశా నిరాశా అన్నీ ఖాళీ అయిపోయాయి. నిలబడలేక కుర్చీలో చతికిలబడింది. రెండుగోడలూ, నేలా కలిశాయి ఆ మూల. చూడకుండా చూస్తోంది శకుంతల. చటుక్కుని కాలిన అగ్గిపుల్ల స్పష్టంగా కనిపించి అలుక్కుపోయింది ఆ మూల. శకుంతల లేచి ఆ పుల్ల తీసింది. 'చూసిందంటే అక్కయ్య తిడుతుంది. శంకరంతోపాటు తనని కూడా' ఆ అగ్గిపుల్ల శంకరం పారెయ్యకపోయినా సరే, అగ్గిపుల్లంత వంక దొరకాలంతే, శంకరాన్నీ తననీ తిట్టడానికి. అన్యాయంగా తిడుతుంది. ఎప్పుడో ఒకటి రెండుసార్లు అతని కార్లో ఎక్కిన మాట నిజమే. ఒకటి రెండుసార్లు సినిమాలకీ వెళ్ళింది. అంతమాత్రం చేత రంకు కట్టెయ్యడవే. పైకనడుగాని తనకీ శంకరానికీ ఏదో సంబంధముందని అక్కయ్య అనుమానం. ఇంటికి రావొద్దనీ, తనతో మాట్లాడొద్దనీ ఎంత గట్టిగానో చెప్పింది శంకరంతో. అతడు వినకపోతే తనేం చేస్తుంది?

చదువుకోడానికి చేర్పించాడన్నయ్య కాలేజీలో. చదువుకోడానికే చేరాను. నా కాళ్ళమీద నేను నిలబడగలగాలి. పదిరాళ్ళు సంపాదించి, అన్నయ్యకి సహాయపడాలి. అక్కయ్యది అర్ధాంతరం కాపరమైపోయింది. వెంకన్నకి జైలు తప్పదు దొరికాడంటే. చంద్రారెడ్డి మహా కక్షగా ఉన్నాడు. అమ్మ...అమ్మా, ఈ ఇళ్ళూ పదికాలాలపాటు బతకాలి అమ్మ. మేమంతా చచ్చినా సరే అని అరిచింది ఆమె మనస్సు లోపలి గుహల్లోంచి ఏదో ఆర్తనాదం – అపచారం. అమ్మకి అపచారం చేశాను. ఇవన్నీ తెంచుకుపోయి ఈ బంధాలన్నీ శంకరం కౌగిలిలో వాలిపోతే ఎవరేవనుకుంటే నాకేం? ఎవరేవైపోతే నాకేం? అక్కయ్య అనుమానం నిజమేనా? నా మనసులో నిజంగా ఈ కోరికుందా? ఇంత నీచవైన కోరిక ఎంత గొప్పగా. ఎంత హుందాగా బతికింది అమ్మ. అమ్మ మనసు నొప్పించడం కన్నా చచ్చిపోడం మేలు. శంకరం కులాసా మనిషి. అతని కులాసా అంటువ్యాధిలా పట్టుకుంటుంది. ఇరుగు పొరుగు అందర్నీ కులాసాని హత్య చెయ్యాలి. నాకు కులాసాగా ఉండడానికి హక్కు లేదు. అమ్మ, నా వైధవ్యం. అన్నయ్య, అక్కయ్య అన్నిటికన్నా అమ్మా, ఈ ఇళ్ళూ, నా బాధ్యతలు. నా సుఖం కోసం నేనాశపడడం పాపం. మహాపాపం.

‘"ఎవరు మీరు?" మూరెడుగడ్డం. పీలికలైపోయిన దుస్తులు సినిమాల్లో... ఏ సినిమాలోనో చూసింది. అయిదేళ్ళ పిల్లతో హార్మోనియం వాయించుకుంటూ బిచ్చం అడుక్కుంటున్న బిచ్చగాడు. తెరమీద నించి దిగొచ్చాడు. ఎందుకంటే నిజం బిచ్చగాడు వచ్చి కుర్చీలో చతికిల పడడు.

"ఎవరు మీరు? వెంకన్న"

ముఖం మోకాళ్ళకి మధ్యకి వంచాడు వెంకన్న. ఏడుపు ఎదుపులు వీపుని ఎత్తి కుదేశాయి. శకుంతలకి ఓదార్చాలో, దాచాలో పొమ్మనాలో ఏవీ తోచలేదు. మీద చెయ్యేస్తేనే అపచారంలాగా అనిపించింది.

ఈ ప్రతిష్టంభనను పగలగొట్టాడు రామన్న. వంగిన నడుము మీది భూభారం ముఖం ముడతల్లోకి కొంత సర్దుకుంటూ. "ఇక్కడికెందుకొచ్చావురా? అసలీ ఊరెందుకొచ్చావు? చంద్రారెడ్డికి తెలిసిపోయింది" అంటూ ఆక్రోశించాడు రామన్న.

"తెలిస్తే తెలియనీ, జైల్లో పెట్టిస్తాడు. అంతేగా ఈ వెధవ బతుక్కంటే అదే నయ్యం. ధైర్యంగా ముష్టెత్తుకోడానికి కూడా లేదు. వెధవ బతుకు"

"తమ్ముడూ" అంది సుభద్ర. అరుపూ కాకుండా గుసగుసా కాకుండా.

"అమ్మ ఇవతలి కొస్తుందేమో" అంది శకుంతల. సుభద్ర తలుపు గొళ్ళెం పెట్టింది.

"ఖరగ్‌పూర్‌లో దింపేశారు రైలు టికెట్ లేదని. మరో రైలెక్కా. చికాకోల్ రోడ్డులో దింపేశారు. ముష్టి అడుక్కోడానికి కూడా సాహసం ఉండాలి. పద్దెనిమిది రోజులు నడిచిందే నడక. రైలెక్కడానికి సిగ్గేసింది. రైల్ని చూస్తేనే సిగ్గేసింది. లోకవంతా చూసింది. టికెట్ కలెక్టర్ నన్ను జబ్బట్టుకు దింపేస్తుంటే రెండుసార్లు. ఇంక రైలు స్టేషను వంక తలెత్తి చూడలేదు. పద్దెనిమిది రోజులు నడిచి నడిచి వచ్చాను. కాళ్ళు చూడండి."

"ఏరోయ్ బావా?" అంటూ వీధి గుమ్మంలోంచి వచ్చాడు కనకరాజు. "పిచ్చాడవు కాకపోతే, జైలుకి భయపడి ఊళ్ళోంచి పారిపోతావా? వొచ్చిన చెడ్డపేరెలాగా వచ్చింది. మరో పదివేలు కాజేసి, నా బోటి వాడి చేతుల్లో పెట్టి, ఠింగురంగా అని జైలుకి పోతే హాయిగా ఉండేది"

"నీ సలహా ఎవరూ అడగలేదు బావా" అంది శకుంతల చేతనైనంత కటవుగా.

"మంచి సలహా మనదగ్గరున్నప్పుడు, ఒకరు అడిగితేనేగాని ఇవ్వకూడదనే పట్టింపే ఉండకూడదు. వాళ్ళ అవసరాన్ని బట్టి ఇస్తూండాలి. తీసుకోకపోతే వాళ్ళ ఖర్మ" అన్నాడు కనకరాజు మీసం మెలేస్తూ. సుభద్ర గుర్రుగా చూసింది. కనకరాజు కొంటెగా నవ్వాడు. సుభద్ర బెదిరిపోయి చూపు మార్చుకుంది.

"ఇప్పుడేం చెయ్యడం?" అనేది అందరి మెదళ్ళలోనూ పుట్టిన ఆలోచన.

"ముష్టాదురోయి" అంది సీతి.

"మావయ్యే" అన్నాడు సాంబడు.

"వెంకన్న మావయ్య" అంటూ ఇద్దరూ మంగళగీతం పాడుకుంటూ లోపలికి పోయారు తలుపు తెరుచుకుని. సుభద్ర తలుపు మళ్ళీ వెయ్యబోయింది.

"వెర్రి పీనుగా తలుపేస్తే మరికాస్త అనుమానపడుతుంది ఆవిడ" అన్నాడు కనకరాజు. సుభద్ర ఆ ప్రయత్నం మానుకుంది.

"వెళ్ళిపోతా నాయనా! నీకు పుణ్యముంటుంది" అన్నాడు రామన్న.

"చూస్తే చూడనీ" అన్నాడు వెంకన్న వంచిన తల ఎత్తకుండానే.

"ఆవిడ చూళ్ళేదులే" అన్నాడు కనకరాజు మీసం మెలేస్తూ.

"వొచ్చేసింది" అంది శకుంతల. వెంకన్న తలెత్తి చూశాడు.

"వెంకన్నా" అంది అమ్మ. గుమ్మంలోకొస్తూ. వెనకాల తలో తలుపు చాటునించీ తొంగిచూశారు సీతీ, సాంబడూ, తప్పు చేసిన కుతూహలంతో. రామన్న వెంకన్నకి సౌంజ్ఞలు చేస్తున్నాడు. ఆదుర్దాగా, వెళ్ళిపోరా బాబూ' అంటూ.

"ఎక్కడికి పొమ్మంటావు? ఒక్క పంచీ చొక్కాతో తిరిగిన చోటు తిరక్కుండా గడిపాడు ఆరునెల్లు. ఎక్కడికి పొమ్మంటావు. సంగతి తెలిస్తే అమ్మ గుండె పగిలి పోతుంది. నేనేదో పెద్ద ఉద్యోగం చేస్తున్నాననీ, వందలకి వందలు సంపాయిస్తున్నాననీ నీతో చెప్పారు వీళ్ళంతా. నేను చేసిన ఉద్యోగం ఏవిటో తెలుసా. ఈ ఆరునెల్లూ? ముష్టెత్తుకు తిన్నాను. ముష్టెత్తుకుని?"

రామన్న నడుం ఇంకా వొంగిపోయింది. కనకరాజు మీసం మెలేసి సుభద్రవేపు చూస్తూ చిన్నగా నవ్వాడు. అమ్మ ముఖం చిట్లించి గుడ్డినడక నడుస్తూ వెంకన్న దగ్గరగా వచ్చింది. చేత్తో తడిమింది. పెరిగిన చింపిరిగడ్డం చేతికి తగిలింది.

"ఏమిట్రా ఇదంతా?"

ఎవరూ చెప్పలేదు. కనకరాజు మీసం మెలెయ్యడం మానేసి లేచాడు.

"చంద్రారెడ్డి సొమ్ము వాడేసి, మరీవాడు పారిపోయాడు. చంద్రారెడ్డి కేసెట్టాడు. పోలీసులు వెతుకుతున్నారు మనవాడి కోసం."

ముడతలు పడ్డ అమ్మ ముఖం వంక చూశారు ఆత్రంగా.

"అదుగో నాకు తెలుసు. నీ ముఖం మారిపోయింది. అందుకే నీకు తెలీకుండా దాచారు వీళ్ళంతా. ఇదంతా వింటే నీ గుండె బద్దలైపోతుంది మరి. నన్ను చూస్తే మీకందరికీ అసహ్యం. ఇంతకన్నా జైలే నయం. నన్నంతగా అసహ్యించుకోరు వాళ్ళు."

అమ్మ అతని జబ్బ పట్టుకుని లేవదీసింది.

"లే ముందు. పిచ్చివాగుడు. వెర్రికుంకవి కాకపోతే నా కసహ్యమేవిటో? కన్నబిడ్డకన్నా గౌరవ మర్యాదలెక్కువట్రా నాకు? నాకు తెలీకుండా ఎందుకు దాచార్రా ఇన్నాళ్ళూ?"

"మర్నాడు దొరికితే చంద్రారెడ్డి జైల్లో పెట్టించేవాడు మరి. నీతో చెప్పి మాత్రం ఏం లాభం?" అన్నాడు రామన్న.

"ఎన్నేళ్ళు నెత్తిమీది కొచ్చినా ప్రపంచ జ్ఞానం లేదురా మీకు. మీరంతా ఇల్లా మనసుల్లో కుంపట్లు పెట్టుకుని బాధపడుతుంటే, నా గౌరవం నిలబెడితే నిలుస్తుందా? శకుంతలా వెంకన్నకి నీళ్ళు పెట్టు స్నానం చేస్తాడు. రామన్నా. చంద్రారెడ్డిని తీసుకురా. ఎంత తెలివిమాలిన పిల్లలై పోయార్రా మీరు.'

శకుంతలా, వెంకన్నా లోపలికి వెళ్ళిపోయారు. రామన్న బయటికి వెళ్ళాడు. కనకరాజు సుభద్రని లోపలికి రమ్మని సంజ్ఞ చేసి తన నులకమంచం మీదికి వెళ్ళిపోయాడు.

అమ్మ కుర్చీలో కూచుంది. చత్వారపు కళ్ళు ఎక్కడో చూస్తున్నాయి.

"శకుంతలా"

"ఎవరు బాబూ?"

"శంకరమంటారండి నన్ను."

"వెంకటప్పయ్యగారబ్బాయివి కదూ. కూచో పనిలో ఉంది వొస్తుంది. మీ నాన్న పాపం చిన్నవాడే పోయేసరికి. మంచి జాగర్తయినవాడు. నువ్వు కాస్త దుబారా చేస్తావని విన్నాను."

"ఏదోలెండి. అయినా డబ్బున్నందుకో కాస్త అనుభవించకపోతే ఎల్లాగండి?"

"మా ఆయన అల్లాగే అనేవారు. ఎంతాస్తి పాడుచేశారో. ఈ ఇల్లొకటే మిగిలింది. ఆ రోజులు మహా వైభవంగా వెళ్ళిపోయ్యినాయి. ఏడేళ్ళప్పుడూ అడుగుపెట్టాను ఈ ఇంట్లో. ఈ ఇల్లొదిలేస్తే ఎల్లా బతగ్గలనా అనిపిస్తుంది."

"మీకు అభ్యంతరం లేకపోతే, ఈ ఇల్లు మీరొదిలి పెట్టక్కర్లేకుండా నేనడ్డుపడగలను."

అమ్మ ముఖం చిట్లించి అతనివంక చూసింది. అతను కొంచెం తికమకపడి సర్దుకున్నాడు.

"అంటే నాకు సంగతి తెలిసిందండి. మీ చిన్నబ్బాయి చంద్రారెడ్డీ పోలీసుకేసూ మీరేమి మొగమాట పడక్కర్లేదు. నా దగ్గర డబ్బు మూలుగుతోంది. మీకభ్యంతరం లేకపోతే"

"మా గొడవలతో నీకేం సంబంధం?"

"మీ అమ్మాయీ నేనూ చాలా...స్నేహితులం. మీకవసర మొచ్చినప్పుడు ఆదుకోకపోతే ఇంక స్నేహితుణ్ణైవుండి.."

"మా అమ్మాయి అడిగిందా నిన్ను?"

"లేదండీ అసలు నాతో చెప్పనన్నాలేదు. చాలా అభిమానం గలది. నాకు తెలిసింది. తెలిసిన తరువాత నేను.."

"నాయనా! స్నేహానికి స్నేహమే. వ్యవహారానికి వ్యవహారమే, రెండూ కలిపేస్తే ప్రమాదముంది. ఇంతకీ మమ్మల్ని ఆదుకోడంలో నీ ఉద్దేశమేమిటి?"

"ఏవీ లేదండి. మీ అమ్మాయంటే నాకు.. చాలా.. గౌరవం."

శకుంతల గుమ్మంలో కొచ్చి నిలబడింది. ఆమె ముఖంలో చిరాకూ, సిగ్గూ, దుఃఖం, అసహనం. అన్నింటి వెనకా, ఒక ఆందోళనా చిందులు తొక్కాయి.

గౌరవముంటే మాత్రం ఉద్దేశాలుండకూడదా? మీ కుర్రాళ్ళకి మీ ఉద్దేశాలేమిటో మీకే తెలియవు."

అమ్మ లేచింది.

"మా శకుంతలని పెళ్ళాడాలనుందా నీకు?"

శకుంతలకీ శంకరానికీ నోరు తడారిపోయింది. శంకరం రెండు గుటకలు వేశాడు.

"మీకిష్టముండదని నాకు తెలుసు. మీరు పాతకాలపు మనుషులు. రోజులు మారినా మీరు మారరు. వితంతువు కింక కులాసాగా బ్రతడానికి హక్కు లేదంటారు మీరు. మీ మూఢనమ్మకాలకోసం, పాతికేళ్ళ యువ జీవితాలు బలియైపోవడమేనా? వాళ్ళు సుఖపడితే మీరు చూడలేరా? ఎందుకు వాళ్ళనలా సంప్రదాయమనే సంకెళ్ళలో బంధించి, జీవిత ఖైదు విధిస్తారు మీరు?"

"మా శకుంతలని పెళ్ళాడాలనుందా నీకు?" అని తాపీగా అంది అమ్మ.

"ఉంది. ఉండమేకాదు, చేసుకు తీరుతాను. ఎన్ని అడ్డంకుల్దురైనా సరే  ఎవరికిష్టం లేకపోయినా సరే. ఆమె నీ వాతావరణం నించి రక్షించి బయటికి తీసుకుపోయి.."

"అంత గట్టిగా అరుస్తావెందుకు నాయనా. రోజులు మారాయని గట్టిగా చెపితేగానీ నాకు తెలీదనుకున్నావా? మా రోజుల్లో కన్నెపిల్లలే కాలేజీల్లో చదివితే తప్పు. వైధవ్యం వొచ్చిందని మా అమ్మాయిని బుర్ర గొరిగించి ఇంట్లో కూచోపెట్టలేదుగా. కాలేజీ చదువుకి ఒప్పుకున్నాక, పెళ్ళికి మాత్రం ఎందుకు అడ్డు చెపుతాను. దాని కిష్టమై చేసుకుంటానంటే,"

శకుంతలా, శంకరం ఈసారి గొంతు తడెక్కి మాటాడలేకపోయారు. ఒకళ్ళవంక ఒకళ్ళు చూడలేకపోయారు కూడా. తల్లి ఎదట ఇద్దరూ చంటిపిల్లల్లా అయి  పోయారు.

"అబ్బాయి నువ్వూ మా శకుంతల తల్లీ ఏ పొరపొచ్చాలూ లేకుండా ఉండాలంటే నువ్వీ విషయంలో జోక్యం కలిగించుకోడం తప్పు. అందుకే అడిగాను. నీ వుద్దేశం ఏవిటని"

"చంద్రారెడ్డికి నేనప్పుడే డబ్బిచ్చేశానండీ.. మరి.."

చాలా పొరపాటు చేశావు. నీకా డబ్బు మళ్ళీ ఇప్పించేస్తాను."

"అక్కర్లేదండి. అది నాకో లెక్కలోది కాదు."

"మాకు చాలా పెద్ద లెక్కలోది నాయనా! తనని నాలుగువేలు విలువకట్టారనుకుంటూంది మా శకుంతల తల్లి"

"నా ఉద్దేశం..."

చంద్రారెడ్డిని వెంటబెట్టుకుని వచ్చాడు రామన్న.

"ఎవరు చంద్రారెడ్డిగారేనా? రండి. నాకంతా తెలిసింది."

"అమ్మా, ఏదో ఉక్రోషం అక్కా. పోలీసు రిపోర్టిచ్చాను."

"రెడ్డిగారూ, మీరు చేసింది న్యాయం. నాకు తెలియలేదుగా? అసలింతవరకూ రానిచ్చేదాన్నికాదు. ఒక్క ఉపకారం చేసిపెట్టాలి మీరు. ఈ ఇల్లు అమ్మేస్తున్నాం."

"ఇల్లు" అన్నాడు రామన్న.

"అమ్మెయ్యడమే" అంది లోపలికొస్తూ సుభద్ర.

"అక్కర్లేదమ్మా. మన శంకరంగారు సర్దేశారు" అన్నాడు చంద్రారెడ్డి.

"ఇల్లమ్మేసి అతని డబ్బు అతనికిచ్చేయండి. మీకు రావలసింది మీరు తీసుకోండి."

"అమ్మా! మిమ్మల్ని ఇంట్లోంచి లెగ్గొట్టి ఆ పాపం మాత్రం నేను కట్టుకోలేను."

"అదేమిటి రెడ్డిగారూ పాపమేమిటి? ఒడిలిపోయిన దేహాన్ని ఒదిలేసి, జీవుడే బయటికి పోతుంటే< ఇల్లొదిలెయ్యడానికి వెనకాడ్డం ఎంత పొరపాటు. పదిహేనేళ్ళుగా ఇంటికేమీ చేయించలేకపోయాం. ఇంత ఇంటిని మేం ఏం చేసుకుంటాం? నాలుగురాళ్ళున్న వాళ్ళు ఈ ఇంటిని కొనుక్కుంటే వాళ్ళకే లాభం. ఇల్లు బాగుపడుతుంది. మీ అప్పుపోగా మిగిలిన డబ్బుతో చిన్న ఇల్లొకటి కొనుక్కుంటాం. మీరే చూసిపెట్టండి చవగ్గా..."

"అప్పుడు నాకు ఏడేళ్ళు. డెబ్బై రెండేళ్ళు. అలమారు తలుపులు పుచ్చిపోయాయి. ఆ పక్క పెణక వాలిపోయింది రామన్న బాగుచేయించలేడు. నూటయాభై రూపాయల గుమాస్తాగిరి తిండికే చాలదు. వాడికి తొందరగా పెండ్లి చేసెయ్యాలి. ఈ ఇల్లొదిలేస్తే ఎలా బతుకుతాడో. కళ్ళు కూడా కనిపించడంలేదు. ఎత్తూ పల్లం గోడా గడపా అలవాటయిపోయాయి ఈ ఇంట్లో. ఎంత వైభవంగా ఉండేది ఆ రోజుల్లో ఇల్లు అమ్మెయ్యాలి. వెనకటివి వదిలెయ్యలేం ఒక పట్టాన్న. దిగులుగా ఉంటుంది. అయినా కాటికి కాళ్ళు జాపుకున్నవాళ్ళం. కుర్రాళ్ళు వాళ్ళ బతుకులు వాళ్ళు బతకాలి. ఏమిటో ఈ బంధాలు. వ్యాసపీఠం మీద భాగవతం తెరిచి, ఎంతబాగా చదివేవారాయన. "కలలోనన్ తను మున్నెరుంగని" అన్న పద్యం – ఆరోజులింకరావు. ఎందుకు రావాలి? పిచ్చిగాని."

ఇల్లు అమ్మెయ్యాలి...